
వాల్మీకి రామాయణము

పుల్లెల శ్రీరామచంద్రుడు

బాల కాండము



వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

బాలకాండము

పద్మశ్రీ పురస్కృత, మహామహోపాధ్యాయ

ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

ప్రథమముద్రణ 2013

ప్రతులు 10,000

మూల్యం

(ఏడు కాండల సెట్)రూ. 495/- (US $ 15)

రచన : ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

చిత్రకారుడు : బాపు

9788192771519

ప్రకాశకులు:

T.L.P Publishers

A Division of Excellent Enterprises

క్వీన్‌హౌస్, సాగర్‌సొసైటీ రోడ్,

బంజారాహిల్స్, రోడ్ నెం. 2, హైదరాబాదు - 500034.

ఫోన్: +91 040 23542515

ముద్రణ:

కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్

హైదరాబాద్.

శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

రామాయణం ఎందుకు చదవాలి?

ఈ మధ్య కొత్తవని చెప్పే కొన్ని భావాలు, అత్యధికంగా ప్రచారం చేయబడు తున్నాయి. కొన్ని శబ్దజాలాలు వినవస్తున్నాయి. "సకలమానవ సౌభ్రాతృత్వం" (Fraternity of mankind) "విశ్వపౌరసత్వం" (World citizenship) "మానవుని ఆత్మగౌరవం" (Dignity of man) "సామాజిక స్పృహ" (Concern for the Society) "మానవతావాదం" (Humanism) "జాతీయవాదం" (Nationalism) -ఇంకా ఇలాంటి శబ్దా లెన్నో ప్రచారంలోకి వస్తున్నాయి. వీటిలో ఏ ఒక్కటీ కూడా అవాంఛనీయ మని కాని, అనావశ్యక మని కాని కొంచెం ఆలోచనాశక్తి కలవాడెవ్వడూ అనడు. ఇవన్నీ అత్యున్నత మైన ఆదర్శాలే. అసాధ్యాలు కూడా కావు. ఒక మూల ఇలాంటి పదాలు అహోరాత్రులు వల్లె వేస్తూండగానే ప్రపంచం పోకడ మాత్రం ఏతద్విరుద్ధంగా ఉంది. 'ఇది ఇలా జరుగుతున్నదేమి!' అని ఎవరైనా ఆశ్చర్యం ప్రకటిస్తే ఈ పదాలు వల్లె వేసే మేధావు లందరూ "తరాల భేదం" (generation gap) ఇత్యాది నూతనపదాలేవో తమ ధీశక్తిచేత కనిపెట్టి, తగిన సమాధాన మేదో దొరికిం దన్న భావన సామాన్యజనుల మనస్సులలో కలిగిస్తూ, అసలు విషయం దాటవేస్తూ ఉంటారు. జరుగుతూన్న దేమి టంటే ఈ నూతనయుగ ప్రవర్తకులందరూ తమ దృష్టి నంతనీ చాలా పెద్ద వనుకొనే సమస్యలమీద కేంద్రీకరించి మూలవిషయాలపట్ల అనాదరం చూపుతున్నారు. మూలవిషయాలను జాగర్తగా కాపాడుకుంటే "పెద్ద సమస్యలు" వాటంతట అవే చక్కబడతాయనే మాట మరచి పోతూన్నారు.

ప్రతీమానవుడూ కూడ తన జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవిస్తూంటాడు. మానవునికి కలిగే ఈ కష్టాలకు కారణం ఏమిటి అని జాగర్తగా పరిశీలిస్తే నూటికి తొంభై కష్టాలకు కారణం తోటి మానవుడే అని స్పష్టం అవుతుంది. రోగాదుల వల్ల, ప్రకృతివైపరీత్యాదులవల్ల కలిగే కష్టాలు పదిశాతమే. కొన్ని మానసిక రోగాలకు, తద్ద్వారా వచ్చే శారీరకరోగాలకూ కూడ తోటి మానవులవల్ల కలిగే బాధలే కారణం. దుష్టపాలకులవల్లా, అవినీతిపరులైన అధికారులవల్ల, మతద్వేషాలను రెచ్చగొడుతూ,

దురాచారాలను ప్రోత్సహించే మతగురువులవల్లా, అన్ని కాలాలలోను, అన్ని దేశాలలోను కలిగే సామాజికవిక్షోభం ఇంతా అంతా కాదు.

మానవు డనుకొనేవానిలో సహజంగా అత్యధికమైన ప్రమాణంలో దానవత్వము, చాల తక్కువగా మానవత్వమూ, మిణుకు మిణుకుమంటూ దేవత్వమూ ఉంటాయి అని శ్రీశంకరాచార్యులు తమ గ్రంథాలలోని అనేక ఘట్టాలలో ప్రతిపాదిస్తూ అత్యధికంగా ఉన్న దానవత్వంనుండి మానవత్వం మీదుగా దేవత్వం సంపాదించుకొనడానికే, మానవుడు, తనకు భగవంతుడిచ్చిన జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి అని బోధించారు.

"మానవుడు సామాజిక జీవనాన్ని కోరుకొనే ప్రాణి" (Man is a social animal) అని గ్రీక్‌తత్త్వవేత్త అరిస్టోటల్ అంటే - అది వాస్తవం కాదు - "మానవుడు అతిక్రూర మైన భయంకర మైన ప్రాణి" (Man is a ferocious animal) అని థామస్ హోబ్బెస్ (Thomas Hobbes) అను ఒక బ్రిటిష్ తత్త్వవేత్త అంటాడు. వీరిద్దరి మాటలలోనూ కొంత సత్యం ఉంది. మానవునిలో ఉన్న ఈ రెండు ప్రవృత్తులకూ మూలకారణం ఒకటుంది - అది వానిలో స్వభావసిద్ధంగా ఉన్న, పుట్టుకనుండీ వచ్చిన స్వార్థపరత్వం అనే లక్షణం. మానవుడు స్వార్థప్రధాను డైన, స్వలాభమాత్రదృష్టి గల, సుఖమాత్రపరాయణు డైన ప్రాణి. ఈ స్వార్థపరత్వం అనేది మానవునిలోనే కాదు, జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రతీ ప్రాణిలోను కనబడుతుంది. కాని ఇతరప్రాణులలో దాగి ఉన్న ఈ స్వార్థచింత అవకాశం వచ్చి నప్పుడల్లా ఒకమారు పైకి వచ్చి మరు క్షణంలో మరుగున పడుతూంటుంది. మానవుని స్వార్థపరత్వం అలాంటిది కాదు; అది ఆజీవితాంతం వానిని వెన్నంటి ఉంటుంది. దానిని గూర్చియే ఆలోచింపచేస్తూ ఉంటుంది. ఒక్క క్షణంకూడ వానిని విడిచిపెట్టదు. ఇతర ప్రాణులలో లేని బుద్ధిబలం అనేది కూడ ఉంది కదా వీనికి మరి!

మానవునిలో ఉన్న ఈ సహజలక్షణాన్ని **ఉపనిషత్తులు** కూడ చాటి చెపుతున్నాయి. **బృహదారణ్యకోపనిషత్తు**లో గొప్ప ఆత్మతత్త్వవేత్త యైన యాజ్ఞవల్క్యుడు, ఒక సందర్భంలో, తన భార్య మైత్రేయికి అతికటువే అయినా కాదనడానికి వీలు లేని ఒక సత్యం బోధిస్తాడు - "భార్య భర్తను ప్రేమిస్తూన్న దంటే అది వాని ఆనందం కోసం కాదు; తన ఆనందం కోసమే." ఈ మాట

వినగానే ఆమె ఉలిక్కిపడి ఉంటుంది. అయితే ఆయన ఇంతటితో ఆపలేదు. ఇంకా ఇలా చెప్పుకొంటూ పోయాడు – "భర్త భార్యను ప్రేమిస్తున్నా డంటే అది ఆమె ఆనందం కోసం కాదు; తన ఆనందం కోసమే. అదే విధంగా పుత్రులమీదా, ధనం మీదా, ఇతరజనుల మీదా, దేశంమీదా, ఈ లోకాలమీదా మానవున కున్న ప్రేమ ఆ పుత్రాదుల ఆనందంకోసం కాదు; తన ఆనందంకోసమే. తన కామం (కోరికలు) తీరడంకోసమే" అని చెపుతూ చివరికి – "ఎవరి కైనా దేనిమీద నైనా ప్రేమ ఉన్న దంటే అది తన కామం కోసమే **ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి" (బృ.ఉ. 2.4.5)** అని ముగిస్తాడు. ఈ విధంగా మనకు అడు గడుగునా కనబడే "మానవుడు స్వార్థపరుడు" అనే తత్వాన్నే **ఉపనిషత్తు** కూడ అతిస్పష్ట మైన మాటలలో విశ్లేషించి బోధించింది.

దీనిని బట్టి తేలిన దేమనగా – తన స్వార్థానికి ఉపయోగించి నంతవరకు మానవుడు సమాజంతో, సమాజంలోని ఇతరులతో సంబంధం పెట్టుకొంటాడు. స్వార్థానికి విఘాతం కలిగిందా ఊహించడానికి కూడ శక్యం కానంతగా క్రూరత్వం చూపిస్తాడు. అందుచేత పైన చూపిన ఇద్దరు తత్త్వశాస్త్రవేత్తల మాటలలోనూ కొంత సత్యం ఉంది.

మానవునిలో సహజంగా ఉన్న ఈ స్వార్థపరత్వాన్ని ఏ మాత్రం నియంత్రణ లేకుండా వదిలిపెడితే భూమండలం మీద సుఖశాంతులు పూర్తిగా కరువైపోతాయి. కౌటిల్యుడు **అర్థశాస్త్రం**లో చెప్పిన **'మాత్స్యన్యాయం'** (పెద్దచేప చిన్న చేపను మ్రింగివేసే పద్ధతి) ప్రబల మౌతుంది. బలవంతుడు దుర్బలుణ్ణి పీడిస్తాడు. కొన్నాళ్లకు వానిని మరొక బలవత్తరుడు మ్రింగివేస్తాడు. లోకవినాశనానికి దారి తీసే స్వార్థపరత్వ ప్రవృత్తిని అణిచి ఉంచా లంటే రెండే ఉపాయాలు – మొదటిది దండం; రెండవది మానవుని మనస్సులోనే మార్పు తీసికొని వచ్చే సన్మార్గదర్శనం. మొదటి ఉపాయం వల్ల కలిగే ఫలితం తాత్కాలిక మైనది. రెండవదానివల్ల కలిగేది అంతకంటె ఎక్కువ కాలం నిలుస్తుంది. ఈ రెండవ ఉపాయం ద్వారా దారి చూపి మానవులలోను, తద్వారా సకలప్రాణిలోకంలోను సుఖశాంతులు నిలపడంకోసం పరమేశ్వరుడు స్వయంగా అప్పు డప్పుడు వివిధరూపాలలో అవతరిస్తూంటాడు. లేదా కొందరు మహాపురుషులలో తన అంశను, శక్తిని, ప్రవేశపెట్టి తద్వారా ఈ కార్యం సాధిస్తూంటాడు.

ఉత్తమసంస్కారం అనేది ప్రాతిస్వికంగా మానవునితోనూ, కుటుంబం తోనూ ప్రారంభం కావాలి. ఒక కుటుంబంలోని వ్యక్తు లందరూ చక్కబడితే కుటుంబం చక్కబడుతుంది. అప్పుడు ప్రాంతమూ, దేశమూ, ప్రపంచమూ, మొత్తం జనసమాజమూ వాటంతట అవే చక్కబడతాయి. వ్యక్తినీ, కుటుంబాన్నీ పూర్తిగా మరచిపోయి ప్రపంచకా న్నంతా, సమాజా న్నంతా ఉద్ధరిస్తామని ఘోషిస్తూ నాయకత్వం వహించడం ఆకాశహర్మ్యనిర్మాణమే అవుతుంది. ఈనాడు ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ అతితీవ్రమై ప్రసరిస్తూన్న ఘాతుకప్రవృత్తి (Terrorism) దీని ఫలితమే. ఇలాంటి ప్రవృత్తినుంచి సమాజాన్ని రక్షించాలంటే ప్రతి ఒక్కడూ రామాయణంలోని భావాలు ఆకళించుకోవాలి.

రామాయణం ఆదికావ్యం. ఇలాంటి ఛందోబద్ధ మైన రచన వేదాలలో తప్ప లౌకికవాఙ్మయంలో, రామాయణం ఆవిర్భవించేవరకూ లేదు. అందుచేతనే దీనికి "ఆదికావ్యం" అనే పేరు వచ్చింది. దీనిని ఎవరి అభిరుచిని పట్టి వాళ్ళు వివిధదృక్కోణాలతో చూస్తూ ఉంటారు. మహాభారతాన్ని గూర్చి – "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని" ఇత్యాదివిధంగా నన్నయ చెప్పినది చాలావరకు రామాయణానికి కూడా సరిపడుతుంది. ఇది అత్యద్భుత మైన వర్ణనలతో నిండిన మహాకావ్యమనీ, ఇతర మహాకావ్యా లన్నింటికీ పథిప్రదర్శక మనీ కొందరు చదివి ఆనందిస్తూంటారు. రామాయణం, ప్రధానంగా సుందరకాండ, శక్తితత్త్వప్రతిపాదక మని కొందరు అర్థాలు చెపుతారు. ఇది మహాకావ్యం అవడం చేత ధ్వని ప్రధానంగా ఉండాలి. అందుచేత ఇది ధ్వనిమార్గాన్ని అనుసరించి శివుని పారమ్యాన్ని బోధిస్తూన్న దని అప్పయదీక్షితులు "శ్రీరామాయణసార సంగ్రహస్తోత్రం"లో ప్రతిపాదించారు.

వ్యాఖ్యాతలు చేసే వ్యాఖ్యానాల జోలికీ, పండితుల వాదాల జోలికీ వెళ్ళకుండా, మన మనస్సులలో ఏర్పరచుకొన్న భావాలు దీనిలో చొప్పించకుండా, మనం రామాయణం చదువుతే, వాల్మీకి ప్రారంభంనుంచి చివరివరకూ రాముణ్ణి మానవుణ్ణిగానే చిత్రించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. బ్రహ్మదేవుడిచ్చిన వరం ప్రకారం రావణుడు మానవుని చేతిలో మాత్రమే మరణించాలి కదా! తావన్మాత్రంచేత రాముని విష్ణ్వవతారత్వానికి భంగం రాదు. విష్ణువు సర్వశక్తుడు. "నా మాయ, నన్ను నేనే మరచిపోయే టట్లు కొంతకాలం నన్ను తన వశంలో

ఉంచుకొను గాక" అని సంకల్పించి ఆయన ఆవిధంగా పూర్తిగా మానవత్వాన్ని స్వీకరించా డని అనుకోవచ్చును కదా. ఇది కూడా సర్వశక్తత్వంలో ఒక భాగమే. ఇలాంటి విస్మృతికి హేతువు లైన భృగుశాపాదివృత్తాంతాలు ఉండనే ఉన్నాయి. రాముని కీ విధ మైన మానవత్వం వాల్మీకికి అభిమత మైన దని మనం అంగీకరించకపోతే రామాయణానికి ఉన్న ఉపదేశకత్వమే కుంటుపడుతుంది. వియోగాలూ, విలాపాలూ ఇవన్నీ అభినయాలు మాత్రమే అనే భావం మన కేర్పడి నప్పుడు పితృభక్తి - సౌభ్రాత్ర - పతిభక్త్యాదులు కూడా అభినయా లైపోయి, అవన్నీ మనం చేయవలసినవీ, చేయదగినవీ కావు అనే భావం ఏర్పడుతుంది. అందుచేత వాల్మీకి రామాదులను మానవమాత్రులనుగానే చిత్రించా దని అంగీకరించాలి. శాస్త్రాలలో చెప్పే **"ఉపక్రమోపసంహారౌ అభ్యాసోఽపూర్వతా ఫలమ్, అర్థవాదోపపత్తీ చ లిఙ్గం తాత్పర్యనిర్ణయే"** అన్న ఆరు తాత్పర్యనిర్ణాయక లింగాలను ఇక్కడ కూడా కొంతవరకు సమన్వయించుకొనవచ్చు. ప్రారంభంలో వాల్మీకి "సర్వగుణసంపన్నుడైన నరుడు ఇప్పుడు ఎవ్వడు ఉన్నాడు" అని నారదుణ్ణి ప్రశ్నిస్తాడు. (**"మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతు మేవంవిధం నరమ్"** బా.కాం. 1-5). "అలాంటి నరుడెవరో చెపుతాను, విను" (**"మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః" బా.కాం.** 1.7) అని ప్రారంభించి నారదుడు, రాముణ్ణి గూర్చి చెపుతాడు. రావణసంహారానంతరం దేవత లందరూ నీవు సాక్షాద్విష్ణుమూర్తివి అని అంటూన్నప్పుడు రాముడు-"నాపేరు రాముడు; నేను దశరథకుమారుడైన మానవమాత్రుడనే" (**ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్" యు.కాం.** 117.11) అని అంటాడు. మధ్యలో అనేకస్థలాలలో రాముడు మానవమాత్రుడుగానే కనబడతాడు. అయోధ్యాకాండలో "చూచావా! మన తండ్రిగారి మూలాన నేను ఇన్ని కష్టాలు పడవలసి వచ్చింది. భరతుడు హాయిగా రాజ్యసుఖా లన్నీ అనుభవిస్తూ ఉంటాడు", అని లక్ష్మణునితో చెప్పుకొని వాపోతాడు. సీతకోసం చేసిన విలాపాదులు ప్రసిద్ధాలే. ఈ విధంగా రాముడు బాలకాండ మొదలు యుద్ధకాండాంతం వరకూ మానవుడుగానే ప్రవర్తిస్తాడు. ఇతరు లైన ఋష్యాదులు ఆయనను మహావిష్ణువుగా తెలుసుకొని ఆ విధంగా అర్చిస్తే అది వేరే విషయం. మానవుడుగా ప్రవర్తించాడు కనకనే ఆయన నడచిన అయనం (మార్గం) మనకు ఉపాదేయం అయింది.

వేదాంతాచార్యులలో ప్రథమశ్రేణికి చెందిన సర్వజ్ఞాత్మముని **"సంక్షేపశారీ**

రకం" అనే గ్రంథం రచించారు. ఇది చాల ప్రామాణిక మైన గ్రంథంగా పరిగణింపబడుతుంది. ఈయన శ్రీశంకరాచార్యుల నలుగురు ప్రధానశిష్యులలో ఒకరైన, వార్తికకారు లని ప్రసిద్ధులైన సురేశ్వరాచార్యుల సాక్షాత్ శిష్యు లని ప్రసిద్ధి. ఒక సందర్భంలో ఈయన జీవ – ఈశ్వరుల స్వరూపస్వభావాలను గూర్చి విశదీకరిస్తూ – "జీవునకు మాయాసంబంధం ఉంటుంది. మాయకు వశుడైపోవడంచేత జీవునికి అహంకారసంబంధం కూడ దృఢంగా ఉంటుంది. ఈశ్వరునికి మాయతో సంబంధం ఉన్నా ఆయన మాయకు వశంవదుడు కాదు; మాయయే ఈశ్వరునికి లొంగి ఉంటుంది. అందుచేత ఈశ్వరునికి అహంకార సంబంధం ఉండదు" అని ప్రతిపాదించి, అయితే "శ్రీరాముని రూపంలో ఉన్న ఈశ్వరుడు అహంకార – మమకారాలతో ప్రవర్తిస్తూ, సుఖ – శోకాదు లనుభవించాడు కదా" అని ఆశంకించుకొని సమాధానంగా –

"సంకల్పపూర్వకమభూద్రఘునన్దనస్య
నాహం విజాన ఇతి కంచన కాలమేతత్,
బ్రహ్మోపదేశముపలభ్య నిమిత్తమాత్రం
తచ్ఛేత్ససర్జ స కృతే సతి దేవకార్యే."

(సంక్షేపశారీరకం II. 182.)

"నేను నా యథార్థస్వరూపం తెలియకుండా కొన్నాళ్లు ఉండిపోతాను" – అని సంకల్పించుకొని రఘునందనుడు కొంతకాలం అలా ప్రవర్తించాడు. ఏ దేవకార్యం కోసం అలా సంకల్పించుకొన్నాడో అది పూర్తి అయిపోగానే బ్రహ్మదేవుని మాటలు నిమిత్తమాత్రంగా తీసికొని తన ఈశ్వరత్వాన్ని గుర్తించాడు" అని వ్రాశారు. అందుచేతనే జాగర్తగా పరిశీలిస్తే, రావణ సంహారానంతరం రాముని ప్రవర్తనలో చాల భేదం కనబడుతుంది. ఉదాహరణకి – సీతాపహరణానంతరం సీత కోసం అంతగా విలపించిన రాముడు, స్వధర్మ పాలనార్థం సీతను విడచిన తరువాత ఆమెకోసం అంతగా విలపించలేదు.

ఈ పూర్వభూమికతో రామాయణం లోని నాలుగైదు ప్రధానోపదేశాలను గూర్చి ముచ్చటించుకుందాం.

1. వైదికధర్మానుసారం దాంపత్యసంబంధం అనేది అతిపవిత్రమూ, విడదీయ రానిదీ అయిన సంబంధం. ఈ విషయాన్ని వాల్మీకి అడుగడుగునా

ప్రతిపాదించాడు. సీతారాముల ప్రేమ ఆదర్శరూప మైనది. వారి ప్రేమను వాల్మీకి ఈ విధంగా వర్ణిస్తాడు:

> **"ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి,**
> **గుణై రూపగుణైశ్చైవ భూయ ఏవాభ్యవర్ధత.**
> **తస్యాశ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే."**

(బా.కాం.77.26.27)

రామునికి సీత అంటే ఎంతో ప్రేమ. అందుకు కారణం అది తండ్రిగారు చేసిన వివాహసంబంధం అవడం. ఆమెలో సహజంగా ఉన్న సౌందర్యాది సద్గుణాలచేత ఆ ప్రేమ ఇంకా పెరిగింది. సీతకు రామునిమీద, అంతకు రెట్టింపు ప్రేమ ఉండేదట. ఇక్కడ రాముడు శివధనుర్భంగం చేసి సీత హస్తం జయించుకొన్నాడు కదా, తండ్రిగారు ఆ సంబంధం చేయడం ఏమిటి, అనే ప్రశ్న కలుగుతుంది. దీనికి సమాధానం మనకు అయోధ్యాకాండలో లభిస్తుంది. సీత అనసూయాదేవితో తన వివాహవృత్తాంతాన్ని గూర్చి చెప్పేటప్పుడు బాలకాండలో మనకు తెలియని ఒక విషయం చెపుతుంది. రాముడు శివధనుర్భంగం చేయగానే "ఇదిగో నా కుమార్తెను ఇస్తున్నాను స్వీకరించు" అని జనకుడు అంటాడు. తన తండ్రిగారు అంగీకరిస్తేనే కాని ఆమెను పరిగ్రహించడానికి రాముడు నిరాకరించి, దశరథుని అనుమతి లభించిన తరువాతనే వివాహమాడాడు.

> **"దీయమానాం న తు తదా ప్రతిజగ్రాహ రాఘవః,**
> **అవిజ్ఞాయ పితుశ్ఛన్దమయోధ్యాధిపతేః ప్రభోః." (అయో.కాం.118.51)**

ఏకపుత్రుని ప్రవాసం వంటి అతిదుఃఖకర మైన పరిస్థితుల్లో కూడా కౌసల్య దశరథుని సేవ చేస్తూనే ఉంటుంది. రాక్షససమాజంలో కూడా దాంపత్యాన్ని కున్న ఆ పవిత్రత్వాన్ని మండోదర్యాదుల పాతివ్రత్యవర్ణనం ద్వారా కవి సూచించి ఉన్నాడు.

దాంపత్యసంబంధం అనేది కుటుంబజీవనంలో శాంతికి మూలకంద మైనది. కొంత కాలం రుచి చూచి విడిచిపెట్టివేసేది కాదు. నాగరికతకు పరాకాష్ఠ

అనుకొన్నట్లు భావింపబడే కొన్ని దేశాలలో అస్తవ్యస్తంగా ఉన్న ఈ సంబంధం ఎన్ని అనర్థాలకు దారి తీస్తున్నదో చూస్తూనే ఉన్నాం. కేవలం తాత్కాలిక సుఖదృష్టితో మాటిమాటికీ వివాహవిచ్ఛేద పునర్వివాహాది పరంపర సాగిస్తూన్న వ్యక్తులకు తమ పిల్లల పట్ల ఎంతటి ప్రేమాభిమానాలు ఉంటాయో, వాళ్ళకి పెద్దవాళ్లమీద ఎంతటి భక్తిభావం ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇలాంటి పరిస్థితులలో ఎవరికీ ఎవరిమీదా స్థిర మైన ప్రేమానురాగాలు ఉండడానికి అవకాశం ఉండదు. ప్రేమ అనేది విచిత్ర మైన బంధం. ఈ బంధం ఉన్నంతవరకు ఎవ్వరూ సాహసకృత్యాలు చేయజాలరు. అలాంటి పనులు చేస్తే తమ ప్రేమపాత్రులకు ఏమి కష్టాలు వస్తాయో, వారిని ఆదుకొనేవారు ఉంటారో ఉండరో; తమ వియోగం వారి కెంత బాధాకరంగా ఉంటుందో అనే ఆలోచనలు వారిలో ఒక విధమైన సంయమనాన్ని పుట్టిస్తాయి. ప్రేమబంధం లేనివాడు ఎంత దుష్కార్యానికైనా వెనుదీయడు. ఆతని జీవితానికి ఒక లక్ష్యం అనేదే ఉండదు. ఇలాంటి వ్యక్తులు సమాజానికే ముప్పు తెచ్చిపెట్టే వాళ్ళుగా ఏర్పడతారు. ఇది మనం చూస్తూనే ఉన్నాం. అత్యున్నత మైన అతిపవిత్ర మైన ఈ దాంపత్యసంబంధం మీద దెబ్బతీయడానికి, చిత్రాలద్వారాను తదితరసాధనాల ద్వారానూ ప్రయత్నాలు సాగుతున్నాయి. దీన్ని అడ్డుకొని కౌటుంబికశాంతిసుఖాలను పెంపొందించా లంటే రామాయణంలో ప్రతిపాదించిన, సహస్రాబ్దాలుగా మన సమాజంలో ఆదరం పొందిన, దాంపత్య సంబంధపవిత్రత్వాన్ని కాపాడుకోవాలి.

ఈ దాంపత్యసంబంధంలో ఏ మాత్రం పొరబాటు వచ్చినా దాని ప్రభావం యువకుల మనస్సు మీద ఎలా ఉంటుందో వాల్మీకి చక్కగా ఒక చోట సూచించాడు. వాలి మరణించా డనుకొని సుగ్రీవుడు ఆతని భార్య తారను చేబడతాడు. బహుశా వానరసమాజంలో అది తప్పు కాకపోవచ్చు. అయితే ఇది తార కుమారుడైన అంగదుని కే మాత్రమూ నచ్చలేదు. అట్లా చేసినందుకు అంగదుడు సుగ్రీవుణ్ణి గూర్చి నిందిస్తూ హనుమదాదుల ముందు తన మనస్సులో అతనిమీద ఉన్న కోపాన్ని వెలిబుచ్చుతాడు. (కి.కాం. 55 సర్గ). ఇలాంటిది అతిగా ఉన్న సమాజం ఎంత విక్షుబ్ధంగా ఉంటుందో ఊహించుకొనవచ్చు.

2. గురుభక్తి, భ్రాతృప్రేమ, సౌహార్దమూ మొదలైన సద్గుణాలు లభించడం కుటుంబంలో ఉన్న పెద్దలు నెలకొల్పిన ఆదర్శాలమీద ఆధారపడి ఉంటుంది.

పుత్రాదుల విషయంలో తమ కర్తవ్యాన్ని వాళ్ళు విస్మరించినా అతిప్రేమాదులచేత సరి యైన శిక్షణ ఇవ్వకపోయినా ఇవి అలవడవు. పుస్తకాల నుంచి నేర్చుకొనే విద్యలుకావు ఇవి. మరొక మాటలో చెప్పాలంటే పవిత్రమైన వివాహసంబంధాన్ని పవిత్రంగా ఉంచుకొని జీవన లక్ష్యాలను విస్మరించనంతవరకూ పెద్దవాళ్ళు చిన్నవాళ్ళకి సన్మార్గదర్శకులు అవకలుగుతారు. అంతేనేకాని 'తరాలభేదం' అంటూ ఏవేవో సమాధానాలు చెప్పుకొనే వాళ్ళు ఆత్మవంచన, పుత్రాదిద్రోహమూ చేసినవా ళ్లవుతారు. తరాలభేదం లేకుండా ఎప్పుడుం టుంది? మహానాగరికత కల వనుకొనే కొన్ని దేశాలలో పుత్రులు, తండ్రులను గూర్చి నిర్దేశించేటప్పుడు "ఆ ముసలాడు" "that old man" అని నిర్దేశించడం అలవాటట. తల్లిదండ్రుల విషయంలో ఈ విధంగా ప్రవర్తించకలిగినవాడు ఇతరుల విషయంలో ఏ విధంగా ప్రవర్తిస్తాడో ఊహించుకోవచ్చు. రామాయణంలోని రామాదుల గురుభక్తిని గూర్చీ, భ్రాతృప్రేమాదులను గూర్చీ చదివినవాడు ఎవ్వడూ ఈ విధంగా ప్రవర్తించజాలడు.

3. అర్థం సర్వానర్థాలకి మూలం. సుఖసాధనాలలో ఇది ఒకటి మాత్రమే. ఇదే సాధ్యం అనుకుంటే ఇది అనర్థకం అవుతుం దనే విషయం సర్వానుభవసిద్ధం. అర్థాన్ని తృణప్రాయంగా పరిత్యజించిన శ్రీరామాదులు ఎంతటి మహోన్నతాదర్శంగా నిలిచి ఉన్నారో అర్థకామాలే పరమధ్యేయం అనుకున్న రావణాదులు ఏవిధంగా పతితు లైనారో బోధిస్తూ రామాయణం ధర్మావిరుద్ధమైన అర్థకామాలే పరిగ్రాహ్యా లని అడుగడుగునా బోధిస్తూన్నది.

"నాహమర్థపరో దేవి లోకమావస్తుముత్సహే,
విద్ధి మామృషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితమ్."(అయో.కాం. 19.20)

"ఓ దేవీ! నేను అర్థప్రధానుడను కాను. నేను మంచి మార్గంలో నడుస్తూ లోకాన్ని మంచి మార్గంలో నడిపించా లనేదే నా కోరిక. నేను ప్రాధాన్యం ఇచ్చేది ధర్మానికే. అందుచేత నేను ఋషితుల్యుణ్ణి అనే విషయం గుర్తు ఉంచుకో." అని రాముడు, అతడు అరణ్యానికి వెడతాడో వెళ్లడో అని శంకిస్తున్న కైకేయితో అంటాడు. ఇక్కడ రాముని అభిప్రాయం తాను ఋషితుల్యుణ్ణని చెప్పుకోవడం కాదు; అర్థానికి ప్రాధాన్యం ఇవ్వనివాళ్లు ఋషితుల్యు లని చెప్పడంలోనే రాముని తాత్పర్యం. భరతుడు చిత్రకూటానికి వస్తూన్నప్పుడు అతనిని శంకించిన లక్ష్మణునితో రాముడు –

"యద్ద్రవ్యం బాన్ధవానాం వా మిత్రాణాం వా క్షయే భవేత్,
నాహం తత్ ప్రతిగృహ్ణీయాం భక్ష్యాన్విషకృతానివ."

"బంధువులు గాని, మిత్రులు గాని నశించడం వల్ల లభించే ధనం విషం కలిపి వండిన భక్ష్యం వంటిది. దాన్ని నే నెన్నడూ ముట్టను" అని అంటాడు. ఈనాడు మన సమాజాన్ని పట్టి పీడిస్తూన్నది అర్థంమీద ఉన్న ఈ వ్యామోహమే. అది కొంతవరకైనా తగ్గి సుఖశాంతులు నెలకొనా లంటే రామాయణం చదవాలి. అధికారదాహంతో ఎలాంటి అక్రమాలు చేయదాని కైనా వెరవని ఈనాటి మన పాలకులకు, రాజ్యం నాకు వద్దంటే నాకు వద్దు అని పోటీ పడిన రామభరతాదుల నిస్స్వార్థధార్మికప్రవృత్తి కొంతైనా మానసిక పరివర్తనం తీసికొనివస్తుంది.

4. చిన్న కష్టం కలిగేటప్పటికి ఏ మాత్రము సహించలేక ఏ ఆత్మహత్యో చేసుకోవడం, లేదా ఇతరులను హత్య చేయడం వంటి ప్రవృత్తి ఈనాడు ప్రబలుతూన్నది. జీవితానికి ఉత్తమాదర్శం అనేది ఒకటి లేకపోవడమే దీనికి కారణం. కష్టాలు రాని మానవు డుండడు. వాటిని సహించే శక్తిని పెంపొందించుకోవడమే మానవుని గొప్ప తనానికి నిదర్శనం. దశరథుని కుటుంబంలోని వారందరూ ఎంత కష్టం అనుభవించారో, అయినా ఎంత ధైర్యంగా సహించారో చదివిన వాళ్ళు ఈ శక్తిని పెంపొందించుకో గలుగుతారు. ప్రతి ఒక్కరికి సీతాదేవి హనుమంతునితో చెప్పిన –

"ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వా సుదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాన్తః పరికర్షతి." (సుం.కాం.37.3)

"అత్యధిక మైన ఐశ్వర్యంలోకీ, అతిభయంకరమైన కష్టాలలోకీ, దైవం, మనిషిని తాడు కట్టి లాగినట్లు కట్టి లాగుతూ ఉంటుంది" అన్న మాటలు అడుగడుగునా ధైర్యం ఇస్తాయి.

5. తనను గురించి ఒక్క క్షణ మైనా ఆలోచించకుండా పరోపకారం చేయడంలోనే జీవితాన్ని సార్థకం చేసుకోవడం అనేది అత్యుత్తమమైన సద్గుణం. దీనికి ఒకే ఒక ఉదాహరణం హనుమంతుడు. ఇలాంటి మహోదారవ్యక్తి ఏ వాఙ్మయంలోనూ కనబడదు. ఎట్టి పరిస్థితులలోనూ గుండె నిబ్బరం చెడకుండా చూచుకోవాలి అనేది ఆయన చేతల్లోను, మాటల్లోను, మనకు చేసిన ఉపదేశం.

"అనిర్వేదః శ్రియో మూలమ్ అనిర్వేదః పరం సుఖమ్" (సుం.కాం.12.10) "దిగులు చెందకుండా ఉండడంవల్ల అభివృద్ధి కలుగుతుంది. అదే సర్వసుఖాలకీ మూలం." **"వినాశే బహవో దోషా జీవన్ ప్రాప్నోతి భద్రకమ్"** (సుం.కాం.13.47) "మరణిస్తే ఏముంది? అన్నీ దోషాలే. జీవించి ఉన్నట్లైతే ఎప్పటి కైనా మంచిని చూస్తాడు." ఇలాంటి ఉపదేశాలు నిరాశాంధకారంలో పడి కొట్టుమిట్లాడే వారికి ఆశాకిరణాలు.

జాగర్తగా పరిశీలించేవారికి ఇలాంటి విషయాలు వందలకొలది రామాయణంలో లభిస్తాయి. ఇవన్నీ దేశ-కాల-జాత్యాదిభేదాలేవీ లేకుండా మానవమాత్రునికి ఉపకరించే సన్మార్గప్రదర్శక దీపాలు. ఈ మార్గాన్ని అనుసరించి తనను తాను చక్కదిద్దుకున్న వ్యక్తి తనకే కాకుండా కుటుంబానికీ, దేశానికీ, ప్రపంచానికీ కూడా శాంతిసమృద్ధులు చేకూర్చ కలుగుతాడు. వ్యక్తుల సముదాయమే కదా సమాజం? సమాజం సుఖశాంతులతో మనవలె నంటే రామాయణం ప్రచారంలోకి రావాలి.

ఈనాడు భారతదేశంలో రోజురోజుకూ పెరిగిపోతూన్న సామాజిక రుగ్మతలకు, నైతికపతనానికీ పరమౌషధం రామాయణప్రచారమే అని గుర్తించిన తమ పూజ్యగురువర్యుల ఉపదేశాన్ని వినమ్రభావంతో స్వీకరించి దానిని ఫలోన్ముఖం చెయ్యా లను దృఢ సంకల్పంతో **శ్రీ టి.ఎల్. ప్రసాద్** గారు తమ **ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్, టి. ఎల్. పి. పబ్లికేషన్స్** ద్వారా చేపట్టిన ఈ మహత్తరకార్యం శ్రీరామానుగ్రహం చేత, తపోధనులైన సద్గురువుల ఆశీర్బలం చేత సఫలమై తెలుగువారి అందరి కృతజ్ఞతకు పాత్రం కాగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు **పుల్లెల శ్రీరామచంద్రుడు**

30-1-2013

నివేదన

పదిమంది మానవులు కలిసి జీవించి సమాజంగా ఏర్పడడం ఏనాడు జరిగిందో స్పష్టంగా ఎవరమూ చెప్పలేము.

కాని, ఆనాటినుంచి యీనాటివరకూ మానవుడు సమాజజీవనంనుంచి ఎంతోకొంత ప్రయోజనం పొందుతూనే ఉన్నాడు. చాలామంది సమాజానికి తాము యిచ్చినదానికంటే ఎన్నో రెట్లు - వందల రెట్లు, వేలరెట్లు - ప్రయోజనం సమాజంనుంచి పొందుతున్నారు.

మనిషిగా పుట్టిన ప్రతివాడూ దేవతలకి, పితృదేవతలకి, ఋషులకీ ఋణపడి ఉంటాడన్నది భారతీయుల విశ్వాసం. పూజలూ, పుణ్యకార్యాలూ చేసి దేవతల ఋణం, గృహస్థాశ్రమం స్వీకరించి సంతానాన్ని కని పితృఋణం, మంచివిషయాలు నేర్చుకుని, నేర్పి ఋషిఋణం తీర్చుకోవాలి అంటారు.

మరి సమాజానికి ఉన్న ఋణాన్ని ఎలా తీర్చుకోవాలి?

ఈ ఆలోచన చాలామంది మిత్రులకి వచ్చింది. ఎన్నో పద్ధతులు చర్చించాం. చాలా మంచిపనులు యిప్పటికే ఎంతోమంది ఉత్తములు చేపట్టారు. వారితో మనం సహకరిద్దామా, లేదంటే మనంతగా ఏదైనా ఒక పద్ధతి ఏర్పరుచుకుందామా అని ఆలోచనలు సాగుతున్నాయి.

మాలో ఒక మిత్రుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఆయన ఒక సూచన చేసారు. ఇటువంటి కార్యక్రమం గుంటూరు జిల్లా లింగంగుంట్ల గ్రామంలో ఒకాయన చేపట్టారని, ఆయనతో ఒకసారి మాట్లాడదామని అన్నారు.

అందరం లింగంగుంట్ల వెళ్ళాము. అక్కడ ఒక చిన్న యింట్లో శ్రీమద్రామాయణ భక్తమండలి అని ఒక సంస్థ ఉంది. అది నడుపుతున్నవారు శ్రీ డి. చంద్రశేఖరరావు గారు.

ఆయన మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి మా ఆలోచనలన్నీ విన్నారు. పల్లెలనుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సహాయంగా వచ్చే వారుంటారు. ఆ అటెండెంట్లకి ఆహారం పెట్టాలనే ఆలోచనకి మేము చాలావరకు మొగ్గు

చూపుతున్నామని చెప్పాము.

ఆయన, " మీరంతా చదువుకున్నవారు. లోకాన్ని అధ్యయనం చేసినవారు. మీకు తెలియని విషయమేదో చెప్పడం నా ఉద్దేశం కాదు. నా ఆలోచన నేను చెప్తాను. నచ్చితే స్వీకరించండి.

ఎప్పుడైనా అన్నం అడిగే చెయ్యిని ప్రోత్సహించడం కంటే అన్నం పెట్టే చేతిని ప్రోత్సహించడం మంచిపని అని నా ఉద్దేశం.

ఇంకోలా చెప్పాలంటే సమాజం మీలాంటివారికోసం ఎదురు చూస్తోంది. టీనేజర్లనుంచి వృద్ధులవరకూ నేటి ప్రధానమైన అవసరం sound mind in a sound body.

మనిషి ఆలోచనలు మంచి మార్గంలో ఉంటే వ్యక్తులు, కుటుంబ వ్యవస్థ, సమాజం నేడు అనుభవిస్తున్న క్లేశాలు చాలావరకూ తగ్గుతాయి.

క్రమశిక్షణతో సాధన చేస్తే శరీరం దృఢంగా ఉంటుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రలోభాలు తగ్గుతాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా అభ్యుదయమార్గంలో ప్రయాణించడానికి ప్రయత్నిస్తారు. సాధిస్తారు." అన్నారు.

"అయ్యా! మీరు చెప్పింది బాగుంది. దానికి మేమేం చెయ్యాలి?" అన్నాం.

"ప్రపంచ సాహిత్యంలో అదికావ్యం, భారతీయులందరికీ ఆత్మీయ కావ్యం రామాయణం ఉంది కదా! ఆ కథ అందరికీ తెలుసు. ఆ గ్రంథం మనకొక సందేశం అందిస్తుంది. మనిషి తానొక ఉత్తమ వ్యక్తిగా, కుటుంబంలో ఉత్తమ సభ్యుడుగా, మంచి కొడుకుగా, మంచి సోదరుడిగా, మంచి మిత్రుడిగా, చివరకు మంచి శత్రువుగా కూడా ఎలా జీవించాలో చెప్తుంది ఆ కావ్యం.

వ్యక్తిత్వ వికాసం, పోజిటివ్ థింకింగ్, ఎథికల్ పర్సనాలిటీ వంటి పేర్లతో నేడు చెప్తున్న విషయాలు చాలా సులువుగా అర్థమయ్యేలా, మనస్సుకి పట్టేలా రామాయణం చెప్తుంది. ఇది పాశ్చాత్యదేశాలతో సహా అందరూ అంగీకరించిన విషయం. నేటి ప్రజలలో అబాలగోపాలానికీ యిది చాలా అవసరం. దీనిని సమాజంలోకి తీసుకుపోండి. మీరేమీ కొత్తగా కనిపెట్టి చెయ్యక్కర్లేదు.

రామాయణం మీరు చదవండి. పదిమందిచేత చదివించండి. అర్థం

తెలియకుండా శ్లోకాలు చదవడం కాకుండా కచ్చితమైన అర్థంతో తెలుగులో చదివించండి.

నేనూ నా మిత్రులూ యిదే పని చేస్తున్నాం. మేమంతా రోజూ ఉదయం కొంత సమయం కేటాయించుకుని రామాయణం చదువుతాం. నలుగురితో మొదలైన యీ కార్యక్రమంలో యిప్పుడు నాలుగువేలమంది చేరారు. అందరి ఆలోచనావిధానాలలోనూ మంచి మార్పులొచ్చాయి." అన్నారు.

మేమంతా హైదరాబాదు తిరిగి వస్తూ యీ విషయమే చర్చించుకున్నాము. స్వామి వివేకానంద చెప్పినదీ యిదే, sound mind in a sound body. ఈ నినాదం ఆనాడు నిస్తేజంగా పడిఉన్న భారతజాతికి పునరుజ్జీవనం కలిగించింది.

జంషెడ్జీ టాటా భారతదేశంలో అతిపెద్ద పారిశ్రామికవేత్త అయ్యాడు. ఆయనని అన్నదానానికి విరాళమిమ్మని బొంబాయివాసులు కొందరు కోరారు. 'ఎంతమందికి అన్నం పెడతారు? ఎన్ని రోజులు?' అని ఆయన అడిగారు. 'ఆకలితో ఉన్న వెయ్యిమందికి. ఒకపూట.' అన్నారు ఆ కార్యకర్తలు.

'ఒకపూట అన్నదానం గొప్పదే. కాని, జీవితాంతం ఉపాధి కల్పించడం అంతకంటే గొప్పది. మంచి ఉపాధి ఉన్న వ్యక్తి తాను తింటాడు. ఇతరులకు పెట్టగలుగుతాడు.' అనుకున్నాడు ఆయన. వెంటనే 'టాటా విశ్వకర్మాలయ' స్థాపించాడు. పరిశ్రమలలో పనిచెయ్యడానికి కావలసిన శిక్షణ యిచ్చాడు. లక్షలమంది నిపుణులైన పనివారిని తయారుచేసాడు.

అలాగే బెంగుళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ స్థాపనకి ఆనాటి రాజులు, మహారాజులు కంటే ఎక్కువగా ఆర్థికంగా తోడ్పడి దానికి కారణభూతుడయ్యాడు.

దీనికంతకీ వెనుక ఆయనకొక సిద్ధాంతం ఉంది. 'మనిషి ఆలోచనని ఆరోగ్యవంతంగా చెయ్యాలి. అప్పుడు కష్టపడి పనిచేస్తాడు. తాను జీవితంలో పైకొస్తాడు. ఇంకొకరికి చేయూతనిస్తాడు.'

ఈ మాటలన్నీ చెప్పుకుంటూ హైదరాబాదు చేరాం. ఒక సంవత్సరం పాటు రామాయణాన్ని చదివాం. చదివినది చర్చించుకున్నాం. కెరీర్ ప్రారంభదశలో చదివిన డేల్ కార్నెగీ, తరువాత చదివిన స్టీవెన్ కొవీ ప్రపంచానికి వెలుగు చూపిస్తూ

చెప్పిన మాటలన్నీ రామాయణంలో కనబడ్డాయి. అందులోనూ మన పరిస్థితులకీ, మన ప్రవృత్తికీ సరిపోయేలా ఉన్నాయి. జీవితంలో అంతవరకూ పొందిన అన్నిటినీ మించిన పెన్నిధి దొరికిందని పొంగిపోయాం. దీనిని సాధ్యమైనంత మందిచే చదివించాలని నిర్ణయించుకున్నాము.

ఆ విధంగా చంద్రశేఖరరావుగారు మాకు గురువుగారు అయ్యారు.

మనదేశంలో ప్రాంతీయభాషల్లో ఉన్న రామాయణాలు ఆయా ప్రాంతాల ప్రజాబాహుళ్యంలో ప్రచారంలో ఉన్నాయి. తమిళంలో కంబరామాయణం, మలయాళంలో ఎళుత్తిచియన్ రచించిన రామాయణం, ఉత్తరభారతంలో తులసీదాసు రచించిన రామాయణం ప్రమాణంగా భావిస్తారు.

అదృష్టవశాత్తు ఆంధ్రులకు వాల్మీకిరామాయణమే ప్రమాణం!

దానినే తెలుగులో అందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నాం. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న రామాయణాల పరిశీలన మొదలుపెట్టాం. పరవాలేదనిపించినవన్నీ సేకరించి గురువుగారి ముందు పెట్టాం.

గీతాప్రెస్‌వారు వేసినది మిగిలినవాటికంటే బాగుందన్నారు గురువుగారు. అది సంస్కృతశ్లోకాలతో మూడు వాల్యూములలో ఉంది. దానికి మార్పు చేసి తెలుగులో తాత్పర్యం మాత్రం వ్రాయించి ఒకే వాల్యూములో వెయ్యమని గీతాప్రెస్ వారిని కోరాము. వారు అంగీకరించి అలాగే చేయించారు. మేము దానిని పదిహేనువేల కాపీలు కొని పంచాము.

ఈలోగా రామాయణానికి మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన బాలనందిని వ్యాఖ్య పది వాల్యూములూ దొరికాయి. వాటిని చదివాము. మళ్ళీ లింగంగుంట్ల పోయి గురువుగారితో మాట్లాడాము.

"శ్రీరామచంద్రుడుగారు వాల్మీకిమహర్షి హృదయం తెలిసిన ఋషి. ఆయన రచించిన వ్యాఖ్య పది వాల్యూములలో తొమ్మిది వేల పేజీల బృహత్ గ్రంథం! అది ఆంధ్రులకు శ్రీరామచంద్రుడు శ్రీరామచంద్రుడుగారి ద్వారా అందించిన వరం!

వాల్మీకి రామాయణంలో యిరవైనాలుగు వేల శ్లోకాలున్నాయి. వాటికి

శ్రీరామచంద్రుడుగారు గాని తెలుగులో తాత్పర్యం వ్రాసి యిస్తే అది అత్యంత ప్రమాణమైన గ్రంథమవుతుంది. ఆందరికీ అర్థమయ్యే గ్రంథం అవుతుంది. అనేక తరాల తెలుగువారికి ప్రయోజనం కలిగిస్తుంది. వారిని ప్రార్థించి ఆ కృషి చెయ్యడానికి ఒప్పించండి." అన్నారు.

మేము శ్రీరామచంద్రుడుగారిని కలిసాము. వారిని చూడగానే అత్యున్నతస్థాయి పాండిత్యం, ఆదర్శభావాలూ, నిరాడంబరత్వం మూడూ కలిసి మనిషిగా రూపొందితే యిలా ఉంటాయనిపించింది.

వారి వయస్సు దృష్ట్వా యింతపని చెయ్యమని కోరడం ఎలాగో తెలియలేదు. భయపడుతూ భయపడుతూ అడిగాము.

మేము కాళ్ళా వేళ్ళా పడి బతిమాలడానికి సిద్ధమయే వెళ్ళాము. కాని, అసలు బతిమాలాల్సిన అవసరం లేకుండానే వారు అంగీకరించారు. అయితే ఒక షరతు పెట్టారు. ఆర్థికప్రతిఫలం యిస్తామనే మాట అనడానికి వీల్లేదన్నారు.

మేము అప్పటికే ఆయన రచనల చివర వ్రాసే signature శ్లోకాలని చదివి పండితులచే అర్థాలు చెప్పించుకున్నాం. 'తల్లిదండ్రుల తపస్సు, గురువుల సత్కృప, దైవానుగ్రహం - ఈ మూడూ నాచేత గ్రంథాలు వ్రాయిస్తున్నాయి. నేను కేవలం సాధనాన్ని మాత్రమే. శ్రీరాముడి కృపాలేశం వ్రాయించిన యీ గ్రంథాన్ని ఆయన పాదాలకే సమర్పిస్తున్నాను.' ఇదీ ఆ శ్లోకాల అర్థం. ఎంత ఉదాత్తమైన భావం! మొదటిసారి ఆ అర్థం విన్నప్పుడు అందరికీ కళ్ళు చెమర్చాయి. ఆనందంతో. పారవశ్యంతో. భక్తితో.

వారు అన్నమాట ప్రకారం రచన పూర్తిచేసి యిచ్చారు. వాల్మీకి ఏ ఘట్టంలో ఏం చెప్పారు అని అనుమానం వస్తే వెంటనే తెలుసుకుందుకు వీలుగా శ్లోకాల సంఖ్యలు వేసి, తాత్పర్యాలు వ్రాసి, చిరకాలం నిలిచిపోయే ప్రమాణగ్రంథంగా రచించి యిచ్చారు.

ఈలోగా సుప్రసిద్ధ పాత్రికేయులు, లబ్ధప్రతిష్ఠులైన రచయిత శ్రీరమణగారు పరిచయమయ్యారు. మా కృషిగురించి విని వారు వీనులవిందైన మాట చెప్పారు. జగమెరిగిన ప్రముఖ చిత్రకారుడు బాపు గారు తమకు మిత్రులని, యీ గ్రంథంవిషయం వారి చెవిన వేస్తానని అన్నారు.

శ్రీబాపుగారు రామభక్తులు. శ్రీరమణగారి పరిచయవాక్యాలు విని యీ గ్రంథానికి తగు చిత్రాలు వేసి యిస్తానని చెప్పి వారు మా ఉత్సాహాన్ని రెట్టింపు చేసేరు.

ఇలా యిద్దరు పద్మశ్రీ పురస్కారం అందుకున్న పెద్దలు, తెలుగువారిలోనే కాకుండా దేశవిదేశాలలో ప్రఖ్యాతిగాంచిన విద్వన్మణులు శ్రీరామచంద్రుడుగారు, బాపుగారు మాకు సహకరించడం మా పూర్వపుణ్యఫలం.

మిత్రులు, ప్రగతి ప్రింటర్స్ యజమాని శ్రీనరేంద్రగారు, కళాజ్యోతి ప్రింటర్స్ అధినేత శ్రీ బాపన్నగారు పుస్తకాల డిజైనింగ్, ప్రింటింగ్ బాధ్యతలు తమకు వదిలెయ్యమని నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించారు.

ఇందరు పెద్దల సహకారంతో '**వాల్మీకిరామాయణం**' రూపు దిద్దుకుంది.

దీనిని రెండు విధాలుగా తీసుకువస్తున్నాం. ఒక్కొక్క కాండ ఒక్కొక్క పుస్తకంగా వేసి, ఏడు పుస్తకాలనూ అందమైన బాక్సులో పెట్టిన పాప్యులర్ ఎడిషన్ ఒకటి. ఏడు కాండలూ ఒకే పుస్తకంగా రూపొందించిన క్లాసిక్ ఎడిషన్ ఒకటి.

ఎనభై సంవత్సరాలు పైబడిన వయస్సులో మా కోసం, తెలుగు మాట్లాడే మనందరికోసం ఎంతో శ్రమకోర్చి ఈ గ్రంథం రచించి యిచ్చిన ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారి పాదాలకు భక్తిపూర్వకంగా శిరసా నమస్కరిస్తున్నాము.

శ్రీ బాపు గారికి మా కృతజ్ఞతాంజలి.

ఈ ప్రయత్నంలో శ్రీ చలమచర్ల వేంకటశేషాచార్యులు గారు, ఆచార్య శ్రీరామచంద్రుడుగారి కుమార్తె శ్రీమతి పి. సత్య (నిట్టల సత్యవతి) గారు మాకు ఎంతో సహకారం అందించారు. వారికి మిక్కిలి కృతజ్ఞులం.

ఈ గ్రంథం ప్రచురించాలనే ఆలోచన కలిగినప్పటినుంచీ మిత్రులు శ్రీ ఉప్పులూరి కామేశ్వరరావు గారు నాకు కుడిభుజమై నిలిచారు. ఆరునెలలు ఇదేదో తన పని అన్నట్లు నవ్వుతూ శ్రమించారు. వారికి కేవలం కృతజ్ఞతలు చెప్పి నా బాధ్యత తీరిపోయిందనుకోలేను. వారు మిత్రుడిగా తన బాధ్యత నిర్వర్తించి స్నేహానికి అర్థం నిర్వచించారు.

మా డి.టి.పి. ఆపరేటర్ చిరంజీవి గనిశెట్టి నరసింహారావు, యింకా మా

ఆఫీసు సిబ్బంది అనేకమంది తమవంతు కృషిచేసి నాకు తోడ్పడ్డారు. వారందరికీ కృతజ్ఞుడిని.

శ్రీమద్రామాయణాన్ని అందరూ చదివేలా చెయ్యాలనుకుంటున్న మా బృహత్ ప్రయత్నంలో ఈ ప్రమాణగ్రంథం ప్రచురణ తొలి అడుగు.

అయితే భావసారూప్యంగల మిత్రులందరి సహాయ సహకారాలతో అయిదు సంవత్సరాల కాలంలో **కోటి కుటుంబాలలో రామాయణ పారాయణ** జరిగేలా చెయ్యాలన్నది మా లక్ష్యం.

దీనికోసం అక్షరాస్యులైన ప్రతివారు చదవగలిగేలా మూలానికి విధేయంగా సంక్షేపరూపంలోనూ, చదివేందుకు ఎక్కువ సమయం వెచ్చించలేని వారికోసం మరింత సంగ్రహంగానూ, యింకా అనేక రూపాలలోనూ వాల్మీకి రచించిన రామకథాసుధని తెలుగువారికి అందించాలని ప్రయత్నం చేస్తున్నాం.

హైదరాబాద్, **తిపిర్నేని లక్ష్మీప్రసాద్**

20-5-2013. **టి.ఎల్.పి. పబ్లికేషన్స్.**

బాలకాండ విషయసూచిక

సర్గ	విషయము	పుట
1.	నారదుడు వాల్మీకికి రామకథ సంక్షిప్తముగా తెలుపుట.	1
2.	రామచరితమును కావ్యముగా రచింపుమని బ్రహ్మ వాల్మీకిని ఆదేశించుట.	11
3.	రామాయణమునందలి విషయముల సంక్షిప్తవర్ణనము.	15
4.	వాల్మీకి కుశలవులకు రామాయణము ఉపదేశించుట, వారు రాముని ఎదుట గానము చేయుట.	19
5.	దశరథుడు పాలించుచున్న అయోధ్య గొప్పతనము.	22
6.	దశరథుని రాజ్యములో పౌరుల సుఖైశ్వర్యాదుల వర్ణనము.	24
7.	దశరథుని అమాత్యుల గుణనీత్యాదుల వర్ణనము.	28
8.	సంతానోత్పత్తికై దశరథుడు అశ్వమేధయాగము చేయ సంకల్పించుట.	30
9.	సుమంత్రుడు దశరథునకు ఋష్యశృంగునిగూర్చి సంక్షిప్తముగ చెప్పుట.	32
10.	ఋష్యశృంగుడు అంగదేశమునకు వచ్చుట, శాంతను వివాహమాడుట.	34
11.	దశరథుడు శాంతాఋష్యశృంగులను అయోధ్యకు తీసికొనివచ్చుట.	37
12.	యాగము చేయింపుడని దశరథుడు ఋషులను కోరుట.	39
13.	దశరథుడు పత్నీసమేతుడై యజ్ఞదీక్ష గ్రహించుట.	41
14.	దశరథుడు అశ్వమేధయాగము చేయుట.	44
15.	బ్రహ్మ దేవతలకు రావణవధోపాయము చెప్పుట.	49
16.	ప్రాజాపత్యపురుషుడు దశరథునకు పాయసము నిచ్చుట.	52

17. బ్రహ్మదేవుడు ప్రేరేపింపగా దేవాదులు అనేక వానరవీరులను సృజించుట. 55

18. రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల జననము. వారి శీలగుణాదుల వర్ధనము. విశ్వామిత్రుని ఆగమనము. అతనిని దశరథుడు సత్కరించుట. 58

19. విశ్వామిత్రుడు యాగరక్షణకై రాముని పంపుమని కోరగా దశరథుడు దుఃఖించుట. 64

20. దశరథుడు రాముని తనతో పంపననుటచే విశ్వామిత్రుడు కోపించుట. 66

21. రాముని విశ్వామిత్రునితో పంపుటకై వసిష్ఠుడు దశరథునకు నచ్చజెప్పుట. 69

22. దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట. 71

23. రామలక్ష్మణసమేతుడైన విశ్వామిత్రుడు కామాశ్రమమున రాత్రి విశ్రమించుట. 74

24. తాటకను చంపుమని విశ్వామిత్రుడు రాముని ఆదేశించుట. 76

25. తాటకను సంహరింపుమని విశ్వామిత్రుడు మరల చెప్పుట. 79

26. రాముడు తాటకను సంహరించుట. 81

27. విశ్వామిత్రుడు రామునకు దివ్యాస్త్రములు ఉపదేశించుట. 85

28. విశ్వామిత్రుడు రామునకు అస్త్రముల ఉపసంహారము ఉపదేశించుట. 87

29. విశ్వామిత్రుడు రామునకు సిద్ధాశ్రమవృత్తాంతము చెప్పుట. 89

30. రాముడు రాక్షసులను సంహరించి విశ్వామిత్రుని యాగమును రక్షించుట. 91

31. రామాదులతో కలిసి విశ్వామిత్రుడు మిథిలకు ప్రయాణమగుట. 94

32. వాయువు కుశనాభుని కుమార్తెలను గూనివారినిగా చేయుట. 96

33.	బ్రహ్మదత్తుడు కుశనాభుని కుమార్తెలను పరిణయమాడుట.	98
34.	గాధి జన్మవృత్తాంతము.	101
35.	రాముడు ప్రశ్నింపగా విశ్వామిత్రుడు గంగావతరణకథ చెప్పుట.	103
36.	పార్వతి దేవతలకును, భూదేవికిని శాపము నిచ్చుట.	105
37.	గంగనుండి కార్తికేయుడు జనించుట.	107
38.	సగరచక్రవర్తి యాగము ప్రారంభించుట.	111
39.	యజ్ఞాశ్వమును దేవేంద్రుడు అపహరించుట. సగరుని కుమారులు యజ్ఞాశ్వమును వెదకుచు భూమిని భేదించుట.	113
40.	సగరకుమారులు కపిలుని క్రోధాగ్నికి భస్మమగుట.	115
41.	అంశుమంతుడు యజ్ఞాశ్వమును తీసుకొనివచ్చుట.	118
42.	గంగను భూలోకమునకు తెచ్చుటకై భగీరథుడు తపస్సు చేయుట.	120
43.	గంగ భగీరథునివెంట పాతాళమునకు వెళ్ళి సగరపుత్రులను ఉద్ధరించుట.	122
44.	భగీరథుడు గంగాజలముచే పితృతర్పణము చేయుట.	125
45.	క్షీరసాగరమథనము, అమృతము ఆవిర్భవించుట.	127
46.	ఇంద్రుని చంపగల పుత్రునికై దితి తపస్సు చేయుట.	131
47.	సప్తమరుత్తుల వృత్తాంతము.	133
48.	అహల్యాశాపవృత్తాంతము.	135
49.	అహల్యాశాపవిమోచనము.	138
50.	రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిల చేరుట.	140
51.	శతానందుడు విశ్వామిత్రుని పూర్వవృత్తాంతమును వర్ణించుట.	142
52.	వసిష్ఠుడు విశ్వామిత్రుని సత్కరించుటకై కామధేనువును ఆదేశించుట.	144

53. విశ్వామిత్రుడు కామధేనువును కోరగా, వసిష్ఠుడు నిరాకరించుట. 146

54. విశ్వామిత్రుడు శబలను అపహరించబోవుట. 148

55. విశ్వామిత్రుడు దివ్యాస్త్రములు ప్రయోగించుట. వసిష్ఠుడు బ్రహ్మదండమును ధరించి విశ్వామిత్రుని ఎదుర్కొనుట. 150

56. విశ్వామిత్రుని అస్త్రములను వసిష్ఠుడు బ్రహ్మదండముతో శమింపచేయుట. 152

57. విశ్వామిత్రుడు తపస్సు చేయుట. త్రిశంకువృత్తాంతము. 154

58. వసిష్ఠపుత్రులు శపించగా త్రిశంకువు విశ్వామిత్రు నాశ్రయించుట. 156

59. విశ్వామిత్రుడు మహోదయుని, వసిష్ఠపుత్రులను శపించుట. 158

60. విశ్వామిత్రుడు మరొక స్వర్గలోకమును సృజించుటకు ఉద్యమించి దేవతలు ప్రార్థింపగా విరమించుట 160

61. శునశ్శేపుని వృత్తాంతము. 162

62. విశ్వామిత్రుడు శునఃశేపుని రక్షించుట. 164

63. విశ్వామిత్రుడు మహర్షిత్వమును పొందుట. మేనక ఆతని తపస్సునకు విఘ్నము కలిగించుట. 166

64. విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వముకై ఘోరతపస్సు చేసెదనని శపథము చేయుట. 168

65. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అగుట. 169

66. జనకుడు శివధనుర్వృత్తాంతము చెప్పుట. రాముడు ధనుస్సునకు నారి కట్టినచో ఆతనికి సీత నిచ్చెదనని ప్రకటించుట. 173

67. శివధనుర్భంగము. జనకుడు దశరథుని తీసికొనివచ్చుటకై మంత్రులను పంపుట. 175

68. దశరథుడు మంత్రిసమేతుడై మిథిలకు బయలుదేరుట 178

69. దశరథుడు మిథిల చేరగా జనకుడు ఆతనిని సత్కరించుట. 179

70. వసిష్ఠుడు రామలక్ష్మణులకొరకై సీతా ఊర్మిళలను వరించుట. 181

71. రామలక్ష్మణులకు సీతాఊర్మిళలను ఇచ్చెదనని జనకుడు అంగీకరించుట. 185

72. భరతశత్రుఘ్నులకొరకై కుశధ్వజుని కన్యలను వరించుట. 187

73. రామలక్ష్మణభరతశత్రుఘ్నుల వివాహము. 189

74. దశరథుడు తన నగరమున కేగుచుండగా దారిలో పరశురాముడు వచ్చుట. 192

75. పరశురాముడు రాముని వైష్ణవధనుస్సుపై బాణసంధానము చేయుమనుట. 194

76. రాముడు పరశురాముడు సంపాదించుకొనిన పుణ్యలోకములను అమోఘమైన బాణముతో కొట్టివేయుట. 197

77. సీతారాముల ప్రేమాతిశయ వర్ణనము. 199

శ్రీః

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమద్రామాయణము

బాలకాండము

మొదటి సర్గము

నారదుడు వాల్మీకికి రామకథ సంక్షిప్తముగా తెలుపుట.

దేవర్షి అయిన నారదుడు తపస్సు చేయుటయందు, వేదాధ్యయనము చేయుట యందు చాల ఆసక్తి గలవాడు. వాక్కులు (అనగా వేదము, వేదార్థము) తెలిసినవారిలో అగ్రగణ్యుడు. మునులలో గొప్పవాడు.

తపఃశాలి అయిన వాల్మీకిమహర్షి నారదుని ఈవిధముగా పరిప్రశ్నించెను. (వినయముగా నమస్కరించి ప్రశ్నించెను.)(1)

"దేవర్షీ! భూలోకములో ఈనాడు మంచి గుణములూ, గొప్ప పరాక్రమమూ కలవాడు, ధర్మము తెలిసినవాడు, కృతజ్ఞుడు, సత్యమైన వాక్కు మరియు దృఢమైన సంకల్పము కలవాడు అయిన మహాపురుషుడు ఎవడున్నాడు?(2)

మంచి నడవడిక కలవాడు, సర్వప్రాణులకు హితము ఆచరించువాడు, విద్వాంసుడు, అసాధ్యములైన కార్యములు కూడ సాధించు సామర్థ్యము కలవాడు, తనను చూచువారికి అందరికీ ఒకే విధముగా ఆనందము కలిగే రీతిలో కనబడువాడు అయిన మహాపురుషుడు ఎవడున్నాడు?(3)

ధైర్యము కలవాడు, కోపమును జయించినవాడు, ప్రశస్తమైన కాంతి కలవాడు, అసూయ లేనివాడు అయిన మహాత్ముడు ఎవడున్నాడు? ఎవడు యుద్ధములో కోపము వచ్చి నిలిచినచో చూచి దేవతలు కూడ భయపడుదురు?(4)

ఓ మహర్షీ! ఇట్టి గుణములున్న మనుష్యుని గూర్చి తెలుసుకొనుటకు నీవు సమర్థుడవు. నేనీ విషయమును వినగోరుచున్నాను. నాకు ఎక్కువ కుతూహలముగా ఉన్నది.(5)"

మూడు లోకముల వృత్తాంతము తెలిసిన నారదుడు, వాల్మీకి మాటలను

విని, సంతోషించి, "చెప్పెదను వినుము." అనుచు ఇట్లు చెప్పెను.(6)

"ఓ వాల్మీకిమునీ! నీవు చెప్పిన అనేకమైన ఈ సద్గుణములు సామాన్య మానవులకు దుర్లభమైనవి. అయిననూ అట్టి గుణములన్నీ ఉన్న ఒక మహాపురుషుని గుర్తించి చెప్పెదను. వినుము.(7)

ఇక్ష్వాకువంశమునందు జన్మించిన రాముడు లోకమంతటా ప్రసిద్ధుడు. అతడు మనోనిగ్రహవంతుడు. గొప్ప పరాక్రమము, కాంతి, ధైర్యము కలవాడు. ఇంద్రియములను వశములో ఉంచుకొన్నవాడు.(8)

రాముడు బుద్ధి, నీతి, మాటలాడుటలో నేర్పు, ఐశ్వర్యము కలవాడు. శత్రువులను నశింపచేయువాడు. అతని మూపులు విశాలమైనవి. బాహువులు దీర్ఘములై బలిసి ఉన్నవి. కంఠము శంఖమువలె ఉండును. చెక్కిళ్ళ పైభాగము ఉన్నతముగా ఉండును. అతని వక్షఃస్థలము చాల విశాలమైనది. అతడి ధనుస్సు చాల గొప్పది. అతని మూపుల సంధులు పైకి కనబడవు. శత్రుసంహారకుడైన అతని బాహువులు మోకాళ్ళను స్పృశించునంతగా దీర్ఘమైనవి. అతడి నడక చూడముచ్చటగా ఉండును. అతడి శిరస్సూ, లలాటమూ కూడ మంచి లక్షణముతో ఒప్పుచుండును. (9,10)

అతడి శరీరము హెచ్చు తగ్గులు లేక సమముగా విభజింపబడిన అవయవములతో శోభించును. అతని శరీరము, మరీ పొట్టిగా గాని, పొడవుగా గాని కాకుండగా సమముగా ఉండును. అతడి శరీరపు ఛాయ చాల చక్కనిది. తేజస్సు ప్రశంసనీయమైనది. వక్షఃస్థలము కండలు తేరి ఉండును. నేత్రములు విశాలమైనవి. అవయవాల శోభ ప్రశస్తమైనది. సాముద్రిక శాస్త్రములో చెప్పిన శుభలక్షణములన్నీ అతని శరీరములో కనబడును.(11)

అతడు సకల ధర్మములు తెలిసినవాడు. ఆడిన మాట తప్పనివాడు. ఎల్లప్పుడూ ప్రజల హితమునే కోరుచుండును. అతడు యశస్సు కలవాడు. అన్ని విషయములు తెలిసినవాడు. పరిశుద్ధమైనవాడు.(అనగా వ్యవహారములలో ఎన్నడూ ఎవరినీ మోసము చేయనివాడు.)(12)

శ్రీమంతుడైన ఆ రాముడు బ్రహ్మదేవునితో సమానుడు. అందరినీ పోషించువాడు. శత్రువినాశకుడు. సమస్త ప్రాణిసముదాయమును రక్షించువాడు. ధర్మసంరక్షకుడు.(13)



అతడికి వేదవేదాంగముల రహస్యములన్నీతెలుసు. ధనుర్వేదములో అతడి ప్రావీణ్యము సాటిలేనిది.(14)

సకల శాస్త్రముల సారము తెలిసిన ఆ రాముని జ్ఞాపకశక్తి, ప్రతిభ చాల ప్రశంసనీయమైనవి. అతడు సకల ప్రజలకు ఇష్టుడు. సాధుస్వభావం కలవాడు. మనస్సులో ఎన్నడూ దైన్యమెరుగనివాడు. పనులలో మంచి నేర్పు కలవాడు.(15)

నదులు సముద్రమును చేరినట్లు, సత్పురుషులందరు ఎల్లవేళలా అతనిని చేరుచుందురు. ఈ విధముగా అతడు ఆర్యుడు, అనగా ప్రతి ఒక్కరూ దగ్గరికి చేరవలసిన పురుషుడు. అందరివిషయమునందు సమముగా ప్రవర్తించువాడు. అతడి దర్శనము అందరికీ, ఒకే విధముగా, ఎల్లవేళలా ఆనందజనకమైనది.(16)

కౌసల్యానందవర్ధనుడైన ఆ రాముడొక్కడే సకలగుణములకు నిలయమైనవాడు. అతడు గాంభీర్యములో సముద్రమువంటివాడు. ధైర్యములో హిమవత్పర్వతమువంటివాడు. ఆతని మనస్సులోని భావము ఏమిటో ఎవ్వరూ గ్రహింపజాలరు. అతని మానసికస్థైర్యాన్ని ఎవరూ కదల్పజాలరు.(17)

అతడు పరాక్రమములో విష్ణువుతో సమానుడు. చూచువారికి ఆనందము కలిగించుటలో చంద్రునివంటివాడు. క్రోధము వచ్చినచో ప్రళయకాలాగ్నితో సమానుడు. ఓర్పులో భూమితో సమానుడు. దానం చేయుటలో కుబేరునివంటివాడు. సత్యము విషయంలో సాక్షాత్తు రెండవ ధర్మదేవతయే.(18)

దశరథుడు ప్రజలకు హితము చేయవలెనను కోరికతో, సమస్త సద్గుణసంపన్నుడును, అమోఘములగు బలపరాక్రమములు కలవాడును, ఎల్లప్పుడును ప్రజల హితమునే కోరుచుండువాడును, తనకు ప్రీతిపాత్రుడును అగు జ్యేష్ఠకుమారుడైన రాముని యువరాజుగా చేయగోరెను.(19, 20)

దశరథుని రాణులలో కైకేయి ఒకతె. పూర్వమెప్పుడో దశరథుడు ఆమెకు రెండు వరములు ఇచ్చియుండెను. రామాభిషేకముకొరకు సేకరించిన

సంభారములను చూచి ఆమె తనకిచ్చిన వరములలో ఒక వరముగా రాముని అరణ్యమునకు పంపవలెననియు, రెండవ వరముగా భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలెననియు దశరథుని కోరెను.(21,22)

దశరథుడు సత్యవాక్పాలన నియమము గలవాడు. అందుచే ధర్మపాశబద్ధుడై తన ప్రియపుత్రుడైన రాముని అరణ్యములకు పంపెను. రాముడు, కైకేయికి సంతోషము కలిగించుటకై తండ్రి మాటమాత్రముగా చెప్పినంతనే దానిని ఆజ్ఞగా గ్రహించి, తన ప్రతిజ్ఞను నిలుపుకొనుచు అరణ్యమునకు వెళ్ళెను.(23, 24)

లక్ష్మణుడు రామునికి చాల ఇష్టుడైన తమ్ముడు. అతనియందు సహజమైన ప్రేమ కలవాడు. వినయసంపన్నుడు. అతడు తన భ్రాతృస్నేహమును చూపుచు అరణ్యమునకు పోవుచున్న ఆ రామునివెంట వెళ్లెను. ఇట్లు ఉత్తమమైన కార్యము చేయుటచే తల్లియగు సుమిత్రకు కూడ ఆనందమును వృద్ధిపొందించెను.(25)

జనకుని వంశమునందు పుట్టినదియు, రామునికి భార్యయు, దశరథునికి కోడలు అయిన సీత రామునకు చాల ఇష్టురాలు. ప్రాణము వంటిది. ఆమె సర్వదా రామునకు హితమునే చేయుచుండును. రాక్షసులను మోహింపచేయుటకై సృజింపబడిన దేవమాయవలె లోకోత్తరమైన సౌందర్యము కలది. సాముద్రికశాస్త్రములో చెప్పిన మంచిలక్షణము లన్నియు ఆమెయందు ఉన్నవి. స్త్రీలలో ఉత్తమురాలైన ఆ సీత కూడ, రోహిణి చంద్రుని అనుసరించినట్లు, ఆ రామచంద్రుని అనుసరించి వెళ్లెను.(26,27)

పౌరులును, దశరథుడును వనవాసమునకు వెళ్ళుచున్న రామునివెంట చాల దూరమువరకు వెళ్ళిరి. ధర్మాత్ముడైన రాముడు గంగాతీరమునందు, శృంగిబేరపురము అనెడు పట్టణములో బోయజాతివారికి ప్రభువైన గుహుని కలుసుకొనెను. అచటినుండి రాముడు తన సారథియైన సూతుని వెనుకకు పంపివేసెను.(28,29)

సీతారామలక్ష్మణులు ఒక వనమునుండి మరొక వనము చేరుచు, గొప్ప గొప్ప నదులను దాటుచు, భరద్వాజమహర్షి ఆదేశము ప్రకారము చిత్రకూటపర్వతమును చేరిరి. అచట పర్ణశాల నిర్మించుకొని దేవగంధర్వులవలె సుఖముగా నివసించిరి.(30,31)

రాముడు చిత్రకూటమునకు వెళ్ళిన పిమ్మట దశరథుడు పుత్రశోకముచేత పీడితుడై, పుత్రునిగూర్చి విలపించుచు స్వర్గస్థుడయ్యెను.(32)

దశరథుడు మరణించిన పిదప వసిష్ఠాదులు రాజ్యము చేయుమని భరతుని ఆజ్ఞాపించిరి. తనకు రాజ్యము చేయు సామర్థ్యమున్నను, భరతుడు రామునిపై నున్న గౌరవముచే రాజ్యమును పాలించుటకు ఒప్పుకొనలేదు. (33)

రాగద్వేషాదులు జయించిన భరతుడు రాముని అనుగ్రహింప చేసుకొనుటకై అరణ్యమునకు వెళ్ళి, వినయముతో సుమహాత్ముడును, సత్యవ్రతుడును, తన సోదరుడును అగు రాముని చేరి, "నీవు సమస్తధర్మములు తెలిసినవాడవు. అందుచేత నీవే రాజువు కావలెను." అని ప్రార్థించెను. (34, 35)

(ఎంతో మృదుస్వభావుడైన) రాముడు తనను ఆశ్రయించినవారి పట్ల సుముఖుడై వారి కోరికలన్నియు తీర్చును. అంతటి మృదుస్వభావుడైనను రాముడు, తండ్రియాజ్ఞను అనుసరింపవలెనను దీక్షవహించి యుండుటవలన భరతుడు ఎంత ప్రార్థించినను రాజ్యమును స్వీకరించుటకు అంగీకరించలేదు. (36)

"నేను వచ్చునంతవరకును నా పాదుకలను నా ప్రతినిధిగా భావించి రాజ్యము చేయుటకై నీవద్ద ఉంచుకొనుము." అని చెప్పి, తన పాదుకలను భరతునకిచ్చి, రాముడు అతనికి అనేకవిధముల బోధించి అయోధ్యకు పంపెను. (37)

రాముని తిరిగి తీసికొనివెళ్లవలెనన్న కోరిక తీరని భరతుడు ఆ రామపాదుకలనే సేవించుచు, రాముడు సుఖముగా తిరిగి రావలెనని మనస్సులో కోరుకొనుచు, అయోధ్యాసమీపమున నున్న నందిగ్రామము అనెడు గ్రామములో నివసించి రాజ్యపాలనము చేసెను. (38)

భరతుడు వెళ్లగానే రాముడు, అయోధ్యాపౌరులును భరతాదులును మాటిమాటికి ఆ చిత్రకూటపర్వతమునకు వచ్చుచుందురు అని ఊహించి, పితాజ్ఞాపాలనమునందు సావధానుడై దండకారణ్యమున ప్రవేశించెను. (39, 40)

దండకారణ్యమును ప్రవేశించిన వెంటనే రాముడు విరాధుడను రాక్షసుని చంపి, శరభంగ - సుతీక్ష్ణ - అగస్త్యమహర్షులను, అగస్త్యుని సోదరుని చూచెను. అగస్త్యుడు తనకు ఇంద్రుడిచ్చిన ధనుస్సును, ఖడ్గమును, తరగని బాణములుగల అమ్ములపొదులను రామున కీయగా అతడు సంతోషముగా వానిని గ్రహించెను. (41, 42)

రాముడు శరభంగమహర్షి ఆశ్రమములో నివసించుచుండగా ఆ చుట్టుప్రక్కలనున్న ఋషులందరును, "అసురులను, రాక్షసులను సంహరింపుము."

అని ప్రార్థించుటకై ఆతనివద్దకు వచ్చిరి.(43)

రాక్షసనివాసమైన ఆ అరణ్యములో అచ్చటి ఋషులు చేసిన ప్రార్థనను రాముడు అంగీకరించెను. "యుద్ధములో రాక్షసులను సంహరించెదను." అని అగ్నితుల్యతేజస్కులైన ఆ దండకారణ్యవాసులైన మునులకు మాట ఇచ్చెను.(44, 45)

దండకారణ్యములో జనస్థానము అను ప్రదేశములో నివసించు కామరూపిణియగు శూర్పణఖ అను రాక్షసిని ముక్కుచెవులు కోసి విరూపిణిగా చేసెను.(46)

శూర్పణఖ విరూపితయైన పిమ్మట ఆమె మాట విని యుద్ధమునకు వచ్చిన ఖరుని, త్రిశిరసుని, దూషణుని, వారి అనుచరులైన సకలరాక్షసులను రాముడు యుద్ధమునందు సంహరించెను. దండకారణ్యమునందు నివసించునపుడు రాముడు జనస్థానములో నివసించు రాక్షసులలో పదునాలుగువేలమందిని సంహరించెను.(47, 48)

తన జ్ఞాతుల మరణవార్త వినిన రావణుడు మిక్కిలి కోపించి తనకు సాహాయ్యము చేయుమని మారీచుడను రాక్షసుని కోరెను.(49)

"రావణా! బలవంతుడైన రామునితో వైరము పెట్టుకొనకుము." అని మారీచుడు రావణుని అనేక పర్యాయములు వారించెను. మృత్యువు సమీపించి ఉండుటచే రావణుడు మారీచుని మాటలు వినలేదు. అతనిని వెంటబెట్టుకొని రాముని ఆశ్రమమునకు వెళ్లెను.(50, 51)

మాయావియైన మారీచునిద్వారా రామలక్ష్మణులను పర్ణశాలనుండి చాలదూరము వెళ్లిపోవునట్లు చేసి, రావణుడు రాముని భార్యయగు సీతను అపహరించెను. ఆమెను విడిపించుటకై వచ్చిన జటాయువును వధించెను.(52)

ప్రాణములు విడుచుటకు సిద్ధముగా ఉన్న జటాయువును రాముడు చూచెను. సీతను రావణుడు అపహరించినట్లు జటాయువు చెప్పగా విని, రాముడు మిక్కిలి దుఃఖితుడై ఇంద్రియములను వశములో ఉంచుకొనజాలక విలపించెను.(53)

రాముడు జటాయువునకు దహనసంస్కారము చేసెను. పిమ్మట సీతకై వెదకుచు, ఆ వనములో వికృతమైన ఆకారముతో, భయంకరముగా ఉన్న కబంధుడనెడి రాక్షసుని చూచెను. బలిష్ఠములైన బాహువులుగల రాముడు ఆ కబంధుని చంపి దహనసంస్కారము చేయగా అతడు స్వర్గమునకు వెళ్లెను. అతడు స్వర్గమునకు

పోవుటకు ముందు, "రామా! ధర్మమును ఆచరించుటయందు నేర్పు కలదియు, ధర్మమును ఆచరించునదియు అగు ఒక శబర స్త్రీ సన్న్యాసాశ్రమమును స్వీకరించి ఈ ప్రాంతమునందే యున్నది. ఆమె వద్దకు వెళ్ళుము." అని చెప్పెను.(54-56)

రాముడు శబరి వద్దకు వెళ్లెను. శబరి ఆ రాముని చక్కగ పూజించెను.(57)

రాముడు పంపాసరోవరతీరమున హనుమంతునితో పరిచయ మేర్పరచుకొని పిదప ఆతని మాట ప్రకారము సుగ్రీవునితో స్నేహము చేసికొనెను. రాముడు తన వృత్తాంతమునంతను మొదటినుండియు సుగ్రీవునకు, హనుమంతునకు చెప్పెను, సీతావృత్తాంతమును విశేషించి తెలిపెను. సుగ్రీవుడు రాముని వృత్తాంతమంతయు విని, అగ్నిసాక్షికముగా రామునితో మైత్రి చేసికొనెను.(58-60)

"నీకును వాలికిని విరోధమెట్లు ఏర్పడినది?" అని రాముడు ప్రశ్నింపగా, సుగ్రీవుడు దుఃఖించుచు, స్నేహముతో రామునకు ఆ వృత్తాంతమునంతయు తెలిపెను.(ఆ వృత్తాంతమును విని) వాలిని చంపెదనని రాముడు ప్రతిజ్ఞ చేసెను. సుగ్రీవుడు కూడ రామునకు వాలియొక్క బలమును వర్ణించి చెప్పెను.(61, 62)

సుగ్రీవుడు రాముని చూచినది మొదలు, "ఇతడు వాలిని చంపుటకు సమర్థుడో, కాడో" అని సందేహించుచుండెను. అతడు రాముని విషయమున తనకు నమ్మకము కలుగుటకై, కొండవలెనున్న దుందుభి యను రాక్షసుని కళేబరమును రామునకు చూపెను.(63, 64)

ఊహింపరాని బలము కల రాముడు అస్థిమయమైన(ఎముకల పోగయి ఉన్న) ఆ దుందుభి కళేబరమును చూచి, "ఇది ఎంత?" అన్నట్లు నవ్వి దానిని తన పాదాంగుష్ఠముతో (కాలి బొటనవ్రేలితో) ఎత్తి పదియోజనముల దూరము పడునట్లు విసరెను. సుగ్రీవునకు ఇంకను నమ్మకము కలుగుటకై ఒకే బాణముచే ఏడు మద్దిచెట్లను, ఒక పర్వతమును, పాతాళమును కూడ భేదించెను.(65, 66)

రాముడు ఆ పనులు చేసిన పిమ్మట సుగ్రీవునకు నమ్మిక కుదిరెను. తనకు రాజ్యము లభించునని అతడు సంతసించి, రాముని వెంటబెట్టుకొని గుహవలె నున్న కిష్కింధాపట్టణమునకు వెళ్లెను.(67)

కిష్కింధ ప్రవేశించి సుగ్రీవుడు గర్జించెను. ఆ మహానాదమును విని వాలి గృహమునుండి బయటకు వచ్చెను. యుద్ధమునకు వెళ్లవద్దని నివారించుచున్న తారను ఒప్పించి, వాలి సుగ్రీవునితో యుద్ధమునకు తలపడెను. అచట రాముడు

ఒక్క బాణముతో వాలిని చంపెను. అనంతరము సుగ్రీవుని వానరరాజ్యమునందు పట్టాభిషిక్తుని చేసెను.(68-70)

వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు వానరులందరిని రప్పించి, సీతాదేవిని అన్వేషించుటకై అన్ని దిక్కులకు పంపెను. మహాబలశాలియగు హనుమంతుడు సంపాతియనెడు గ్రద్ధ చెప్పిన ప్రకారము నూరుయోజనముల వెడల్పుగల లవణసముద్రమును దాటెను.(71, 72)

రావణుడు పాలించుచున్న లంకాపురము చేరి, అచట అశోకవనములో రామునే ధ్యానించుచు ఉన్న సీతాదేవిని చూచెను. సుగ్రీవునితో రామునకు మైత్రి కలుగుట మొదలగు వృత్తాంతమును సీతకు విన్నవించి, తన చేతికి రాముడిచ్చిన అంగులీయకమును ఆమెకు గుర్తుగా ఇచ్చి, ఆమెను ఊరడించి, అశోకవన బహిర్ద్వారమును చూర్ణము చేసెను.(73, 74)

హనుమంతుడు పంచసేనాగ్రనాయకులను, సప్తమంత్రిపుత్రులను సంహరించి, శూరుడైన అక్షకుమారుని వధించి, చివరకు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు కట్టువడెను.(75)

పరాక్రమశాలియగు హనుమంతుడు, పూర్వము బ్రహ్మదేవుడు తనకిచ్చిన వరముల ప్రభావమువలన, తనను బ్రహ్మాస్త్రబంధము వదలిపోయినట్లు తెలుసుకొనెను. తనను త్రాళ్లచే కట్టి ఈడ్చుకొని పోవుచున్న రాక్షసులను వధించుటకు తాను సమర్థుడనని తెలిసినను, రావణుని చూడగోరి ఆ రాక్షసులు పెట్టు బాధలను సహించెను. రావణునితో మాటలాడిన పిమ్మట సీతాదేవి నివసించు ప్రదేశమును తప్ప మిగిలిన లంకాపురి నంతయు కాల్చి, 'సీతను చూచితిని' అను సంతోషవార్త చెప్పుటకై మరల రాముని సమీపమునకు వెళ్లెను.(76, 77)

అతడు రామునివద్దకు వెళ్లి, అతనికి ప్రదక్షిణనమస్కారములు చేసి, "చూచితిని సీతను." అని యథార్థముగా విన్నవించెను.(78)

సుగ్రీవునితో కలిసి రాముడు సముద్రతీరము చేరి, సముద్రుడు తనకు వశము కానందులకు కోపించి, సూర్యునివలె తీక్ష్ణములైన బాణములచే సముద్రుని క్షోభింపచేసెను. సముద్రుడు రాముని కోపమునకు భయపడి నిజరూపముతో కనబడి తనపై సేతువు కట్టించు ఉపాయమును చెప్పెను. అతని మాట ప్రకారము రాముడు నలునిచే సేతువు కట్టించెను.(79, 80)

రాముడు ఆ సేతుమార్గమున లంకలోనికి ప్రవేశించెను. యుద్ధమునందు రావణుని సంహరించెను. సీతను పొంది(పరగృహములో చాలకాలము నివసించిన భార్యను ఎట్లు స్వీకరింతును? అని) చాల సిగ్గుపడెను. ఆ కారణమువలన రాముడు జనులందరిలోను, సీతతో పరుషముగా మాటలాడెను. మహాపతివ్రతయగు సీత ఆ మాటలను సహింపజాలక అగ్నిలో ప్రవేశించెను.(81, 82)

"సీత ఏపాపమూ లేనిది." అని అగ్ని చెప్పగా రాముడు చాల సంతసించెను. సకలదేవతలు రాముని పూజించిరి. మహాత్ముడైన రాముడు లోకకంటకుడైన రావణుని చంపుటచే స్థావరజంగమాత్మకములైన మూడు లోకములును, దేవతాఋషిగణములును సంతోషించినవి.(83, 84)

రాముడు పూర్వము విభీషణుని సముద్రతీరమున అభిషిక్తుని చేసెను. ఇపుడు లంకాపురిలో కూడ విభీషణుని రాక్షసరాజునుగా అభిషిక్తునిచేసి కృతకృత్యుడయ్యెను. తన ప్రతిజ్ఞ నెరవేరునో లేదో అను అతని చింత తొలగిపోయెను.(85)

రాముడు తనను చూడవచ్చిన దేవతలనుండి వరమును పొందెను. దాని ప్రకారము మృతులైన వానరులనందరిని బ్రతికించుకొనెను. స్నేహితులతో కూడి, పుష్పకవిమానారూఢుడై అయోధ్యకు బయలుదేరెను. రాముడు భరద్వాజాశ్రమము చేరి అక్కడినుండి హనుమంతుని భరతుని వద్దకు పంపెను.(86, 87)

రాముడు సుగ్రీవవిభీషణాదులతో కూడి, పూర్వవృత్తాంతములను చెప్పుకొనుచు నందిగ్రామమునకు వెళ్లెను. నందిగ్రామమున సోదరుల నందరిని కలిసెను. వారందరును జటలను విడచిరి. ఈవిధముగా రాముడు సీతను పొంది మరల రాజ్యమును కూడా పొందెను.(88, 89)

రాముడు రాజ్యాభిషిక్తుడు కాగా లోకమంతయు సంతోషాతిశయముచే గగుర్పాటు చెందెను. ప్రజలెల్లరు ప్రీతి చెందిరి. ఆనందాతిశయముచే లోకమునకు పరిపుష్టిలభించినది. ప్రజలందరును చక్కగా ధర్మము నాచరించుచుండిరి. లోకమందు పీడలు, వ్యాధులు, దుర్భిక్షములు మొదలగువాని భయము తొలగిపోయెను.(90)

రాముడు రాజ్యము చేయుచున్నపుడు తండ్రి యుండగా పుత్రుడు మరణించడు. స్త్రీలకు వైధవ్యదుఃఖము ఉండదు. వారు సర్వదా పతివ్రతలై యుందురు. రాముని రాజ్యములో అగ్నిభయము గాని, జలభయము గాని, వాతభయము గాని, జ్వరభయము గాని, క్షుద్బాధ గాని, చోరభయము గాని లేదు. నగరములు, దేశములు కూడ

ధనధాన్యసమృద్ధములై ఉన్నవి. కృతయుగములో వలెనే ప్రజలందరును సంతోషవంతులై యున్నారు.(91-93)

రాముడు వందలకొలది అశ్వమేధయాగములచేతను, అనేక 'బహుసువర్ణక' యాగములచేతను దేవతలను పూజించి, పదివేలకోట్ల గోవులను, లెక్కింపరానంత ధనమును బ్రాహ్మణులకిచ్చి, శాశ్వతమగు తన స్థానమును పొందగలడు. క్షత్రియులకు రాజ్యము లిచ్చి నూరింతలుగా వారి వంశములను వృద్ధి పొందింపగలడు. నాలుగు వర్ణములవారిని వారి వారి ధర్మము లాచరించునట్లు నియమించగలడు.(94-96)

రాముడు ప్రజలకు సుఖము కలుగునట్లు, పదకొండువేల సంవత్సరములపాటు రాజ్యమును పాలించి, బ్రహ్మలోకమును చేరగలడు.(97)

రామచరిత్ర పరిశుద్ధిని కలిగించును. పాపములను నశింపచేయును. పుణ్యములను ఇచ్చును. ఇది వేదముతో సమానము. దీనిని చదువువారి సర్వపాపములును తొలగిపోవును. రామాయణమనెడు ఈ ఆఖ్యానము అయుర్దాయమును వృద్ధి పొందించును. దీనిని చదువువాడు పుత్రపౌత్రాదులతోను, భృత్యబంధుగణములతోను కూడి సర్వసౌఖ్యములను అనుభవించి, మరణానంతరము స్వర్గమునందు దేవతలచేత పూజింపబడును.(98, 99)

ఈ రామాయణమును బ్రాహ్మణుడు పఠించినచో అష్టాదశ విద్యలందును ప్రావీణ్యమును పొందును. క్షత్రియుడు పఠించినచో భూమండలాధిపతి యగును. వైశ్యుడు పఠించినచో వ్యాపారమునందు లాభమును పొందును. శూద్రుడు పఠించినచో గొప్పవాడగును.(100)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ప్రథమసర్గము సమాప్తము.

రెండవ సర్గము

రామచరితమును కావ్యముగా రచింపుమని బ్రహ్మ వాల్మీకిని ఆదేశించుట.

వాల్మీకిమహాముని ధర్మబుద్ధి కలవాడు. వాక్యముల విశేషము తెలిసినవాడు. అందుచే నారదుడు చెప్పిన సంక్షేపమైన రామాయణ కథను వినినంతనే దానిని శ్లాఘించెను. అయన శిష్యులు కూడ శ్లాఘించిరి.(1)

వాల్మీకి యథోచితముగా చేసిన పూజలందుకొని, అతని అనుజ్ఞపొంది, నారదుడు ఆకాశమార్గమున దేవలోకమునకు వెళ్ళెను.(2)


నారదుడు బ్రహ్మలోకమునకు వెళ్ళిన వెంటనే, వాల్మీకి జాహ్నవికి దగ్గరగా ఉన్న తమసానదికి వెళ్ళెను. తమసానదీతీరము చేరి, బురదలేని రేవును చూచి, ప్రక్కనున్న శిష్యునితో ఇట్లు అనెను.(3, 4)

"ఓ భరద్వాజుడా! ఈ రేవును చూడుము. ఇది బురదలేకుండ సత్పురుషుని హృదయమువలె నిర్మలమై, మనోహరమై ఉన్నది. నాయనా! జలపాత్రను క్రింద నుంచి నాకు నారచీర ఇమ్ము. శ్రేష్ఠమైన ఈ తమసాతీర్థమునందు స్నానము చేసెదను."(5, 6)

మహాత్ముడగు వాల్మీకి ఇలా చెప్పగా, గురువిధేయుడైన భరద్వాజుడు వాల్మీకికి నారచీర ఇచ్చెను. ఇంద్రియనిగ్రహముగల వాల్మీకి శిష్యుని చేతినుండి ఆ నారచీరను తీసికొని విశాలమైన ఆ వనమునంతను చూచుచు సంచరించెను. ఆ వనములో, తమసాతీర్థమునకు సమీపముననే ఎడబాటు లేకుండ తిరుగుచూ, మనోహరముగ కూయుచున్న క్రౌంచపక్షుల జంటను చూచెను.(7-9)

క్రూరమైన నిర్దయము కలవాడు, పశుపక్ష్యాదుల విషయమున నిష్కారణముగ ద్వేషముతో ప్రవర్తించువాడు అయిన ఒక బోయవాడు, ఆ మహర్షి చూచుచున్నాడనెడు సంకోచమైనను లేక ఆ జంటలో మగపక్షిని చంపెను.(10)

ఆ నిషాదుడు కొట్టగా రక్తసిక్తమై నేలపై పడి పొరలుచున్న ఆ మగపక్షిని భార్యయైన ఆడ క్రౌంచపక్షి చూచినది. తనపై ఎంతో ప్రేమ కలిగినది, తననుండి ఎడబాటు ఎరుగనిది, అందమైన రెక్కలు ఎఱ్ఱని తలయుగలది, కామముచే మదించినది అయిన మగపక్షితో వియోగము చెంది ఆ క్రౌంచి అతి దీనముగా



ఏడ్వసాగినది.(11, 12)

బోయవానిచే పడగొట్టబడిన ఆ పక్షిని చూడగనే ధర్మాత్ముడైన ఆ వాల్మీకికి జాలి కలిగెను. ఆ మహర్షి ఏడ్చుచున్న క్రౌంచిని చూచి, దయగలవాడై, "ఆ పక్షిని రతి కాలమందు చంపుట ధర్మముకాదు." అని తలచుచు ఇట్లు పలికెను.(13, 14)

"నిర్భాగ్యుడైన ఓ బోయవాడా! నీవు క్రౌంచపక్షి దంపతులనుండి మన్మథపరవశమైన ఒకదానిని చంపితివి. అందుచే నీవు చాలకాలము జీవించకుందువుగాక!" ఈవిధముగ పలికి తన నోటినుండి వెలువడిన వాక్యమును పరిశీలించుకొనెను. ఆ మహర్షి మనస్సులో, "ఈ పక్షియొక్క శోకముచేత దుః ఖితుడనైన నా నోటినుండి ఇదేమి! ఈవిధమైన వాక్యము వెలువడినది?" అను ఆలోచన కలిగెను.(15, 16)

మహాపండితుడు, బుద్ధిమంతుడు అయిన ఆ మునిపుంగవుడు ఒక నిశ్చయము చేసికొని శిష్యునితో ఇట్లు పలికెను.(17)

"నేను శోకార్తుడనై ఉండగా నా నోటినుండి ఈ వాక్యము బయలుదేరినది. ఇది నాలుగు పాదములలో, ఒక్కొక్క పాదమునకు సమానమైన అక్షరములతో కూర్చబడినది. వీణపై కూర్చి గీతవాద్యములతో పాడుటకు అనుకూలముగా ఉన్నది. కావున దీనికి శ్లోకమను పేరుతో ప్రసిద్ధి రావలెను. మరొక పేరుతో కాదు."(18)

వాల్మీకి మాటలను విని శిష్యుడు అత్యుత్తమమైన "మా నిషాద" ఇత్యాది వాక్యమును స్వీకరించెను, అనగా దానిని కంఠస్థము చేసికొనెను. వాల్మీకి అందులకు సంతసించెను.(19)



పిమ్మట వాల్మీకిమహాముని ఆ తీర్థమునందు యథావిధిగా స్నానము చేసి, అక్కడ జరిగిన సంఘటనను గూర్చియే ఆలోచించుచు ఆశ్రమమువైపు మరలెను. శిష్యుడైన భరద్వాజుడు జలముతో నిండిన కలశమును తీసికొని వాల్మీకిని వెంబడించెను. (20, 21)

వాల్మీకిమహర్షి శిష్యునితోగూడ ఆశ్రమము ప్రవేశించి, కూర్చుని అంతకుముందు జరిగిన పక్షివృత్తాంతాదులనే స్మరించుచు, ఆయా విషయములను గూర్చి ముచ్చటించెను. (22)

అప్పుడు లోకములను సృజించినవాడు, లోకములకు అధిపతి, నాలుగు ముఖములు కలవాడు, గొప్ప తేజస్సు కలవాడు అయిన బ్రహ్మదేవుడు ఆ మునిపుంగవుని చూచుటకై స్వయముగ వచ్చెను. వాల్మీకి బ్రహ్మను చూడగనే ఆశ్చర్యచకితుడై వెంటనే లేచి, అంజలి ఘటించి, ఆతనికి యథాశాస్త్రముగా నమస్కరించి, అవిచ్ఛిన్నమగు కుశలమును ప్రశ్నించి, పాద్యము అర్ఘ్యము ఆసనము వందనము సమర్పించి పూజించెను. (23-25)

బ్రహ్మదేవుడు పరమపూజితమగు ఉత్తమాసనముపై కూర్చుండి, "నీవు కూడ ఆసనముపై కూర్చుండుము." అని వాల్మీకితో అనెను. (26)

వాల్మీకి బ్రహ్మదేవుని అనుజ్ఞ పొంది ఆసనముపై కూర్చుండెను. లోకములకు పితామహుడైన ఆ బ్రహ్మదేవుడు ఎదురుగా కూర్చొనియుండగా కూడ వాల్మీకి, మనస్సులో ఆ క్రౌంచపక్షిని గూర్చియే ఆలోచించుచుండెను. (27)

"అట్టి మధురధ్వనిగల క్రౌంచపక్షిని నిష్కారణముగా, ఆ బోయవాడు చంపినాడు కదా! ఆ పాపాత్ముడు వైరముచే దానిని పట్టుకొనవలెనను బుద్ధితో ఎంతటి ఘోరకార్యము చేసినాడు!" అని ఆలోచించుచుండెను. వాల్మీకి దుఃఖపరవశుడై, బాహ్యవిషయములపై ప్రవర్తించని మనస్సుతో, ఆ క్రౌంచిని గూర్చియే విచారించుచు, మానిషాద ఇత్యాది శ్లోకమును మరల మరల మననము చేసుకొనుచుండెను. (28, 29)

బ్రహ్మదేవుడు నవ్వుచు వాల్మీకితో ఇట్లనెను. "వాల్మీకీ! నీవు కూర్చినది



శ్లోకమే. ఈ విషయమున సందేహము లేదు. నా సంకల్పమును అనుసరించియే ఈ వాక్కు నీయందు ఆవిర్భవించినది. నీవు ఋషిశ్రేష్ఠుడవు. రాముని చరితము నంతను కావ్యరూపమున రచింపుము.(30, 31)

రాముడు ధర్మస్వభావుడు. లోకములో ప్రశస్తములైన గుణములు కలవాడు. పండితుడు. అట్టి రాముని చరిత్రమును నారదునినుండి నీవు వినినది వినినట్లుగ చెప్పుము.(32)

లక్ష్మణసహితుడైన రాముడు, సీత, భరతాదులు, రాక్షసులు -వీరందరి చరిత్రము రహస్యమైనదైనను, ప్రకాశమైనదైనను నీ కింతవరకును తెలియనిదికూడ ఇపుడు స్పష్టముగా తెలియగలదు.(33, 34)

ఈ కావ్యములో నీవు చెప్పిన ఒక్క మాట యైనను అసత్యము కానేరదు. పుణ్యము, మనోహరము అయిన రామకథను శ్లోకబద్ధము చేయుము.(35)

పర్వతములును, నదులును, భూతలమునందు ఉన్నంతవరకును రామాయణకథ లోకములలో వ్యాపించి యుండును. నీవు రచించిన రామాయణకథ ప్రచారములో ఉన్నంతకాలము నీవు, నేను సృజించిన ఊర్ధ్వలోకములలోను, అధోలోకములలోను స్వేచ్ఛగ సంచరించుచు ఉండగలవు."(36, 37)

బ్రహ్మదేవుడు ఈవిధముగ పలికి అచటనే అంతర్ధానము పొందెను. వాల్మీకి మహామునియు, శిష్యులును చాల ఆశ్చర్యము చెందిరి.(38)

పిమ్మట వాల్మీకిశిష్యు లందరును మాటిమాటికి సంతోషించుచు ఈ శ్లోకమును మరల మరల పఠించి ఒకరి కొకరు చెప్పుకొనిరి.(39)

సమసంఖ్యాకములగు అక్షరములతో, నాలుగు పాదములతోను, కూడినదై మహర్షి గానము చేసిన ఈ శ్లోకము మాటిమాటికిని గానము చేయుటచే ఇంకను శ్లోకత్వమును పొందినది.(40)

పరమాత్మధ్యానపరాయణుడగు వాల్మీకి, "రామాయణమును అంతను ఈ శ్లోకవృత్తములో రచించెదను." అని నిశ్చయించుకొనెను. ఈ కావ్యము యశస్కాలియగు రాముని మాహాత్మ్యమును తెలుపునట్టిది. దీనిని మనోహరములు, ఉత్తమములు

అగు వృత్తములతోను, శబ్దార్థములతోను శోభించునట్లు రచించెను. సమాక్షరములు కలిగిన వందలకొలది శ్లోకములతో ఈ కావ్యమును రచించెను.(41, 42)

వాల్మీకిముని రచించిన ఈ "రామచరితము"లో, "రావణవధ"లో సమాసములు నాతిదీర్ఘములు. సంధులు శ్రావ్యములు. శబ్దవ్యుత్పత్తి శాస్త్రసమ్మతమైనది. ఇందలి వాక్యములు సమములై, మధురములై, అర్థభరితములై ఉన్నవి. అట్టి ఈ కావ్యమును వినండి.(43)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని రెండవసర్గము సమాప్తము.

మూడవ సర్గము

రామాయణమునందలి విషయముల సంక్షిప్తవర్ణనము.

ధర్మస్వభావుడైన వాల్మీకి, తనకు నారదుడు చెప్పిన ధర్మసహితమగు ఆ రామకథకంటె అధికముగ ఇంకను ఏమైన రామచరితము ఉన్నదా అని పరిశీలించెను. ఆచమనము చేసి అగ్రభాగములు తూర్పుగా ఉండునట్లు పరచిన దర్భలపై కూర్చుండి, దోసిలి కట్టి, దివ్యదృష్టితో రామచరితమును గూర్చి చక్కగా ఆలోచించెను.(1, 2)

వాల్మీకి తపఃప్రభావముచే, రామలక్ష్మణులు, సీత, దశరథమహారాజు ఏమి చేసిరో, రాముడు భార్యాసహితుడై ఉన్నప్పుడును రాజ్యముతో ఉన్నప్పుడును ఏమేమి పొందెనో ఆ విషయముల నన్నింటినీ యథార్థముగా తెలిసికొనెను. మరియు వారందరును ఎట్లు నవ్విరో, ఎట్లు మాటలాడిరో, ఎట్లు నడచిరో, ఇంకను ఏయే పనులు చేసిరో ఆ విషయముల నన్నింటిని కూడ తెలుసుకొనెను. రాముడు సీతాలక్ష్మణులతో కలిసి అరణ్యములో సంచరించినపుడు ఏమేమి జరిగెనో అవి యన్నియు తెలుసుకొనెను. రామాదులకు సంబంధించిన వృత్తాంతమునంతను యోగదృష్టిచే కరతలామలకమును వలె స్పష్టముగా కనుగొనెను.(3-6)

మహాతేజఃశాలియైన వాల్మీకి తపఃప్రభావముచే విషయముల నన్నింటిని తెలుసుకొనెను. పిమ్మట కామార్థములనెడు పురుషార్థములతో సంబంధించినదియు, ధర్మప్రధానమైన గుణములు అధికముగా కలదియు, రత్నములతో సమృద్ధమైన సముద్రమువలె నున్నదియు, అందరి చెవులను మనస్సులను ఆకర్షించునదియు,

సకల వేదసారసంగ్రహరూపమును అగు లోకాభిరాముడైన రాముని చరిత్రమును రచించుటకు ఉపక్రమించెను. పూర్వము నారదమహర్షి తనకు చెప్పినవిధముగ రచించెను.(7-9)

రాముని అవతారమును, అతని మహాపరాక్రమమును, అందరికిని అనుకూలుడుగాను ఇష్టుడుగాను ఉండుటను, ఓర్పును, సౌందర్యమును, సత్యశీలమును వర్ణించెను.(10)

విశ్వామిత్రుని కలిసినప్పుడు జరిగిన విచిత్రములైన అనేక కథలను, శివధనుర్భంగమును, జానకీపరిణయమును, పరశురామునితో దశరథరాముని వివాదమును, రాముని సద్గుణములను, రాముని యౌవరాజ్యపట్టాభిషేకమునకై ప్రయత్నమును, కైకేయి దుష్టచింతనమును వర్ణించెను.(11, 12)

రాముని యౌవరాజ్యపట్టాభిషేకమునకు విఘ్నము కలుగుట, రాముని అరణ్యవాసమునకు పంపుట, దశరథుడు దుఃఖార్తుడై విలపించుట, అతడు స్వర్గస్థుడగుట – ఈ విషయములను వర్ణించెను.(13)

ప్రజలు దుఃఖించుటను, రాముడు వారిని విడచిపెట్టుటను, గుహునితో సంభాషణమును, సారథియైన సుమంత్రుడు రాముని అరణ్యప్రాంతములో విడచి తిరిగివచ్చుటను, సీతారామలక్ష్మణులు గంగానదిని దాటుటను, భరద్వాజుని చూచుటను, భరద్వాజుని ఆజ్ఞప్రకారము వారు చిత్రకూటమునకు వెళ్లుటను వర్ణించెను.(14, 15)

రామాదులు చిత్రకూటమున గృహము నిర్మించుకొని నివసించుటను, భరతుడు వచ్చి రాముని బ్రతిమాలుటను, రాముడు తండ్రికి ఔర్ధ్వదేహికక్రియలు చేయుటను, భరతుడు రామపాదుకలకు పట్టాభిషేకము చేసి నందిగ్రామములో నివసించుటను, రాముడు దండకారణ్యములోనికి ప్రవేశించుటను, అచట విరాధుని చంపుటను వర్ణించెను.(16, 17)

రాముడు శరభంగసుతీక్ష్ణమహర్షుల దర్శనము చేయుటను, సీత అనసూయ దగ్గర కూర్చుండి సంభాషణాదికము చేయుటను, అనసూయ సీతకు శరీరమునకు పూసికొనెడు అంగరాగమును ఇచ్చుటను, రాముడు అగస్త్యుని దర్శనము చేయుటను, జటాయువును కలియుటను, పంచవటికి వెళ్లుటను, అచట శూర్పణఖను చూచుటను వర్ణించెను.(18, 19)



శూర్పణఖతో జరిగిన సంభాషణమును, ఆమెకు రూపవికారము కలిగించుటను, ఖరుడు, త్రిశిరస్కుడు అను రాక్షసులను రాముడు సంహరింపగా రావణుడు రామునకు అపకారము చేయుటకై ప్రయత్నము ప్రారంభించుటను, రాముడు మారీచుని చంపుటను, రావణుడు సీతను హరించుటను, జటాయువును చంపుటను, రాముడు సీతకై విలపించుటను, రాముడు కబంధుని, పంపాసరస్సును, శబరిని, హనుమంతుని చూచుటను, రాముడు ఋశ్యమూకపర్వతమునకు వెళ్లి, సుగ్రీవుని కలిసికొని అతనితో స్నేహము చేసికొనుటను, అతనికి నమ్మకము కలిగించుటను, వాలిసుగ్రీవుల యుద్ధమును, రాముడు వాలిని సంహరించుటను, తార విలపించుటను, రాముడు సుగ్రీవునకు రాజ్యము నిచ్చుటను, రామసుగ్రీవులమధ్య సీతాన్వేషణమును గూర్చి జరిగిన ఒప్పందమును, రాముడు వర్షర్తురాత్రులందు యుద్ధమునకై తగు కాలము వచ్చువరకును వేచియుండుటను వర్ణించెను. (20-24)

సుగ్రీవుడు ఆలస్యము చేయుటచే రామునకు కోపము కలుగుటను, సుగ్రీవుడు వానరసేనలను పిలిపించుటను, వారిని నాల్గుదిక్కులకు పంపుటను, సుగ్రీవుడు వారికి పృథివిపై నున్న వివిధప్రదేశములను గూర్చి వర్ణించి చెప్పుటను, రాముడు హనుమంతుని చేతికి తన ఉంగరమును ఇచ్చుటను, వానరులు ఋక్షబిలములో ప్రవేశించుటను, వారు సీతను కానక నిరాశులై ప్రాయోపవేశము చేయుటను, వారు సంపాతిని చూచుటను వర్ణించెను. (25, 26)

హనుమంతుడు మహేంద్రపర్వతము నెక్కి దానినుండి ఎగిరి సముద్రమును దాటుటను, సముద్రుడు ప్రేరేపింపగా వచ్చిన మైనాకపర్వతముయొక్క దర్శనమును, సింహికయొక్క మరణమును, హనుమంతుడు లంకలో ఉన్న పర్వతముయొక్క ఒక భాగమును చూచుటను(చేరుటను), రాత్రియందు లంకలో ప్రవేశించుటను, ఒంటరిగానున్న అతడు ఆలోచన చేయుటను, రావణుని, అతని పుష్పకమును చూచుటను, మద్యపానభూమికి వెళ్లి అచట రావణాంతఃపురస్త్రీలను చూచుటను వర్ణించెను. (27-29)

అశోకవనములో ప్రవేశించి అచట సీతను చూచుటను, ఆమెకు రాముని

ఉంగరమును ఆనవాలుగా ఇచ్చుటను, పిమ్మట రావణుని చూచుటను, రాక్షసస్త్రీలు సీతను భయపెట్టుటను, త్రిజటాస్వప్నమును, సీత హనుమంతునకు చూడామణి ఇచ్చుటను, హనుమంతుడు అశోకవనములోని వృక్షములను విరుచుటను, రాక్షసస్త్రీలు పారిపోవుటను, హనుమంతుడు రావణుని భటులను చంపుటను, వాయునందనుడు ఇంద్రజిత్తుచేత పట్టువడుటను, అతడు లంకను దహించుచు గర్జించుటను, హనుమంతుడు మరల సముద్రము దాటి వెనుకకు వచ్చుటను, వానరులు మధువనములో మధువును త్రాగుటను, హనుమంతుడు సీత వార్త తెలిపి, రాముని ఓదార్చి,అతనికి సీత ఇచ్చిన చూడామణిని సమర్పించుటను వర్ణించెను.(30-33)

రాముడు సైన్యముతో సముద్రము చేరుటను, నలుడు సేతువు బంధించుటను, రాత్రి లంకను ముట్టడించుటను, విభీషణునితో స్నేహసంబంధమును, అతడు రామునకు రావణవధోపాయమును చెప్పుటను, కుంభకర్ణమేఘనాదుల సంహారమును, రావణవధను, సీతాప్రాప్తిని, లంకలో విభీషణరాజ్యాభిషేకమును, పుష్పకదర్శనమును వర్ణించెను.(34-36)

రాముడు అయోధ్యచేరి భరతుని కలియుటను, రాముని పట్టాభిషేకోత్సవమును, రాముడు వానరసైన్యము నంతను వెనుకకు పంపివేయుటను, దేశములోని ప్రజలందరును సంతోషించు విధమున రాముడు రాజ్యపాలనము చేయుటను, సీతను త్యజించుటను వర్ణించెను.(37)

మున్ముందు జరుగనున్న రాముని చరిత్రమునంతను ఉత్తరకాండలో రచించెను.(38)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని మూదవసర్గము సమాప్తము.

నాలుగవ సర్గము

వాల్మీకి కుశలవులకు రామాయణము ఉపదేశించుట, వారు రాముని ఎదుట గానము చేయుట.

ఋషి యగుటచే కావ్యము చేయుటకు సమర్థుడగు వాల్మీకి, రాముడు రాజ్యమును పాలించుచున్న కాలముననే, అతని చరిత్రము నంతను విచిత్రములైన శబ్దములతో రచించెను.(1)

వాల్మీకిమహర్షి రామాయణమును ఏడు కాండములలో, ఆరు వందల సర్గలలో, ఇరువదినాలుగువేల శ్లోకములలో రచించెను. ఈ విధముగ రామపట్టాభిషేకానంతరము జరిగిన కథతోడను, అశ్వమేధానంతరము జరిగిన కథతోడను రామాయణమును రచించి, "దీనిని యుక్తరీతిలో పఠింపగలవారు ఎవరున్నారా?" అని ఆలోచించెను.(2, 3)

వాల్మీకిమహర్షి ఈవిధముగా ఆలోచించుచుండగా మునివేషధారులైన గాయకులగు కుశలవులు వచ్చి ఆయనకు పాదప్రణామము చేసిరి. వాల్మీకిమహర్షి ధర్మజ్ఞులు, కీర్తిమంతులు, మధురస్వరవంతులు, ఆశ్రమనివాసులు, సోదరులు, గాయకులు అగు కుశలవులను చూచెను.(4, 5)

సాంగవేదాధ్యయనము చేసినవారు, మేధావంతులు అయిన ఆ ఇరువురిని చూచి, వాల్మీకి తాను వేదార్థమునకు పరిపుష్టి కూర్చుటకై రచించిన రామాయణమును వారికి ఉపదేశించెను.(6)

వాల్మీకి ఆ కావ్యమును "రామాయణము" "సీతాచరితము" "పౌలస్త్యవధము" అను పేర్లతో రచించి ఉండెను.(7)

కుశలవులు ఆ కావ్యము చక్కగా గానము చేసిరి. ఆ కావ్యములోని చదువదగిన అంశము(సాహిత్యము), గానము చేయు అంశము(సంగీతము) కూడ మధురముగా ఉన్నవి. అనగా ఈ కావ్యములోని భాష, అర్థము వంటి విషయములు మధురముగా ఉన్నవి. ఇది గానమునకు కూడ అనువుగా ఉండుటచే దీని గానము కూడ మధురముగనే ఉన్నది. ద్రుత - మధ్య - విలంబితములను నిర్వహించుటకు వీలున్నది. ఇది వీణాతంత్రులపై లయ కలిపి పాడుటకు అనువుగ ఉన్నది. ఆయా స్థానములలో ప్రసంగానుగుణముగా శృంగార-హాస్య-కరుణ- రౌద్ర - వీర -

భయానక - బీభత్స - అద్భుత - శాంతరసములు నిర్వహింపబడినవి. దీనిని పాడిన కుశలవులు కూడ సంగీతశాస్త్ర రహస్యములు తెలిసినవారు. మనుష్యరూపము ధరించిన గంధర్వులవలె ఉన్నారు. అపూర్వసౌందర్యముతో, ఉత్తమ లక్షణములతో అలరారుచున్న వారు. మాటలాడునపుడు కూడ వారి కంఠస్వరము ఎంతగానో ముచ్చట గొల్పుచు ఉండెను. వారు రాముని శరీరమనెడు మూలబింబమునుండి వెలికితీసిన రెండు ప్రతిబింబములా అన్నట్లు ఉండిరి.(8-11)

ఆ రాజకుమారులు ధర్మప్రతిపాదకమైన ఆ ఉత్తమకావ్యమును పూర్తిగా కంఠస్థము చేసికొని, దాని నెట్లు గానము చేయవలెనో ఆ రహస్యములను బాగుగా తెలిసికొని, సావధానచిత్తులై, ఋషులు, ద్విజులు, సత్పురుషులు మొదలైనవారి సమావేశములలో, ఎవ్వరును తప్పు పట్టుటకు వీలుకాని విధమున గానము చేసిరి.(12, 13)

ఒకనాడు పవిత్రహృదయులగు కొందరు ఋషీశ్వరులు కలిసి ఒకచోట కూర్చొనియుండగా కుశలవులు వారి ఎదుట ఈ కావ్యమును గానము చేసిరి. వారి కావ్యగానమును విన్న మునులందరును మిక్కిలి ఆశ్చర్యము చెంది, ఆనందబాష్పములు కార్చుచు, "బాగు! బాగు!" అని వారిని మెచ్చుకొనిరి.(14, 15)

గానము చేయుచున్న కుశలవులను ఆ మునులందరును సంతోషించిన హృదయములతో ప్రశంసించిరి.(16)

"గీతము చాల మధురముగా ఉన్నది. శ్లోకములు ఇంకను మధురముగా ఉన్నవి. పూర్వమేనాడో జరిగిన కథ కండ్లకు కట్టినట్లు వర్ణింపబడినది. వారిద్దరును కంఠములు చక్కగా కలిపి, భావావేశముతో, మధురముగాను, మనోహరముగాను, షడ్జాది స్వరములు చెడకుండగను పాడిరి." మహాతపఃశాలులగు ఆ మహాత్ము లీవిధముగా కొనియాడగా కుశలవులు అతిమధురముగాను, మనోహరముగాను గానము చేసిరి.(17-19)

ఒకానొక మహర్షి సంతోషించినవాడై లేచి వారికి ఒక కలశమును బహూకరించెను. మరియొక మహర్షి సంతసించి నారచీరలను బహూకరించెను.(20)

వాల్మీకి రచించిన ఈ రామాయణము చాల ఆశ్చర్యకరమైనది. రాబోవు కవులందరికిని ఆధారమైనది. క్రమము ప్రకారము పూర్తి చేయబడినది.(21)



ఆయుష్షును వృద్ధి పొందించు నదియు, పుష్టిని కలిగించునదియు, అందరి చెవులకును ఇంపుగా నుండునదియు అగు ఆ గీతమును చక్కగా పాడుచున్న ఆ కుశలవులను అందరూ ప్రశంసించు చుండిరి. వారు వీథులందును, రాజమార్గము లందును, ఇతర ప్రదేశములందును గానము చేయుచుండగా ఒకనాడు రాముడు వారిని చూచెను. గౌరవార్హులైన ఆ కుశలవులను తన మందిరమునకు రప్పించి గౌరవించెను.(22-24)

రాముడు దివ్యమైన స్వర్ణసింహాసనమును అలంకరించి యుండెను. మంత్రులును, సోదరులును సమీపమున కూర్చుని ఉండిరి. మంచిరూపముతో ప్రకాశించుచున్న కుశలవులను చూచి రాముడు భరతలక్ష్మణ శత్రుఘ్నులతో, (25, 26)

"వీరిద్దరు దేవతలవంటి తేజస్సుగలవారు. వీరు పాడనున్న ఆఖ్యానము విచిత్రమైన పదములును, అర్థములును కలది. ఈ ఆఖ్యానమును శ్రద్ధగా వినుడు." అని పలికి, కుశలవులను పాడుడని నియోగించెను.(27)

ఆ కుశలవులు మధురముగాను, రాగయుక్తముగాను గానము చేసిరి. వారి కంఠధ్వని చాల చక్కగ దీర్ఘముగ ఉండెను. వారి పాట వీణాతంత్రుల లయకు సరిపడి ఉండెను. అర్థము స్పష్టముగ తెలియుచుండెను.(28)

జనసమూహములో ఆ కుశలవుల గానము వీనులకు విందుగా నుండి, వినువారి సర్వేంద్రియములను, మనస్సులను, హృదయములను ఆనందింపచేసెను. (29)

"ఓ జనులారా! వీరిరువురు మునులే అయినను రాజలక్షణములతో ప్రకాశించుచున్నారు. గాయకులే అయినను గొప్ప తపస్సు కలవారు. వీరు గానము చేయనున్న సీతాచరితము నాకుకూడ ఊరట కలిగించునది అగుటచే శ్రేయస్కరము. సావధానచిత్తులై వినుడు."(అని రాముడు అక్కడనున్న వారితో పలికెను).(30)

రాముడు ప్రేరేపించగా ఆ కుశలవులు మార్గదేశీపద్ధతులనెడు రెండు

గానపద్ధతులలో మార్గపద్ధతినే చక్కగా అవలంబించి గానము చేసిరి. పరిషత్తులో నున్న రాముడు కూడ మనఃశాంతి పొందవలెననెడు అభిలాషచే ఆ గానమునందు ఆసక్తచిత్తుడయ్యెను. (31)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నాలుగవసర్గము సమాప్తము.

ఐదవ సర్గము

దశరథుడు పాలించుచున్న అయోధ్య గొప్పతనము.

అష్టాదశద్వీప పరిమితమైన ఈ భూమియంతయు, పూర్వము, మనుచక్రవర్తి మొదలుకొని, విజయవంతులైన ఏ రాజుల వశములో ఉండెడిదో, ఆ వంశములో సగరుడనెడు చక్రవర్తి ఉండెడివాడు. ఆ సగరచక్రవర్తి సాగరమును త్రవ్వించగా అది వైశాల్యమును పొందినది. అతడు యుద్ధయాత్రకై బయలుదేరినపుడు అతనితో కూడ అరువదివేలమంది కుమారులు వెళ్లెడివారు. (1, 2)

రామాయణమని ప్రసిద్ధిచెందిన ఈ పవిత్రమైన ఆఖ్యానము అట్టి మహాత్ములైన ఇక్ష్వాకురాజుల వంశములో పుట్టినది. దీనిని లోకములో అంతటను ప్రవర్తింప చేసెదము. ధర్మార్థకామము లనెడు పురుషార్థములను ప్రతిపాదించు ఈ రామాయణమును పూర్తిగ మొదటినుండియు అసూయ(ఇతరులలోని మంచి గుణములలో కూడ దోషములనే చూచుట) లేనివారై వినుడు. (3, 4)

ధనధాన్యములతో తులతూగుచు నిత్యసంతుష్టులైన ప్రజలుగల, విశాలమైన కోసలమనెడు ఒక గొప్ప దేశము సరయూనదీతీరమున ఉన్నది. ఆ కోసలదేశములో అయోధ్య యను ఒక ప్రసిద్ధమైన నగరము ఉండెను. సకలమానవులకును ప్రభువైన మనుచక్రవర్తి స్వయముగ దానిని తన సంకల్పబలముచే నిర్మించెను. (5, 6)

చక్కగా ఏర్పరుపబడిన విశాలములైన మార్గములతో శోభాయుతముగా ఉన్న ఆ అయోధ్యానగరము పంద్రెండు యోజనముల పొడవు, మూడు యోజనముల వెడల్పు కలిగి యుండెను. ఆ నగరము చక్కగా ఏర్పరచిన, విశాలమైన రాజమార్గముతో ఒప్పారుచుండెను. దానియం దంతటను పుష్పములు చల్లుచుండెడివారు. నిత్యము నీరు చల్లి తడుపుచుండెడివారు. (7, 8)

విశాలమైన రాజ్యమును పరిపాలించిన సమర్థుడైన దశరథుడను రాజు, దేవేంద్రుడు స్వర్గములో నివసించినట్లు, ఆ నగరములో నివసించెను. (9)

ఆ అయోధ్యానగరమునకు వెలుపలనున్న తలుపులును, దారుబంధములును, చాల దృఢమైనవి. అంగడివీథులన్నియు మధ్యలో చక్కగా తీర్చిదిద్దబడియున్నవి. అచ్చటచ్చట అనేకవిధములైన యంత్రములును, ఆయుధములును నెలకొల్పబడియున్నవి. ఎందరో శిల్పులు ఆ నగరములో నివసించుచుండిరి. (10)

ఆ నగరమందు ఎందరో సూతులును, మాగధులును నివసించుచుండిరి. అది అత్యధిక సమృద్ధితో సాటిలేని శోభతో, ప్రకాశించుచుండెను. అందలి కోటబురుజులును, ధ్వజములును చాల ఉన్నతముగ ఉండెను. వందలాది శతఘ్నులు అచ్చటచ్చట అమర్చబడియుండెను. (11)

ఆ నగరములో ఎన్నియో నటీనటసంఘములుండెడివి. నలువైపులా శాఖానగరములు ఉండెను. అచ్చటచ్చట ఉద్యానవనములును, మామిడితోపులును ఉండెను. అతివిశాలమైన ఆ నగరము చుట్టును ఉన్న ఉన్నతమైన ప్రాకారము దానికి వడ్డాణమువలె ఉండెను. (12)

ఆ నగరము చుట్టును ప్రవేశింపశక్యముకాని, అగాధమైన అగడ్త ఉండెను. ఎవ్వరును ఆ నగరములో ప్రవేశించి దానిని ఆక్రమింపజాలరు. అది గుఱ్ఱములు, ఏనుగులు, గోవులు, ఒంటెలు, గాడిదలు మొదలైనవాటితో నిండియుండెను. (13)

ఆ నగరము కప్పము కట్టుటకై వచ్చిన సామంతరాజులచేతను, నానాదేశములనుండి వచ్చిన వర్తకులచేతను నిండి యుండెడిది. రత్నములతో అలంకరించిన రాజగృహముల తోడను, క్రీడాపర్వతములతోడను అయోధ్య ప్రకాశించుచుండెను. మేడలపై కట్టిన మేడలతో నిండి ఇంద్రుని రాజధానియగు అమరావతివలె ఉండెను. (14, 15)

జూదమాడు పీటవంటి ఆకారముగల ఆ నగరము చాల ఆశ్చర్యజనకమై సుందరులగు స్త్రీలతో నిండియుండెను. అన్నివిధములైన రత్నములును అచట ఉండెను. ఏడంతస్తుల విశాలభవనములతో ప్రకాశించుచుండెను. ఆ నగరములో దట్టముగ ఇండ్లు కట్టబడెను. అనుపయుక్తమైన స్థలమేదియు లేకుండెను. అది మిట్టపల్లములు లేని భూమిపై నిర్మింపబడెను. అచట వరిబియ్యము సమృద్ధిగ లభించుచుండెను. అచటి ఉదకము చెఱకురసమువలె మధురముగ నుండెను. (16, 17)

ఆ నగరమునందు దుందుభి మృదంగ వీణా పణవాది మంగళవాద్యముల ధ్వనులు ఎల్లప్పుడును మిన్ను ముట్టుచుండెడివి. భూమిలో దానికంటె ఉత్తమమైన పట్టణము మరొకటిలేదు. సిద్ధులు తపఃశక్తిచే స్వర్గమునందు నిర్మించుకొనిన విమానమువలె ఉన్న ఆ అయోధ్యలో గృహములు బారులుతీర్చి చక్కగ నిర్మింపబడినవి. ఉత్తములైన మనుష్యులు అచట నివసించెడివారు.(18, 19)

ఆ నగరములో వేలకొలది మహారథులైన వీరులుండిరి. వారు బాణప్రయోగమునందు హస్తలాఘవము గలవారు. వారు ఒంటరిగా ఉన్నవానిని, తండ్రిగాని కుమారుడుగాని(వెనుక ముందు ఎవరూ) లేనివానిని, శబ్దమును పట్టి కొట్టుటకు వీలుగా ఉన్నవానిని, పారిపోవుచున్న వానిని ఎన్నడును బాణములచే కొట్టెడివారు కారు. మదించి వనములలో గర్జించుచున్న సింహవ్యాఘ్రవరాహాది క్రూరమృగములను తీక్ష్ణములైన ఆయుధములచేత గాని, ఆయుధములు లేకుండ కేవలము బాహుబలముచేత గాని చంపెడివారు. అట్టి అయోధ్యానగరమును నివాసముగా చేసికొని దశరథమహారాజు రాజ్యము పాలించెను.(20-22)

ఆ అయోధ్యానగరములోని ద్విజులందరును, అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఆహితాగ్నులు, సద్గుణవంతులు, వేదవేదాంగనిష్ణాతులు, అనంతముగా దానము చేయువారు. సత్యనిరతులు. మహాబుద్ధిశాలులు. వీరిలో కొందరు మహర్షులవంటివారై ఉండగా మరికొందరు సాక్షాత్తు ఋషులే.(23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పంచమసర్గము సమాప్తము.

ఆరవ సర్గము

దశరథుని రాజ్యములో పౌరుల సుఖైశ్వర్యాదుల వర్ణనము.

దశరథమహారాజు ఆ అయోధ్యాపురిలో నివసించుచు, సర్వలోక రక్షకుడును, మహాతేజఃశాలియు అగు మనువెట్లు పరిపాలించెనో, అట్లు జగత్తునంతను పరిపాలించెను. ఆ దశరథుడు వేదవేత్త. శూరులను, పండితులను దానాదులచే వశము చేసికొనినవాడు. ఎప్పుడో జరుగబోవు విషయములను గ్రహింపగలవాడు. గొప్ప పరాక్రమము గలవాడు. పౌరులకును, జానపదులకును ఇష్టుడు. ఇక్ష్వాకువంశ



రాజులలో అతిరథుడు. ఎన్నో యాగములు చేసినవాడు. ధర్మమునందు ఆసక్తికలవాడు. సర్వజనులను వశమునం దుంచుకొనువాడు. మహర్షితో సమానుడు. రాజుగా ఉండియు ఋషియైనవాడు. మూడు లోకములలోను ప్రసిద్ధుడు. గొప్ప సైన్యము కలవాడు. శత్రువుల నందరిని నశింపచేసినవాడు. మంచి మిత్రసంపద గలవాడు. ఇంద్రియములను జయించినవాడు. ధనములచేతను, ఇతర వస్తుసంగ్రహముచేతను ఇంద్రునితోనూ, కుబేరునితోనూ సమానుడు.(1-4)

దశరథుడు సత్యమునందు పట్టుదల కలిగియును, ధర్మార్థకామములనెడు మూడు పురుషార్థములకును సమానమైన ప్రాధాన్యమిచ్చి వాటి ననుసరించుచును ఇంద్రుడు అమరావతినివలె, అయోధ్యను పాలించెను.(5)

అయోధ్యాపురములో నివసించు నరులందరును సంతోషవంతులు, ధర్మాత్ములు, చక్కగ శాస్త్రాభ్యాసము చేసినవారు, తమకు ఉన్నదానితో తృప్తిచెందినవారు. ఆశ లేనివారు. ఎప్పుడూ సత్యమునే పలుకువారు.(6)

ఆ నగరములో తక్కువ ధనమును మాత్రమే సంపాదించినవాడు గాని; ధర్మార్థకామము లనెడు పురుషార్థములను సాధించనివాడుగాని, గోసంపద అశ్వసంపద ధనధాన్యములు లేనివాడుగాని అయిన కుటుంబి ఒక్కడును లేకుండెను.(7)

కాముకుడుగాని, లోభికాని, క్రూరుడుకాని, విద్యావిహీనుడుకాని, నాస్తికుడుకాని, ఆ అయోధ్యలో వెదకినను కానరాదు. ఆ నగరములోని స్త్రీలు, పురుషులు కూడ ధర్మశీలులు. మంచి ఇంద్రియనిగ్రహము కలవారు. మంచి స్వభావముతో, మంచి నడవడికతో ఒప్పుచున్నవారు. మహర్షులవలె పరిశుద్ధమైనవారు.(8, 9)

ఆ నగరములో కర్ణభూషణములు లేనివాడుగాని, శిరోభూషణము లేనివాడుగాని, పుష్పమాలలు ధరించనివాడుగాని, భోగములలో కొరత ఉన్నవాడుగాని, అభ్యంగస్నానము చేయనివాడుగాని, శరీరమునకు అంగరాగమును

పూసికొననివాడుగాని, మంచి సుగంధద్రవ్యములను సేవించనివాడుగాని లేడు.(10)

ఆ నగరములో, కడుపునిండ తిండి లేనివాడుగాని, దానము చేయనివాడుగాని, బాహుపురులను, కంఠాభరణములను ధరింపనివాడుగాని, ముంజేతికి అలంకారము లేనివాడుగాని, ఇంద్రియనిగ్రహము లేనివాడుగాని ఒక్కడును కనబడడు.(11)

అయోధ్యలో ఆహితాగ్ని కానివాడుకాని, యాగము చేయనివాడుకాని, నీచుడుకాని, దొంగగాని, వర్ణసంకరము చేసినవాడుగాని ఒక్కడును లేకుండెను. బ్రాహ్మణులెల్లప్పుడును తమ కర్మలయందు ఆసక్తులై, ఇంద్రియనిగ్రహవంతులై, దానము చేయుట, వేదాధ్యయనము చేయుట అను స్వాభావిక గుణములతో ఒప్పుచు, తప్పనిసరియైనపుడు మాత్రమే దానము పట్టుచు, స్వభార్యానురక్తులై, పరభార్యావిముఖులై ఉండెడివారు.(12, 13)

దశరథుడు రాజ్యము పాలించు కాలమున రాజధానియైన అయోధ్యలోనే కాక, రాజ్యమునందు ఎచ్చటను నాస్తికుడుగాని, అసత్యవాదికాని, శాస్త్రాభ్యాసము చేయనివాడుగాని, అసూయ కలవాడుగాని, అసమర్థుడుకాని, వివిధ విషయజ్ఞానము లేనివాడుగాని లేకుండెను.(14)

అయోధ్యలో ఏ ఒక్కడును, షడంగవేత్త కానివాడుకాని, వ్రతానుష్ఠానము లేనివాడుకాని, వేలకొలది ద్రవ్యము దానము చేయనివాడుకాని, దీనుడుకాని, కలతచెందిన మనస్సు కలవాడుకాని, బాధలకు గురియైనవాడుగాని లేకుండెను. అయోధ్యానగరిలో ఐశ్వర్యము, సౌందర్యము, రాజభక్తి లేని పురుషుడుకాని స్త్రీకాని మచ్చునకైనను కానరాకుండిరి.(15, 16)

అయోధ్యానగరములో నాలుగు వర్ణములకును చెందిన పురుషులందరును దేవతాపూజలు, అతిథిపూజలు చేయువారు, కృతజ్ఞులు, ఉదారులు, శూరులు, పరాక్రమ వంతులు. వారు దీర్ఘాయుర్దాయవంతులై, సత్యధర్మపరులై, ఎల్లప్పుడును దారపుత్ర పౌత్రాదులతో కలిసి ఆనందించెడివారు.(17, 18)

క్షత్రియులు బ్రాహ్మణులను, వైశ్యులు క్షత్రియులను అనుసరించి ఉండెడివారు. శూద్రులు మూడు వర్ణములవారికిని ఉపచారము చేయుచు స్వధర్మనిరతులై యుండెడివారు. మానవేంద్రుడును, బుద్ధిశాలియు అగు మనుచక్రవర్తి పూర్వమెట్లు పాలించెనో అట్లే ఆ దశరథుడు ఆ అయోధ్యను చక్కగ పరిరక్షించెను.(19, 20)

ఆ అయోధ్య, అగ్నితుల్యులు, నేర్పుకలవారు, పౌరుషవంతులు,

శస్త్రవిద్యానిపుణులు అగు యోధులతో పర్వతగుహవలె నిండియుండెను.(21)

కాంభోజ - బాహ్లిక - వనాయు - సింధుదేశములలో పుట్టినవి, ఉచ్చైశ్శ్రవముతో సమానమైనవి అగు ఉత్తమాశ్వములతో ఆ అయోధ్య నిండియుండెను. వింధ్యపర్వతము నందు పుట్టిన మత్తగజములతోను; గొప్ప బలము గలవియు, పర్వతములతో సమానమైనవియు, మదముతో కూడినవియు అగు హిమవత్పర్వతప్రాంతమున పుట్టిన ఏనుగులతోను; ఐరావతకులమునందు, మహాపద్మకులమునందు, అంజనకులమునందు, వామనకులమునందు పుట్టిన ఏనుగులతోను అయోధ్య నిండియుండెను.(22-24)

భద్రజాతీయములు, మంద్రజాతీయములు, మృగజాతీయములు, భద్రమంద్రమృగ జాతీయములు, భద్రమంద్రజాతీయములు, భద్రమృగజాతీయములు, మృగమంద్ర జాతీయములు, ఎల్లప్పుడును మదించి యున్నవియు, పర్వతములతో సమానములును అగు ఏనుగులతో ఆ నగరము ఎల్లప్పుడును నిండియుండెను.(25)

ప్రపంచము నంతను పాలించుచున్న దశరథమహారాజునకు నివాసస్థానమైన అయోధ్య బైట కూడ రెండు యోజనముల వరకును శత్రువులచే ఎదిరింపశక్యముకానిదై, అయోధ్య యను తన నామధేయమును సార్ధకము చేసికొని ప్రకాశించుచుండెను.(26)

మహాతేజఃశాలియు, పూజ్యుడును అయిన దశరథమహారాజు శత్రువుల నందరిని అణచి, చంద్రుడు నక్షత్రములను పాలించినట్లు అయోధ్యానగరమును పాలించెను.(27)

ఇంద్రునితో సమానుడైన ఆ దశరథుడు దృఢమైన తోరణములును, గడియలును కలదియు, విచిత్రములైన గృహములతో ప్రకాశించునదియు, మంగళకరమైనదియు, వేలకొలది జనులతో నిండినదియు, యథార్థమైన పేరు గలదియు అగు ఆ అయోధ్యను పరిపాలించెను.(28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఆరవసర్గ సమాప్తము.

ఏడవ సర్గము

దశరథుని అమాత్యుల గుణనీత్యాదుల వర్ణనము.

మహాత్ముడైన దశరథునకు, ప్రజ్ఞాదిగుణములచే మంత్రణమునందు సమర్థులును, ఇతరుల ఆకారాదులను పట్టి వారి మనస్సులోని అభిప్రాయమును తెలిసికొనగలవారును, ఎల్లప్పుడును తమ ప్రభువునకు ఇష్టము, హితము అగు కార్యమును చేయుటయందు ఆసక్తి కలవారును అగు మంత్రులు ఉండిరి. (1)

మహావీరుడును, యశశ్శాలియు అగు ఆ దశరథునకు లంచములు తీసికొనుట మొదలగు దోషములు లేనివారును, వ్యవహారశుద్ధి కలవారును, ఎల్లప్పుడు రాజ్యకార్యముల యందే నిమగ్నులై ఉండువారును అగు ఎనమండుగురు మంత్రులు ఉండిరి. ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అని ఈ ఎనమండుగురు మంత్రుల పేర్లు. వసిష్ఠుడు, వామదేవుడు అను ఇద్దరు ఋషిసత్తములు దశరథునకు ప్రధానులైన ఋత్విక్కులుగా ఉండిరి. వీరు మాత్రమే కాక మరికొందరు మంత్రులు కూడ దశరథునివద్ద ఉండిరి. (2-4)

ఆ మంత్రులు సమస్తవిద్యలు నేర్చినవారు. అకార్యములను చేయుటకు సిగ్గుచెందువారు. నేర్పు కలవారు. ఇంద్రియనిగ్రహవంతులు. ఐశ్వర్యవంతులు. మహాబుద్ధిశాలులు. శాస్త్రజ్ఞానము కలవారు. దృఢమైన పరాక్రమము కలవారు. కీర్తిమంతులు. కార్యములు చేయునపుడు ఏకాగ్రచిత్తము కలవారు. చెప్పినవిధముగ చేయువారు. తేజస్సు, ఓర్పు, కీర్తి కలవారు. చిరునవ్వు నవ్వుచూ మాటలాడువారు. (5, 6)

కోపమువలన గాని, కామముచేత గాని, ధనముకొరకు గాని వారెన్నడు అసత్య మాడెడివారు కాదు. స్వపరరాష్ట్రములలో చేయబడినది గాని, చేయబడుచున్నది గాని, చేయబడనున్నది గాని, వారికి గూఢచారులద్వారా తెలియనిది ఏదియు లేకుండెను. (7)

ఆ మంత్రులు వ్యవహారదక్షులు. వారు ఎట్టి వారికి స్నేహితులుగా ఉన్నారో తెలుసుకొనుటకు ఆ స్నేహితులందరును(రాజుచేత) పరీక్షించబడినారు. ఆ మంత్రులు తమ కుమారులకు కూడ, ఆవశ్యకమైనపుడు, సరియైన దండమును విధించెడివారు. రాజ్యధనాగారమును నింపుట, సైన్యమును సమకూర్చుట మొదలైన రాజ్యకార్యముల

యందు సర్వదా ఆసక్తి చూపెడివారు. అపరాధము చేయనిచో శత్రువునైనను హింసించరు.(8, 9)

వారు వీరులు. చలించని ఉత్సాహము కలవారు. రాజశాస్త్ర ప్రకారము కార్యములను అనుష్ఠించువారు. దేశములో నున్న సత్పురుషులకు ఎట్టి ఉపద్రవములు కలుగకుండ ఎల్లప్పుడును కాపాడుచుండెడివారు. బ్రాహ్మణక్షత్రియులకు బాధ కలుగకుండ చూచుచు కోశమును నింపెడివారు. అపరాధియొక్క బలాబలములను పరీక్షించి, తగువిధముగ తీక్ష్ణమైన దండమును విధించెడివారు.(బలవంతుడైనచో అధికదండము, దుర్బలుడైనచో అల్పదండము ఇచ్చెడివారు. లేదా అపరాధముయొక్క బలాబలములను పరీక్షించి శిక్షించెడివారు).(10, 11)

పరిశుద్ధమైన నడవడికగల ఆ మంత్రులందరును ఐకమత్యముతో రాజకార్యములను చక్కబెట్టుచుండిరి. నగరములోగాని, రాజ్యములోగాని, ఎచ్చటను, అసత్యమాడువాడు ఒక్కడును ఉండెడివాడు కాదు. ఆ రాజ్యములో దుష్టుడుగాని, పరభార్యాసక్తుడుగాని లేకుండెను. ఆ దేశమునందు అంతటను, అయోధ్యయందును శాంతి నెలకొని ఉండెను.(12, 13)

ఆ మంత్రులందరును మంచి వస్త్రములు, వేషములు ధరించెడివారు. మంచి శీలము కలవారు. నీతినేత్రములతో సర్వదా మేల్కొనియుండి రాజుయొక్క హితముకొరకు పాటుపడెడివారు.(14)

వారు మాతాపిత్రాదులగు పెద్దలలో ఉన్న గుణములను మాత్రమే గ్రహించెడివారు. పరాక్రమముచే ప్రసిద్ధులు. అన్ని విషయములను గ్రహింపగలిగిన బుద్ధిబలమునుబట్టి విదేశములలోకూడ ప్రఖ్యాతి గడించినవారు.(15)

శత్రువులతో ఎప్పుడు ఎట్లు సంధిచేసికొనవలెనో, ఎప్పుడు వారితో యుద్ధము చేయవలెనో బాగుగ తెలిసినవారు. సహజముగ ఐశ్వర్యవంతులు. ఆలోచనలను రహస్యముగ ఉంచుటయందును, సూక్ష్మవిషయములను గ్రహించి నిర్ణయములు చేయుటయందును సమర్థులు. నీతిశాస్త్రములోని విశేషము లన్నియు తెలిసినవారు. ఇతరుల మనస్సును నొప్పింపని విధమున మాటలాడువారు.(16,17)

ఎట్టిదోషములును లేని దశరథమహారాజు, ఇట్టి సద్గుణోపేతులైన మంత్రుల సాహాయ్యముతో భూమిని పరిపాలించెను.(18)

ఔదార్యవంతుడనియు, ప్రతిజ్ఞను నిలుపుకొనువాడనియు మూడు లోకములలో

ప్రసిద్ధిగాంచిన, పురుషశ్రేష్ఠుడైన దశరథుడు, రాజ్యములోని విషయముల నన్నింటిని గూఢచారులద్వారా తెలిసికొనుచు, ప్రజలను ఆనందింపచేసి, వారిని రక్షించుచు, అధర్మములను తొలగించుచు, భూమినంతను ధర్మముతో పరిపాలించెను. (19, 20)

అతనికి ఎందరో మిత్రులుండిరి. సామంతరాజు లందరును లొంగి ఉండిరి. అతడు తనకు బాధ కలిగించువారి నందరిని ప్రతాపముచేత సంహరించెను. అందుచే అతనిని మించినవాడుగాని, అతనితో సమానుడుగాని అయిన శత్రు వొక్కడును లేకుండెను. దేవేంద్రుడు స్వర్గమును పాలించినట్లు అతడు ఈ జగత్తునంతను పాలించెను. (21)

ఆలోచనలయందును రాజునకు మేలు చేయుటయందును ఆసక్తి గలవారును, అనురక్తులును, సమర్థులును, నేర్పు కలవారును అగు ఆ మంత్రులతో కూడిన దశరథమహారాజు, తేజోరూపములైన కిరణములతో కూడిన ఉదయించుచున్న సూర్యునివలె ప్రకాశించెను. (22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని సప్తమసర్గము సమాప్తము.

ఎనిమిదవ సర్గము

సంతానోత్పత్తికై దశరథుడు అశ్వమేధయాగము చేయ సంకల్పించుట.

ఇట్టి ప్రభావముగల ధర్మజ్ఞుడైన, మహానుభావుడైన ఆ దశరథునకు చాలకాలము వరకును వంశమును నిలబెట్టు కుమారుడు కలుగలేదు. పుత్రులు జనించలేదని చింతించుచున్న ఆ మహాత్ముని మనస్సులో, "నేను సుతులను పొందుటకై అశ్వమేధయాగము చేయవచ్చును కదా!" అను అభిప్రాయము కలిగెను. (1, 2)

అతడు మంత్రులందరితో సంప్రదించి, యాగము చేయవలెనని గట్టిగా నిశ్చయించి, "పురోహితులతోకూడ, నా గురువుల నందరిని తీసికొనిరమ్ము." అని మంత్రిసత్తముడైన సుమంత్రుని ఆదేశించెను. (3, 4)

సుమంత్రుడు శీఘ్రముగా వెళ్లి సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని, పురోహితుడైన వసిష్ఠుని, తదితరులైన బ్రాహ్మణోత్తములను, సర్వవేదములు తెలిసిన వారిని – అందరిని తీసుకొనివచ్చెను. (5, 6)

దశరథమహారాజు వారిని ఆదరించి, ధర్మార్థములతో కూడిన, మధురమైన వచనమును పలికెను.(7)

"పుత్రులు లేరని బాధపడుచున్న నాకు సుఖమనునది లేదు. అందుచే అశ్వమేధయాగము చేయవలెనని నాకు అభిలాష కలిగినది. నేను యథాశాస్త్రముగ యజ్ఞము చేయదలచుచున్నాను. నా కోరిక ఎట్లు తీరునో ఉపాయము ఆలోచింపుడు."(8, 9)

వసిష్ఠుడు మొదలైన ఆ బ్రాహ్మణు లందరును దశరథుని నిర్ణయము చాల బాగున్నదని అభినందించిరి. వారందరును చాల సంతసించి దశరథునితో, "కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చి అశ్వమును విడువుము." అని పలికిరి.(10, 11)

"ఓ రాజా! పుత్రులు కావలెనని నీకు కలిగిన ఈ ఆలోచన చాల ధర్మసమ్మతమైనది. నీకు తప్పక, ఇష్టులైన పుత్రులు కలుగుదురు." అని కూడా చెప్పిరి.(12)

రాజు బ్రాహ్మణుల మాటలకు సంతసించి ఆనందము తొణికిసలాడుచున్న చూపులతో, మంత్రులతో ఇట్లు పలికెను.(13)

"నా గురువులు చెప్పిన విధముగ యజ్ఞసంభారములను సమకూర్చి, సమర్థులైన వీరులచే రక్షింపబడుచున్న అశ్వమును విడిచి, దానివెంట ఉపాధ్యాయులను కూడ పంపుడు. సరయూనది ఉత్తరతీరమున యజ్ఞభూమిని ఏర్పాటు చేయుడు. శాస్త్రోక్తప్రకారముగ, నియమబద్ధముగ శాంతికార్యములను జరిపించుడు.(14, 15)

ఈ అశ్వమేధయాగములో అపాయకరమైన అపచారమేమియు కలుగని పక్షాన అందరు రాజులును దీనిని చేయగలిగియుండెడివారు. అశ్వమేధయాగములో ఏమైనా ప్రమాదము కలుగునా యని పండితులైన బ్రహ్మరాక్షసులు చూచుచు వేచియుందురు. యజ్ఞమునకు భంగము వాటిల్లినచో యజమానుడు వెంటనే నశించును. అందుచే, ఈ క్రతువు శాస్త్రప్రకారము పూర్తియగునట్లు చూడుడు. మీరందరును కార్యములయందు ఆరితేరినవారే కదా!"(16-18)

మంత్రులందరును దశరథుని మాటలు విని, అయనను అభినందించి, "తాము ఆజ్ఞాపించిన విధముననే చేసెదము." అని పలికిరి.(19)

బ్రాహ్మణు లందరును ఈవిధముగ దశరథుని ఉత్సాహమును వృద్ధిపొందించి, అనుజ్ఞ తీసికొని, తిరిగి వెళ్లిరి. బ్రాహ్మణులు వెడలిపోయిన తరువాత దశరథుడు మంత్రులతో, "ఋత్విక్కులు చెప్పిన ఈ యాగము యథాశాస్త్రముగ జరుగునట్లు చూడుడు." అని పలికెను.(20, 21)

ఆ రాజశ్రేష్ఠుడు సమీపముననున్న సచివులను ఈవిధముగ ఆజ్ఞాపించి, వారిని పంపివేసి, ఇంటిలోనికి ప్రవేశించి తన మనస్సునకు చాల ఇష్టులైన పత్నుల దగ్గరకు వెళ్లి, "నేను యాగము చేయనున్నాను; అందుచే మీరు కూడ దీక్ష వహింపుడు." అని పలికెను.(22,23)

ఆ మాట వినగానే మంచి తేజస్సుగల ఆ దశరథపత్నుల ముఖపద్మములు మంచు తొలగినపుడు పద్మములు ప్రకాశించినట్లు ప్రకాశించినవి.(24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఎనిమిదవసర్గము సమాప్తము.

తొమ్మిదవ సర్గము

సుమంత్రుడు దశరథునకు ఋష్యశృంగునిగూర్చి సంక్షిప్తముగ చెప్పుట.

ఈ విషయమును విన్న సుమంత్రుడు రహస్యముగ దశరథునితో ఇట్లు పలికెను. "ఋత్విక్కులు చెప్పిన ఈ ఉపాయము పూర్వము చర్చింపబడగా నేను వింటిని.(1)

ఓ రాజా! నీ పుత్రప్రాప్తిని గూర్చిన కథను, పూర్వమొకప్పుడు, సనత్కుమారుడు ఋషులతో చెప్పినాడు.(2)

కాశ్యపునకు విభండకుడు అను కుమారుడు కలడు. అతనికి ఋష్యశృంగుడను పుత్రుడు కలుగును. వనములోనే పెరిగి, నిత్యము వనములోనే సంచరించుచు, సర్వదా తండ్రితోడనే ఉండు ఆ ఋష్యశృంగుడు తండ్రిని తప్ప వేరే ఎవ్వరిని ఎరుగడు.(3, 4)

ఆ ఋష్యశృంగుడు లోకములలో ప్రసిద్ధమైనదియు, బ్రాహ్మణులచే సర్వదా కొనియాడబడునదియు అగు వ్రతిత్వము, ప్రాజాపత్యము అని రెండు విధములైన

బ్రహ్మచర్యములను అవలంబింపగలడు.(5)

అగ్నిని, యశఃశాలియైన తన తండ్రిని సేవించుచు అతడు ప్రతిత్వ మను బ్రహ్మచర్యమును కొంతకాలము గడుపగలడు. ఆ కాలమునందే, అంగదేశములో, ప్రతాపశాలియు, ప్రసిద్ధుడును, మహాబలుడును అగు రోమపాదు దను రాజు ఉండగలడు.(6, 7)

ఆ రాజు ధర్మాతిక్రమణము చేయుటచే అతని రాజ్యములో సర్వప్రాణులకును భయంకరమైన తీవ్రమైన అనావృష్టి కలుగును. అనావృష్టి కలిగినందులకు మిక్కిలి దుఃఖించుచు, ఆ రాజు విద్యావృద్ధులైన బ్రాహ్మణులను పిలిపించి ఇట్లు చెప్పును.(8, 9)

'మీరు సమస్తధర్మములు, లోకాచారములు తెలిసినవారు. ఈ అనావృష్టికి కారణమైన పాపము తొలగిపోవుటకై ఏదైన నియమము ఉపదేశింపుడు'.(10)

వేదములలో ప్రవీణులైన ఆ బ్రాహ్మణులు ఆ రాజుతో ఇట్లు చెప్పగలరు. 'రాజా! అన్ని ఉపాయములను ప్రయోగించి, ఋష్యశృంగుని ఇచటకు రప్పింపుము. అతనిని రప్పించి, బాగుగా సత్కరించి, శ్రద్ధాయుక్తుడవై నీ కుమార్తె అయిన శాంతను అతని కిచ్చి, యథాశాస్త్రముగ వివాహము చేయుము.'(11, 12)

వారి మాటలను విని, రాజు, 'జితేంద్రియుడైన ఆ ఋష్యశృంగుని తీసికొనివచ్చుటకు ఉపాయమేమి?' అని ఆలోచింపగలడు.(13)

అంత ధీమంతుడగు ఆ రాజు మంత్రులతో ఆలోచించి, నిశ్చయము చేసి, ఋష్యశృంగుని తీసికొనివచ్చుటకై పురోహితుని, అమాత్యులను ప్రేరేపించగలడు. వారు రాజు మాటలు విని, విభండకమునికి భయపడి, తలలు వంచి, 'మేము అచటికి వెళ్లజాలము.' అని ఆ రాజును బ్రతిమాలెదరు.(14, 15)

పిమ్మట వారు ఆలోచించి, అందుకు తగిన ఉపాయములను కనుగొని, 'మేము దోషమేమియు కలుగకుండ ఆ ఋషిని తీసికొని వచ్చెదము.' అని ఆ రాజుతో చెప్పెదరు.(16)

రోమపాదుడు గణికల సాహాయ్యముతో ఋష్యశృంగుని తీసికొని రాగలడు. వర్షములు కురియును. అతనికి శాంతనిచ్చి వివాహము చేయుదురు.(17)

జామాతయైన ఋష్యశృంగుడు నీకు పుత్రులు కలుగువిధానము చేయగలడు.

ఈ విషయమును సనత్కుమారుడు చెప్పగా విని నేను నీకు చెప్పుచున్నాను."(18)

దశరథుడు సంతోషించి, ఆ ఋష్యశృంగుని ఎట్లు తీసికొనివచ్చిరో సవిస్తరముగ చెప్పుమని సుమంత్రుని అడిగెను.(19)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని తొమ్మిదవసర్గము సమాప్తము.

పదవ సర్గము

ఋష్యశృంగుడు అంగదేశమునకు వచ్చుట, శాంతను వివాహమాడుట.

ఈ విధముగ దశరథుడు ప్రశ్నింపగా సుమంత్రుడు ఇట్లు పలికెను. "మంత్రులు ఋష్యశృంగుని ఎట్లు తీసికొని వచ్చిరో చెప్పెదను. వినుము.(1)

అమాత్యులును, పురోహితుడును రోమపాదునితో ఇట్లు పలికిరి. 'మేము అపాయము లేని ఒక ఉపాయము ఆలోచించితిమి.(2)

ఋష్యశృంగుడు అడవులలోనే సంచరించుచు, తపఃస్వాధ్యాయనిరతుడై ఉన్నాడు. అతడు స్త్రీసుఖమును గాని, ఇతరమైన విషయసుఖములనుగాని అనుభవించి ఎరుగడు. ఇంద్రియార్థములు మానవులకు అభిమతములు. అవి వారి మనస్సులను క్షోభపెట్టును. అట్టి ఇంద్రియార్థములచే ప్రలోభపెట్టి ఋష్యశృంగుని పట్టణమునకు తీసుకునివచ్చెదము. శీఘ్రముగ నిశ్చయింపుము.(3, 4)

చక్కగా అలంకరించుకొనిన సౌందర్యవతులైన వేశ్యలను సత్కరించి అచటికి పంపుము. వారు అనేకవిధములైన ఉపాయములచే అతనిని ప్రలోభపెట్టి తీసికొని రాగలరు."(5)

రాజు ఆ మాటలు విని, "అటులనే చేయుడు." అని అనుమతించగా పురోహితుడును, మంత్రులును ఆవిధముగ చేసిరి.(6)

వారు ఆదేశించగా ఉత్తమ సౌందర్యవతులైన వేశ్యాస్త్రీలు ఆ అరణ్యమును ప్రవేశించిరి. వారు ఋష్యశృంగుని ఆశ్రమమునకు సమీపమున నివాసమేర్పరుచుకొనిరి. ఋష్యశృంగుడు ఎల్లప్పుడూ తన ఆశ్రమమునందే నివసించువాడు. ఆ వేశ్యలు ఋషి దర్శనమునకై ప్రయత్నము చేయుచుండిరి.(7)

ఏ కోరికలును లేక నిత్యసంతుష్టుడుగా ఉన్న ఆ ఋష్యశృంగుడు తన తండ్రి ఆశ్రమము దాటి ఎన్నడును బైటకు వెళ్లలేదు. పుట్టినది మొదలు అతడు తనతండ్రిని తప్ప పురుషునిగాని, స్త్రీనిగాని, నగరగ్రామాదులలోని ఏ ఇతరవస్తువును గాని చూచి ఉండలేదు.(8, 9)

ఒకనాడు ఋష్యశృంగుడు దైవవశమున ఆ స్త్రీలు ఉన్న ప్రదేశమునకు వెళ్ళి వారిని చూచెను. చిత్రములైన వేషములు ధరించి మదముతో కూడిన ఆ స్త్రీలు మధురస్వరముతో గానము చేయుచుండిరి. ఋష్యశృంగుని చూడగనే వారందరును అతనిని సమీపించి ఇట్లు పలికిరి.(10, 11)

"ఓ బ్రాహ్మణుడా! నీవెవ్వడవు! నీ జీవన విధానమేమి? జనశూన్యమైన ఈ ఘోరమైన అరణ్యములో ఏల సంచరించుచున్నావు? తెలిసికొనవలె నని కోరుచున్నాము, చెప్పుము."(12)

ఆ స్త్రీల సౌందర్యము చాల మనోహరముగ నుండెను. అట్టి సౌందర్యవతులను అతడు పూర్వ మెన్నడును ఆ వనములో చూడలేదు. వారిని చూడగానే వారిపై స్నేహభావము కలిగెను. వారికి తన తండ్రిని గూర్చి చెప్పవలెనని నిశ్చయించుకొనెను.(13)

"నేను విభండకుని ఔరసపుత్రుడను. ఋష్యశృంగుడను. నా పేరును, కర్మయు లోకమున ప్రసిద్ధములు. ఓ శుభదర్శనులారా! మా ఆశ్రమము ఇచటకు సమీపముననే ఉన్నది. మీ అందరికిని మా ఆశ్రమములో యథాశాస్త్రముగ అతిథిసత్కారము చేసెదను."(14, 15)

(ఋష్యశృంగుడు వారిని విచిత్రవేషములలో ఉన్న పురుషులే అనుకొనెను. అందువలన 'వః సర్వేషాం పూజాం విధిపూర్వకం కరిష్యే' అనినాడు. వారు స్త్రీలని తెలిసి మాట్లాడినచో 'సర్వేషాం' అనకుండా 'సర్వాసాం' అని ఉండెడివాడు.)

ఋష్యశృంగుని మాటలు విన్న పిదప ఆ వేశ్యలకు ఆ ఆశ్రమమును చూడవలెనను కోరిక కలిగినది. వారందరును అతనితో కలిసి వెళ్ళిరి.(16)

పిదప ఆ ఋష్యశృంగుడు, "ఇది మేము సమర్పించు అర్ఘ్యము. ఇది పాద్యము. ఇవి కందమూలఫలములు." అని పలుకుచు వారిని పూజించెను. ఆ వేశ్యలు ఉత్సాహముతో ఆ పూజ నందుకొని విభండక మహర్షి ఎక్కడ వచ్చునో అని భయపడుచు, శీఘ్రముగ మరలిపోవలె నని నిశ్చయించిరి.(17, 18)

"ఓ బ్రాహ్మణా! ఇవి మేము భుజించు ఫలములలో శ్రేష్ఠమైనవి; తీసికొనుము. నీకు క్షేమమగును. శీఘ్రముగ భక్షించుము." అనుచు, ఆ వేశ్యలందరును ఋష్యశృంగుని ఆనందముతో కౌగలించుకొని, అతనికి అనేకమైన మధురమైన పదార్థములను, ఇతరములైన వివిధభక్ష్యములను ఇచ్చిరి.(19, 20)

సర్వదా వనమునందే నివసించువారు పూర్వమెన్నడును రుచి చూచి ఎరుగని ఆ భక్ష్యములను తిని, బ్రహ్మతేజముతో ఒప్పు ఋష్యశృంగుడు అవి(రుచికరమైన) ఫలములే అనుకొనెను.(21)

అతని తండ్రి వచ్చి ఏమి శపించునో అని భయపడిన ఆ స్త్రీలు అతనివద్ద సెలవు గైకొని, కర్మానుష్ఠానము చేసికొనవలె నను నెపముతో వెళ్లిపోయిరి.(22)

వేశ్యలు వెళ్లిపోయిన పిదప ఋష్యశృంగుడు మనస్సునందు (అంతకు ముందు ఎన్నడును లేని) అస్వస్థత చెంది దుఃఖముతో తిరుగాడుచుండెను.(23)

తపశ్శాలియగు ఋష్యశృంగుడు మరునాడు బయలుదేరి, మనోహర రూపవతులును, సర్వాలంకారభూషితలును అగు ఆ వేశ్యలను తాను పూర్వము చూచిన ప్రదేశమునకు వచ్చెను.(24)

అతడు తమవద్దకు వచ్చుచున్నట్లు చూడగనే సంతసించి, ఆ వేశ్యలందరును అతని దగ్గరకు వెళ్లి, "ఓ సౌమ్యుడా! మా ఆశ్రమమునకు రమ్ము. అచట నీకు విశేషరూపమున చక్కని అతిథిసత్కారము చేయగలము." అని పలికిరి.(25, 26)

వారు పలికిన మనోహరమైన మాటలు విని అతడు వారితో వెళ్లుటకు అంగీకరించెను. వారు అతనిని తమతో తీసికొనివెళ్లిరి. మహాత్ముడైన ఆ ఋష్యశృంగుడు అంగదేశములో ప్రవేశించెనో లేదో, వెంటనే పర్జన్యుడు జగత్తుకు ఆహ్లాదము కలుగునట్లు వర్షించెను.(27, 28)

తన వెంట వర్షమును కూడ తీసికొనివచ్చిన ఆ ఋష్యశృంగునికి ఎదురేగి, రోమపాదుడు నమ్రుడై సాష్టాంగప్రణామము ఆచరించెను. రోమపాదుడు శ్రద్ధాపూర్వకముగ ఆతనిని అర్ఘ్యపాద్యాదులతో సత్కరించెను. అతని అనుగ్రహమును కోరెను.(లేదా "నిన్ను ఇచటికి తీసికొనివచ్చినందులకు నీ తండ్రికి కోపము రాకుండునట్లు అనుగ్రహింపుము." అని వేడెను.) ఋష్యశృంగునకు కోపమేమియు కలుగలేదు.(29, 30)

అ రాజు ఋష్యశృంగునితో పురములో ప్రవేశించి, అతనికి శాంతనిచ్చి యథావిధిగ వివాహము చేసి, మనస్సు కుదుటపడగా ఆనందించెను.(31)

ఈవిధముగ సమస్తభోగములను సమకూర్చి పూజింపబడిన ఋష్యశృంగుడు ఆ అంగరాజ్యమునందే నివసించెను."(32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదవసర్గము సమాప్తము.

పదకొండవ సర్గము

దశరథుడు శాంతాఋష్యశృంగులను అయోధ్యకు తీసికొనివచ్చుట.

"మహారాజా! సనత్కుమారుడు కథలో ఇంకను ఏమని చెప్పినాడో చెప్పెదను. హితకరమగు ఆ విషయమును వినుము.(1)

"శ్రీమంతుడును, సత్యప్రతిజ్ఞుడును, పరమధార్మికుడును అగు దశరథుడు అను పేరుగల రాజు ఇక్ష్వాకువంశములో పుట్టగలడు. ఆ దశరథునకు అంగరాజుతో స్నేహమేర్పడును.ఆ అంగరాజు పేరు రోమపాదుడు. అతనికి శాంతయనెడు మహాభాగ్యవతియగు కుమార్తె పుట్టగలదు. గొప్ప కీర్తిగల ఆ దశరథమహారాజు అతనివద్దకు వెళ్లగలడు.(2-4)

'ఓ ధర్మాత్ముడా! నాకు పుత్రులు కలుగలేదు. అందుచేత నీవు ఋష్యశృంగుని నాతో పంపి, నాకు పుత్రులు కలుగుటద్వారా నా వంశము అవిచ్ఛిన్నముగ ఉండుటకై క్రతువును చేయుటలో సాహాయ్యము చేయుము.' అని కోరగలడు.(5)

రోమపాదుడు దశరథుని మాటలు విని, బాగుగా ఆలోచించి, పుత్రులు గల - అనగా తపోమహిమచే ఇతరులకు పుత్రులను అనుగ్రహింపగల, ఋష్యశృంగుని పంపగలడు. దశరథుడు ఋష్యశృంగుని తోడ్కొనివచ్చి, మనోవ్యథ శాంతింపగా, సంతోషించిన మనస్సుతో యజ్ఞము చేయగలడు.(6, 7)

ధర్మవేత్తయైన ఆ దశరథుడు, దోసిలి ఒగ్గి, "నాకు సంతానము, స్వర్గము కూడ కలుగునట్లు యజ్ఞము చేయించుము.' అని ఆ ఋష్యశృంగుని ప్రార్థించగలడు. ఆ బ్రాహ్మణోత్తమునివలన అతడి కోరికలు తీరును.(8, 9)

ఆ దశరథునికి అమితపరాక్రమము కలవారును, వంశప్రతిష్ఠకు

కారణమైనవారును, సర్వలోకములందు ప్రసిద్ధులును అగు నలుగురు పుత్రులు జనింపగలరు.'(10)

పూర్వము కృతయుగములో దేవతాశ్రేష్ఠుడైన సనత్కుమారుడు కథను ఈవిధముగా చెప్పెను.(11)

మహారాజా! (అందువలన) నీవే స్వయముగ సైన్యవాహనాదులతో వెళ్లి ఆదరపూర్వకముగా ఋష్యశృంగుని తీసికొనిరమ్ము."(12)

సుమంత్రుని మాటలు విని దశరథుడు వసిష్ఠుని అనుమతికూడ గైకొని, అంతఃపురామాత్యాదులతో కలిసి ఆ ఋష్యశృంగుడు ఉన్న దేశమునకు వెళ్లెను. వనములను, నదులను, మెల్లమెల్లగ దాటుచు ఆ ఋష్యశృంగుడున్న దేశమును చేరెను.(13, 14)

ఆ నగరము చేరగనే దశరథుడు, రోమపాదుని సమీపమున ఉన్న ద్విజశ్రేష్ఠుడైన ఋష్యశృంగుని చూచెను. అతడు ప్రజ్వలించుచున్న అగ్నివలె ప్రకాశించుచుండెను. (15)

దశరథుని రాకచే సంతోషించిన రోమపాదుడు, యథాశాస్త్రముగను, మిత్రుడగుటచే విశేషముగను, దశరథునికి ఆదరసత్కారములు చేసెను.(16)

రోమపాదుడు తనకు దశరథునితో ఉన్న స్నేహబాంధవ్యములను గూర్చి ఋష్యశృంగునకు చెప్పగా అతడు దశరథుని పూజించెను. దశరథుడు రోమపాదుడు చేసిన సత్కారముల నందుకొని, ఏడెనిమిది దివసములు అతని అతిథిగా ఉండి, అతనితో ఇట్లనెను.(17, 18)

'ఓ రాజా! నేనొక గొప్ప కార్యము తలపెట్టితిని. నీ కుమార్తెయైన శాంతను, భర్తతోకూడ, నా నగరమునకు పంపుము.'(19)

రోమపాదుడు అంగీకరించి, "నీవు భార్యతో అయోధ్యకు వెళ్లుము." అని ఋష్యశృంగునితో పలికెను. ఋష్యశృంగుడు అందులకు అంగీకరించి, అటులనే చేసెదనని పలికి, రోమపాదుని అనుజ్ఞ గైకొని భార్యాసమేతుడై దశరథునితో వెళ్లెను.(20, 21)

దశరథరోమపాదు లిద్దరును ఒకరికొకరు దోసిలి ఒగ్గి నమస్కారము చేసికొని, వక్షఃస్థలములు కలియునట్లు కౌగిలించుకొని సంతోషించిరి.(22)

మిత్రునివద్ద సెలవుగైకొని బయలుదేరిన దశరథుడు, శీఘ్రముగా వెళ్లగలిగిన దూతలను పంపి, అయోధ్యాపౌరుల కీ విధముగ ఆజ్ఞాపించెను.

"నగరము నంతను వెంటనే చక్కగా అలంకరింపుడు. ధూపసుగంధములను వ్యాపింపచేయుడు. మార్గములు తుడిచి నీళ్లు చల్లుడు. పతాకలు ఎగురవేయుడు." (23, 24)

రాజు వచ్చుచున్నట్లు వినిన పౌరులు చాల సంతసించి, ఆయన ఆజ్ఞాపించిన విధమున నగరాలంకారములు చేసిరి. దశరథుడు ఆ ఋష్యశృంగుని ఎదుట ఉంచుకొని, శంఖదుందుభినాదాలమధ్య, మంగళధ్వనులమధ్య చక్కగ అలంకరింపబడిన అయోధ్యా నగరమును ప్రవేశించెను.(25, 26)

దేవేంద్రునితో సమానుడైన ఆ నరేంద్రునిచే సత్కరింపబడి అయోధ్యలో ప్రవేశించుచున్న ఋష్యశృంగుని చూచి పౌరులెల్లరు సంతోషించిరి.(27)

దశరథుడా ఋష్యశృంగుని అంతఃపురములోనికి తీసికొనివెళ్లి, యథాశాస్త్రముగ పూజించెను. ఆతనిని తీసికొనివచ్చుటచే తన కర్తవ్యము పూర్తియైనట్లు సంతోషించెను. భర్తతో కలిసివచ్చిన, విశాలాక్షియైన శాంతను చూచి, అంతఃపుర స్త్రీలందరును ప్రేమతో ఆనందభరితలైరి.(28, 29)

అంతఃపురస్త్రీలును, దశరథుడును ఆదరింపగా శాంత ఋష్యశృంగునితో కలిసి కొంతకాలము అయోధ్యలో సుఖముగ ఉండెను.(30)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదకొండవసర్గము సమాప్తము.

పండ్రెండవ సర్గము

యాగము చేయింపుడని దశరథుడు ఋషులను కోరుట.

ఈ విధముగ చాలకాలము గడిచిన పిదప మనోహరమగు వసంతఋతువు వచ్చెను. అపుడు యజ్ఞము చేయవలెనని దశరథునకు అభిలాష కలిగెను.(1)

దశరథుడు దేవతుల్యుడైన ఋష్యశృంగునికి నమస్కరించి, అనుగ్రహింపచేసుకొని, "నా వంశము పుత్రపౌత్రాద్యభివృద్ధితో అవిచ్ఛిన్నముగా

ఉండునట్లు యజ్ఞము చేయింపుము." అని పలికి, అతనిని ఋత్విక్కుగా వరించెను.(2)

బాగుగా ఆదరింపబడిన ఋష్యశృంగుడు, "అటులనే చేయించెదను. యజ్ఞసంభారము లన్నియు సమకూర్చుము. యజ్ఞాశ్వమును విడువుము." అని పలికెను.(3)

అంత దశరథుడు మంత్రిశ్రేష్ఠుడైన సుమంత్రునితో, "సుమంత్రా! బ్రహ్మవాదులైన ఋత్విక్కులను, సుయజ్ఞుడు మొదలగువారిని, పురోహితుడైన వసిష్ఠుని, ఇతరులైన బ్రాహ్మణోత్తములను శీఘ్రముగా రప్పింపుము." అని పలికెను. (4, 5)

సుమంత్రుడు శీఘ్రముగా వెళ్లి సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని, పురోహితుడైన వసిష్ఠుని, తదితరులైన బ్రాహ్మణోత్తములను అందరిని ఒక్కసారిగ తీసికొనివచ్చెను.(6)

దశరథమహారాజు వారిని ఆదరించి, ధర్మార్థములతో కూడిన, మధురమైన వచనమును పలికెను.

"పుత్రులు లేరని బాధపడుచున్న నాకు సుఖమనునది లేదు. అందుచే అశ్వమేధయాగము చేయవలెనని నాకు అభిలాష కలిగినది. నేను యథావిధిగా యాగము చేయగోరుచున్నాను. ఋష్యశృంగుని ప్రభావముచే నా కోరికలు తీరును."(7-9)

వసిష్ఠుడు మొదలైన ఆ బ్రాహ్మణులందరును దశరథుని నిర్ణయము చాల బాగున్నదని అభినందించిరి.(10)

ఋష్యశృంగాదులు రాజుతో ఇట్లనిరి. "యజ్ఞసంభారములను సమకూర్చుము. అశ్వమును విడువుము. నీకు పుత్రులకొరకై ధర్మసమ్మతమైన బుద్ధి జనించినది. అందువలన నీకు తప్పక అనంతపరాక్రమవంతులగు నలుగురు పుత్రులు జనింపగలరు." (11, 12)

రాజు బ్రాహ్మణుల మాటలకు సంతసించి, ఆనందము తొణికిసలాడుచున్న చూపులతో మంత్రులతో ఇట్లు పలికెను.(13)

"నా గురువులు చెప్పిన విధముగ యజ్ఞసంభారములను సమకూర్చి, సమర్థులైన వీరులచే రక్షింపబడుచున్న అశ్వమును విడిచి, దానివెంట ఉపాధ్యాయులను కూడ

పంపుడు.(14)

సరయూనది ఉత్తరతీరమున యజ్ఞభూమిని ఏర్పాటు చేయుడు. శాస్త్రోక్తప్రకారముగ, నియమబద్ధముగ శాంతికార్యములను జరిపించుడు. ఈ అశ్వమేధయాగములో అపాయకరమైన అపచారమేమియు కలుగని పక్షాన అందరు రాజులును దీనిని చేయగలిగియుండెడివారు. అశ్వమేధయాగములో ఏమైనా ప్రమాదము కలుగునా యని పండితులైన బ్రహ్మరాక్షసులు చూచుచు వేచియుందురు. యజ్ఞమునకు భంగము వాటిల్లినచో యజమానుడు వెంటనే నశించును. అందుచే, ఈ క్రతువు శాస్త్రప్రకారము పూర్తియగునట్లు చూడుడు. మీరందరును కార్యములయందు ఆరితేరినవారే కదా!"(15-18)

మంత్రులందరును దశరథుని అభినందించి, అతడు ఆజ్ఞాపించిన విధముగ చేసిరి. పిమ్మట ఆ బ్రాహ్మణులు ధర్మజ్ఞుడైన దశరథుని కొనియాడి, అతని అనుజ్ఞ గైకొని స్వస్థానములకు తిరిగివెళ్లిరి. బ్రాహ్మణులు వెడలిపోయిన పిమ్మట, తేజశ్శాలియగు దశరథుడు మంత్రులను కూడ పంపివేసి గృహములో ప్రవేశించెను.(19-21)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పంద్రెండవసర్గము సమాప్తము.

పదమూడవ సర్గము

దశరథుడు పత్నీసమేతుడై యజ్ఞదీక్ష గ్రహించుట.

సంవత్సరము పూర్తియై తిరిగి వసంతఋతువు వచ్చినది. దశరథుడు సంతానము కొరకై అశ్వమేధయాగము చేయు సంకల్పముతో యజ్ఞశాలలో ప్రవేశించెను.(1)

దశరథుడు బ్రాహ్మణశ్రేష్ఠుడైన వసిష్ఠునికి నమస్కరించి, యథాశాస్త్రముగ పూజించి, పుత్రార్థియై వినయపూర్వకముగ ఇట్లు పలికెను.(2)

"ఓ మునిసత్తమా! నా యజ్ఞము యథాశాస్త్రముగ జరుగునట్లును, యజ్ఞాంగములలో ఎట్టి విఘ్నములు కలుగకుండునట్లును చూడుము. నీవు నా

విషయమున స్నేహముగల మిత్రుడవు. పూజ్యుడవైన ఉత్తమ పురోహితుడవు. ప్రారంభింపబడిన ఈ యజ్ఞకార్యభారమును నీవే వహింపవలెను."(3,4)

"అంతయు నీవు కోరినట్లే చేసెదను." అని ఆ బ్రాహ్మణోత్తముడు దశరథునితో పలికెను.(5)

పిమ్మట వసిష్ఠుడు యజ్ఞకర్మలయందు ఆరితేరిన వృద్ధులైన బ్రాహ్మణులను, వాస్తుకర్మయందు ప్రజ్ఞగల పరమధార్మికులైన వృద్ధులను, వివిధకర్మచారులను, ఇటుకలు మొదలగువాటిని నిర్మించు శిల్పకారులను, వడ్రంగులను, త్రవ్వువారిని, లెక్కలు కట్టువారిని, చిత్రలేఖనాది నిపుణులైన శిల్పులను, నటులను, నర్తకులను, పరిశుద్ధమైన చరిత్రగల శాస్త్రవేత్తలను అనేకవిషయముల అనుభవము గల పురుషులను పిలిపించి ఇట్లాజ్ఞాపించెను.

"మీరందరును రాజాజ్ఞానుసారముగా యజ్ఞమునకు సంబంధించిన పనులు చేయుటకు పూనుకొనుడు. అనేక సహస్రముల ఇటుకలను తెప్పింపుడు. అతిథులుగా రాబోవు రాజుల నివాసమునకై వివిధవస్తుసామగ్రితో కూడిన తాత్కాలిక భవనములను నిర్మింపుడు.(6-9)

బ్రాహ్మణుల నివాసముకొరకై వందలకొలది అందమైన గృహములను నిర్మించి, అనేకవిధములగు భక్ష్యములను, అన్నపానాదులను సమకూర్చుడు.(10)

పౌరజనులకొరకుగూడ అతివిశాలములును, వివిధ భక్ష్యభోగాదులతో కూడినవియు అగు నివాసగృహములను నిర్మింపుడు. అట్లే గ్రామములనుండి వచ్చిన జనులను యథోచితరీతిని సత్కరించి, వారికి మంచి ఆహారమును ఇవ్వవలెను. ఎవరికినీ ఏదియు అనాదరముగా ఇవ్వకూడదు.(11, 12)

అన్నివర్ణములవారును బాగుగా సత్కరింపబడినవారై పూజలందుకొనునట్లు చూడవలెను. వారిలో ఎవరైన కామక్రోధాదులను చూపినను వారిని అవమానింపరాదు.(13)

యజ్ఞమునకు సంబంధించిన పనులు నిర్వహించుచున్న పురుషులను, విశేషించి శిల్పులను, వారి వారి అర్హతల ననుసరించి సత్కరింపవలెను. వారికి వలసినంత ధనమునిచ్చి భోజనము పెట్టవలెను. అన్ని పనులు సరిగా జరుగునట్లును, ఏమియు లోటురానట్లును, మీరు ప్రేమార్ద్రమైన మనస్సులతో ఏర్పాట్లు చేయవలెను. (14, 15)

పిమ్మట వారందరును వచ్చి వసిష్ఠునితో ఇట్లు చెప్పిరి. "తాము చెప్పిన విధమున గృహనిర్మాణాదికము జరుగుచున్నది. ఏ లోటును లేదు. తాము చెప్పినవిధమున అన్నదానాదికము కూడ ఏ లోటును లేకుండ చేయగలము." (16, 17)

పిదప వసిష్ఠుడు సుమంత్రుని పిలిపించి ఇట్లు చెప్పెను. "ఈ భూమండలములో నున్న ధార్మికులైన రాజుల నందరిని ఆహ్వానింపుము. మన రాజ్యములోనివారినేకాక, సమస్తదేశములలో ఉన్న వేలకొలది బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను కూడ గౌరవపూర్వకముగా తీసికొనిరమ్ము (ఆహ్వానించుము). (18, 19)

శూరుడును, సత్యపరాక్రమవంతుడును, సర్వవేదశాస్త్రములలో నిష్ణాతుడును, మహాభాగ్యవంతుడును అగు, మిథిలాధిపతియైన జనకుడు మనకు పూర్వసంబంధి యను విషయమును గుర్తు ఉంచుకొని తగు విధములగు సత్కారములతో నీవు స్వయముగ తీసికొనిరమ్ము. మనకు పూర్వసంబంధి యగుటచే ఆయన విషయమును నీకు ముందుగా చెప్పుచున్నాను. (20, 21)

స్నేహశీలుడును, ఎల్లప్పుడును ప్రియముగ పలుకువాడును, మన మహారాజుకు మిత్రుడును అగు కాశీరాజును కూడ నీవు స్వయముగ వెళ్లి తీసికొనిరమ్ము. (22)

పరమధార్మికుడును, మన మహారాజుగారి మామగారును అగు వృద్ధుడైన కేకయదేశరాజును కూడ పుత్రసమేతముగ తీసికొనిరమ్ము. అంగదేశాధిపతియు, మహాభాగ్యవంతుడును అయిన రోమపాదుడు, మన మహారాజునకు మిత్రుడు. ఆ యశఃశాలిని గూడ బాగుగా సత్కరించి తీసికొనిరమ్ము. (23, 24)

తూర్పుదేశాల రాజులను, సింధుసౌవీరసౌరాష్ట్ర దేశాల రాజులను, దక్షిణదేశరాజులను అందరిని తీసికొనిరమ్ము. మన రాజ్యముతో స్నేహసంబంధము గల భూతలమునందలి ఇతరరాజుల నందరినికూడ, వారి పరివార బంధువులతోసహా, వీలైనంత త్వరగా తీసికొనిరమ్ము."(25, 26)

వసిష్ఠుని ఆజ్ఞప్రకారము, సుమంత్రుడు రాజులను తీసికొని వచ్చుటకై సద్గుణవంతులగు పురుషులను వెంటనే పంపెను. జనక, కేకయ రాజాదులను స్వయముగ తీసికొనివచ్చుటకై శీఘ్రముగా వెళ్లెను. (27, 28)

ఆయా కార్యములందు నియుక్తులైన కర్మకారులందరును తాము యజ్ఞము విషయమున చేసిన పనుల నన్నింటినీ వసిష్ఠునకు విన్నవించిరి. (29)

అది విని సంతోషించిన వసిష్ఠుడు వారితో ఇట్లనెను. "ఎవ్వరికైన ఏదైన ఇచ్చునపుడు, అనాదరముగ గాని, అశ్రద్ధగ గాని ఇవ్వకూడదు. అనాదరముతో చేసిన దానమునకు ఫలితముగ దాత నశించును".(30)

అంతట కొన్ని దినములలో, నానాదేశములకు చెందిన రాజులు దశరథమహారాజునకు ఉపాయనముగా అనేకరత్నములను తీసికొని అయోధ్యానగరము చేరిరి.(31)

వసిష్ఠుడు సంతోషించి దశరథునితో ఇట్లనెను. "ఓ నరశ్రేష్ఠుడా! నీ అజ్ఞప్రకారము రాజులందరును వచ్చినారు. నేను వారినందరిని తగురీతిని సత్కరించినాను. కర్మచారులు సావధానచిత్తులై యజ్ఞమునకై కావలసిన సాధనసామగ్రిని సమకూర్చినారు. ఇంక నీవు యజ్ఞము ప్రారంభించుటకై, సమీపముననే ఉన్న యాగశాలకు బయలుదేరుము. సమస్తభోగ్యవస్తువులతో అంతటను నిండి, మనస్సుచే నిర్మించబడినదా అన్నట్లు ఆశ్చర్యకరముగానున్న ఈ యాగశాలను చూడుము."(32-35)

(ఋష్యశృంగుడు కూడ వసిష్ఠుడు చెప్పినవిధముగనే చెప్పెను.) ఆ వసిష్ఠ ఋష్యశృంగుల ఆదేశమును అనుసరించి, దశరథుడు శుభనక్షత్రముతో కూడిన శుభదివసమునందు యాగశాలలో ప్రవేశించుటకై బయలుదేరెను.(36)

పిమ్మట వసిష్ఠుడు మొదలైన వారందరును యాగశాలలో ప్రవేశించి, ఋశ్యశృంగుని ముందు ఉంచుకొని, యథాశాస్త్రముగ, కల్పోక్తప్రకారముగ యాగము చేయ ప్రారంభించిరి.(37)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదమూడవ సర్గము సమాప్తము.

పదునాలుగవ సర్గము

దశరథుడు అశ్వమేధయాగము చేయుట.

సంవత్సరము పూర్తియై అశ్వము తిరిగివచ్చినది. అపుడు సరయూనది ఉత్తరతీరమునందు దశరథుని యజ్ఞము ప్రారంభమయ్యెను.(1)

మహాత్ముడైన ఆ దశరథుని అశ్వమేధయాగమునందు, బ్రాహ్మణశ్రేష్ఠులు ఋష్యశృంగుని ముందు ఉంచుకొని విధ్యుక్తకార్యములు చేసిరి.(2)

వేదములలో మహాపండితులైన ఋత్విక్కులు కర్మలన్నియు వారు వేదవిధుల ప్రకారము, న్యాయానుసారము ఆచరించిరి. బ్రాహ్మణులు అశ్వమేధాంగములగు ప్రవర్గ్యమును, ఉపసదమును, తదితరకర్మలను శాస్త్రానుసారము నిర్వర్తించిరి.(3, 4)

ఆ మునిశ్రేష్ఠులందరును సంతుష్టాంతరంగులై, ఆహూతులైన దేవతలను పూజించి, ప్రాతఃసవనాదికర్మలను యథావిధిగ చేసిరి. ఇంద్రునకు హవిర్భాగములను సమర్పించి నిర్దుష్టమైన సోమలతను నలగగొట్టి రసము తీసిరి. ఈవిధముగ మాధ్యందిన సవనము యథాశాస్త్రముగ చేయబడెను. ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు, బుద్ధిశాలియగు దశరథుని తృతీయసవనమును కూడ యథాశాస్త్రముగ పూర్తిచేసిరి.(5-7)

ఆ యజ్ఞములో హోమములను చేయుటలోకాని, మరి ఏ ఇతర కర్మలలోగాని, ఒక్క పొరబాటు కూడ జరుగలేదు. అంతయు మంత్రపూర్వకముగ జరిగెను. అన్నియు క్షేమకరములుగా ఉండునట్లు చేసిరి. ఆ దినములలో అలసినవాడు గాని, ఆకలిగొన్నవాడు గాని, విద్యావిహీనుడైన బ్రాహ్మణుడు గాని, నూరుగురు శిష్యులు కూడా లేని బ్రాహ్మణుడు గాని, కనబడలేదు.(8, 9)

ఆ యాగము జరిగినన్నాళ్ళును బ్రాహ్మణులు, దాసులు, మునులు, సంన్యాసులు అందరును తృప్తిగా భుజించుచుండిరి. వృద్ధులును, రోగములతో బాధపడుచున్న వారును, స్త్రీలును, బాలురును తినుచుండిరి. ఈవిధముగ నిరంతరము భుజించుచున్నను వారికి తృప్తి కలుగుటలేదు.(భోజనము అంత మధురముగా ఉన్నదని భావము. లేదా ఇంతమంది ఈవిధముగ నిరంతరము భుజించుచున్నను వడ్డించువారికిని, దశరథునకును తృప్తి కలుగుటలేదు అని భావము.)(10, 11)

"అన్నము పెట్టండి. ఇంకనూ పెట్టండి. అనేకవిధములైన వస్త్రములను కూడ పంచిపెట్టండి. మరిన్ని పంచిపెట్టండి." అని దశరథమంత్రులచే ప్రేరితులై అచటివారు ఆవిధముగ చేసిరి.(12)

అచట ప్రతిదినము శ్రద్ధగా వండిన భోజ్యపదార్థముల రాసులు అనేకములు పర్వతములవలె కనబడుచుండెను. దశరథుని యజ్ఞమునందు నానాదేశములనుండి

వచ్చిన స్త్రీ పురుషులు, అన్నపానములచే తృప్తి పొందిరి. యథావిధిగా వండిన, మధురమైన అన్నమును భుజించిన బ్రాహ్మణశ్రేష్ఠులు, "ఆహా! తృప్తి చెందినాము. నీకు మంగళ మగుగాక." అని పలుకుచుండగా, దశరథుడు విని ఆనందించెను.(13-15)

చక్కగా అలంకరించుకొనిన పురుషులు బ్రాహ్మణులకు వడ్డించుచున్నప్పుడు మంచి మణికుండలములు ధరించిన మరికొందరు ఆ వడ్డించువారికి సాహాయ్యము చేసిరి.(16)

కర్మకును, కర్మకును మధ్య అవకాశము లభించినపుడు, వాక్చాతుర్యము కలవారును, బుద్ధిశాలురును అగు బ్రాహ్మణులు ఒండొరులను జయించవలెనను అభిలాషతో అనేక శాస్త్రములకు సంబంధించిన వాగ్వాదములను చేసిరి. యజ్ఞకర్మలలో నేర్పుగల బ్రాహ్మణులు, ప్రతిదినమునందును, సర్వకర్మలను వసిష్ఠాదుల పర్యవేక్షణములో యథాశాస్త్రముగ నిర్వర్తించిరి.(17, 18)

షడంగవేత్త కానివాడు గాని, వ్రతానుష్ఠానము చేయనివాడు గాని, బహుశాస్త్ర పరిచయములేనివాడు గాని ఆ యజ్ఞశాలలో లేకుండెను. దశరథుని యజ్ఞసదస్సులో శాస్త్రవాదకౌశలము లేని బ్రాహ్మణు లెవ్వరును సదస్యులుగా లేకుండిరి.(19)

ఆ యజ్ఞములో యూపస్తంభములను నిలుపవలసిన సమయము వచ్చినది. ఆరు మారేడుకఱ్ఱతో చేసిన యూపములు, ఆరు చంద్రకఱ్ఱతో చేసిన యూపములును, మోదుగకఱ్ఱతో చేసిన యూపములు ఆరును, శ్లేష్మాతకవృక్షము కఱ్ఱతో చేసిన ఒక యూపము, దేవదారుచెట్టు కఱ్ఱతో చేసిన యూపములు రెండును నిలుపబడినవి. యూపమునకును యూపమునకును మధ్య బారెడు దూరము ఉండునట్లు నిలుపబడినవి.(20,21)

యజ్ఞప్రవీణులు యథాశాస్త్రముగ చేయించిన ఆ యూపస్తంభములను, యజ్ఞములో శోభగా ఉండుటకై బంగారముతో అలంకరించిరి. ఇరువదియొక్క అరత్నుల ఎత్తు ఉన్న ఆ ఇరువదియొక్క యూపస్తంభములను ఇరువదియొక్క వస్త్రములు చుట్టి అలంకరించిరి.(22, 23)

ఆ స్తంభములు నున్నగా, దృఢముగా ఎనిమిది అంచులు ఉండునట్లుగా శిల్పులచే చక్కగా నిర్మింపబడినవి. వాటి నన్నింటిని యథాశాస్త్రముగా నిలిపిరి. వస్త్రములు కప్పి, పుష్పసుగంధాదులతో అలంకరించిన ఆ యూపస్తంభములు ఆకాశమునందు సప్తర్షులవలె దీప్తిమంతములై ప్రకాశించినవి.(24, 25)

శాస్త్రములో చెప్పిన కొలత ప్రకారము నిర్మించిన ఇటుకలు పేర్చి, శుల్బకర్మయందు(ఒంటిపేట తాడుతో కొలతలు వేసి అగ్నివేదికలు కట్టుటలో) నిపుణులైన బ్రాహ్మణులు, అగ్నివేదికలు కట్టిరి.(26)

దశరథుని చిత్యాగ్నిని ఉంచుటకు వీలుగా, నేర్పుగల బ్రాహ్మణులు గరుడాకారమైన వేదికను నిర్మించిరి. దీనిని ఇతర వేదికలకంటె మూడురెట్లు ఇటుకలు ఎక్కువగా ఉంచి కట్టుటచే మొత్తము పద్దెనిమిది వరుసలైనవి.(27)

శాస్త్రములో చెప్పిన విధానము ననుసరించి, ఆ యా దేవతలకొరకై పశువులును, సర్పములును, పక్షులును కట్టబడినవి. ఇంతలో పశువిశసనము చేయు సమయము వచ్చినపుడు అశ్వమును, కొన్ని జలచరములను, ఋత్విక్కులు శాస్త్రానుసారముగా యూపములకు బంధించిరి. మూడువందల పశువులను, దశరథుని ఉత్తమాశ్వమును యూపస్తంభములకు కట్టిరి.(28-30)

కౌసల్య ఆ అశ్వమునకు ప్రదక్షిణము చేసి, దానిని మూడు కత్తులతో చంపెను. ధర్మశ్రద్ధావతి యగు కౌసల్య స్థిరమైన చిత్తముతో, ఒక రాత్రి ఆ అశ్వసమీపమున శాస్త్రోక్తరీతిని నివసించెను.(31, 32)

హోత, అధ్వర్యువు, ఉద్గాత అను ఋత్విక్కులు రాజమహిషిని, పరివృత్తిని, వావాతను గ్రహించిరి. (రాజుతోపాటు రాజ్యాభిషేకము పొందిన భార్య మహిషి. ఉపేక్షితభార్య పరివృత్తి. భోగినీస్త్రీ వావాత. ఆ యజ్ఞమునందు వారిని అట్లు ఋత్విక్కులకు యివ్వవలెను. ఋత్విక్కు వారిని పరిగ్రహించి వారికి బదులుగా మరొక వస్తువు ఏదైన తీసుకుని వారిని తిరిగి యజమానునకు యిచ్చివేయును.)(33)

ఇంద్రియనిగ్రహవంతుడును, ఉత్తమజ్ఞానసంపన్నుడును అగు ఋత్విక్కు ఆ అశ్వముయొక్క వపను తీసి యథాశాస్త్రముగ పక్వము చేసెను. దశరథుడు తగిన సమయమున, శాస్త్రానుసారముగ, తన పాపమును తొలగించుకొనుటకై, వపాధూమగంధమును వాసన చూచెను. పదహారుగురు ఋత్విక్కులు, అశ్వముయొక్క వివిధాంగములను, సమంత్రకముగ అగ్నిలో హోమము చేసిరి.(34-36)

ఇతరయజ్ఞములలో హవిస్సును జువ్వికొమ్మలపై ఉంచి సంస్కరింపవలెను. అశ్వమేధమునందు మాత్రము ప్రబ్బలితీగపై ఉంచి సంస్కరించవలెను.(37)

కల్పసూత్రానుసారముగా అశ్వమేధము మూడు దినములలో చేయవలసిన యజ్ఞము. మొదటి దివసమునకు చతుష్టోమమని పేరు. రెండవ దివసమునకు

ఉక్థ్యమనియు, మూడవదానికి అతిరాత్రమనియు పేర్లు. శాస్త్రానుసారముగా విహితము లగు అనేకములైన ఇతరక్రతువులను కూడ దశరథుడు ఆ సమయమున చేయించెను. (38, 39)

జ్యోతిష్టోమ ఆయుర్యాగములు, రెండు అతిరాత్రములు, అభిజిద్యాగ విశ్వజిద్యాగములు, అప్తోర్యామమను మహాక్రతువును చేయబడినవి. (40)

తన వంశమునకు అభివృద్ధి చేకూర్చు దశరథమహారాజు తూర్పుదిక్కునందున్న దేశమును హోతకును, పశ్చిమదిక్కునందున్న దేశమును అధ్వర్యునకును, దక్షిణదిక్కునందున్న దేశమును బ్రహ్మకును, ఉత్తరదిక్కునందున్న దేశమును ఉద్గాతకును ఇచ్చివేసెను. పూర్వము బ్రహ్మ విధించిన అశ్వమేధయాగములో ఈవిధముగ దక్షిణ ఈయవలెనని నిర్ణయింపబడినది. దశరథుడు ఆ క్రతువును పూర్తిచేసి, దాని ఫలము పరిపూర్ణముగ లభించుటకై, ఈ భూమినంతను ఋత్విక్కులకు దానము చేసెను. (41-43)

కాని, ఆ ఋత్విక్కులందరును పాపరహితుడైన దశరథునితో ఇట్లనిరి. "ఈ భూమినంతను రక్షింపగలవాడవు నీవొక్కడవే. ఎల్లప్పుడు స్వాధ్యాయాధ్యయనము చేసికొనుచుండు మాకు భూమితో పనిలేదు. ఈ భూమికి బదులుగ, స్వల్పముగ, ఏదైన ధనము నిమ్ము. శ్రేష్ఠమైన మాణిక్యముగాని, బంగారముగాని, గోవులుగాని, లేదేని ఏ వస్తువు లభ్యమో అదిగాని ఇమ్ము. మాకు భూమితో ప్రయోజనము లేదు". (44-46)

వేదములలో నిష్ణాతులైన ఆ బ్రాహ్మణులు ఇట్లు చెప్పగా, దశరథుడు వారికి పదిలక్షల గోవులను, వందకోట్ల బంగారు నాణెములను, నాలుగువందల కోట్ల వెండినాణెములను ఇచ్చెను. ఆ ఋత్విక్కులందరును కలిసి ఆ ధనమును ఋశ్యశృంగునకును, ధీమంతుడైన వసిష్ఠునకును ఇచ్చిరి. (47-49)

అంతట సంతోషించిన మనస్సులుగల ఆ బ్రాహ్మణోత్తము లందరును న్యాయానుసారముగ ఆ ధనమును పంచుకొని, "చాల ఆనందించితిమి." అని రాజుతో పలికిరి. (50)

పిమ్మట, దశరథుడు శ్రద్ధాయుక్తుడై యాగమును చూచుటకై వచ్చిన బ్రాహ్మణులకు, కోటి బంగారు నాణెము లిచ్చెను. ఇంతలో ఒక దరిద్రబ్రాహ్మణుడు వచ్చి యాచింపగా, దశరథుడాతనికి తాను చేతికి ధరించిన ఆభరణమును

ఇచ్చివేసెను. వారందరును సంతృప్తి పొందినట్లు చూచి దశరథుడు ఆనందముచే వ్యాకులములైన చూపులతో వారికి నమస్కరించెను. సాష్టాంగప్రణామము చేయుచున్న ఆ మహాదాతయైన దశరథుని బ్రాహ్మణులు యథాశాస్త్రముగ ఆశీర్వదించిరి. (51-54)

అశ్వమేధయాగము సర్వపాపములను తొలగించును. స్వర్గమునకు తీసికొనివెళ్లును. గొప్ప రాజులుకూడ దీనిని చేయజాలరు. అట్టి అత్యుత్తమమైన అశ్వమేధయాగము పూర్తిచేసికొని దశరథుడు చాల సంతసించెను. పిమ్మట దశరథుడు, "ఓ మహామునీ! నా వంశముయొక్క వృద్ధికి హేతువగు కర్మను చేయుము" అని ఋష్యశృంగుని ప్రార్థించెను. (55, 56)

"రాజా! అటులనే చేయించెదను. నీకు వంశోద్ధారకులైన నలుగురు కుమారులు పుట్టగలరు." అని ఋషశృంగుడు పలికెను. (57)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదునాలుగవసర్గము సమాప్తము.

పదిహేనవ సర్గము

బ్రహ్మ దేవతలకు రావణవధోపాయము చెప్పుట.

మేధావంతుడును, సకలవేదనిష్ణాతుడును అగు ఋష్యశృంగుడు కొంచెము ఆలోచించి, ఏ కర్మ చేసిన బాగుండునో గుర్తు చేసికొని, దశరథునితో ఇట్లనెను. (1)

"నీకు పుత్రులు కలుగుటకై పుత్రీయేష్టిని చేయించెదను. దీనిని అథర్వశిరస్సు అనెడు వేదభాగములో నున్న మంత్రములచే చేయించవలెను". (2)

బ్రహ్మతేజోవంతుడగు ఋష్యశృంగుడు, దశరథునకు పుత్రులు కలుగుటకై, పుత్రీయేష్టిని ప్రారంభించి, మంత్రోక్తవిధానముతో అగ్నిలో హోమము చేసెను. అంతట దేవతలును, గంధర్వులును, సిద్ధులును, పరమర్షులును, శాస్త్రానుసారముగా తమ తమ యజ్ఞభాగములను స్వీకరించుటకై వచ్చి అచట కలిసిరి. (3, 4)

ఆ దేవతలందరును శాస్త్రానుసారముగ ఆ సదస్సులో చేరి, సకలలోకస్రష్టయగు బ్రహ్మదేవుని సమీపించి పూజ్యమైన వాక్యములు పలికిరి. (5)

"హే భగవన్! రావణు డనెడు రాక్షసుడు నీ వరప్రసాదమువలన కలిగిన

పరాక్రమముతో మమ్ముల నందరిని బాధించుచున్నాడు. పూర్వ మాతని తపస్సుకు సంతసించిన నీవు అతనికి వర మిచ్చితివి. ఆ వరమును గౌరవించుచు మేము అతడు చేయు అపకారమును సర్వదా క్షమించుచున్నాము. అతనిని శిక్షింపజాల కున్నాము.(6, 7)

దుర్బుద్ధియైన ఆ రావణుడు మూడు లోకములను పీడించుచున్నాడు. లోకపాలురపట్ల ద్వేషము వహించుచున్నాడు. దేవాధీశుడైన ఇంద్రుని కూడ అవమానింప చూచుచున్నాడు. నీవు ఇచ్చిన వరముచే కన్నుగానక ఆ రావణుడు, ఋషులను, గంధర్వులను, అసురులను, బ్రాహ్మణులను అవమానించుచున్నాడు. వాని నెవ్వరును జయింపజాలకున్నారు.(8, 9)

సూర్యుడు ఆతనికి వేడి కలిగించడు. వాయువు ఆతని ప్రక్క మసలుటకు భయపడును. ఎల్లప్పుడును చలించు తరంగపంక్తులుగల సముద్రుడు కూడ ఆతనిని చూడగనే స్తంభించిపోవును. వాని దర్శనమే చాల ఘోరమైనది. అట్టి వానినుండి మాకు గొప్ప భయము వచ్చిపడినది. వానిని వధించుటకు ఏదైన ఒక ఉపాయమును చేయుము."(10, 11)

దేవతల మాటలు విని బ్రహ్మదేవుడు ఆలోచించి, ఇట్లు పలికెను. "ఆహా! ఈ దురాత్ముని చంపుటకు ఒక ఉపాయము తోచినది. దేవదానవ రాక్షసగంధర్వయక్షుల చేతిలో నాకు చావు లేకుండుగాక అని అతడు పలుకగా, అట్లే అగుగాక అని నేనంటిని. అప్పుడా రాక్షసుడు మనుష్యుల విషయమై అనాదరముచే వారిని పేర్కొనలేదు. కావున ఆ రాక్షసుడు మనుష్యుని చేతిలో చచ్చుటకు అవకాశమున్నది. వానిని చంపుటకు మరొక ఉపాయము లేదు".(12-14)

బ్రహ్మదేవుడు పలికిన ఈ ప్రియవాక్యమును విని, దేవతలును, మహర్షులును, అందరును చాల సంతసించిరి.(15)

ఇంతలో గొప్ప కాంతి కలవాడును, జగత్తునకంతకును ప్రభువును అయిన విష్ణువు శంఖచక్రగదాహస్తుడై, పీతాంబరధారియై అచటికి వచ్చెను. విష్ణువు బ్రహ్మను కలిసి, మౌనముగా నిలబడెను. అంతట దేవతలందరును నమస్కరించి స్తుతించుచు ఆ విష్ణువుతో ఇట్లనిరి.(16, 17)

"ఓ విష్ణూ! లోకముల హితముకొరకై నిన్ను ఒక కార్యము చేయుమని వేడుచున్నాము. అయోధ్యాధిపతి యైన దశరథుడు ధర్మజ్ఞుడు, ఔదార్యవంతుడు,

మహర్షివంటి తేజస్సు కలవాడు, సత్ప్రభువు. నీవు నాలుగు విధములుగా ఏర్పడి హ్రీ-శ్రీ-కీర్తులవంటి అతని ముగ్గురి భార్యలలో పుత్రులుగా ఆవిర్భవింపుము. (18, 19)

నీవు ఆ దశరథభార్యలయందు మనుష్యుడుగా జన్మించి, మితిమీరి పోవుచున్నవాడును, లోకములకు కంటకమువలె నున్నవాడును, దేవతలచే చంపశక్యముకానివాడును అగు రావణుని యుద్ధమునందు సంహరించుము. మూర్ఖుడైన ఆ రావణుడు, వీర్యమదముచే దేవతలను, గంధర్వులను, సిద్ధులను, మునిశ్రేష్ఠులను బాధించుచున్నాడు. (20, 21)

ఆ క్రూరుడు ఎందరో ఋషులను, నందనవనములో విహరించుచున్న గంధర్వులను, అప్సరసలను హింసించినాడు. కావున సిద్ధగంధర్వయక్షులును, మేమును, మునులతో కలిసి నిన్ను వేడుకొనుటకై ఇచటికి వచ్చినాము. మేమందరము నిన్ను శరణుపొందుచున్నాము. ఓ శత్రువినాశకా! నీవే మాకు అందరికిని అత్యుత్తమమైన గతివి. రాక్షససంహారము చేయుటకై నరలోకమున జనింప నిశ్చయము చేయుము."(22-24)

దేవతల ప్రభువును, దేవతాశ్రేష్ఠుడును, సర్వలోకములచే నమస్కరింపబడిన వాడును, అగు విష్ణువు ఈవిధముగా ప్రార్థింపబడినవాడై, ధర్మమును అనుసరించువారగు అచటికి చేరిన బ్రహ్మాది దేవతలనందరిని ఉద్దేశించి ఇట్లు పలికెను. (25, 26)

"మీరందరునూ భయము విడిచిపెట్టుడు. మీకు క్షేమమగును. మీ హితము కొరకై, నేను క్రూరుడును, దురాత్ముడును, దేవతలకు(మీకు), ఋషులకు భయము కలిగించు వాడును అగు రావణుని, వాని పుత్ర-పౌత్ర-అమాత్య-మిత్ర - జ్ఞాతి - బాంధవులను, యుద్ధమునందు సంహరించి పదకొండువేల సంవత్సరములు మర్త్యలోకములో నివసించి ఈ భూమిని పాలింపగలను". (27, 28)

బుద్ధిమంతుడగు విష్ణుదేవుడు దేవతలకు ఈవిధముగా వరము నిచ్చి, తాను మనుష్యలోకములో అవతరించుటకు తగిన స్థానమును గూర్చి ఆలోచించెను. పద్మపు రేకులవంటి నేత్రములు గల ఆ విష్ణువు, తనను నాలుగు విధములుగా చేసి, దశరథుని తన తండ్రిగా చేసికొనుటకు ఇష్టపడెను. అంతట దేవతలును, గంధర్వులును, రుద్రులును, అప్సరస్త్రీగణములును దివ్యములగు స్తోత్రములతో ఆ విష్ణువును స్తుతించిరి. (29-31)

"భయంకరమైన పరాక్రమముగల ఆ రావణుడు వృద్ధిపొందిన గర్వముతో విజృంభించుచున్నాడు. ఇంద్రుని ద్వేషించుచున్నాడు. లోకములను ఏడ్పించుచున్నాడు. మునులను బాధించుచు సర్వదా వారికి భయహేతు వగుచున్నాడు. అట్టివానిని పూర్తిగా ఉన్మూలించుము.(32)

గొప్ప పౌరుషము కలవాడును, లోకములను ఏడ్పించువాడును అగు ఆ రావణుని సైన్యబాంధవాదిసహితముగ చంపి, చాలకాలము పాటు ఏ చింతలు లేనివాడవై, దేవేంద్రునిచే రక్షింపబడినదియు, దోషములు కాని పాపములు కాని లేనిదియు అగు స్వర్గలోకమునకు తిరిగిరమ్ము."(33)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదిహేనవసర్గము సమాప్తము.


పదునారవ సర్గము

ప్రాజాపత్యపురుషుడు దశరథునకు పాయసము నిచ్చుట.

ఈవిధముగా దేవతలచే నియుక్తుడైన విష్ణువు, తెలిసినవాడే యైనను, తెలియనట్లు దేవతలతో మధురముగా ఇట్లనెను. "ఋషులకు బాధలను కలిగించుచున్న దురాత్ముడైన రావణుని వధించుటకు ఉపాయమేమి?(మీరు చెప్పుడు.) ఆ ఉపాయముచేతనే నేను రావణుని వధించెదను".(1, 2)

"మనుష్యశరీరమును ధరించి, యుద్ధరంగమున రావణుని వధింపుము." అని దేవతలు ప్రత్యుత్తరమిచ్చిరి.(3)

"ఆ రావణుడు చాలకాలము తీవ్రమైన తపస్సు చేయగా బ్రహ్మదేవుడు ఆ తపస్సునకు సంతోషించెను. సంతోషించిన ఆ బ్రహ్మదేవుడు, 'మనుష్యులు తప్ప మరి ఏ ఇతరప్రాణులనుండియు నీకు భయము లేకుండుగాక.' అని ఆ రాక్షసునకు వరమునిచ్చెను. ఎందువల్లననగా, వరదానసమయమున అతడు(రావణుడు) మానవుల విషయమున అనాదరమును చూపెను. ఈవిధముగ బ్రహ్మదేవునినుండి వరమును పొంది, అతడు దృప్తుడై మూడు లోకాలను పీడించుచున్నాడు. స్త్రీలను బలాత్కరించుచున్నాడు. వానిని సంహరింపగలవారు మనుష్యులు మాత్రమే'.(4-7)




దేవతలు చెప్పిన మాటలను విని విష్ణువు దశరథుని తండ్రిగా చేసికొనుటకు ఇష్టపడెను. (8)

అదే సమయమున దశరథుడు, పుత్రులు లేకపోవుటచే, పుత్రులను ఇచ్చు యాగమును చేయుచుండెను. ఈవిధముగా నిశ్చయించుకొనిన విష్ణువు బ్రహ్మదేవుని వీడ్కొని దేవతలచేతను, మహర్షులచేతను పూజింపబడుచున్నవాడై అంతర్ధానము పొందెను. (9, 10)

దశరథుడు యజ్ఞము చేయుచుండగా అగ్నికుండమునుండి సాటిలేని కాంతిగల ఒక మహాభూతము ఆవిర్భవించెను. దాని బలపరాక్రమములు అసాధారణములు. అది నలుపు - ఎరుపురంగులుగల వస్త్రమును ధరించెను. ముఖము ఎఱ్ఱగ నుండెను. దాని కంఠధ్వని దుందుభిధ్వనివలె గంభీరముగ నుండెను. మెత్తగానున్న దాని రోమములును, మీసములును, వెంట్రుకలును, సింహముజూలు రంగులో ఉండెను. పర్వతశిఖరము వంటి ఔన్నత్యముగల ఆ భూతముయొక్క నడక దర్పముతో కూడిన పెద్దపులి నడకవలె నుండెను. దాని ఆకారము సూర్యుని ఆకారమువలెను, అది ప్రజ్వలించుచున్న అగ్నిశిఖవలెను ఉండెను. ఆ భూతము తన రెండు చేతులతో ఒక మేలిమి బంగారుపాత్రను అత్యాదరముతో తీసికొనివచ్చెను. దివ్యపాయసముతో నిండియున్న ఆ బంగారుపాత్రపై వెండి మూత యుండెను. అది మాయచే నిర్మింపబడినదా అన్నట్లు అత్యద్భుతముగ నుండెను. (11-15)

ఆ భూతము దశరథమహారాజును చూచి ఇట్లు పలికెను. "ఓ రాజా! నేను ప్రజాపతి పంపగా ఇచటకు వచ్చినాను". (16)

ఆ రాజు చేతులు జోడించి, "పూజ్యుడా! నీకు స్వాగతము. నీకొరకు నేనేమి చేయవలెను?" అని పలికెను. (17)



ఆ ప్రాజాపత్య పురుషుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "రాజా! నీవు దేవతలను అర్చించుచున్నందుకు ఫలితముగా నేడు ఇది నీకు లభించినది. ఈ పాయసము దేవతలు నిర్మించినది. ఇది సంతానము నిచ్చును. ధనమును ఇచ్చును. ఆరోగ్యమును పెంచును. దీనిని తీసికొనుము. ఈ పాయసమును నీ భార్యలలో తగినవారికి ఇచ్చి తినుమని చెప్పుము. నీవు పుత్రులకొరకై యాగము చేయుచున్నావు కదా. ఆ భార్యలయందు నీకు పుత్రులు జన్మించగలరు".(18-20)

దేవతలు వండిన అన్నముతో నింపి పంపిన ఆ బంగారు పాత్రను దశరథుడు శిరస్సు వంచి సవినయముగ అందుకొని సంతోషించెను. మిక్కిలి సంతోషించిన దశరథుడు అద్భుతమైన ఆ భూతమునకు ప్రదక్షిణము చేసి నమస్కరించెను. దేవతలు నిర్మించిన ఆ పాయసము లభించుటచే దశరథుడు, ధనము లభించిన నిరుపేదవలె, చాల సంతసించెను.(21-23)

అద్భుతమైన ఆకారముతో పరమతేజోవంతమగు ఆ భూతము, ఆ పనిచేసి అచటనే అంతర్ధానము చెందెను.(24)

సంతోషకాంతులతో వెలుగొందుచున్న దశరథాంతఃపురము, మనోహరుడైన శరచ్చంద్రుని కిరణములచే వెలుగు ఆకాశమువలె ప్రకాశించెను. అతడు అంతఃపురములో ప్రవేశించి, 'నీకు పుత్రులను కలిగించు ఈ పాయసమును తీసికొనుము.' అని కౌసల్యతో పలికెను.(25, 26)

దశరథుడు పాయసములో సగముభాగమును కౌసల్య కిచ్చెను. మిగిలిన సగము భాగములోని సగము భాగమును(అనగా నాల్గవ భాగమును) సుమిత్ర కిచ్చెను. మిగిలిన దానిలో సగము భాగమును (అనగా ఎనిమిదవ భాగమును)

కైకేయికి ఇచ్చెను. మిగిలిన ఎనిమిదవ భాగమును మరల ఆలోచించి, సుమిత్రకు ఇచ్చెను. ఈవిధముగా రాజు భార్యలు ముగ్గురికిని వేరువేరుగా పాయసము నిచ్చెను. (27-29)

ఉత్తమగుణవతులగు ఆ రాజభార్యలు అందరును ఆ పాయసము లభించినందులకు చాల సంతోషించి దానిని గొప్ప బహుమానముగా భావించిరి. (30)

వారు ఉత్తమమైన ఆ పాయసము భుజించి, అగ్న్యాదిత్యుల వంటి తేజస్సుతో ఒప్పుచు, చాలకాలము తరువాత గర్భములను ధరించిరి. దశరథుడు గర్భవతులైన భార్యలను చూచి స్వస్థచిత్తుడై, స్వర్గమునందు దేవేంద్రసిద్ధఋష్యాదులచే పూజింపబడిన విష్ణువవలె సంతసించెను. (31, 32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదునారవసర్గము సమాప్తము.

పదుహేడవ సర్గము

బ్రహ్మదేవుడు ప్రేరేపింపగా దేవాదులు అనేక వానరవీరులను సృజించుట.

విష్ణువు దశరథమహారాజునకు పుత్రు దగుటకు నిర్ణయించుకొనిన పిమ్మట బ్రహ్మదేవుడు దేవత లందరితో ఇట్లు చెప్పెను. (1)

"సత్యసంధుడును, మహావీరుడును, మన అందరి హితమును కోరువాడును అగు విష్ణువునకు సహాయులుగ ఉండుటకై, బలవంతులును, కామరూపులును అగు పుత్రులను సృజింపుడు. (2)

అన్ని మాయలు తెలిసినవారు, శూరులు, వాయువేగముతో సమానమైన వేగము కలవారు, నీతిజ్ఞులు, బుద్ధిసంపన్నులు, విష్ణువుతో సమానమైన పరాక్రమము కలవారు, చంప శక్యముకానివారు, వివిధోపాయజ్ఞులు, దివ్యశరీరములు కలవారు, సర్వాస్త్రముల శక్తివంటి శక్తిగలవారు, అమృతమును భుజించినవారివలె క్షుత్పిపాసాదులు లేనివారు, మీతో సమానమైన పరాక్రమము కలవారు అగు పుత్రులను ఉత్తమాప్సర స్త్రీలయందును, గంధర్వస్త్రీలయందును, వానరరూపమున సృజింపుడు. ఎలుగుబంటులలో శ్రేష్ఠుడైన జాంబవంతుని నేను చాలకాలము

క్రితమే సృజించి ఉన్నాను. నేను ఆవులించినపుడు అతడు నా ముఖమునుండి హఠాత్తుగా ఆవిర్భవించినాడు."(3-6)

బ్రహ్మదేవుని ఆజ్ఞప్రకారము ఆ దేవతలు వానరరూపములలో ఉన్న పుత్రులను సృజించిరి. మహావీర్యవంతులగు ఋషులు, సిద్ధులు, విద్యాధరులు, ఉరగులు, చారణులు కూడ వీరులైన కుమారులను వానరరూపములలో సృజించిరి.(7, 8)

దేవేంద్రుడు మహేంద్రపర్వతము వంటి శరీరము కలవాడును, మహాబలవంతుడును అగు వాలియనెడు వానరేంద్రుని పుట్టించెను. తేజశ్శాలులలో గొప్పవాడైన సూర్యుడు సుగ్రీవుని పుట్టించెను. బృహస్పతి, వానరశ్రేష్ఠు లందరిలోను మహాబుద్ధిమంతుడైన తారు డను గొప్ప వానరుని సృజించెను. కుబేరుడు శ్రీమంతుడగు గంధమాదను డనెడు కుమారుని సృజించెను. విశ్వకర్మ నలుడు అనెడు పేరు గల గొప్ప వానరుని పుట్టించెను. శ్రీమంతుడును, అగ్నితో సమానమైన తేజస్సు కలవాడును, అగ్ని కుమారుడును అగు నీలుడు తేజఃకీర్తివీర్యములచే ఇతరవానరుల నందరిని మించి ఉండెను. సౌందర్య మనెడి సంపద గల అశ్వినీదేవతలు, ప్రశస్తసౌందర్యవంతులగు మైందుడు, ద్వివిదుడు అను వానరులను పుట్టించిరి. వరుణుడు సుషేణు డనెడు వానరశ్రేష్ఠుని, పర్జన్యుడు మహాబలశాలి యగు శరభుని పుట్టించిరి.(9-14)

వాయుదేవునకు శ్రీమంతుడును, వీర్యవంతుడును, వజ్రమువంటి దేహము కలవాడును, వేగమునందు గరుత్మంతునితో సమానుడును అగు హనుమంతుడు కుమారుడుగ జనించెను.(15)

అమేయమైన బలపరాక్రమములు గలవారును, కామరూపులును అగు వేలకొలది వీరులు దశగ్రీవుని వధకొరకై సృష్టింపబడిరి. మేరుమందర పర్వతములవలె మహోన్నతములైన దేహములుగల, మహాబలవంతులగు ఋక్ష-వానర-గోపుచ్ఛులు శీఘ్రముగనే జనించిరి. ఏ దేవునకు ఏ రూపము, ఏ వేషము, ఏ పరాక్రమము ఉండెనో ఆ దేవుని కుమారుడు కూడ అదే రూపము, అదే వేషము, అదే పరాక్రమము కలిగి ఉండెను.(16-18)

కొనియాడదగిన పరాక్రమము గల కొందరు గోలాంగూలస్త్రీలయందును, కొందరు ఋక్షస్త్రీలయందును, కిన్నరస్త్రీలయందును జన్మించిరి.(19)

ఆ సమయమున దేవ-మహర్షి-గంధర్వ-తార్క్ష్య-యక్ష-నాగ- కింపురుష



- సిద్ధ - విద్యాధర - ఉరగులు అనేకులు చాల సంతసించినవారై ప్రధానలైన అప్సరసలయందును, విద్యాధర - నాగ - గంధర్వస్త్రీలయందును, గొప్ప దేహములు కలవారును, వనములలో సంచరించు వారును అగు వేలకొలది వానరులను సృజించిరి.(20-22)

ఆ వానరు లందరును కోరిన రూపము ధరింపగలరు. బలాఢ్యులు. స్వేచ్ఛగా సంచరించువారు. దర్పబలములచే సింహశార్దూలములతో సమానులు. వారికి అన్ని అస్త్రములను గూర్చియు తెలియును.(అయినను) వారు యుద్ధములలో శిలలు, వృక్షములు, గోళ్ళు, కోరలు - వీటినే ఆయుధములుగా ఉపయోగించెడివారు. (23, 24)

వారు మహాపర్వతములను ఊపివేయగలరు. స్థిరములైన మహావృక్షములను పెకిలించగలరు. వేగముచే, సకలనదులకును గమ్యస్థానమైన సముద్రమును కూడ కలిచివేయగలరు. పాదములచేత భూమిని చీల్చివేయగలరు. సముద్రమును దాటగలరు. ఆకాశములో ప్రవేశించి మేఘములనుకూడ పట్టుకొనగలరు. అరణ్యములలో సంచరించు మత్తగజములను కూడ పట్టుకొనగలరు. ఆ వానరుల అరుపులు విని పక్షులు ఆకాశమునుండి క్రిందకు పడిపోవును.(25-27)

(ఈ విధముగ) కామరూపులును, సేనానాయకులును, మహాత్ములును అగు వానరులు నూరులక్షలు(కోటిమంది) సృజింపబడిరి. ఆ వానరసేనానాయకులు వానరుల ముఖ్యసేనలకు నాయకులై, వీరులగు వానరులను పుట్టించిరి. వేలకొలది వానరులు కొందరు ఋక్షవత్పర్వతముపైన నివసించిరి. మరికొందరు అనేక పర్వతములపైనను, అడవులందును నివసించిరి.(28-30)

ఆ వానరశ్రేష్ఠులందరు ఇంద్రసూర్యుల కుమారులును, సోదరులును అగు వాలిసుగ్రీవులను, నలుని, నీలుని, హనుమంతుని, తదితర వానరసేనానాయకులను సేవించుచుండిరి.(31)

గరుత్మంతుని వంటి బలము కలవారును, యుద్ధసమర్థులును అగు ఆ వానరు లందరును స్వేచ్ఛగా సంచరించుచు, దర్పముచేత సింహములను, వ్యాఘ్రములను, మహోరగములను పీడించిరి. (అనగా వాటికికూడ భయము

కలుగునట్లు సంచరించిరి.) గొప్ప బాహువులుగల, అధికపరాక్రమవంతుడు అయిన వాలి తన భుజబలముచేత ఆ ఋక్షగోపుచ్ఛవానరులను రక్షించెను. (32,33)

అనేకవిధములైన శరీరనిర్మాణములును, అనేకవిధములైన దేహ – జాత్యాది చిహ్నములును గల ఆ శూరులైన వానరులు, పర్వత – వన – సముద్ర సహితమగు ఈ భూమిని అంతనూ ఆవరించి ఉండిరి. మేఘముల గుంపులతోడను పర్వతశిఖరములతోడను సమానులును, మహాబలవంతులును, భయంకరములైన శరీరములు కలవారును, రామునికి సాహాయ్యము చేయుటకై ఆవిర్భవించినవారును అగు ఆ వానర సేనానాయకులచే భూమియంతయు ఆవరింపబడియుండెను. (34, 35)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పదిహేడవసర్గము సమాప్తము.

పద్దెనిమిదవ సర్గము


రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల జననము. వారి శీలగుణాదుల వర్ణనము. విశ్వామిత్రుని ఆగమనము. అతనిని దశరథుడు సత్కరించుట.

మహాత్ముడైన దశరథుడు ప్రారంభించిన అశ్వమేధపుత్రకామేష్టులు పూర్తియైనవి. దేవతలు హవిర్భాగములను తీసికొని తమ తమ స్థానములకు వెడలిపోయిరి. పత్నీసమేతుడైన దశరథుడు యాగదీక్షా నియమములను పూర్తి చేసికొని, భృత్య–బల–వాహనాదులతో అయోధ్యానగరములో ప్రవేశించెను. (1, 2)

యాగమునకు ఆహూతులై వచ్చిన రాజు లందరును, తగు విధముగ దశరథునిచేత పూజింపబడినవారై, వసిష్ఠునకు నమస్కారము చేసి, సంతోషముతో స్వదేశములకు వెళ్లిరి. అయోధ్యాపురినుండి తమ పురములకు బయలుదేరిన ఆ రాజుల సైన్యములు, శుభ్రములై ఆనందము కలవై ప్రకాశించినవి. (3, 4)

రాజులు వెడలిపోయిన పిదప శ్రీమంతుడగు దశరథమహారాజు సద్బ్రాహ్మణులను ముందిడుకొని నగరము ప్రవేశించెను. (5)

దశరథునినుండి బాగుగా పూజల నందుకొని ఋష్యశృంగుడు పరివార



సమేతుడైన రోమపాదుడు అనుసరింప శాంతతో కూడ తిరిగి స్వస్థానమునకు వెళ్లెను.(6)

దశరథుడు ఈవిధముగా వారి నందరిని పంపివేసి, ఆనందముతో నిండిన మనస్సుతో కుమారుల ఉత్పత్తికైఎదురుచూచుచు, సుఖముగా నుండెను.(7)

యజ్ఞము పూర్తియైన తరువాత ఆరు ఋతువులు గడచినవి. అనగా ఒక సంవత్సరము చాలవరకు పూర్తియైనది. తరువాత వచ్చిన పండ్రెండవ మాసమగు చైత్రమాసమునందు, పునర్వసునక్షత్రయుక్త నవమీ తిథియందు, ఐదు గ్రహములు తమ తమ ఉచ్చస్థానములం దుండగా - అనగా సూర్య - కుజ - గురు - శుక్ర - శనులు తమ ఉచ్చస్థానములగు మేష - మకర - కర్కాటక - మీన - తులా - రాసులందుండగా గురుడు చంద్రునితో కలసియున్న కర్కాటకలగ్నమునందు, కౌసల్య సకలజగన్నాథుడును, సర్వలోక నమస్కృతుడును, సర్వలక్షణసంపన్నుడును, విష్ణువుయొక్క అంశ యైనవాడును, మహాభాగ్యవంతుడును, ఇక్ష్వాకువంశవర్ధనుడును అగు రాముని పుత్రునిగా కనెను.(8-10)

అమితమైన తేజస్సుగల ఆ కుమారునితో కౌసల్య, దేవతలలో శ్రేష్ఠుడైన దేవేంద్రునితో అతని తల్లియైన అదితివలె ప్రకాశించెను.(11)

సత్యపరాక్రముదును, సాక్షాత్తు విష్ణువుయొక్క నాల్గవభాగమైన వాడును, సమస్త సద్గుణ సంపన్నుడును అగు భరతుడు అను పుత్రుడు కైకేయియందు జన్మించెను.(12)

పిమ్మట సుమిత్ర సకలాస్త్రములందును నేర్పు కలవారును, విష్ణువుయొక్క అంశతో కూడినవారును, వీరులును అగు లక్ష్మణశత్రుఘ్ను లను సుతులను కనెను. నిర్మలమైన బుద్ధిగల భరతుడు పుష్యమీనక్షత్రమునందు, మీనలగ్నమున పుట్టెను. మరునాడు లక్ష్మణశత్రుఘ్నులు, ఆశ్లేషానక్షత్రమునందు, కర్కాటకలగ్నమున మధ్యాహ్న సమయమున పుట్టిరి.(13, 14)

ఈవిధముగ దశరథునకు గుణవంతులును, అనురూపులును, పూర్వాభాద్ర ఉత్తరాభాద్రములు అను నాలుగు నక్షత్రముల వంటి కాంతి కలవారును, బుద్ధిమంతులును అగు నలుగురు పుత్రులు జనించిరి.(15)

ఆ సమయమున గంధర్వులు మధురముగా గానము చేసిరి. అప్సరసలు నాట్యము చేసిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్పవర్షము కురిసినది. అయోధ్యలో ఎందరో జనులు పాల్గొనిన గొప్ప ఉత్సవము జరిగినది. వీధులన్నియు జనులతో కిక్కిరిసి ఉన్నవి. నటనర్తకాదులతో నిండిపోయినవి. గాయకుల ధ్వనులు, వాద్యధ్వనులు వందిమాగధులు చేయు ధ్వనులును మిన్ను ముట్టినవి. దశరథుడు సూత-మాగధ-వందులకు పారితోషికములను పంచి పెట్టెను. బ్రాహ్మణులకు అధికసంఖ్యాకము లగు గోవులను, తదితర వస్తువులను దానము చేసెను.(16-19)

పదకొండు దినముల తరువాత నామకరణము జరిగెను. ఆనందభరితహృదయుడైన వసిష్ఠుడు జ్యేష్ఠుడగు కౌసల్యాపుత్రునకు రాముడనియు, కైకేయీపుత్రునకు భరతు డనియు, సుమిత్రాపుత్రులకు లక్ష్మణశత్రుఘ్ను లనియు నామధేయములు చేసెను.(20, 21)

దశరథుడు బ్రాహ్మణులకును, పౌరులకును, జానపదులకును సంతర్పణములు చేసి బ్రాహ్మణులకు అత్యధికమగు రత్నసముదాయమును దానము చేసెను. ఈవిధముగ దశరథుడు కుమారులకు జాతకర్మ - నామకరణ - అన్నప్రాశన - చౌల - ఉపనయనాదిసంస్కారము లన్నియు యథాకాలముగ చేయించెను.(22)

వారిలో పెద్దవాడైన రాముడు ధ్వజమువలె సర్వోన్నతుడై, తండ్రికి చాల ప్రీతిని కలిగించెను. బ్రహ్మదేవుడు వలె సమస్తప్రాణుల ఆదరమును చూరగొనెను.(23)

ఆ దశరథపుత్రులందరును వేదవేత్తలే. అందరును శూరులే. అందరును జ్ఞానసంపన్నులే. అందరును సద్గుణశోభితులే. అందరును లోకక్షేమమునందు ఆసక్తికలవారే. వారందరిలో కూడ, మహాతేజఃశాలియు, సత్యపరాక్రముడును



అగు రాముడు, నిర్మలుడైన చంద్రుడువలె సకలలోకమునకు ఇష్టుడై ఉండెను. (24, 25)

రాముడు గజాశ్వరథములపై నెక్కి యుద్ధము చేయుటయందు సమర్థుడని పేరెన్నిక గనెను. అతడు ధనుర్వేదమునందు శ్రద్ధ కలవాడు. పితృసేవ చేయుటయందు ఆసక్తికలవాడు. (26)

సంపదలను వృద్ధిపొందించు లక్ష్మణుడు, చిన్నతనమునుండియు, లోకములకు మనోహరుడును, జ్యేష్ఠసోదరుడును అగు రాముని విషయమున సర్వదా అత్యధికస్నేహము కలవాడై ఉండెను. రామునకు సకలప్రియములను చేకూర్చుటకై శరీరమును కూడ అర్పించుటకు వెనుతీయని లక్ష్మీసంపన్నుడైన లక్ష్మణుడు రామునకు, బహిఃప్రాణమా అన్నట్లు అపారస్నేహాస్పదు డయ్యెను. లక్ష్మణుడు ప్రక్కన లేకున్నచో శ్రీరాముడు నిద్రపోయెడివాడు కాదు. అతడు లేనిచో మధురమైన ఆహారమును కూడ భుజించెడివాడు కాదు. (27-29)

రాముడు అశ్వమునెక్కి వేటకై బయలువెడలినపుడు లక్ష్మణుడు ధనుస్సు చేతబూని అతని వెనుకనే వెళ్లెడివాడు. అట్లే లక్ష్మణుని తమ్ముడైన శత్రుఘ్నుడు భరతునకు ప్రాణములకంటె ఎక్కువ ప్రియు డయ్యెను. శత్రుఘ్నునకు భరతుడును అట్లే ప్రియు డయ్యెను. (30, 31)

భాగ్యశాలులును, ప్రియులును అగు ఆ నలుగురు కుమారులతో దశరథుడు, దేవతలతో బ్రహ్మదేవుడు వలె చాల సంతోషించెను.(32)

ఆ కుమారు లందరును జ్ఞానసంపన్నులు. సర్వసద్గుణభూషితులు. తప్పు పనులు చేయుటకు సిగ్గుపడెడువారు. కీర్తిని సంపాదించినవారు. అన్ని విషయములందును జ్ఞానము సంపాదించినవారు. దీర్ఘాలోచన చేయ సమర్థులు. ఇట్టి ప్రభావముగల తేజశ్శాలులగు ఆ పుత్రులను చూచుకొని దశరథమహారాజు సకలలోకప్రభువగు ప్రజాపతివలె సంతుష్టాంతరంగు డయ్యెను.(33, 34)

ఆ రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వేదాధ్యయనమందు శ్రద్ధావంతులై తల్లిదండ్రులను సేవించుటయందు ఆసక్తి కలవారై, ధనుర్వేదమునందు కూడ నైపుణ్యమును సంపాదించిరి.(35)

ఒకనాడు దశరథమహారాజు, పురోహితునితోడను, బంధువులతోడను కలిసి తన కుమారుల వివాహమును గూర్చి ఆలోచించుచుండెను. బుద్ధిశాలియగు దశరథుడు మంత్రులతో ఆలోచించుచుండగా, మహాతేజశ్శాలియగు విశ్వామిత్రమహాముని అచటకు వచ్చెను.(36, 37)


రాజదర్శనమును కోరుచున్న అతడు, ద్వారపాలకులతో, "కుశికవంశీయుడును, గాధికుమారుడును అగు విశ్వామిత్రుడు వచ్చినాడు అని శీఘ్రముగ మీ రాజుకు చెప్పుడు." అని పలికెను.(38)

ఆ మాట వినగానే ద్వారపాలకు లందరును భయపడిన చిత్తములతో రాజగృహమునకు పరుగెత్తి వెళ్లిరి. వారు రాజప్రాసాదము చేరి విశ్వామిత్రమహర్షి వచ్చినా డని దశరథునకు తెలిపిరి.(39, 40)

వారి మాటలు విన్న దశరథుడు, సంతోషించి, పురోహితసమేతుడై, సావధానచిత్తుడై, దేవేంద్రుడు బ్రహ్మకువలె, విశ్వామిత్రునకు ఎదురేగెను. గొప్ప తపఃశక్తితో ప్రజ్వలించుచున్నవాడును, కఠినవ్రతములను ఆచరించువాడును అగు ఆ విశ్వామిత్రుని చూచి దశరథుడు ఆనందముచే వికసించిన ముఖము కలవాడై, అర్ఘ్యము సమర్పించెను.(41, 42)

విశ్వామిత్రుడు శాస్త్రోక్తరీతిని దశరథమహారాజు సమర్పించిన అర్ఘ్యము స్వీకరించి, "ఎట్టి ఆపదలును లేక కుశలముగా నున్నావా?" అని అతనిని

ప్రశ్నించెను. (43)



మిక్కిలి ధార్మికుడైన విశ్వామిత్రుడు, "నీ రాజ్యములోని నగరములందును, గ్రామములందును, అందరును క్షేమముగా ఉన్నారా? ధనాగారము సమృద్ధముగా ఉన్నదా? నీ సుహృద్బాంధవు లందరును క్షేమమే కదా! నీకు సామంతరాజు లందరును లొంగి ఉన్నారా? శత్రువుల నందరిని జయించినావా? దేవతాప్రీతికరమైన యజ్ఞయాగాదులను, మానవప్రయత్న సాధ్యమైన సామదానభేదదండా ద్యుపాయములను చక్కగ అనుష్ఠించు చున్నావా?" అని దశరథుని ప్రశ్నించెను. (44, 45)

ఆ మునిపుంగవుడు, వసిష్ఠుని, అచటనున్న మహానుభావులగు ఇతర ఋషులను సమీపించి, న్యాయానుసారముగా వారి కుశల మడిగెను. (46)

ఆ ఋషులందరును సంతసించి దశరథుని గృహమును ప్రవేశించిరి. అచట యోగ్యతానుసారముగా పూజింపబడినవారై కూర్చుండిరి. (47)

గొప్ప దాతయైన దశరథుడు విశ్వామిత్రుని రాకచే సంతోషించిన మనస్సుతో ఆ మహామునిని పూజించి ఇట్లనెను. (48)

"ఓ మహామునీ! నీ రాక అమృతప్రాప్తి వంటిది. నీళ్లు లేనిచోట వానలు కురియుట వంటిది. సంతానము లేనివానికి అనుకూలవతియగు భార్యయందు పుత్రుడు జనించుటవంటిది. పోగొట్టుకొనిన వస్తువు మరల దొరకుట వంటిది. గొప్ప అభివృద్ధి లభించినపుడు కలుగు హర్షము వంటిది. నీకు స్వాగతము అగుగాక!(49, 50)

ఓ విశ్వామిత్రా! నీ రాకతో నేను మిక్కిలి సంతోషించినాను. నీకు ఏ కోరికను, ఎట్లు తీర్చవలెనో చెప్పుము. నీవు సత్పాత్రవు, నా అదృష్టముచే వచ్చినావు, ఈనాడు నా జన్మ సఫలమైనది. జీవితము సుజీవితమైనది. (51, 52)

మొదట నీకు రాజర్షి అను బిరుదము ఉండెడిది. అది నీ శక్తిని సూచించునది. పిదప తపస్సుచేత బ్రహ్మర్షిత్వమును పొందినావు. నీవు నాకు సర్వథా పూజ్యుడవు.

నీవు వచ్చుట చాల ఆశ్చర్యజనకము, నాకు చాల పవిత్రత్వమును చేకూర్చుచున్నది. నీ దర్శనమువలన నేను పుణ్యక్షేత్రములో నివసించినట్లున్నది.(53, 54)

నీవు ఏ కార్యమును కోరి ఇచటకు వచ్చితివో చెప్పుము. ఆజ్ఞారూపమగు అనుగ్రహము చేయుము. నీ కార్యమును సాధించుటకు సిద్ధముగా నున్నాను. నీవు వచ్చిన కార్యము చాల గొప్పది కావచ్చును. అయినను సందేహింపకుము. నేను దానిని పూర్తిగా నెరవేర్చెదను. నీవు నాకు దైవతము వంటివాడవు.(55, 56)

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ఈనాడు నాకు గొప్ప అభ్యుదయము లభించినది. నీ రాకవలన నాకు కలిగిన ఈ ధర్మము చాల గొప్పది."(57)

బుద్ధిమంతుడగు దశరథుడు వినయపూర్వకముగా పలికినవి, శ్రోత్రములకును, హృదయమునకును సుఖమును కలిగించునవి అగు ఆ వాక్యములను విని, ప్రసిద్ధములైన గుణములు, కీర్తి కలవాడు, సద్గుణములచే శ్రేష్ఠుడు అయిన విశ్వామిత్రుడు చాల ఆనందించెను.(58)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పద్దెనిమిదవసర్గము సమాప్తము.

పందొమ్మిదవ సర్గము

విశ్వామిత్రుడు యాగరక్షణకై రాముని పంపుమని కోరగా దశరథుడు దుఃఖించుట.

ఆ రాజశ్రేష్ఠుని ఆశ్చర్యకరములు, విస్తృతములు అయిన మాటలు విని మహాతేజఃశాలియగు విశ్వామిత్రుడు, ఆనందముచే శరీరము పులకింపగా ఇట్లు పలికెను.(1)

"ఓ రాజశ్రేష్ఠుడా! మహావంశమునందు పుట్టి వసిష్ఠుని ఉపదేశములను పొందుచున్న నీవు ఈవిధముగ మాటలాడుటయే యుక్తము. మరొక విధముగ మాటలాడుట అసంభావ్యము. నా మనస్సులో నున్న కార్యమును చెప్పెదను. దానిని తప్పక చేయుము. నీవు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనుము.(2, 3)

నేను ఒక సిద్ధికొరకై ఒక (యజ్ఞము చేయవలెనని) నియమమును

అవలంబించి ఉన్నాను. కాని మారీచసుబాహులను ఇద్దరు రాక్షసులు దానికి విఘ్నము కలిగించు చున్నారు. నా వ్రతము సమాప్తి చెందు సమయమునకు, వీర్యవంతులును, సుశిక్షితులును అగు ఆ రాక్షసులు వచ్చి, మాంసముతో కూడిన రక్తప్రవాహమును యజ్ఞవేదికపై వర్షించుచున్నారు. ఆ వ్రతసంకల్పమునకు ఆ విధముగ విఘ్నము కలిగినది. ఆ యజ్ఞమునకై ఇంత శ్రమపడిన నేను ఉత్సాహము సన్నగిలగా ఆ ప్రదేశమును వదలి వచ్చితిని.(4-6)

ఆ సమయమున కోపము చూపుటకు బుద్ధి కలుగుటలేదు. ఆ యజ్ఞము అట్టిది. అట్టి యజ్ఞములలో శాపము ఇవ్వకూడదు.(7)

రాజా! శూరుడు, సత్యమైన పరాక్రమము కలవాడు, జునపములు ధరించు కౌమారవయస్సులో నున్నవాడు అయిన నీ జ్యేష్ఠకుమారుడైన రాముని నాకిమ్ము (నాతో పంపుము). (నీ కుమారుని నేను అన్ని విధములా రక్షించెదను.) నాచే రక్షింపబడిన ఈ రాముడు, తన సహజమైన దివ్యతేజస్సుచేత విఘ్నకారులగు రాక్షసులను సంహరించుటకు సమర్థుడు. రామునకు అనేకవిధములైన శ్రేయస్సులను కలిగింపగలను. దానిచే ఇతడు మూడు లోకములలో కీర్తిని పొందగలడు. సందేహము లేదు.(8-10)

ఆ మారీచసుబాహులు రాముని ఎదుట ఏ విధముగను నిలువజాలరు. రాముడు తప్ప మరెవ్వరును వారిని చంపజాలరు. పరాక్రమముచే గర్వించిన ఆ మారీచసుబాహులు యముని పాశములకు వశులు కావలసి యున్నది. వారు యుద్ధమునందు మహాత్ముడైన రాముని ముందు నిలువలేరు.(11, 12)

రామునియందున్న పుత్రస్నేహముచే వెనుదీయకుము. ఆ రాక్షసులు రామునిచే సంహరింపబడినారనియే నిశ్చయించుకొనుము. నేను నీకు ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను.(13)

మహాత్ముడును, సత్యపరాక్రముడును అగు రామునిగూర్చి నాకు తెలియును. వసిష్ఠునకు తెలియును. నీ సభలోనున్న మహర్షులకు తెలియును. రాముడు నీ కుమారుడగుటచే నీ వాతనిని సామాన్యునిగ తలపవచ్చును. అతని యథార్థస్వరూపము మావంటి తపోధనులకు మాత్రమే తెలియును.(14)

నీవు ధర్మమే కావలెనని కోరినట్లైతే, నీ గొప్ప కీర్తి భూలోకమున స్థిరముగా నుండవలెనని అభిలాష నీకు ఉన్నచో రాముని నాతో పంపుము. దశరథమహారాజా! నీ మంత్రులును వసిష్ఠాదులును అనుజ్ఞ ఇచ్చిననే రాముని నాతో పంపుము. నా

యాగము పదిదినములు జరుగును. ఆ యాగమును రక్షించుటకై నీ ప్రియపుత్రుడైన రాముని నాతో పంపుము.(15-17)

నా యజ్ఞసమయము దాటిపోకుండునట్లు చూడుము. ఆలస్యము చేయకుము. నీకు క్షేమ మగును. దుఃఖింపకుము."(18)

ధర్మాత్ముడు, మహాతేజఃశాలియు అయిన విశ్వామిత్రమహాముని ఈవిధముగ ధర్మార్థసహితమగు మాటలు పలికి ఊరకుండెను.(19)

విశ్వామిత్రుని మాటలు విని దశరథుడు తీవ్రమైన శోకమును పొంది భయముతో క్రుంగిపోయెను. ఆ మాటలు దశరథుని హృదయమును చీల్చివేసినవి. మిక్కిలి వ్యథతో ఆతడు ఆసనమునుండి చలించెను.(20, 21)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని పందొమ్మిదవసర్గ సమాప్తము.

ఇరువదియవ సర్గము

దశరథుడు రాముని తనతో పంపననుటచే విశ్వామిత్రుడు కోపించుట.

విశ్వామిత్రుని మాటలు వినగానే దశరథుడు క్షణకాలముపాటు నిశ్చేష్టుడయ్యెను. మరల తెప్పరిల్లి ఇట్లు పలికెను.(1)

"మహామునీ! రాజీవలోచనుడైన నా రాముడు కమలనేత్రుడు. పదహారు సంవత్సరములు కూడ నిండలేదు. ఈతనికి రాక్షసులతో యుద్ధము చేయు యోగ్యత ఉన్నదని నేను భావింపను. నా వద్ద పూర్తి అక్షౌహిణి సైన్యమున్నది. దీనికి నేను అధిపతిని. నియామకుడను. ఈ సైన్యముతో వెళ్లి నేను రాక్షసులతో యుద్ధము చేయగలను.(2, 3)

నా పోషణలో నున్న ఈ సైనికులు శూరులు. విక్రమవంతులు. అస్త్రముల ప్రయోగమునందు సమర్థులు. వీరు రాక్షసులతో యుద్ధము చేయుటకు యోగ్యులు. నీవు రాముని తీసికొనివెళ్లవలదు.(4)

ధనుర్ధారినై నేనే నీయాగమును రక్షించెదను. నా ప్రాణములు ఉన్నంతవరకును యుద్ధాగ్రమునందు నిలిచి రాక్షసులతో యుద్ధము చేసెదను. నేనే స్వయముగ

అచటికి వచ్చి, యాగమును రక్షించి, అది నిర్విఘ్నముగ కొనసాగునట్లు చేసెదను. రాముని తీసికొనివెళ్లవలదు.(5, 6)

నా రాముడు చిన్నవాడు. పూర్తిగ విద్యలను నేర్వలేదు. శత్రువుల బలాబలములను గుర్తింపజాలడు. ఇంకను అస్త్రబలమును సంపాదింపలేదు. యుద్ధమునందు నేర్పు లేనివాడు. రాక్షసులు తప్పక కపటయుద్ధము చేయుదురు. అందుచే వారితో యుద్ధము చేయుటకు రాముడు తగినవాడు కాడు.(7)

ఓ మునిశ్రేష్ఠా! రాముడు లేనిచో నేను క్షణకాలమైనను జీవింపజాలను. అందుచే రాముని తీసికొనివెళ్లవలదు. అయినను రామునే తీసికొని వెళ్లవలె నని నీకు కోరిక ఉన్నచో అతనితో పాటు చతురంగబలమును, నన్ను కూడ తీసికొనివెళ్లుము.(8, 9)

అరవైవేల సంవత్సరముల వయస్సునందు, ఎంతో శ్రమపడి ఈతనిని కన్నాను. రాముని తీసికొనివెళ్లవలదు. నలుగురు కుమారుల విషయమునందును నాకు గొప్ప ప్రేమ ఉన్నది. కాని జ్యేష్ఠుడు, ధర్మవిషయమున ప్రధానుడు (నాకు అత్యంత ప్రీతిపాత్రుడు) అయిన రాముని తీసికొని వెళ్లవలదు.(10, 11)

ఓ మునిశ్రేష్ఠుడా! ఆ రాక్షసుల పరాక్రమ మెట్టిది? వారు ఎవరు? ఎవరి కుమారులు? వారి ప్రమాణము ఎంత? వారిని ఎవరు రక్షించుచున్నారు? కపటయుద్ధము చేయు రాక్షసుల విషయమున రాముడు కాని, నా సైన్యములు కాని, నేను కాని ఎట్లు ప్రతిక్రియ చేయవలసియుండును? దుష్టస్వభావులైన ఆ రాక్షసులతో యుద్ధమునందు నేనెట్లు మెలగవలెను? ఈ విషయము లన్నియు చెప్పుము. రాక్షసులు పరాక్రమముచే గర్వించుచుందురు కదా?"

దశరథుని మాటలు విని విశ్వామిత్రుడు ఇట్లు పలికెను.(12-15)

"పౌలస్త్యవంశమునందు జన్మించిన రావణు డను రాక్షసుడు ఉన్నాడు. అతడు మహాబలవంతుడు. మహావీర్యవంతుడు. అతడు బ్రహ్మనుండి వరమును పొంది, చాలమంది రాక్షసులతో కలిసి మూడు లోకములను మిక్కిలి పీడించుచున్నాడు.(16)

రాక్షసరాజైన ఆ రావణుడు విశ్రవసు డను మునియొక్క పుత్రుడు. సాక్షాత్తు కుబేరుని సోదరుడు. అతడు గొప్ప పరాక్రమము కలవాడని వినుచున్నాము. మహాబలుడైన అతడు స్వయముగా యజ్ఞమునకు విఘ్నము చేయడు. కాని, అతనిచే

ప్రేరేపింపబడిన మారీచుడు, సుబాహువు అనెడు ఇద్దరు రాక్షసులు యజ్ఞవిఘ్నము చేయుచుందురు."(17-19)

విశ్వామిత్రుడు ఇట్లు చెప్పగా విని దశరథుడు అతనితో ఇట్లనెను .

"నేను యుద్ధమునందు ఆ దురాత్ముని ఎదుట నిలువజాలను. నీవు సర్వధర్మములు తెలిసినవాడవు. నా చిన్నికుమారునియందును, అల్పభాగ్యుడనైన నాయందును అనుగ్రహము చూపుము. గురువైన నీవు మాకు దైవము కదా!(20, 21)

దేవదానవగంధర్వయక్షపతగపన్నగులు కూడ ఆ రావణుని ఎదుట నిలిచి యుద్ధము చేయజాలరు. ఇక మానవుల మాట చెప్పవలెనా? ఆ రాక్షసుడు యుద్ధములో వీర్యవంతుల వీర్యమును గ్రహించివేయును. నేను నా సైన్యముతో కూడినవాడనై గాని, నా కుమారులతో కలిసి గాని, అతడు ఒక్కనితో గాని, అతని సైన్యముతో గాని యుద్ధము చేయజాలను.(22, 23)

విశ్వామిత్రా! బాలుడైన నా కుమారుడు దేవతలతో సమానుడు. యుద్ధపరిచయము లేనివాడు. పున్నామనరకమునుండి నన్ను ఉద్ధరించువాడు. ఏది ఏమైనను రాముని నీతో పంపజాలను. నీకు యజ్ఞవిఘ్నము చేయు ఆ సుందోపసుందుల కుమారులైన మారీచసుబాహువులు యుద్ధమునందు యమునివంటివారు. అందుచే నా కుమారుని నీతో పంపజాలను.(24, 25)

మారీచసుబాహువులు పరాక్రమవంతులు మాత్రమే కాదు. యుద్ధమునందు మంచి నేర్పుకలవారు కూడ. స్నేహితులతో సహితుడనైన నేను కూడ వారిలో ఒకరితో మాత్రమే యుద్ధము చేయగలను."(26)

దశరథుని అసంబద్ధప్రలాపములు వినగనే ద్విజశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధావిష్టుడయ్యెను. యజ్ఞమునందు బాగుగా హోమముచేసి, నేతిచే తడుపబడిన అగ్నివలె, విశ్వామిత్రాగ్ని ప్రజ్వలించెను.(27)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువదియవసర్గ సమాప్తము.

ఇరువదియొకటవ సర్గము

రాముని విశ్వామిత్రునితో పంపుటకై వసిష్ఠుడు దశరథునకు నచ్చజెప్పుట.



పుత్రస్నేహముచే తడబడుచున్న దశరథుని మాటలు విని, విశ్వామిత్రుడు క్రుద్ధుడై అతనితో ఇట్లనెను.(1)

"రాజా! అడిగినది ఇచ్చెద నని మొదట ప్రతిజ్ఞచేసి, ఇప్పుడు ప్రతిజ్ఞను విడువవలె ననుకొనుచున్నావు. ఇది రఘువంశరాజులు చేయవలసినది కాదు. నీకు ఇదే యుక్తమని తోచినచో నేను వచ్చినట్లే తిరిగి వెళ్ళెదను. నీవు కకుత్థ్సవంశములో పుట్టినవాడవు. చేసిన ప్రతిజ్ఞను నిలుపుకొనజాలని నీవు, బంధుసహితుడవై సుఖముగా నుండుము."(2, 3)

ధీమంతుడైన ఆ విశ్వామిత్రుడు క్రోధావిష్టుడు కాగానే, భూమియంతయు కంపించెను. దేవతలు కూడ భయపడిరి. ఉత్తమవ్రతుడు, ధీరుడు అయిన వసిష్ఠమహర్షి జగత్తు అంతయు మిక్కిలి భయపడినదను విషయమును గ్రహించి రాజుతో ఇట్లు పలికెను.(4, 5)

"రాజా! నీవు ఇక్ష్వాకువంశములో పుట్టినావు. సాక్షాత్తు అపరధర్మదేవత వంటివాడవు. ధైర్యవంతుడవు. ఉత్తమవ్రతము కలవాడవు. శ్రీమంతుడవు. నీవిట్లు ధర్మమును విడచుట తగదు. నీవు ధర్మాత్ముడ వని మూడు లోకములందును ప్రసిద్ధి పొందియున్నావు. స్వధర్మమును ఆచరింపుము. అధర్మము చేయకుము.(6, 7)

ఇట్లు చేసెదను అని మొదట చెప్పి, పిమ్మట అట్లు చేయనివానికి ఇష్టాపూర్తములు చేసిన వచ్చు పుణ్యము నశించును. కావున విశ్వామిత్రునకు యిచ్చిన మాటపై

నిలిచి రాముని అతనితో పంపుము. రాముడు అస్త్రములు నేర్చినను, నేర్వకపోయినను విశ్వామిత్రుని రక్షణములో నున్నంతవరకు, అగ్నిచే రక్షింపబడిన అమృతమునువలె, రాక్షసులు ఇతనిని ఏమియు చేయజాలరు.(8, 9)

ఈ విశ్వామిత్రుడు మూర్తీభవించిన ధర్మము. పరాక్రమవంతులలో శ్రేష్ఠుడు. ఇతడు బుద్ధిచే అందరికంటె గొప్పవాడు. తపస్సుకు గొప్ప నిధి. ఈతడు అనేకవిధములైన అస్త్రములు తెలిసినవాడు. చరాచరాత్మకములైన మూడు లోకములందును ఈతనికి తెలిసినవిధమున అస్త్రములు మరెవ్వరికిని తెలియవు. భవిష్యత్తులో కూడ ఎవ్వరును తెలుసుకొనజాలరు.(10, 11)

ఈ విశ్వామిత్రునకు తెలిసిన అస్త్రములు దేవతలకుగాని, ఋషులకుగాని, అసురులకుగాని, రాక్షసులకుగాని, గంధర్వయక్షకిన్నరమహోరగులకు గాని తెలియవు. పరమధార్మికులైన భృశాశ్వపుత్రులగు అస్త్రము లన్నియు, విశ్వామిత్రుడు పూర్వము రాజ్యము చేయుచున్నపుడు, అతనికి ఈయబడినవి.(12, 13)

భృశాశ్వునకును దక్షప్రజాపతి కుమార్తెలకును పుత్రులుగా ఉదయించిన ఆ అస్త్రములు, అనేకరూపములు కలవి. గొప్ప పరాక్రమము గలవి. కాంతి గలవి. జయమును చేకూర్చునవి. జయ, సుప్రభ అనెడు ఇరువురు దక్షప్రజాపతి కుమార్తెలు చాల ప్రకాశించు నూరు అస్త్రములను కనిరి.(14, 15)

పూర్వము, జయ, అసురసైన్యములను సంహరించుటకై ఏబది మంది పుత్రులను కనెను. వారు అప్రమేయమైన పరాక్రమము కలవారు. శ్రేష్ఠులు. స్వేచ్ఛాప్రకారము రూపములను ధరింప సమర్థులు. సుప్రభకూడ, సంహారు లను పేరుగల మరి యేబదిమంది పుత్రులను కనెను. వారు చాల బలవంతులు. ఎదిరించి జయింప శక్యముకానివారు. ఆ అస్త్రములన్నియు ఈ కుశికనందనునకు చక్కగ తెలియును. ధర్మవేత్తయగు ఈతడు క్రొత్త అస్త్రములను పుట్టించుటకు కూడ సమర్థుడు.(16–18)

దశరథమహారాజా! గొప్ప తేజస్సు, కీర్తియు గల విశ్వామిత్రు డింతటి ప్రభావశాలి. కావున రాముని పంపుట విషయమున సందేహింపకుము. విశ్వామిత్రుడు ఆ రాక్షసులను స్వయముగనే నిగ్రహింపగల్గినను, నీ కుమారునకు మేలు చేయుటకై నీ వద్దకు వచ్చి యాచించుచున్నాడు."(19, 20)

దశరథుడు వసిష్ఠుని మాటలచే ప్రసన్నమైన చిత్తము కలవాడయ్యెను.

సంతోషముతో ఆతని శరీర ముప్పొంగెను. రాముని విశ్వామిత్రునితో పంపుటకు అంగీకరించెను. (21)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది ఒకటవసర్గము సమాప్తము.

ఇరువదిరెండవ సర్గము

దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట.

వసిష్ఠుడు అట్లు పలుకగా, దశరథుడు సంతసించి, లక్ష్మణసమేతుడైన శ్రీరాముని స్వయముగ పిలుచుకొని వచ్చెను. కౌసల్యయు దశరథుడును రామునకు స్వస్త్యయనము చేసిరి. వసిష్ఠుడు మంగళకరములగు మంత్రోదకాదులతో రాముని అభిమంత్రించెను. దశరథుడు ఆ ప్రియపుత్రుని శిరస్సుపై వాసనచూచి, (ముద్దిడుకొని), చాల సంతసించిన హృదయముతో అతనిని విశ్వామిత్రున కిచ్చెను. (1-3)

కమలలోచనుడగు రాముడు విశ్వామిత్రుని అనుసరింపగనే వాయువు పరాగము లేక సుఖస్పర్శకరమై వీచెను. మహాత్ముడైన విశ్వామిత్రుడు బయలుదేరగనే గొప్ప పుష్పవర్షము కురిసెను. దేవతలు దుందుభులు మ్రోయించిరి. దశరథుని ప్రాసాదములో కూడ శంఖదుందుభిధ్వనులు మిన్నుముట్టెను. (4, 5)

విశ్వామిత్రుడు ముందు నడువగా అతని వెనుక ధనుర్ధరుడైన రాముడును, అతని వెనుక కాకపక్షధారియు (జునపములు గలవాడు), ధనుర్ధరుడును అగు లక్ష్మణుడును వెళ్లిరి. (6)

రెండేసి అమ్ములపొదులను, ధనుస్సును ధరించిన ఆ రామలక్ష్మణులు మూడేసి తలలు గల సర్పములవలె ఉండిరి. వారు నడుచుచుండగా పది దిక్కులును ప్రకాశించినవి. అట్టి అనల్పరూపవీర్యాదిసంపన్నులగు రామలక్ష్మణులు విశ్వామిత్రుని అనుసరించి వెళ్లునపుడు ఇద్దరు అశ్వినీదేవతలు బ్రహ్మదేవుని వెనుక నడిచిపోవుచున్నట్లుండెను. (7)

బాలురైన ఆ రామలక్ష్మణులు, ధనుస్సులు ధరించియుండిరి. చక్కగ



అలంకరించుకొనిరి. వ్రేళ్లకు ఉడుముతోలుతో చేసిన తొడుగులను ధరించిరి. ఖడ్గములు ధరించి యుండిరి. గొప్ప కాంతితో ప్రకాశించుచుండిరి. చక్కని ఆకారముతో, ఒప్పారుచు ఎట్టి దోషములును లేక యుండిరి. అపూర్వసౌందర్యముతో అగ్నినుండి జనించిన స్కందవిశాఖులు అచింత్యప్రభావుడగు ఈశ్వరుని అనుసరించి అతనిని ప్రకాశింపచేసి నట్లు, వారు విశ్వామిత్రుని అనుసరించి వెళ్ళుచు అతనిని ప్రకాశింపచేసిరి.(8-10)

ఒకటిన్నర యోజనముల దూరము నడచి సరయూదక్షిణతీరము చేరిన పిమ్మట విశ్వామిత్రుడు, "రామా!" అని మధురముగ పిలిచి ఇట్లనెను.(11)

"వత్సా! ఆచమనము చేయుము. మంత్రముల సముదాయమును, బల, అతిబల అనెడు విద్యలను ఇచ్చెదను, తీసికొనుము. ఈ విద్యలు గ్రహించినచో,నీకు శ్రమకాని, జ్వరముకాని, రూపములో మార్పుగాని కలుగదు. నీవు నిద్రపోవుచున్నను, ఏమరి యున్నను రాక్షసులు నిన్నేమియు చేయజాలరు.(12, 13)

బాహువీర్యములో నీతో సమానుడు(ఇప్పటికే) ఈ పృథివిలో ఎవ్వడును లేడు.(ఈ విద్యలు స్వీకరించినచో) నీతో సమానుడు మూడు లోకములలో కూడ ఉండబోడు. సౌందర్యమునందుగాని, సామర్థ్యమునందుగాని, జ్ఞానమునందుగాని, బుద్ధిచే నిశ్చయింపవలసినపుడుగాని, సమాధానము చెప్పవలసినపుడుగాని నీకు సరివచ్చువాడు ఈ లోకములో ఉండడు.(14, 15)

ఈ విద్యాద్వయము లభించిన పిమ్మట నీకు సముడు ఇపుడు లేడు. భవిష్యత్తులో



కూడ ఉండదు. ఈ బల, అతిబల విద్యలు సకలజ్ఞానమును కలుగజేయును. నీవు మార్గమునందు ఈ బలాతిబలలను జపించినచో నీకు ఆకలిదప్పికలు కలుగవు. ఈ విద్యాద్వయమును జపించినచో నీకు సాటి లేని కీర్తికూడ లభించును. ధార్మికుడవైన ఓ రామా! తేజోవంతములైన ఈ విద్యలు బ్రహ్మదేవుని పుత్రికలు. వీటిని గ్రహించుటకు నీవే తగినవాడవు.(16-18)

ఉత్తమగుణము లన్నియు నీయందు అధికముగా నున్నవి. సందేహములేదు. ఈ విద్యలను తపస్సుచే పోషించినచో వివిధ ఫలములను ఇవ్వగలవు."(19)

రాముడు ఆచమనము చేసి, శుచియై ఆనందముచే ముఖము వికసించగా పరిశుద్ధమనస్కుడైన ఆ మహర్షినుండి ఆ రెండు విద్యలను స్వీకరించెను.(20)


అధికపరాక్రమశాలియగు రాముడు విద్యలను గ్రహించిన పిమ్మట, విశ్వామిత్రుని విషయమున మంత్రాచార్యుని విషయమున ప్రవర్తించవలసిన విధముగ ప్రవర్తించుచు, శరత్కాలమునందు సూర్యుడువలె ప్రకాశించెను. వారు ముగ్గురును ఆ రాత్రి సరయూతీరమున సుఖముగా నివాసము చేసిరి.(21, 22)

రామలక్ష్మణులు పూర్వ మెన్నడును అలవాటు లేని తృణశయనముపై (గడ్డి పరుచుకుని చేసుకున్న పక్కపైన) కలిసి శయనించిరి. విశ్వామిత్రుని బుజ్జగింపు మాటలచే వారికి ఆ రాత్రి కూడ సుఖముగానే ఉండెను.(23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది రెండవసర్గము సమాప్తము.

ఇరువది మూడవ సర్గము

రామలక్ష్మణసమేతుడైన విశ్వామిత్రుడు కామాశ్రమమున రాత్రి విశ్రమించుట.



రాత్రి గడిచి తెల్లవారుచున్నది. అపుడు విశ్వామిత్రమహర్షి పర్ణశయనముపై శయనించియున్న రామలక్ష్మణులతో ఇట్లు పలికెను. (1)


"కౌసల్యాసత్పుత్రుడవైన ఓ రామా! ప్రాతఃకాలసంధ్య వచ్చినది. ఓ నరశ్రేష్ఠుడా! లెమ్ము. సంధ్యావందనాదినిత్యకర్మలు చేయవలసియున్నది."(2)

రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఆ మధురవాక్యము విని, లేచి, స్నానము చేసి, సూర్యునకు అర్ఘ్యప్రదానము చేసి, అత్యుత్తమమగు గాయత్రీమంత్రమును జపించిరి. సంధ్యావందనాది నిత్యకర్మలను పూర్తిచేసికొని, విశ్వామిత్రమహర్షికి నమస్కరించి, ఉత్సాహముతో ప్రయాణోన్ముఖు లయిరి. (3, 4)

వారు కొంతదూరము ప్రయాణము చేసిన పిమ్మట పవిత్రమగు సరయూనదీ సంగమస్థానమునందు గంగానదిని చూచిరి. (5)

అచట కొన్నివేల సంవత్సరములనుండి గొప్ప తపస్సు చేయుచున్నవారు, శ్రేష్ఠమైన తేజస్సుగలవారు అయిన ఋషుల ఆశ్రమమును చూచిరి. ఆ పుణ్యాశ్రమమును చూడగనే సంతుష్టాంతరంగులైన రామలక్ష్మణులు విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి. (6, 7)

"ఓ పూజ్యుడా! పవిత్రమైన ఈ ఆశ్రమము ఎవ్వనిది? దీనిలో ఎవ్వడు



నివసించుచున్నాడు? మాకు విన వేడుకగా నున్నది."(8)

వారి మాటలు విని, విశ్వామిత్రుడు నవ్వి, "పూర్వము ఈ ఆశ్రమమెవ్వరిదో చెప్పెదను, వినుడు." అని పలికెను.(9)

"మన్మథుడు మూర్తిమంతుడై (శరీరము కలిగినవాడై) ఉండెడివాడు. అతనికి కాముడు అని పేరు. నియమముచే సమాహితచిత్తుడై ఇచట తపస్సు ఆచరించి, వివాహము చేసికొని దేవతాసమేతుడై వెళ్ళుచున్నవాడు, సకలదేవతలకు ప్రభువు అయిన శివుని దుష్టబుద్ధియగు ఆ మన్మథుడు ఎదిరించెను. అపుడు శివుడు హుంకరించి కోపముగా చూచెను.(10, 11)

శివుని నేత్రముచే కాల్చివేయబడిన ఆ దుర్మతి అవయవము లన్నియు అతని శరీరమునుండి జారిపోయినవి. శివునిచే కాల్చివేయబడిన మన్మథుని శరీరము నశించినది. ఈవిధముగ శివుడు కోపించి మన్మథుని శరీరము లేనివానినిగా చేసెను. అది మొదలు మన్మథునికి అనంగు డని ప్రసిద్ధి వచ్చినది. అతడు దేహమును(అంగమును) విడచిన దేశమునకు అంగదేశ మని పేరు వచ్చినది.(12-14)

ఇది శివుడు తపస్సు చేసిన పుణ్యమైన ఆశ్రమము. ఈ మునులందరును పూర్వము, అనగా శివుడు ఇచట నున్నపుడు, ఆ శివుని శిష్యులుగా నుండెడివారు. వీరు ధర్మపరాయణులు. వీరికి పాపము అనునది లేదు.(15)

రామా! ఈ రాత్రి పవిత్రములైన గంగా సరయూనదుల మధ్య ఇచటనే ఉండి రేపు గంగానదిని దాటెదము. మనమందరము స్నానజపహోమాదులు చేసుకుని పరిశుద్ధులమై ఈ పుణ్యాశ్రమమును ప్రవేశించెదము."(16, 17)

రామలక్ష్మణవిశ్వామిత్రులు ఇట్లు మాటలాడుచుండగా, ఆ ఆశ్రమములోని మునులు తపస్సుచే ఎంత దూరమైనను ప్రసరించు దృష్టిచే (జ్ఞానముచే) వీరు వచ్చుచున్నట్లు తెలుసుకుని చాల సంతసించినవారై ఆనందమును పొందిరి.(18)

వారు ముందుగా విశ్వామిత్రునకు అర్ఘ్యపాద్యములను, ఆతిథ్యమును సమర్పించి, పిమ్మట రామలక్ష్మణులకు అతిథిసత్కారము చేసిరి.(19)

రామలక్ష్మణవిశ్వామిత్రులు వారినుండి సత్కారములు గైకొనిరి. పిదప ఆ ఋషులందరును ఏకాగ్రచిత్తులై తగు విధమున సంధ్యోపాసన చేసిరి.(20)

ఆ ఆశ్రమములో నివసించు సువ్రతు లగు మునులు రామలక్ష్మణ విశ్వామిత్రులను తమతో ఆశ్రమములోనికి తీసికొనివెళ్లిరి. వారు అచట సుఖముగా నివసించిరి.(21)

విశ్వామిత్రమహాముని, మనోహరు లగు ఆ రాజకుమారులకు మనోహరము లగు కథలు చెప్పుచు వారిని ఆనందింపచేసెను.(22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది మూడవసర్గము సమాప్తము.

ఇరువదినాల్గవ సర్గము

తాటకను చంపుమని విశ్వామిత్రుడు రాముని ఆదేశించుట.

రామలక్ష్మణులు పవిత్రమైన ప్రాతఃకాలమునందు ప్రాతఃకాలకృత్యములు తీర్చుకొనిరి. ప్రయాణమునకు సిద్ధముగా ఉన్న విశ్వామిత్రుడు బయలుదేరి ముందు నడువగా ఆ సోదరులు ఆతనిని అనుసరించి గంగానదీతీరము చేరిరి.(1)

తీవ్రవతపశ్చర్యగల మహాత్ములైన ఆ మునులందరును మంగళకరమైన నావ నొకదానిని తీసికొనివచ్చి విశ్వామిత్రునితో,(2)

"రామలక్ష్మణులను వెంటబెట్టుకొని నీవు నావను అధిరోహింపుము. శుభముగా, కాలవిలంబము జరుగకుండగా ప్రయాణము చేయుము." అని పలికిరి.(3)

విశ్వామిత్రుడు 'అలాగే' అని చెప్పి, ఆ ఋషీశ్వరులను పూజించి, రామలక్ష్మణులతో గంగానదిని దాటెను. నదీమధ్యమున చేరిన పిమ్మట రామలక్ష్మణులు మిక్కిలి వేగముచే వృద్ధిపొందింపబడిన ఒక శబ్దమును వినిరి.(4, 5)

నదీమధ్యమున రాముడు, "నీరు బ్రద్దలగుచున్నట్లు గంభీరమైన ధ్వని వచ్చుచున్నది, ఇది ఏమి?" అని విశ్వామిత్రుని ప్రశ్నించెను.(6)

వేడుకతో కూడిన రాముని ప్రశ్నను విని విశ్వామిత్రుడు ఆ శబ్దము ఎందుకు వచ్చుచున్నదో విశదీకరించెను.(7)

"రామా! బ్రహ్మదేవుడు కైలాసపర్వతముపై తన మనఃసంకల్పమాత్రముచే ఒక సరస్సును నిర్మించెను. మనస్సుచే నిర్మింపబడుటచే దానికి మానస మని పేరు.(8)

ఆ సరస్సునుండి పుట్టినదే సరయూ నది. సరస్సునుండి పుట్టుటచే దానికి ఆ పేరు వచ్చినది. ఆ నది అయోధ్యను చుట్టి ఉన్నది. బ్రహ్మ సృజించిన మానససరస్సునుండి జనించిన దగుటచే ఆ నది చాల పవిత్రమైనది.(9)

ఆ నది యిక్కడ గంగలో ప్రవేశించుచున్నది. ఈ గంభీరధ్వని (రెండు నదుల) జలసంక్షోభము వలన కలిగినది. రామా! శ్రద్ధాభక్తియుక్తుడవై ఈ నదీద్వయసంగమమునకు నమస్కారము చేయుము.(10)

అతిధార్మికులైన రామలక్ష్మణులు ఆ రెండు నదులకును నమస్కారము చేసిరి. గంగానది దక్షిణతీరమును చేరి శీఘ్రగమనముతో ప్రయాణము చేసిరి.(11)

అచట మానవసంచారము లేనిది, భయంకరమైనది అగు ఒక అరణ్యమును చూచి రాముడు విశ్వామిత్రుని ఇట్లు ప్రశ్నించెను.(12)

"ఈ వనము ప్రవేశింప శక్యము కాక ఉన్నది. ఈలపురుగుల రొదచే ధ్వనింప చేయబడినది. భయంకరములైన ఘాతుకమృగములతోను, భయమును కలిగించునట్లు కూయుచున్న భాసపక్షులతోను నిండియున్నది. ఈ వనమునందు అతిభయంకరమైన స్వరములతో కూయుచున్న అనేకవిధములైన పక్షులు, సింహములు, పెద్దపులులు, అడవిపందులు, ఏనుగులు సంచరించుచున్నవి.(13, 14)

ఇది చంద్ర, ఇనుమద్ది, ఏరుమద్ది, మారేడు, తుమ్మికి, కలిగొట్టు, రేగుచెట్లతో దట్టముగ నున్నది. ఈ భయంకరమైన వనము ఏమి?"(15)

మహాతేజశ్శాలియైన విశ్వామిత్రమహాముని రామునితో, "వత్సా! రామా! భయంకరమైన ఈ వనము ఎవ్వరిదో చెప్పెదను. వినుము." అనుచు ఇట్లు చెప్పెను.(16)

"దేవతలు నిర్మించిన మలదము, కరూశము అనెడు రెండు విశాలములైన, సమృద్ధములైన దేశములు ఈ ప్రాంతమునందు ఉండెడివి.(17)

పూర్వము ఇంద్రుడు వృత్రాసురుని చంపుటచే ఆతనిని బ్రహ్మహత్యాపాపము ఆవహించెను. అపుడాతనిని అశుచిత్వము, ఆకలి పీడింపదొడగినవి. దేవతలును, తపశ్శాలులగు మహర్షులును ఆ ఇంద్రుని తీర్థోదకములచేతను, కలశములలో అభిమంత్రించిన ఉదకములచేతను స్నానము చేయించి అతని అశుచిత్వమును తొలగించిరి. మహేంద్రుని శరీరమున కున్న అశుచిత్వమును, ఆతని ఆకలిని ఈ ప్రదేశమునకు ఇచ్చివేసి సంతోషించిరి.(18–20)

అశుచిత్వము, ఆకలి తొలగిపోయి శుచియైన పిమ్మట సర్వసమర్థుడగు ఇంద్రుడు ఈ దేశము విషయమున చాల సంతోషించినవాడై ఒక వర మిచ్చెను.(21)

"నా శరీరమునందలి అశుచిత్వమును, ఆకలిని గైకొనిన ఈ దేశములు, సర్వసమృద్ధములై మలదము, కరూశము అను పేర్లతో లోకమున ఖ్యాతిని పొందగలవు."(22)

ధీమంతుడగు దేవేంద్రుడు ఆ దేశములకు చేసిన గౌరవమును చూచి దేవతలు "బాగున్నది. బాగున్నది." అని అనుచు దేవేంద్రుని మెచ్చుకొనిరి.(23)

విశాలములైన ఈ మలదకరూశదేశములు చాలకాలము ధనధాన్యసమృద్ధములై ఉండెడివి.(24)

కొంతకాలమునకు స్వేచ్ఛారూపధారిణి యగు ఒక యక్షిణి ఆవిర్భవించినది. ఆమెకు వేయి ఏనుగుల బల మున్నది. ఆమె ధీమంతుడైన సుందుని భార్య. ఇంద్రునితో సమానమైన పరాక్రమము గల మారీచు డనే రాక్షసుడు ఆమె కుమారుడు.(25, 26)

ఆ మారీచుని బాహువులు బలిసి వున్నవి. అతడు గొప్ప పరాక్రమము కలవాడు. విశాలమైన ముఖము శరీరము కలవాడు. గొప్ప ప్రమాణము కలవాడు. భయంకరాకారుడు. అట్టి మారీచుడు ఎల్లప్పుడును ప్రజలను బాధించుచున్నాడు.(27)

రామా! దుర్మార్గురాలగు తాటక నిత్యము ఈ మలదకరూశదేశములను నశింప చేయుచున్నది. ఆమె ఈ మార్గమును అడ్డగించి, ఒకటిన్నర ఆమడల దూరములో నివసించుచున్నది. ఇది తాటక వనము కావున ఈ వనములోనికి ఎవ్వరును పోజాలరు. నీ బాహుబలముచే ఈ దుర్మార్గురాలిని వధింపుము. నా ఆజ్ఞను పాలించి ఈ దేశమును మరల ఏ బాధలు లేనిదానినిగా చేయుము.(28–30)



రామా! ఎవ్వరును ఎదిరింపలేని క్రూరురాలైన తాటకచే ఈ వనమంతయు పాడుపడినట్లు చేయబడినది. ఎవ్వడును ఈ ప్రదేశమునకు రాజాలడు.(31)

తాటక ఈ వనమును ఏవిధముగ పాడుబరచి భయంకరమగునట్లు చేసినదో, ఈ వనము నింకను ఎట్లు విడువకున్నదో అంతయు నీకు చెప్పినాను."(32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది నాల్గవసర్గ సమాప్తము.

ఇరువది ఐదవ సర్గము

తాటకను సంహరింపుమని విశ్వామిత్రుడు మరల చెప్పుట.

అమేయప్రభావు డగు విశ్వామిత్రుని ఉత్తమములగు మాటలు విని పురుషశ్రేష్ఠుడైన రాముడు శుభమైన వాక్కు పలికెను.(1)

"ఓ మునిపుంగవా! యక్షులు అల్పపరాక్రమవంతు లని వినుచుందుము కదా! ఈ అబలకు నాగసహస్రబలము(వెయ్యి ఏనుగుల బలము) ఎట్లు వచ్చినది?"(2)

విశ్వామిత్రుడు ఇట్లు చెప్పెను. "రామా! ఆ అబల ఏ కారణముచేత అంత గొప్ప బలము పొందినదో వినుము. ఆమె వరదానమువలన లభించిన వీర్యమును, బలమును ధరించుచున్నది.(3)

పూర్వము సుకేతువు అను పరాక్రమవంతుడగు గొప్ప యక్షుడొక డుండెను. సంతానము లేకపోవుటచే, అతడు సదాచారవంతుడై గొప్ప తపస్సు చేసెను. బ్రహ్మదేవుడు అతని తపస్సునకు చాల సంతోషించి, ఆ యక్షాధిపతికి తాటక అను కన్యారత్నమును ప్రసాదించెను. బ్రహ్మదేవుడు ఆ తాటకకు వేయి ఏనుగుల బలము ఇచ్చినాడు కాని, ఆ సుకేతునకు పుత్రుని మాత్రము ఇవ్వలేదు.(4-6)

సహస్రనాగబలముతో జనించిన ఆ తాటక పెరిగి, రూపయౌవనములతో ప్రకాశించుచుండెను. సుకేతువు ఆమెను ఝర్ఝుని పుత్రుడైన సుందున కిచ్చి వివాహము చేసెను. కొంతకాలమునకు ఆ తాటక మారీచు డనే మహాబలవంతుడగు కుమారుని కనెను. అతడు శాపవశముచేత రాక్షసుడయ్యెను.(7, 8)

అగస్త్యుడు సుందుని శపించి చంపగా, తాటకయు మారీచుడును ఆ ఋషిశ్రేష్ఠుని ఎదిరించుటకై ప్రయత్నించిరి. ఆమె గర్జించుచు అగస్త్యుని భక్షించుటకై వెళ్లెను. భగవంతుడైన అగస్త్యుడు చాల కోపించి, "నీవు ఈ రూపమును విడిచి భయంకరమైన ముఖము కలదానివై మనుష్యులను భక్షించు మహాయక్షిణివి అగుదువు గాక! నీకు అతి భయంకరమైన రూపము కలుగు గాక!" అని శపించెను. మారీచుని, "నీవు రాక్షసుడవు అగుదువు గాక!" అని శపించెను.(9-12)

ఈ శాపముచే తాటకకు కోపము కలిగినది. అత్యధికమైన కోపముతో ఈమె పూర్వము అగస్త్యుడు సంచరించిన ఈ దేశమును నశింపచేయుచున్నది.(13)

రామా! దుర్మార్గురాలు, క్రూరురాలు, దుష్టపరాక్రమవంతురాలు అగు ఈ యక్షిణిని గోబ్రాహ్మణుల హితముకొరకై సంహరించుము. నీవు తప్ప, మూడు లోకములలో మరెవ్వడును శాపగ్రస్తురాలైన ఈమెను చంపుటకు సమర్థుడు కాడు.(14, 15)

ఓ నరశ్రేష్ఠుడా! స్త్రీని వధించుటయా అని సంకోచింపకుము. రాజకుమారుడు చాతుర్వర్ణ్యమువారి హితముకొరకై ఏ పనియైనను చేయవలయును. ధర్మాత్ముడైన రాజు, ప్రజారక్షణకొరకై ఉపయోగించు కార్యము క్రూరమైనను కాకపోయినను, పాపమైనను దోషములతో కూడిన దైనను చేయవలసినదే. ఇది రాజ్యపాలనభారమును వహించువారు పాటించవలసిన అతి ప్రాచీనమైన ధర్మము. ధర్మవిరుద్ధమైన ప్రవర్తన గల ఈమెను సంహరించుము. ఈమెయందు ధర్మ మనునదియే లేదు కదా!(16-18)

పూర్వము విరోచనుని కుమార్తె యగు మంథర భూమిని చంపగోరినప్పుడు

దేవేంద్రుడు ఆమెను చంపెనని వినుచున్నాము కదా?(19)

పూర్వము విష్ణువుకూడ లోకకల్యాణము కొరకు స్త్రీవధ చేసెను. లోకములో ఇంద్రుడు ఉండకూడ దను కోరికతో తీవ్రవ్రతము నాచరించుచున్న శుక్రాచార్యుని తల్లి యగు భృగుమహర్షి భార్యను విష్ణువు చంపెను.(20)

రాజపుత్రా! మహాత్ములైన వీరును, ఇంకను ఎందరో పురుషశ్రేష్ఠులును ధర్మవిరుద్ధముగ ప్రవర్తించు స్త్రీలను చంపినారు."(21)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది ఐదవసర్గము సమాప్తము.

ఇరువది ఆరవ సర్గము

రాముడు తాటకను సంహరించుట.

ఇట్లు నిశ్చయపూర్వకముగ విశ్వామిత్రుడు పలికిన మాటలు విని దృఢమైన నియమము కలవాడును, రాజశ్రేష్ఠుని కుమారుడు అయిన రాముడు అంజలి ఘటించి ఇట్లనెను.(1)

"మహామునీ! మా తండ్రిగారి ఆజ్ఞవలనను, ఆయన మాటయందు నాకున్న గౌరవమువలనను, నీ ఆదేశమువలనను నాకు ఈ కార్యము నిస్సందేహముగ చేయదగినదే.(2)

అయోధ్యానగరములో వసిష్ఠాదిగురుజనుల మధ్య మహాత్ముడైన మా తండ్రి దశరథమహారాజు, "విశ్వామిత్రుడు చెప్పినట్లు చేయుము." అని నన్ను ఆజ్ఞాపించినాడు. ఆయన మాటను ఉల్లంఘింపరాదు కదా?(3)

నేను తండ్రిగారి ఆజ్ఞప్రకారమును, బ్రహ్మవాది వైన నీ మాట పాటించియు తప్పక తాటకను సంహరించెదను. గోబ్రాహ్మణుల సుఖముకొరకును ఈ దేశము యొక్క సుఖముకొరకును, అప్రమేయప్రభావశాలివగు నీ ఆజ్ఞప్రకారము చేయుటకు సిద్ధముగా నున్నాను."(4, 5)

శత్రుసంహారకుడగు రాముడు ఈవిధముగ పలికి, పిడికిలితో ధనుర్మధ్యమునందు గట్టిగా పట్టి, దిక్కులు ప్రతిధ్వనించునట్లు తీవ్రమైన టంకారధ్వనిని



చేసెను.(6)

తాటకావనములో అన్ని ప్రాణులును ఆ ధ్వనికి భయపడినవి. తాటకకూడ ఆ శబ్దముచేత మిక్కిలి కోపించి దిగ్భ్రాంతి చెందెను. ఆ శబ్దము వినగనే కోపావిష్టురాలైన తాటక, క్షణకాల మాలోచించి ఆ శబ్దము వచ్చినవైపు శీఘ్రముగ పరుగెత్తెను.(7, 8)

వికారముగా ఉన్న ముఖముతో, పెద్ద దేహముతో నున్నది, మిక్కిలి కోపించినది అగు ఆమెను చూచి రాముడు లక్ష్మణునితో ఇట్లనెను.(9)

"లక్ష్మణా! ఈ యక్షిణి ఆకారము ఎంత భయంకరముగను, క్రూరముగను ఉన్నదో చూడుము. ఈమెను చూడగనే పిరికివాళ్ల గుండెలు పగిలిపోవును.(10)

మాయాబలముచే ఎదిరింప శక్యముకాక ఉన్న ఈమెను, చెవులును నాసాగ్రమును ఖండించి వెనుకకు మరలిపోవునట్లు చేసెదను. చూడుము.(11)

ఆడుదగుటయే ఈమెను రక్షించుచున్నది. ఈమెను చంపుటకు యత్నింపక ఈమె పరాక్రమమును, గమనశక్తిని నశింపచేయవలెనని అనుకొనుచున్నాను."(12)

రాముడు ఇట్లు పలుకుచుండగనే తాటక క్రోధావిష్టురాలై, చేతులు ఎత్తి, గర్జించుచు, రామునిమీదకు పరుగెత్తెను.(13)

బ్రహ్మర్షియైన విశ్వామిత్రుడు హుంకారముచేత ఆమెను అదలించి, "రామలక్ష్మణులకు స్వస్తి అగుగాక. వారికి జయము కలుగుగాక." అని పలికెను.(14)



తాటక భయంకరమైన పరాగమును చిమ్ముచు రామలక్ష్మణులకు క్షణకాలము పాటు ఆ పరాగములో ఏమియు తోచకుండ చేసెను. పిమ్మట మాయాప్రభావముచే రామలక్ష్మణులపై గొప్ప శిలావర్షమును కురిపించెను. దానితో రామునకు కోపము వచ్చెను.(15, 16)

ఆమె కురిపించిన శిలావర్షమును రాముడు తన బాణవర్షముచేత వారించెను. అయిననూ ఆమె తన మీదికి వచ్చుచుండగా ఆమె హస్తములను బాణములచే ఛేదించెను. చేతులు తెగి, అలసిపోయి తమ సమీపమునందు గర్జించుచున్న ఆ తాటక చెవులను, ముక్కును లక్ష్మణుడు క్రోధముతో ఛేదించివేసెను.(17, 18)

ఇష్టము వచ్చిన రూపములను ధరింప గల ఆ తాటక అనేకవిధములైన రూపములను ధరించుచు, రాళ్లవాన కురిపించుచు అతిభయంకరముగ సంచరించెను.(19)

నలువైపులనుండి రాళ్లవానచే కొట్టబడుచున్న ఆ రామలక్ష్మణులను చూచి విశ్వామిత్రుడు ఇట్లు పలికెను.(20)

"రామా! ఈమెపై జాలి చూపకుము. యజ్ఞములకు విఘ్నము చేయు పాపాత్మురాలు, దుర్మార్గురాలు అయిన ఈ యక్షిణి మాయాబలముచే వృద్ధిపొందగలదు. సంధ్యాకాలము రాబోవుచున్నది. ఈ లోపుగనే ఈమెను చంపివేయుము. సంధ్యాకాలమునందు రాక్షసులను ఎదిరింప శక్యముకాదు." విశ్వామిత్రుడు ఇట్లు చెప్పుచున్ననూ రాముడు తన శబ్దవేధిత్వ సామర్థ్యము ప్రదర్శించుచు తాటక కురిపించుచున్న రాళ్ళ వర్షమును ఆపెను.(21-23)

మాయాబలము గల ఆ తాటక బాణజాలముచే అడ్డుకొనబడినదైనను గర్జించుచు రామలక్ష్మణుల మీదికి పరుగెత్తికొని వచ్చెను. పరాక్రమము చూపుచు పిడుగువలె వేగముగ వచ్చి మీద పడుచున్న ఆమె వక్షఃస్థలముపై రాముడు బాణము ప్రయోగించెను. ఆ శరాఘాతమునకు ఆమె క్రిందపడి చనిపోయెను.(24, 25)

భయంకరురాలైన ఆ తాటక మరణమును చూచి దేవతలును, దేవేంద్రుడును, "బాగు బాగు." అని రాముని ప్రశంసించిరి. సహస్రాక్షుడైన దేవేంద్రుడు,

దేవతలందరును కూడ సంతసించి విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి.(26, 27)

"విశ్వామిత్రమహర్షీ! ఈ పనిచేత సకలదేవతలును, ఇంద్రుడును చాల సంతోషించినారు. నీవు రామునియందు ప్రేమను చూపుము. ప్రజాపతియైన భృశాశ్వుని పుత్రులును, సత్యమైన పరాక్రమము కలవియు, తపోబలముచే పోషింపబడినవియు అగు అస్త్రములను రామునకు ఉపదేశింపుము.(28, 29)

ఓ విశ్వామిత్రా! భక్తితో, స్థిరచిత్తముతో నిన్ను అనుసరించి వచ్చుచున్న ఈ రాముడు అస్త్రములను ఉపదేశించుటకు తగిన సత్పాత్రము. ఈతడు గొప్ప దేవకార్యమును చేయవలసి యున్నది."(30)

ఈ విధముగ పలికి, దేవతలందరును సంతసించినవారై, విశ్వామిత్రుని పూజించి తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. పిమ్మట సంధ్యాసమయ మయ్యెను.(31)

తాటకాసంహారముచే సంతోషించిన విశ్వామిత్రుడు రాముని శిరస్సుపై వాసన చూచి ఇట్లు పలికెను.(32)

"రామా! ఈ రాత్రి ఇచటనే నివసించి రేపు ప్రాతఃకాలమున నా ఆశ్రమమునకు వెళ్లెదము."(33)

రాముడు విశ్వామిత్రుని మాటలు విని సంతోషించి, ఆ రాత్రి తాటకావనములో సుఖముగా నివసించెను. ఆ వనముకూడ, శాపమునుండి విముక్తమై కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథమువలె సుందరమై ప్రకాశించెను.(34, 35)

రాముడు తాటకను చంపి దేవతలు, సిద్ధులు మొదలగువారిచే ప్రశంసింపబడుచు, విశ్వామిత్రునితో ఆ రాత్రి ఆ వనమునందే వసించెను. ప్రభాతసమయమున విశ్వామిత్రుడు అతనిని మేల్కొలిపెను.(36)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది ఆరవసర్గ సమాప్తము.

ఇరువది ఏడవ సర్గము

విశ్వామిత్రుడు రామునకు దివ్యాస్త్రములు ఉపదేశించుట.

విశ్వామిత్రుడు ఆ రాత్రి అచట నివసించి, మరునాడు చిరునవ్వు నవ్వుచు రామునితో మధురముగ ఇట్లనెను.(1)

"రామా! నాకు చాలా సంతోషము కలిగినది. నీకు ప్రేమపూర్వకముగా గొప్ప అస్త్రములను పూర్తిగ ఇచ్చెదను. దేవ - అసుర - గంధర్వ - ఉరగాదులు ఎవ్వరు శత్రువులుగా వచ్చినను యుద్ధరంగమునందు ఈ దివ్యాస్త్రముల సాహాయ్యముచే నీవు వారిని బలాత్కారముగ వశము చేసికొని జయింపగలవు.(2, 3)

నీకు ధర్మచక్ర - కాలచక్ర - విష్ణుచక్రములను, అత్యుగ్రమైన ఐంద్రాస్త్రమును, వజ్రాస్త్రమును, శివుని శ్రేష్ఠమైన శూలమును, బ్రహ్మశిరోస్త్రమును, ఐషీకాస్త్రమును, అత్యుత్తమమైన బ్రహ్మాస్త్రమును ఇచ్చెదను.(4-6)

మోదకి, శిఖరి అనెడు ప్రజ్వరిల్లుచున్న రెండు గదలను, ధర్మపాశమును, కాలపాశమును, వారుణపాశమును, గొప్పదైన వారుణాస్త్రమును, శుష్కము, ఆర్ద్రము అనెడు రెండు పిడుగులను, పైనాకాస్త్రమును, నారాయణాస్త్రమును, శిఖర మను పేరుగలదియు, అగ్నికి చాల ఇష్టమైనదియు అగు ఆగ్నేయాస్త్రమును, ప్రథనమను పేరుగల వాయవ్యాస్త్రమును, హయశిరస్సు అను అస్త్రమును, క్రౌంచాస్త్రమును, రెండు శక్తులను ఇచ్చెదను.(7-11)

అసురులు ధరించు కంకాళము, కపాలము, కంకణము అను ముసలములను గూడ పూర్తిగ ఇచ్చెదను.(12)

వైద్యాధర మనెడు మహాస్త్రమును, నందన మనెడు శ్రేష్ఠమైన ఖడ్గమును, నిద్ర కలిగించునదియు, నిద్ర తొలగించునదియు అగు గాంధర్వమానవాస్త్రములను, సౌరాస్త్రమును ఇచ్చెదను.(13, 14)

రామా! దర్పణ - శోషణ - సంతాపన - విలాపనాస్త్రములను, మన్మథునకు ఇష్టమైనదియు, ఎదిరింప రానిదియు అగు మదనాస్త్రమును, పిశాచములకు సంబంధించినదియు, వారికి ఇష్టమైనదియు అగు మోహనాస్త్రమును గ్రహింపుము.(15, 16)

తామస - సౌమనాస్త్రములను, ఎదిరింప శక్యముకాని సంవర్తాస్త్రమును,



మౌసలాస్త్రమును, సత్యాస్త్రమును, మాయాధరాస్త్రమును, ఇతరుల తేజస్సును ఆకర్షించు ఘోరమైన తేజఃప్రభాస్త్రమును, సోమదేవతాకమైన శిశిరాస్త్రమును, త్వష్టృదేవతాకమైన సుదామనాస్త్రమును, భగుని దారుణమైన శీతేషువు(బాణము)ను, మరియు మానవాస్త్రమును గ్రహింపుము.(17-19)

ఇష్టము వచ్చిన రూపములు ధరింపగలవియు, చాల గొప్పవియు, విశేషమైన బలము కలవియు అగు ఈ అస్త్రములను వెంటనే గ్రహింపుము."(20)

అపుడు మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు శుచియై ప్రసన్నచిత్తుడై, పూర్వాభిముఖుడై అత్యుత్తమమగు అస్త్రసముదాయమును రాముని కిచ్చెను.(21)

ఏ అస్త్రములను సాంగోపాంగములుగను, పరిపూర్ణముగను స్వీకరించుట అనునది దేవతలకు కూడ దుర్లభమో అట్టి అస్త్రములను విశ్వామిత్రుడు రామునకు ఇచ్చెను.(22)

ధీమంతుడైన ఆ విశ్వామిత్రుడు జపించుచుండగా, పూజనీయములైన అస్త్రము లన్నియు రాముని సేవించినవి. పరమోదారు లైన ఆ అస్త్రదేవత లందరును అపుడు నమస్కరించుచు, "రామా! మేమందరము నీ కింకరులము." అని పలికిరి.(23, 24)

రాముడు ఆ అస్త్రములను స్వీకరించి, హస్తముచే ఆ అస్త్రదేవతలను స్పృశించి, "మీరందరూ నా మనస్సులో సంచరించుచుందురుగాక." అని ఆ దేవతలను ఆజ్ఞాపించెను.(25)

అటుపిమ్మట మహాతేజఃశాలియగు రాముడు సంతోషించి విశ్వామిత్రమహర్షికి నమస్కరించి ప్రయాణ మయ్యెను. (26)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది యేడవసర్గము సమాప్తము.

ఇరువది ఎనిమిదవ సర్గము

విశ్వామిత్రుడు రామునకు అస్త్రముల ఉపసంహారము ఉపదేశించుట.

రాముడు పవిత్రుడై అస్త్రములను గ్రహించి, ఆనందించి, నడచి వెళ్లుచునే విశ్వామిత్రునితో ఇట్లనెను. (1)

"పూజ్యుడా! అస్త్రములను స్వీకరించి ఇపుడు నేను దేవతలకుగూడ ఎదిరింపశక్యము కానివాడ నైతిని. మునిశ్రేష్ఠా! నీవు ఉపదేశించిన అస్త్రముల ఉపసంహారమును కూడ తెలిసికొనగోరుచున్నాను." (2)

రాముని మాటలను అంగీకరించి విశ్వామిత్రమహర్షి అస్త్రముల ఉపసంహారమును కూడ ఉపదేశించెను. (3)

"రామా! భృశాశ్వుని కుమారులును, ప్రకాశించునవియు, కామరూపము కలవియు అగు సత్యవంతము, సత్యకీర్తి, ధృష్టము, రభసము, ప్రతిహారతరము, పరాఙ్ముఖము, అవాఙ్ముఖము, లక్షాక్షము, విషమము, దృఢనాభము, దశాక్షము, శతవక్త్రము, దశశీర్షము, శతోదరము, పద్మనాభము, మహానాభము, దుందునాభము, సునాభము, జ్యోతిషము, కృశనము, నైరాశ్యము, విమలము, యోగంధరము, హరిద్రము, దైత్యము, ప్రశమనము, సార్చిర్మాలి, ధృతి, మాలి, వృత్తిమంతము, రుచిరము, పితృసౌమనసము, విధూతము, మకరము, కరవీరకరము, ధనము, ధాన్యము, కామరూపము, కామరుచి, మోహము, ఆవరణము, జృంభకము, సర్వనాభము, సంతానము, వరణము అను అస్త్రములను నా వద్దనుండి స్వీకరించుము. నీవు సత్పాత్ర మైనవాడవు." (4-10)

రాముడు సంతసించిన హృదయముతో, "అటులనే గ్రహించెదను." అని పలికి ఆ అస్త్రములను గ్రహించెను. ఆ అస్త్రదేవతలలో కొందరు ఎఱ్ఱగా కాలిన బొగ్గునిప్పులవలె నుండిరి. కొందరు ధూమమువలెను, కొందరు చంద్రసూర్యులవలెను

ఉండిరి. దివ్యములైన ప్రకాశించుచున్న దేహములు దాల్చి సుఖమును కలిగించు ఆ అస్త్రదేవతలు, వినయముతో చేతులు కట్టుకొని మధురముగా మాటలాడుచు రామునితో, "ఓ నరశ్రేష్ఠుడా! ఇదిగో మేమిచట ఉన్నాము. ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుము." అని పలికిరి.(11-13)

"మీరు నా మనస్సులో మెదలుచు పనిపడునప్పుడు నాకు సాహాయ్యము చేయుడు. అంతవరకు యథేచ్ఛగ వెళ్లుడు." అని రాముడు ఆ అస్త్రములతో పలికెను.(14)

ఆ దేవతలు, "అటులనే చేసెదము." అని పలికి, రామునికి ప్రదక్షిణనమస్కారములు చేసి, సెలవు గైకొని వచ్చినట్లుగనే వెళ్లిపోయిరి.(15)

రాముడు ఉపసంహారమంత్రములను తెలిసికొని, నడుచుచునే విశ్వామిత్రమహర్షితో మధురము, మృదువు అయిన వచనమును పలికెను.(16)

"మునిసత్తమా! ఇటువైపు పర్వతమునకు కొంచెము దూరమున ఒక వృక్షముల గుంపు మేఘమువలె చూడ ముచ్చటగా నున్నది. ఇది మృగములతో నిండియున్నది. చాల మనోరంజకముగ నున్నది. మధురనాదములు గల నానావిధపక్షులు ఇందు సంచరించుచున్నవి. ఇది ఏమి? నాకు వినుటకు చాల కుతూహలముగ నున్నది.(17, 18)

ఈ ప్రదేశము సుఖకరముగా నుండుటచే భయంకరమైన ఆ అరణ్యమునుండి బైటకు వచ్చినామని అనుకొనుచున్నాను. ఈ ఆశ్రమ మెవరిది? ఓ పూజ్యుడా! అంతయు నాకు తెలుపుము.(19)

మహామునీ! (నీవు చెప్పిన) బ్రహ్మహత్య చేయువారును, దుర్మార్గులును, దుష్టస్వభావులును అగు ఆ పాపాత్ములు ఎక్కడకు వచ్చి నీ యజ్ఞమునకు విఘ్నము చేయుచుందురు? నేను నీ యాగమును సంరక్షించవలసిన ప్రదేశ మేది? నేను రాక్షసుల నెక్కడ చంపవలసి యున్నది? ఇది యంతయు వినవలెనని కోరుచున్నాను."(20-22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది ఎనిమిదవసర్గము సమాప్తము.

ఇరువది తొమ్మిదవ సర్గము

విశ్వామిత్రుడు రామునకు సిద్ధాశ్రమవృత్తాంతము చెప్పుట.

అప్రమేయప్రభావు డగు రాముడు ఆ వనమును గూర్చి ప్రశ్నింపగా విశ్వామిత్రుడు చెప్పుటకు ఉపక్రమించెను.(1)

"రామా! దేవతాశ్రేష్ఠుడును, సర్వశక్తుడును అగు విష్ణువు చాల కాలము (అనగా) వందలకొలది యుగములపాటు మహాతపస్సు చేయుచు ఈ వనములో నివసించెను. ఇది వామనావతారమునకు పూర్వము వామనుడు (విష్ణువు) నివసించిన ఆశ్రమము. ఇచట కాశ్యపుడు తపస్సు చేసి సిద్ధి పొందుటచే దీనికి సిద్ధాశ్రమ మని పేరు వచ్చినది.(2, 3)

విష్ణువు ఈ ఆశ్రమములో తపస్సు చేయుచున్న కాలమున, విరోచనుని కుమారుడైన బలిచక్రవర్తి ఇంద్ర-మరుద్గణాది సహితముగా దేవతలను జయించి మూడు లోకములలో ప్రసిద్ధుడై రాజ్య మేలెను.(4, 5)

బలిచక్రవర్తి యాగము చేయుచుండగా అగ్ని మొదలైన దేవతలు ఈ ఆశ్రమములో నున్న విష్ణువును సమీపించి,(6)

"ఓ విష్ణూ! విరోచనుని పుత్రుడైన బలి గొప్ప యజ్ఞము చేయుచున్నాడు. ఆ యజ్ఞము పూర్తికాకమునుపే స్వకార్యమును, అనగా నీ వారమగు మా కార్యమును, సాధింపుము.(7)

నలుమూలలనుండి వచ్చిన యాచకులు, ఇతనిని యాచించున్నారు. ఎవరు ఏది యాచించినను అది ఎచట, ఏవిధముగ నున్నదో దానినంతను అచటనే ఆవిధముగనే ఇతడు ఇచ్చివేయుచున్నాడు. నీవు దేవతల హితముకొరకై మాయచే వామనరూపము దాల్చి, (యాచకుడవై వెళ్ళి) ఉత్తమమైన కల్యాణకరకార్యమును చేయుము." అని ప్రార్థించిరి.(8, 9)

ఇంతలో, అగ్నితో సమానమైన కాంతిగలవాడు, తేజస్సుతో దేదీప్యమానుడు, మాహాత్మ్యము కలవాడు అయిన కాశ్యపుడు అదితిసమేతుడై వేయి దివ్యసంవత్సరములు చేసిన వ్రతమును భార్య సాహాయ్యముతో పూర్తిచేసికొని వరదుడైన మహావిష్ణువును, "ఓ పురుషోత్తమా! నీవు తపోమయుడవు. తపస్సుయొక్క రాశివి. తపస్సు నీ మూర్తి. నీవు తపఃస్వరూపుడవు. అట్టి నిన్ను బాగుగ తపస్సు చేసి నేడు నేను చూడగలుగుచున్నాను. ప్రభూ! ఈ ప్రపంచము నంతను నీ శరీరములో

చూచుచున్నాను. నీకు ఆదిలేదు. నీ విట్టివాడ వని వర్ణింప శక్యము కాదు. నిన్ను నేను శరణు జొచ్చుచున్నాను" అని స్తుతించెను.(10-13)



విష్ణువు సంతోషించి ఎట్టి పాపములును లేని ఆ కాశ్యపునితో, "వరమును కోరుకొనుము. నీవు వరము నీయదగినవాడ వని నేను నమ్ముచున్నాను." అనెను.(14)

మరీచుని కుమారుడైన కాశ్యపుడు విష్ణువు మాటలు విని, "ఓ వరదుడా! నీవు అనుగ్రహించి అదితికిని, దేవతలకును, వారితోపాటు నిన్ను ప్రార్థించుచున్న నాకును వరము నిమ్ము. అదితికిని, నాకును పుత్రుడ వగుము. మా కుమారుడవగుటచే దేవేంద్రునకు తమ్ముడవై శోకపీడితులైన దేవతలకు సాహాయ్యము చేయుము.(15-17)

నీవు నాకు పుత్రుడవుగ జనించుటచే నా తపస్సు సఫలమగును. నీ అనుగ్రహమువలన ఈ ఆశ్రమము సిద్ధాశ్రమ మను పేరు గలది కాగలదు. భగవన్! ఇచటినుండి లెమ్ము. నా పుత్రుడవు అగుము." అని ప్రార్థించెను.(18)

అంత విష్ణువు అదితిపుత్రుడుగ జన్మించి, వామనరూపము ధరించి, బలిచక్రవర్తివద్దకు వెళ్లెను.(19)

గౌరవమును ఇచ్చువాడు, అభిమానమును తొలగించువాడు, సర్వలోకస్వరూపుడు, సర్వభూతములకు హితమును చేయుటయందు ఆసక్తి కలవాడు అయిన ఆ విష్ణువు, మూడు అడుగులు యాచించి, వాటిని ప్రతిగ్రహించి, మూడు లోకములను ఆక్రమించి, పరాక్రమముచే బలిని బంధించి, త్రిలోకాధిపత్యమును మరల మహేంద్రునకు ఇచ్చెను.(20, 21)

పూర్వము వామనుడు ఈ ఆశ్రమములోనే ఉండెడివాడు. వామనునిపై నున్న భక్తిచేత నేను కూడ ఈ ఆశ్రమములో నివసించుచున్నాను. నా యజ్ఞమునకు విఘ్నము చేయు రాక్షసులు ఈ ఆశ్రమమునకే వచ్చుచున్నారు. వారిని ఇక్కడనే చంపవలసియున్నది.(22, 23)

ఇపుడు అత్యుత్తమమైన సిద్ధాశ్రమములో ప్రవేశించెదము. నాయనా! ఈ ఆశ్రమము నా కెట్లో నీకును అట్లే."(24)

రామలక్ష్మణులతో ఆశ్రమములోనికి ప్రవేశించుచున్న విశ్వామిత్రమహాముని, మంచు తొలగి పునర్వసు నక్షత్రములతో కూడిన చంద్రునివలె ప్రకాశించెను.(25)

సిద్ధాశ్రమములో నివసించు ముని లందరును విశ్వామిత్రుని చూచి, తొందరగా పరుగెత్తి వెళ్ళి అతనిని పూజించిరి. ధీమంతు డగు విశ్వామిత్రునకు తగు విధముగ పూజలు చేసిరి. అట్లే రాజపుత్రులకు కూడ అతిథిపూజ చేసిరి.(26, 27)

పిమ్మట, శత్రుసంహారకులైన రామలక్ష్మణులు క్షణకాలము విశ్రాంతి తీసికొని విశ్వామిత్రునకు నమస్కరించి ఇట్లు పలికిరి.(28)

"ఓ! మునిశ్రేష్ఠా! ఈ రోజుననే యజ్ఞదీక్షలో ప్రవేశింపుము. ఈ సిద్ధాశ్రమము సిద్ధిప్రదమై సార్థకనామధేయ మగుగాక! నీ వచనము సత్య మగుగాక!"(29)

మహాతేజఃశాలియైన విశ్వామిత్రమహర్షి వారి వాక్యము విని నియమము నవలంబించి, ఇంద్రియములను నిగ్రహించి యజ్ఞదీక్షలో ప్రవేశించెను.(30)

రామలక్ష్మణులు ఆ రాత్రియంతయు సావధానచిత్తులై ఉండి ప్రాతఃకాలమున లేచి, ఆచమనము చేసి, ప్రాతఃకాలసంధ్య నుపాసించి, నియమపూర్వకముగ గాయత్ర్యాదిమంత్రముల జపము చేసి, అప్పటికే అగ్నిహోత్రము చేసికొని ఉపవిష్టుడై యున్న విశ్వామిత్రుని సమీపించి నమస్కరించిరి.(31, 32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఇరువది తొమ్మిదవసర్గము సమాప్తము.

ముప్పదియవ సర్గము

రాముడు రాక్షసులను సంహరించి విశ్వామిత్రుని యాగమును రక్షించుట.

పిమ్మట, ఏ దేశమునందు ఏ కాలమునందు ఎట్లు మసలుకొనవలెనో తెలిసినవారు, ఏ దేశమునందు, ఏ కాలమునందు ఎట్లు మాటలాడవలెనో తెలిసినవారు, శత్రుసంహారసమర్థులు అయిన రామలక్ష్మణులు,(1)

"బ్రహ్మర్షీ! ఆ రాక్షసులనుండి నీ యజ్ఞమును ఎపుడు రక్షింపవలెనో వినగోరు చున్నాము. ఆ కాలము దాటిపోగూడదు కదా!" అని విశ్వామిత్రుని అడిగిరి.(2)

ఈవిధముగ పలుకుచు, యుద్ధము చేయుటకై తొందరపడుచున్న ఆ



రామలక్ష్మణులను చూసి సంతసించి అచ్చటి మునులందరును వారిని ప్రశంసించి,(3)

"రామలక్ష్మణులారా! విశ్వామిత్రమహర్షి దీక్ష వహించినాడు గాన మౌనమును పాటించును. నేడు మొదలు ఆరు రాత్రులు మీరు యాగరక్షణము చేయుడు." అని తెలిపిరి.(4)

కీర్తిమంతులైన రామలక్ష్మణులు వారి వాక్యము విని, ఆరు రేయింబవళ్లు నిద్రలేనివారై ఆ తపోవనమును రక్షించిరి. ధనుర్ధారులైన ఆ వీరులు సన్నద్ధులై ఆ విశ్వామిత్రుని సమీపముననే ఉండి ఆ మునిశ్రేష్ఠుని రక్షించిరి.(5, 6)

అయిదు దివసములు గడచి ఆఱవ దివసము వచ్చినది. అపుడు రాముడు లక్ష్మణునితో, "సన్నద్ధుడవై, అప్రమత్తుడవై ఉండుము." అని పలికెను.(7)

రాముడు యుద్ధాభిలాషతో తొందరపడుచు ఈవిధముగా పలుకుచుండగనే ఋత్విక్కులతోను, పురోహితునితోను కూడిన యజ్ఞవేదిక భగ్గున మండెను.(8)

దర్భలతో, చమసములతో, స్రుక్కులతో, సమిధలతో, పుష్పసముదాయముతో, విశ్వామిత్రునితో, ఋత్విక్కులతో కూడిన వేది (ఒక్కసారి) జ్వలించినది.(9)

ఆ యజ్ఞము మంత్రపూర్వకముగాను, శాస్త్రానుసారముగాను జరుగుచుండెను. ఇంతలో ఆకాశమునందు, భయంకరమైన ఒక శబ్దము వినబడెను. వర్షాకాలమున బయలుదేరిన మేఘమువలె ఆకాశమును ఆవరించి మారీచసుబాహువులు మాయావికారములను చూపుచు పరుగెత్తి వచ్చిరి. భయంకరులైన మారీచసుబాహువులును, వారి అనుచరులును వచ్చి (యజ్ఞము జరుగు ప్రాంతమునందు) రక్తప్రవాహమును వర్షించిరి.(10-12)

రక్తప్రవాహముచే నింపబడిన ఆ వేది ప్రజ్వరిల్లెను. అంతలో, శీఘ్రముగ పరుగెత్తి వచ్చిన రాముడు ఆకాశమునందు ఆ రాక్షసులను చూచెను. వేగముగ వచ్చి పడుచున్న ఆ మారీచ సుబాహువులను చూచి, రాముడు లక్ష్మణునితో,(13, 14)

"లక్ష్మణా! దుర్మార్గులు, నరమాంసభక్షకులు అయిన ఈ రాక్షసులను వాయువు మేఘములను ఎగురగొట్టినట్లు మానవాస్త్రముచే ఎగురగొట్టి వేయుచున్నాను, చూడుము." అని పలుకుచు, చాల కోపించి, మంచి సామర్థ్యము కలది, మిక్కిలి ప్రకాశించుచున్నది అయిన మానవాస్త్రమును మారీచుని వక్షఃస్థలముపై ప్రయోగించెను.(15, 16)

ఆ మానవాస్త్రముచేత కొట్టబడిన మారీచుడు పూర్తిగ నూరు యోజనముల దూరములో కెరటములతో ఎగసిపడుచున్న సముద్రజలమునందు పడెను.(17)

ఆ చల్లని బాణముచేత కొట్టబడి, చైతన్యము కోల్పోయి, గిఱ్ఱున తిరిగిపోవుచు దూరముగా పడవేయబడిన ఆ మారీచుని చూచి, రాముడు లక్ష్మణునితో,(18)

"లక్ష్మణా! ఈ మానవాస్త్రము తన ధర్మమును అనుసరించి సంధించిన చల్లని బాణమును చూడుము. ఇది వీనికి మోహము కలుగజేసి (స్పృహ పోగొట్టి) తీసికొనిపోవుచున్నది. కాని ఇతని ప్రాణములు తీయలేదు.(19)

జాలిలేనివారు, దుర్మార్గులు, పాపములు చేయువారు, యజ్ఞములను చెరచువారు, రక్తమును త్రాగువారు అయిన ఈ (మిగిలిన) రాక్షసులను కూడ చంపెదను." అనుచు, దివ్యము, ఆశ్చర్యకరము అయిన ఆగ్నేయాస్త్రమును గ్రహించి, సుబాహువు వక్షఃస్థలముపై ప్రయోగించెను. దాని దెబ్బ తిని అతడు నేలకూలెను.(20, 21)

ఆశ్రమములోని మునులకు ఆనందము కలిగించుచు రాముడు మిగిలిన రాక్షసులను వాయవ్యాస్త్రము ప్రయోగించి చంపెను.(22)

పూర్వము విజయము కలిగినపుడు దేవతలు దేవేంద్రుని పూజించినట్లు, ఋషులందరును ఆ రాక్షసులనందరిని వధించిన రాముని ప్రశంసించిరి.(23)

యజ్ఞము సమాప్తమైన పిమ్మట విశ్వామిత్రమహాముని ఈతిబాధ లన్నియు తొలగిపోయిన దిక్కులను చూచి, రామునితో, "మహాబాహూ! నేను తలపెట్టిన పని పూర్తియైనది. నీవు తండ్రిగారి ఆజ్ఞను నిర్వహించితివి. ఈ సిద్ధాశ్రమమును సత్యమైన



పేరుగల దానినిగా చేసితివి." అని అభినందించెను.(24, 25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పదియవసర్గము సమాప్తము.

ముప్పది ఒకటవ సర్గము

రామాదులతో కలిసి విశ్వామిత్రుడు మిథిలకు ప్రయాణమగుట.

తమకు అప్పగించిన కార్యమును పూర్తిచేసి వీరులైన రామలక్ష్మణులు ఆ రాత్రి ఆనందముతో నిండిన మనస్సుతో ఆ ఆశ్రమమునందు నివసించిరి.(1)

తెల్లవారగనే ప్రాతఃకాలము చేయదగిన సంధ్యావందనాదులు పూర్తిచేసికొని, ఇద్దరును కలిసి, విశ్వామిత్రుని వద్దకును ఇతర ఋషులవద్దకును వెళ్లిరి.(2)

మధురముగా మాటలాడు స్వభావముగల ఆ రామలక్ష్మణులు ప్రజ్వలించుచున్న అగ్నివలె ఉన్న విశ్వామిత్రునకు నమస్కరించి,(3)

"ఓ మునిశ్రేష్ఠా! ఇదిగో కింకరులము వచ్చినాము. నీకు ఏది ఇష్టమో ఆజ్ఞాపింపుము. మేము ఏ ఆజ్ఞను చేయవలెను?" అని మధురముగా పలికిరి.(4)

రామలక్ష్మణులు ఇట్లు పలుకగా అచటనున్న మహర్షు లందరును, విశ్వామిత్రుని అనుజ్ఞను పొంది, రామునితో, "రామా! మిథిలాధిపతి యైన జనకుడు మిక్కిలి ధర్మసంమతమైన యజ్ఞము చేయనున్నాడు. మేము ఆ యజ్ఞమునకు వెళ్ళుచున్నాము. నీవు కూడ మాతో అచటికి వచ్చినచో అచట ఆశ్చర్యకరమైన శ్రేష్ఠమైన ధనుస్సును చూడగలవు.(5-7)

అప్రమేయమైన బలముగలది, భయంకరమైనది, గొప్ప ప్రకాశముగలది అగు ఆ ధనుస్సును పూర్వము దేవతలు (జనకుని పూర్వులకు) యజ్ఞసదస్సులో ఇచ్చిరి. దేవతలుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, రాక్షసులుగాని ఆ ధనుస్సును వంచి నారి కట్టజాలరు. మనుష్యుల మాట చెప్ప పనియేలేదు. రాజవంశములందు పుట్టిన, మహాబలశాలు లగు ఎందరో రాజులు ఆ ధనుస్సు శక్తిని పరీక్షింపగోరి, ప్రయత్నించిరి. కాని ఎక్కుపెట్టలేకపోయిరి.(8-10)

రామా! అచటికి వెళ్లి మహాత్ముడైన జనకుని ధనుస్సును, ఆశ్చర్యకరమైన యజ్ఞమును చూడగలవు. మిథిలాధిపతి యైన దేవరాతుడు, దృఢమైన మధ్యభాగము గల ఆ ధనుస్సును, దేవతలనుండి, యజ్ఞమునకు ఫలమునుగా యాచించి గ్రహించెను. ఆ ధనుస్సు మిథిలాధిపతి గృహములో ప్రధానపూజ్య మగు ధనుస్సుగా ఉండి, వివిధములైన గంధములచేతను, అగరుధూపములచేతను పూజింపబడుచున్నది." అని చెప్పిరి.(11-13)

ఈవిధముగ పలికిన ఋషిసంఘముతోను, రామలక్ష్మణులతోను కూడినవాడై, విశ్వామిత్రుడు బయలుదేరి (ఆ ఆశ్రమమునందలి వనదేవతలతో), "ఓ వనదేవతలారా! ఈ సిద్ధాశ్రమములో నాకు సంకల్పసిద్ధి కలిగినది. ఇచటినుండి గంగానదికి ఉత్తరతీరమునందున్న హిమవత్పర్వతమునకు వెళ్లెదను. మీకు క్షేమమగుగాక!" అని వారి వద్ద సెలవు గైకొనెను.(14, 15)

అత్యుత్తమమైన ఆ సిద్ధాశ్రమమునకు ప్రదక్షిణము చేసి, ఉత్తరము వైపు ప్రయాణమై వెళ్లెను. విశ్వామిత్రుడు ప్రయాణమై వెళ్లుచుండగా, అతనిని అనుసరించు బ్రహ్మవాదులకు చెందిన దాదాపు, నూరు శకటములు వారిని అనుసరించినవి. (16, 17)

సిద్ధాశ్రమములో నున్న మృగములు, పక్షులు కూడ మహాత్ముడగు ఆ విశ్వామిత్ర మహామునిని అనుసరించి వెళ్లినవి. విశ్వామిత్రుడు ఆ పక్షులను, మృగములను కూడ వెనుకకు పంపివేసెను.(18)

ఆ మునులు చాలదూరము ప్రయాణము చేసి, సాయంకాలమున శోణానదతీరమున అందరును కలిసి నివాసము చేసిరి.(19)

గొప్ప తేజస్సుగల ఆ ఋషులందరును, సూర్యాస్తమయానంతరము అగ్నిహోమములు చేసికొని, విశ్వామిత్రుని పురస్కరించుకొని కూర్చుండిరి.(20)

లక్ష్మణసమేతుడైన రాముడు ఆ మునులను పూజించి, పిమ్మట విశ్వామిత్రుని ఎదుట కూర్చుండెను. పిమ్మట రాముడు, విన వేడుకతో, విశ్వామిత్రమహామునిని, "ఓ పూజ్యుడా! ఫలపుష్పాదులతో సమృద్ధమైన వనములచే శోభించుచున్న ఈ ప్రదేశము పేరేమి?" అని ప్రశ్నించెను.(21-23)

ఉత్తమవ్రతుడు, మహాతపఃశాలి అయిన విశ్వామిత్రుడు, రాముని వాక్యముచే ప్రేరేపింపబడి, ఆ దేశమునకు సంబంధించిన సకలవృత్తాంతమును ఋషులమధ్య ఇట్లు చెప్పెను.(24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పది ఒకటవసర్గము సమాప్తము.

ముప్పదిరెండవ సర్గము

వాయువు కుశనాభుని కుమార్తెలను గూనివారినిగా చేయుట.

"బ్రహ్మకుమారుడైన కుశుడను ఒక మహాపురుషుడు ఉండెను. అతడు గొప్ప తపస్సు కలవాడు. ఎన్నడును నియమములకు భంగము కలిగించనివాడు. ధర్మములను ఎఱిగినవాడు. సజ్జనులను పూజించువాడు.(1)

ఆ మహాత్మునకు సత్కులసంజాతురాలు, తనకు తగినది అయిన విదర్భరాజ కుమారియందు కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసువు అనెడు సుగుణవంతులు, తనతో సమానులు అగు నలుగురు కుమారులు జన్మించిరి.(2)

కుశమహారాజు రాజధర్మమును అనుష్ఠింపవలె ననెడు అభిలాషచే ప్రకాశవంతులు, గొప్ప ఉత్సాహము కలవారు, ధర్మనిరతులు, సత్యమునే పలుకువారు అయిన ఆ పుత్రులకు, "పుత్రులారా! రాజ్యపాలనము చేయుడు. అత్యధికమైన ధర్మమును పొందెదరు." అని బోధించెను. ఆ ఋషి మాటలు విని ఆ నరశ్రేష్ఠులు

నలుగురును నాలుగు పట్టణములను నిర్మించిరి.(3-5)

మహాతేజశ్శాలియైన కుశాంబుడు కౌశాంబీనగరమును, ధర్మాత్ముడైన కుశనాభుడు మహోదయపురమును నిర్మించిరి. అధూర్తరజసుడు ధర్మారణ్య మనెడు నగరశ్రేష్ఠమును, వసురాజు గిరివ్రజపురమును నిర్మించిరి.(6, 7)

రామా! ఇపుడు మనమున్నది ఆ మహాత్ముడైన వసువు భూమి. దీని చుట్టును ఐదు ఉత్తమపర్వతములు ఉన్నవి. మగధదేశమునందు పుట్టిన, రమ్యమైన, ప్రసిద్ధమైన శోణనదము ఐదు శైలముల మధ్య పుష్పమాలవలె ప్రకాశించుచున్నది.(8, 9)

ఈ శోణనదము ఆ వసువునకు సంబంధించినది. తూర్పునుండి పశ్చిమము వైపు ప్రవహించుచున్నది. దీని తీరప్రాంతములందు మంచి సస్యములతో నిండిన పొలములున్నవి.(10)

ధర్మాత్ముడును, రాజర్షియు అయిన కుశనాభుడు, ఘృతాచి యను అప్సరః స్త్రీయందు అత్యుత్తమురాండ్రు అయిన నూరుగురు కన్యలను కనెను.(11)

యౌవనముతో ప్రకాశించుచున్న రూపవతులగు ఆ కన్యలు సకలాభరణములతో చక్కగ అలంకరించుకొని వర్షాకాలపు మెరుపుతీగలవలె ప్రకాశించుచు, ఉద్యానములో నలుమూలల విహరించుచు, గానము చేయుచు, నాట్యమాడుచు, వాద్యములను మ్రోగించుచు గొప్ప ఆనందమును పొందిరి.(12, 13)

అందమైన సకలావయవములు కలిగి భూలోకమునందు సాటిలేని రూపము గల ఆ కన్యకలు ఉద్యానమును చేరి మేఘమధ్యమునందు నక్షత్రములవలె ప్రకాశించిరి.(14)

అంతటను సంచరించు వాయుదేవుడు సర్వగుణసంపన్నలై, రూప యౌవనములతో ప్రకాశించుచున్న ఆ కన్యలను చూచి, "నేను మిమ్ముల నందరిని కోరుచున్నాను. మీరందరూ నా భార్యలు కండు. నన్ను వివాహము చేసికొనినచో మనుష్యత్వము పోయి మీకు దీర్ఘాయువు లభించును. యౌవన మనునది అస్థిరము. మనుష్యులలో ఇంకను అస్థిరము. నన్ను పెండ్లాడినచో మీరు శాశ్వతమైన యౌవనము కలిగియుండు దేవతాస్త్రీలు కాగలరు." అని పలికెను.(15-17)

ఏ పనిచేయుట కైనను అడ్డు లేని ఆ వాయువు మాటలు విని, ఆ నూర్గురు కన్యలు పరిహాసపూర్వకముగా, "ఓ సురోత్తమా! నీవు సర్వప్రాణులలోపల సంచరించువాడవు. నీ ప్రభావము మాకందరకును తెలియును. నీవు మమ్ములను

ఎందుకు ఇట్లు అవమానించుచున్నావు? మేమందరమును కుశనాభుని కుమార్తెలము. నీవు దేవతవే యైనను నిన్ను నీ అధికారమునుండి తొలగించు సామర్థ్యము మా కున్నది. కాని, మా తపస్సును రక్షించుకొనుటకై మేము అట్లు చేయుటలేదు. (18–20)

ఓ దుర్బుద్ధీ! సత్యవాదియైన తండ్రిని కాదని స్వేచ్ఛానుసారముగా, మేమే స్వయముగ వరుని పొందెదు కాలము మాకు ఎన్నటికిని రాకుండుగాక! మాకు మా తండ్రియే ప్రభువు. తండ్రియే దేవత. మా తండ్రి మమ్ములను ఎవరి కిచ్చునో అతడే మా భర్త కాగలడు." అని పలికిరి. (21, 22)

ఆ కన్యకల వాక్యము విని, సామర్థ్యవంతు డగు వాయువు చాల కోపించి, వారి అవయవము లన్నింటిలోనికి ప్రవేశించి వాటిని దుర్బలములుగ చేసెను. వాయువుచేత ఆవిధముగ పీడింపబడిన ఆ కన్యకలు రాజగృహములోనికి ప్రవేశించి తొట్రుబడుచు, కన్నీళ్లు కార్చుచు, సిగ్గుపడుచు నేలమీద పడిరి. (23, 24)

కుశనాభుడు మిక్కిలి ప్రకాశించు తన ప్రియపుత్రికలు భగ్నలై, దైన్యముతో నుండుట చూచి, "పుత్రికలారా! ఇది యేమి? ఈవిధముగ ధర్మమును అవమానించుచున్నవాడు ఎవడు? చెప్పుడు. మిమ్ముల నందరిని గూనివాళ్లనుగా చేసినది ఎవడు? నేలపై దొర్లుచు మాటలాడకున్నారేమి?" అని అడిగెను. రాజు ఈ విధముగ పలికి, నిట్టూర్చి, ఏమి చెప్పెదరో అని వినుటకై సావధానచిత్తుడై ఉండెను. (25, 26)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పది రెండవసర్గము సమాప్తము.

ముప్పదిమూడవ సర్గము

బ్రహ్మదత్తుడు కుశనాభుని కుమార్తెలను పరిణయమాడుట.

కుశనాభుని మాటలు విని, ఆ నూర్గురు కన్యలును తండ్రి పాదములకు నమస్కరించి ఇట్లు పలికిరి. (1)

"తండ్రీ! సర్వవ్యాపియైన వాయువు చెడు మార్గము నవలంబించి మమ్ములను

తిరస్కరించుటకు ప్రయత్నించుచున్నాడు. ధర్మమును లెక్కచేయుటలేదు. 'మా తండ్రిగారున్నారు. మేము స్వతంత్రలము కాము. మా తండ్రి మమ్ములను నీకిచ్చునేమో కోరుము.' అని మేము చెప్పగా పాపాశయుడైన ఆ వాయువు మా మాటల నంగీకరింపక మమ్ములను ఈవిధముగ పీడించినాడు."(2-4)

పరమధార్మికుడు, మహాతేజశ్శాలి అయిన కుశనాభుడు వారి మాటలు విని వారితో ఇట్లనెను.(5)

"పుత్రికలారా! ఓర్పు కలవారు (మాత్రమే) చేయతగిన క్షమించుట అను గొప్ప పని మీరు చేసినారు. ఇది చాల ప్రశంసనీయము. మీరందరును ఒకేవిధమగు ఆలోచనతో నా వంశగౌరవమును కాపాడినారు.(6)

స్త్రీలకైనను, పురుషులకైనను ఓర్పు అనునది అలంకారము కదా! క్షమించుట అనునది చేయశక్యము కాని పని. రూపయౌవనాదులుగల దేవతలకు ఓర్పు ఉండుట ఇంకను కష్టము. మీరందరును ఒకేవిధమున ఓర్పు చూపుట ఇంకను మెచ్చుకొనవలసిన విషయము.(7)

పుత్రికలారా! ఓర్పే దానము. ఓర్పే యజ్ఞము. ఓర్పే సత్యము. ఓర్పే కీర్తి. ఓర్పే ధర్మము. ఓర్పుమీదనే ఈ జగత్తు నిలిచిఉన్నది."(8)

కుశనాభుడు ఇట్లు పలికి, కన్యకలను లోనికి పంపివేసి, వారి వివాహమును గూర్చి మంత్రులతో ఆలోచన చేసెను. కన్యాదానము చేయుటకు తగిన దేశకాలములను గూర్చియు, తగిన వరునకు ఇచ్చుట మొదలగు విషయములను గూర్చియు ఆలోచించెను.(9, 10)

ఆ కాలముననందే, మహాతపశ్శాలి, ఊర్ధ్వరేతస్కుడు, శుభమైన ఆచారము కలవాడు అయిన చూళి అను మహర్షి వేదోక్తరీతిని తపస్సు చేసెను. అక్కడాతడు తపస్సు చేయుచుండగా ఊర్మిళ కుమార్తెయైన సోమద అనెడు గంధర్వస్త్రీ అతనికి ఉపచారములు చేయుచుండెను. రామా! ఈ పుణ్యకథను వినుటచే నీకు మంగళమగుగాక!(11, 12)

సోమద ఆ ఋషి విషయమున వినయవంతురాలై, శ్రద్ధాపూర్వకముగ శుశ్రూష చేయుచు, ధర్మమార్గము ననుసరించి అచట నివసించెను. కొంత కాలమునకు చూళికి ఆమెపై అనుగ్రహము కలిగెను. ఆమె చేసిన శుశ్రూష ఫలించు కాలము వచ్చినది. ఆ ఋషి సోమదతో, "నీ విషయమున సంతోషించితిని. నీకు ఏమి

ప్రియము చేయవలెను?" అని పలికెను.(13, 14)

మధురమైన స్వరము, మాటలాడుటలో నేర్పు కల ఆ గంధర్వస్త్రీ ముని అనుగ్రహించినాడని తెలిసి చాల సంతోషించినదై, ఆ మునితో ఇట్లనెను.(15)

"మహాతపఃశాలివైన నీవు బ్రాహ్మతేజస్సుచే బ్రహ్మదేవుని వంటివాడవై ఉన్నావు. ఓ ధార్మికుడా! నేను బ్రాహ్మమగు తపస్సుతో కూడిన పుత్రుని కోరుచున్నాను.(16)

నాకు భర్త లేడు. నే నెవ్వరికిని భార్యను కాను. నిన్ను ఆశ్రయించి ఉన్న నాకు నీ తపోబలముచే అట్టి కుమారుని ఇమ్ము."(17)

ప్రసన్నుడైన ఆ బ్రహ్మర్షి ఆమె కొరక అత్యుత్తముడైన పుత్రుని ఇచ్చెను. అతడు బ్రహ్మదత్తు డనియు, చూళి మానసపుత్రు డనియు ప్రసిద్ధి పొందెను. సోమద కుమారుడైన ఆ రాజు, దేవరాజు స్వర్గమునందువలె, కాంపిల్యానగరమునందు అత్యధికమైన ఐశ్వర్యముతో నివసించెను.(18, 19)

సుధార్మికుడైన ఆ కుశనాభమహారాజు తన నూర్గురు కన్యలను బ్రహ్మదత్తున కీయవలెనని నిశ్చయించి, బ్రహ్మదత్తుని ఆహ్వానించి, ఆనందభరితమైన హృదయముతో నూర్గురు కూతుళ్లను అతనికిచ్చి వివాహము చేసెను. దేవేంద్రునితో సమానుడైన బ్రహ్మదత్త మహారాజు, క్రమానుసారముగా ఆ కన్యల హస్తములను గ్రహించెను. అతడు హస్తములను స్పృశింపగనే ఆ నూర్గురు కన్యలును గూను తొలగి, బాధ శాంతించి, గొప్ప శోభతో ప్రకాశించిరి.(20-23)

కుశనాభ మహారాజు వాయుదోషము తొలగిపోయిన కుమార్తెలను చూచి చాలా సంతోషించెను. మాటిమాటికి ఆనందము పొందెను. వివాహము చేసికొనిన బ్రహ్మదత్త మహారాజును, భార్యాఋత్విగాదిసమేతముగా అతని రాజ్యమునకు పంపెను.(24, 25)

సోమద ఆ కన్యకలను మాటిమాటికి ఒక్కరొక్కరుగ స్పృశించి, వారి తండ్రియైన కుశనాభుని ప్రశంసించి, పుత్రుడు చేసిన ఆ యుక్తమైన కార్యమును, ఆ కోడళ్లను అభినందించెను."(26)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పదిమూడవసర్గము సమాప్తము.

ముప్పదినాల్గవ సర్గము

గాధి జన్మవృత్తాంతము.

"రామా! బ్రహ్మదత్తుడు వివాహము చేసికొని వెళ్లిన పిమ్మట పుత్రులు లేని కుశనాభుడు, పుత్రులకొరకై పుత్రకామేష్టి చేసెను. పుత్రకామేష్టి జరుగుచున్న సమయమున మిక్కిలి ఉదారుడు, బ్రహ్మపుత్రుడు అయిన కుశుడు కుశనాభునితో, "కుమారా! నీకు తగినవాడు, మంచి ధార్మికుడు అయిన కుమారుడు (ఈ యజ్ఞమువలన నీకు) జన్మించగలడు. గాధియను పేరుగల ఆ కుమారునిద్వారా నీకు లోకమున శాశ్వతమగు కీర్తి లభింపగలదు." అని పలికెను.(1-3)

కుశనాభునితో ఈవిధముగ చెప్పి కుశుడు ఆకాశమార్గమున శాశ్వతమగు బ్రహ్మలోకమును చేరెను.(4)

కొంతకాలమునకు, ధీమంతుడైన ఆ కుశనాభునకు గాధి యను పేరుగల పరమధార్మికుడైన కుమారుడు జన్మించెను. ఆ గాధి నా తండ్రి. కుశుని వంశము నందు పుట్టుటచే నాకు కౌశికు డను పేరు వచ్చినది.(5, 6)

నాకొక అక్కగారు ఉన్నది. ఆమెపేరు సత్యవతి. ఉత్తమవ్రతయగు నా అక్కగారిని ఋచీకునకిచ్చి వివాహము చేసిరి. ఆమె భర్తను అనుసరించి సశరీరముగ స్వర్గమునకు వెళ్లినది.(7, 8)

ఆమె లోకమునకు ఐహికాముష్మికసుఖములను ప్రసాదించుటకై దేవతాశక్తి కలది, పుణ్యోదకము కలది, సుందరమైనది, అయిన కౌశికీ నదిగా కూడ హిమవత్పర్వతముమీద ప్రవహించుచున్నది.(9)

సోదరియగు కౌశికియందలి స్నేహముచే నేను హిమవత్ప్రాంతమునందు ఎక్కువ ఆసక్తితో సుఖముగా నివసించుచున్నాను. కౌశికియను మహానదిగా ఏర్పడిన ఆ సత్యవతి పుణ్యయైనది. సత్యమునందును, ధర్మమునందును స్థైర్యము కలది. పతివ్రత. గొప్ప భాగ్యము కలది. యాగనియమము పూర్తి చేసికొనుటకై నేనామెను విడచి సిద్ధాశ్రమమునకు వచ్చితిని. నీ తేజస్సుచే కార్యసిద్ధి పొందితిని.(10-12)

రామా! నీవు చెప్పమని నన్ను అడిగితివి కదా! నేను ఎట్లు పుట్టితినో, నా వంశము, ఈ దేశము ఎట్లు పుట్టినవో చెప్పినాను.(13)

నేను ఈ కథలు చెప్పుటలో అర్ధరాత్రి గడచిపోయినది. ఇక నిద్రపొమ్ము. నీకు

మంగళమగుగాక! మనకు ఈ మార్గమధ్యమున ప్రయాణవిఘ్నము కాకుండుగాక! (14)

వృక్షములు నిశ్చలముగ ఉన్నవి. మృగపక్ష్యాదులు తమ తమ స్థానములలో కదలకుండ అణగియున్నవి. రాత్రి చీకటి అన్ని దిక్కులందును వ్యాపించినది. మెల్లమెల్లగా సంధ్య తొలగిపోయినది. నక్షత్రములతోడను, అశ్విన్యాది తారాగణముతోడను నిండిన ఆకాశము, జ్యోతీరూపములైన వాటిచేత వ్యాప్తమై, నేత్రములతో నిండినట్లు ఉన్నది. చల్లని కిరణములుగల చంద్రుడు లోకమునందలి చీకటిని తొలగించుచు, తన కాంతిచేత ప్రాణుల మనస్సులను ఆనందింపచేయుచు పైకి వచ్చుచున్నాడు. (15-17)

రాత్రి సంచరించు సకలప్రాణులును, యక్షులు, రాక్షసులు, భయంకరులైన మనుష్యాశనులును అక్కడక్కడ తిరుగుచున్నారు."(18)

మహాతేజశ్శాలియగు విశ్వామిత్రుడు ఈవిధముగ పలికి విరమించెను. "బాగున్నది, బాగున్నది." అని అనుచు మును లందరును, "ఈ కుశవంశము పూజ్యమైనది. సర్వదా ధర్మమునందు ఆసక్తికలది. కుశవంశమునందు పుట్టిన మానవోత్తములు పూజింపదగిన స్వభావము కలవారు. బ్రహ్మదేవునితో సమానులు. ఓ విశ్వామిత్రమహామునీ! నీవు మహాయశశ్శాలివి. కుశవంశములోని వారందరిలోను విశేషించి నీవు మహాత్ముడవు. బ్రహ్మతుల్యుడవు. నదులలో శ్రేష్ఠయైన కౌశికి నీ వంశమునకు వన్నె తెచ్చిపెట్టినది." అని బ్రహ్మవర్చస్వి యగు విశ్వామిత్రుని ప్రశంసించిరి. పిమ్మట విశ్వామిత్రుడు, సూర్యుడు అస్తాద్రిని చేరినట్లు నిద్రను పొందెను. (19-22)

లక్ష్మణసమేతు డగు రాముడు కూడ విశ్వామిత్రుడు చెప్పిన కథ వినుటచే కొంచెము ఆశ్చర్యము నొంది, ఆయనను ప్రశంసించి నిద్రించెను. (23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పదినాల్గవసర్గము సమాప్తము.

ముప్పదిఐదవ సర్గము

రాముడు ప్రశ్నింపగా విశ్వామిత్రుడు గంగావతరణకథ చెప్పుట.

ఆ రాత్రి అంతయు మహర్షులతో శోణానదీతీరమున గడపి, విశ్వామిత్రుడు, తెల్లవారగనే, "రామా! రాత్రి బాగుగా తెల్లవారినది. ప్రాతఃకాలసంధ్య ప్రారంభమైనది. లెమ్ము. లెమ్ము. నీకు మంగళమగుగాక! ప్రయాణమునకు సన్నద్ధుడవు అగుము." అని రామలక్ష్మణులను మేల్కొలిపెను.(1, 2)

విశ్వామిత్రుని మాట విని రాముడు, పూర్వాహ్ణమునందు చేయవలసిన సంధ్యావందనాదులను పూర్తిచేసుకొని, ప్రయాణమునకు సిద్ధుడై, "మునీంద్రా! శుభమైన జలముగల ఈ శోణనదము ఇసుకతిన్నెలతో ప్రకాశించుచు, లోతు తక్కువగ ఉన్నది. మనము దీనిని ఏమార్గమున దాటవలెను?" అని అడిగెను.(3, 4)

"మహర్షులు ఏ మార్గమున వెళ్ళుచున్నారో ఆ మార్గముననే పోవుదము." అని విశ్వామిత్రు డనెను. విశ్వామిత్రుని మాటలు విన్న మహర్షులు వివిధములైన వనములను చూచుచు, ప్రయాణము చేసిరి.(5, 6)

వారు చాలదూరము ప్రయాణము చేసి మధ్యాహ్నసమయమునందు నదులలో శ్రేష్ఠమైనది, మునులచే సేవింపబడినది అయిన గంగానదిని చూచిరి.(7)

పుణ్యమైన ఉదకముతోను హంససారసపక్షులతో కూడిన ఆ గంగను చూచి రామలక్ష్మణులు, ఆ మునులును సంతోషించిరి.(8)

వారందరును గంగాతీరమున నివసించిరి. మునులందరు స్నానములు చేసి యథాశాస్త్రముగ పితృతర్పణములు చేసిరి. అగ్నిహోత్రములు చేసుకొని అమృతతుల్యమగు హవిస్సును భుజించిరి. ప్రశాంతచిత్తులై, పవిత్రమగు ఆ గంగాతీరమున మహాత్ముడైన విశ్వామిత్రుని పరివేష్టించి కూర్చుండిరి.(9, 10)

అంతట రాముడు అచట సుఖాసీనుడై యున్న విశ్వామిత్రుని చేరి, "పూజ్యుడా! గంగానది మూడు మార్గములందు(స్వర్గమునందు, భూమిపైన, పాతాళమునందు) ప్రవహించుచున్నది. ఈ గంగను గూర్చి తెలిసికొనగోరుచున్నాను. ఈ నది మూడు లోకములను ఎట్లు ఆక్రమించినది? ఎట్లు సముద్రములోనికి ప్రవేశించినది?" అని ప్రశ్నించెను.(11, 12)

రాముడిట్లు ప్రశ్నింపగా విశ్వామిత్రమహాముని గంగానది ఉత్పత్తి, వృద్ధి మొదలైన విషయములను చెప్పుట మొదలుపెట్టెను.(13)

"రామా! హిమవంతు డనెడు పర్వతరాజు ఉన్నాడు. అతడు అనేకవిధములగు ధాతువులకు గొప్ప నిధి. అతనికి ప్రపంచమునందు సాటిలేని సౌందర్యముగల ఇద్దరు కన్యకలు ఉన్నారు. మేరుపర్వతము కుమార్తెయైన మనోరమ ఆ హిమవంతుని భార్య. ఆ కన్యకల తల్లి.(14, 15)

ఈ గంగ హిమవంతునకు, మనోరమయందు పెద్ద కుమార్తెగా జనించినది. అతనికే ఉమ రెండవ కుమార్తెగా జనించినది.(16)

దేవత లందరును తమ ప్రయోజనమును సాధించుకొనుటకై జ్యేష్ఠ పుత్రిక, మూడు మార్గములలో ప్రవహించునది అయిన గంగను తమ కిమ్మని హిమవంతుని కోరిరి.(17)

హిమవంతుడు ధర్మమును పాటించి మూడు లోకములకును హితము కలుగవలెనెడు కోరికతో, లోకములను పవిత్రింపచేయునది, స్వేచ్ఛానుసారముగా ప్రవహింప సమర్థురాలు అయిన తన జ్యేష్ఠపుత్రియైన గంగను వారికిచ్చెను.(18)

దేవతలు గంగను హిమవంతునినుండి ప్రతిగ్రహించి, సఫలమైన కోరిక గల మనస్సుతో మూడు లోకములకును హితము చేయబోవువారై ఆమెను తమతో తీసుకొనివెళ్లిరి.(19)

హిమవంతుని రెండవ కుమార్తెయైన ఉమ తపోధనురాలై ఉగ్రమైన వ్రతమును అవలంబించి తపస్సు ఆచరించెను. ఉగ్రమైన తపస్సు చేసినది, సర్వలోక నమస్కృతయైన తన కుమార్తె ఉమను హిమవంతుడు సాటిలేని రుద్రున కిచ్చి వివాహము చేసెను.(20, 21)

నదులలో శ్రేష్ఠురాలైన గంగ, ఉమాదేవి వీరిరువురును హిమవంతుని పుత్రికలు, లోకములచే పూజింపబడినవారు.(22)

గంగానది మొదట ఆకాశమునకు ఎట్లు వెళ్ళినదో ఈ విషయమంతయు చెప్పినాను. రమ్యమైనది, పాపరహితయు అయిన ఆ హిమవత్పుత్రిక జలరూపమున ప్రవహించుచు స్వర్గమును అధిరోహించి సురనది యైనది."(23, 24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పది ఐదవసర్గము సమాప్తము.

ముప్పది ఆరవ సర్గము

పార్వతి దేవతలకును, భూదేవికిని శాపము నిచ్చుట.

విశ్వామిత్రుని వాక్యము విని రామలక్ష్మణులు ఆ కథను మెచ్చుకొని, ఆ మునిపుంగవునితో ఇట్లు పలికిరి.(1)

"మునీంద్రా! ధర్మయుక్తమైన ఈ ఉత్తమకథను చెప్పినావు. హిమవంతుని పెద్ద కుమార్తెకు సంబంధించినది, దేవలోకమనుష్యలోకములలో జరిగినది అగు కథను సవిస్తరముగ చెప్పుము. నీవు కథావిస్తరములు తెలిసినవాడవు కదా!(2)

లోకపావనియైన గంగ ఏ కారణముచేత మూడు మార్గములలో ప్రవహించు చున్నది? త్రిపథగ యైన ఈ గంగ ఏ కర్మలను పట్టి మూడు లోకములలో ఉత్తమమైన నది యని ప్రసిద్ధి పొందినది?"(3, 4)

రాముని మాటలు విని విశ్వామిత్రమహర్షి ఆ కథ నంతను సంపూర్ణముగా, ఋషుల మధ్యయందు చెప్పెను.(5)

"రామా! మహాతపఃశాలి యగు ఈశ్వరుడు పూర్వము వివాహము చేసుకొని, దేవిని చూచి అత్యాసక్తితో మైథునమునకు ఉపక్రమించెను.(6)

ఈశ్వరు డీ విధముగ క్రీడించుచుండగా నూరు దివ్య వర్షములు గడచిపోయినవి. కాని ఆ దేవియందు కుమారుడు జనించలేదు.(7)

"ఈ దేవియందు పుట్టబోవు బిడ్డను ఎవ్వడైన సహింపగలడా?" అని బ్రహ్మదేవుడు మొదలైన దేవతలందరును కలత చెంది, దేవాధిదేవుడైన మహాదేవా! నీవు ఈ లోకమునకు హితము చేయుటయందు ఆసక్తిగలవాడవు. మేమంతా నమస్కరించుచున్నాము. మమ్మనుగ్రహింపుము.(8, 9)

సురోత్తమా! నీ తేజస్సును లోకములు ధరింపజాలవు. దేవితో కూడ వేదోక్తప్రకారమున తపస్సు చేయుము. నీ తేజస్సును నీ యందే ధరించి మూడు లోకములకును హితము చేకూర్చుము." అని ప్రార్థించిరి.(10, 11)

సర్వలోకమహేశ్వరుడు దేవతల వాక్యము విని, "తప్పక అటులనే అగుగాక!" అని పలికి మరల ఇట్లనెను. "ఉమాసహితుడనైన నేను నా తేజస్సును(రేతస్సును) తేజస్సునందే (నా శరీరమునందే) ధరించెదను. దేవతలును, పృథివియు



భయపడకుందురుగాక! (12, 13)

కాని, స్వస్థానమునుండి(యిప్పటికే) చలించిన నా యీ శ్రేష్ఠమైన తేజస్సును ఎవరు ధరింతురో చెప్పుడు."(14)

ఆ మాటలు విని దేవతలు ఈశ్వరునితో ఇట్లనిరి, "చలించిన నీ తేజస్సును భూమి ధరించగలదు".(15)

దేవతలు చెప్పిన విధముగ మహేశ్వరుడు తేజస్సును భూమిపై విడువగా అది పర్వతారణ్యాదులతో సహా భూమిపై అంతటను వ్యాపించెను.(16)

అది చూచి దేవతలు, "వాయువుతో కూడినవాడవై ఈ ఈశ్వరతేజస్సులో ప్రవేశించుము." అని అగ్నిని ఆదేశించిరి.(17)

ఆ తేజస్సు అగ్నిచేత వ్యాప్తమై శ్వేతపర్వతముగ అయినది. అచటనే అగ్న్యాదిత్యులతో సమానమైన, దివ్యమైన శరవణము కూడ బయలుదేరినది. దానియందే మహాతేజఃశాలి, అగ్నినుండి పుట్టినవాడు, కృత్తికల కుమారుడు అయిన కుమారస్వామి జన్మించెను.(18)

పిమ్మట దేవతలును, మహర్షులును చాల సంతసించినవారై ఉమాదేవిని, పరమేశ్వరుని ఎక్కువగా పూజించిరి. ఉమాదేవి కోపించి, ఎఱ్ఱబడిన నేత్రములతో,

దేవతల నందరిని.(19, 20)

"పుత్రుడు కావలెనను కోరికచే మేమిరువురము చేయుచున్న సంభోగమునకు అడ్డు తగిలినారు గావున మీకు మీ భార్యలయందు సంతానము కలుగుకుందుగాక! నేడు మొదలు మీ భార్యలకు సంతానము కలుగుకుందుగాక." అని శపించినది. ఆమె పృథివిని గూడ, "ఓ భూమీ! నీవు అనేక రూపములు కలదానవుగాను, అనేకులకు భార్యవుగాను అగుదువుగాక. నువ్వు చాల చెడ్డబుద్ధి గలదానివి! నాకు పుత్రుడు జనించుటకు ఇష్టపడని నీవు నా కోపమునకు ఫలితముగా పుత్రులవలన ఆనందమును పొందకుందువుగాక." అని శపించెను.(21-24)

అపుడు మహేశ్వరుడు సిగ్గుచెందిన సురుల నందరిని చూచి, అచటినుండి పశ్చిమదిక్కువైపు వెళ్లుటకు బయలుదేరెను. మహేశ్వరుడు హిమవత్పర్వతమునందే పశ్చిమదిక్కుగా వెళ్లి, దాని ఉత్తరపార్శ్వమునం దున్న శిఖరముపై, ఉమాసమేతుడై తపస్సు చేసెను.(25, 26)

రామా! ఉమాదేవికి సంబంధించిన కథ చెప్పితిని. ఇపుడు నీవును, లక్ష్మణుడును, గంగాప్రభావమును వినుడు."(27)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పది ఆరవసర్గము సమాప్తము.

ముప్పది ఏడవ సర్గము

గంగనుండి కార్తికేయుడు జనించుట.

"ఈ విధముగ పరమేశ్వరుడు తపస్సు చేయుచుండగా, దేవతలును, ఋషులును, సేనానాయకుడు కావలెనని కోరుచు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లిరి.(1)

అగ్నిని ముందు ఉంచుకొని వెళ్లిన ఆ ఇంద్రాదిదేవత లందరును బ్రహ్మదేవునకు నమస్కరించి ఇట్లు పలికిరి.(2)

"పూర్వము నీవు మాకు సేనాపతిగా ఇచ్చిన మహేశ్వరుడు ఉమాదేవితోకూడ గొప్ప నియమము నవలంబించి తపస్సు చేయుచున్నాడు. ఈ విషయమున లోకక్షేమముకొరకై ఇపు డేమి చేయవలెనో అది చేయుము. తగు ఉపాయములు

నీకే తెలియును. మాకు శరణము నీవే గదా?"(3, 4)

దేవతల వాక్యము విని పితామహుడు వారిని మధురములైన మాటలచే ఓదార్చుచు ఇట్లు పలికెను.(5)

"ఉమాదేవి చెప్పిన విధముగ మీకు మీ భార్యలయందు పుత్రులు పుట్టరు. ఆమె మాటకు అడ్డు లేదు. ఇది సత్యము.(6)

ఆకాశమునందు ప్రవహించుచున్న ఈ గంగ ఉన్నది కదా. ఈమెయందు అగ్నిదేవుడు, దేవతలకు సేనాపతియై శత్రుసంహారము చేయు పుత్రుని పుట్టించును. హిమవంతుని జ్యేష్ఠపుత్రియైన గంగ అగ్నిదేవునినుండి ఆ గర్భమును స్వీకరించును. ఇది యంతయు ఉమకు కూడ అంగీకారయోగ్య మగును. సందేహము లేదు."(7, 8)

రామా! ఆ దేవతలందరును బ్రహ్మదేవుని వాక్యము విని సఫలీకృతమనోరథులై ఆయనకు నమస్కరించి పూజించిరి.(9)

దేవతలందరును ధాతువులచే అలంకృతమగు కైలాసపర్వతమునకు పోయి, అగ్నిదేవుని ఆజ్ఞాపించుచు, "ఓ అగ్నిదేవా! ఈ దేవతాకార్యమును చేయుము. నీయందున్న మహేశ్వరుని తేజస్సును హిమవంతుని పుత్రి యగు గంగయం దుంచుము." అని పలికిరి.(10, 11)

అగ్నిదేవుడు "అటులనే" అని దేవతలకు మాట యిచ్చి, గంగను సమీపించి, 'దేవీ! గర్భమును ధరింపుము. ఈ కార్యము దేవతలకు ప్రియమైనది.' అని పలికెను.(12)

అగ్నిదేవుని మాట విని గంగ దివ్యమైన రూపమును ధరించెను. ఆమె మహిమను చూచి అగ్నిదేవుడు తన దేహము ఆమెపై అంతటను వ్యాపించునట్లు చేసి, తనలోనున్న పరమేశ్వరవీర్యము ఆమెయందు అంతటను వ్యాపించునట్లు విడచెను. దానితో గంగ అవయవములన్నియు నిండిపోయినవి.(13, 14)

పిమ్మట ఆ గంగ సర్వదేవతలకును ముందుండెడు ఆ అగ్నిదేవునితో ఇట్లు పలికినది. "అగ్నిదేవా! విజృంభించిన నీ ఈ తేజస్సును నేను ధరింపజాలను. ఈ తేజస్సు నన్ను దహింపచేయుచున్నది. నాకు స్పృహ తప్పిపోవుచున్నది".(15)

అగ్నిదేవుడు గంగతో, "ఈ గర్భమును ఇచట, హిమవత్పర్వత సమీపము నందున్న చిన్న పర్వతముపై విడువుము." అని చెప్పెను.(16)



అపుడా గంగ అగ్నిదేవుడు చెప్పిన విధమున, మిక్కిలి ప్రకాశించుచున్న ఆ గర్భమును తన అవయవములనుండి అచట విడచెను. గంగ వదలిపెట్టగా బయటకు వచ్చి భూమిపై పడిన, కరిగిన బంగారముతో సమానమైన కాంతి గల తేజస్సు నుండి మంగళకరమైన బంగారము, పరిశుద్ధమైన వెండియు పుట్టెను. అచట, రేతస్సులో నున్న క్షారము నుండి రాగి, ఇనుము పుట్టినవి. ఆ రేతస్సులోని మలము తగరముగాను, సీసముగాను అయినది. ఈవిధముగ ఆ వీర్యము నేలపైబడి అనేక ధాతువుల రూపములో వృద్ధి పొందినది.(17-20)

ఆ గర్భమును అచట విడువగనే పర్వతముపై మొలచిన శరవణ మంతయు కాంతులచే రంజింపబడినదై, సువర్ణమయ మైపోయినది. అది మొదలు అగ్నితో సమానమైన కాంతిగల బంగారము జాతరూపము(పుట్టిన రూపము కలది) అని ప్రసిద్ధి చెందినది. తృణము, వృక్షములు, లతలు, పొదలు, అన్నియు బంగారముగా మారిపోయినవి.(21, 22)

అంతట కుమారుడు పుట్టెను. అతనికి కృత్తికలు అందరును కలసి ఒకే కాలమునందు పాలు ఇచ్చి ఆదరించవలెనని, ఇంద్రసమేతులగు దేవతలు ఏర్పాటు చేసిరి.(23)

ఆ కృత్తికలు తమలో తాము నిర్ణయము చేసుకొని, "ఈ పిల్లవాడు మా కందరకును పుత్రుడు కావలెను." అని దేవతలతో ఒక ఉత్తమమైన ఒప్పంద మేర్పరచుకొని, అపుడే పుట్టిన ఆ పిల్లవానికి చనుబాలు ఇచ్చిరి. "ఈ పుత్రుడు కార్తికేయుడు(కృత్తికల కుమారుడు) అని మూడు లోకములలో ప్రసిద్ధి పొందును. సందేహము లేదు." అని దేవతలందరును పలికిరి.(24, 25)

దేవత లిట్లు చెప్పగా, గర్భస్రావమునందు జారిపడి అగ్నివలె శోభతో ప్రకాశించుచున్న ఆ పిల్లవానికి కృత్తికలు స్నానము చేయించిరి. మహాభాగ్యవంతుడు, అగ్నితుల్యుడు, గర్భస్రావము వలన జారిపడినవాడు అయిన ఆ కార్తికేయునకు

"స్కందుడు" (జారిపడినవాడు) అని కూడ పేరు పెట్టిరి.(26, 27)



ఆ కృత్తికల స్తనములలో అత్యుత్తమమైన క్షీరము పుట్టినది. ఆ శిశువు ఆరు ముఖములు కలవాడై, ఆ ఆరుగురి స్తనములలో పుట్టిన క్షీరమును ఒక్క సమయముననే త్రాగెను. సామర్థ్యశాలియగు ఆ కుమారుడు ఒక్క దినమునందు మాత్రమే పాలు త్రాగి, సుకుమారశరీరవంతుడైనను, తన పరాక్రమముచే దైత్యసేనలను జయించెను.(28, 29)

అగ్ని మొదలగు దేవత లందరును కలిసి సాటిలేని కాంతిగల ఆతనిని దేవసేనానాయకునిగా అభిషేకించిరి.(30)

రామా! గంగకు సంబంధించిన విస్తృతకథను, ధన్యత్వమును కలిగించునది, పుణ్యము అయిన కుమారసంభవ వృత్తాంతమును చెప్పితిని.(31)

భూలోకమున కుమారస్వామియందు భక్తి గల మానవుడు దీర్ఘాయుర్దాయవంతుడై, పుత్రపౌత్రాది సౌఖ్యములు అనుభవించి మరణానంతరము స్కందుని లోకము చేరును."(32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పదియేడవసర్గము సమాప్తము.

ముప్పది ఎనిమిదవ సర్గము

సగరచక్రవర్తి యాగము ప్రారంభించుట.

విశ్వామిత్రుడు రామునకీ కథ చెప్పి మరల అతనితో ఇట్లనెను.(1)

"పూర్వము అయోధ్యాధిపతి, శూరుడు, ధర్మాత్ముడు అయిన సగరు డను రాజు ఉండెను. సంతానము కలుగకపోవుటచే అతడు సంతానమును కోరుచుండెను.(2)

విదర్భాధీశుని కూతు రగు కేశిని సగరుని పెద్ద భార్య. ఆమె మిక్కిలి ధార్మికురాలు. సత్యమునే పలికెడిది. అరిష్టనేమి కుమార్తె, రూపముచే భూలోకమునందు సాటిలేనిది సుమతి సగరుని రెండవ భార్య.(3, 4)

భార్య లిద్దరితో కలిసి రాజు హిమవత్పర్వతమునకు పోయి, భృగుప్రస్రవణ మనెడు పర్వతమునందు తపస్సు చేసెను.(5)

అతడు తపస్సు చేయుచుండగా నూరు సంవత్సరములు గడచినవి. సత్యవంతులలో శ్రేష్ఠుడైన భృగుమహర్షి సగరుని తపస్సునకు సంతోషించి అతనికి వరమిచ్చెను.(6)

"ఓ పుణ్యాత్మా! నీకు అత్యధికసంతానప్రాప్తి కలుగును. లోకములో సాటిలేని కీర్తి కూడ లభించును. నాయనా! ఒక భార్య నీ వంశమును నిలుపు ఒక కుమారుని, మరియొక భార్య అరువదివేలమంది కుమారులను కనగలరు." అని చెప్పెను.(7, 8)

అపుడా రాజపుత్రికలు చాల సంతసించి, చేతులు జోడించి, ఆ విధముగ పలికిన ఆ మహాత్ముని అనుగ్రహింపచేసికొని, "బ్రహ్మర్షీ! మా ఇద్దరిలో ఒక్క కుమారుడు ఎవతెకు కలుగును, చాలమంది ఎవతెకు కలుగుదురు? వినవలె నని కోరుచున్నాము. నీ వాక్యము సత్యమగుగాక!" అని అడిగిరి.(9, 10)

వారి మాటలు విని పరమధార్మికుడైన ఆ భృగుమహర్షి "ఈ విషయమున మీరే కోరుకొనుడు. వంశకరుడైన ఒక్క కుమారుడు కావలెనా? మహాబలవంతులును, కీర్తిమంతులును, మహోత్సాహవంతులును అగు చాలమంది పుత్రులు కావలెనా? మీలో ఎవరికి ఏ వరము కావలెను?" అని పలికెను.(11, 12)

కేశిని, మునివాక్యమును విని, రాజు సన్నిధిలో, "నాకు వంశకరు డగు పుత్రుడు కావలెను." అని కోరుకొనెను. గరుత్మంతుని సోదరియగు సుమతి మహోత్సాహవంతులును, కీర్తిమంతులును అగు అరువదివేలమంది పుత్రులను కోరెను. భార్యాసమేతుడైన సగరచక్రవర్తి, ఋషికి ప్రదక్షిణనమస్కారములు చేసి తన పురమునకు వెళ్లెను.(13-15)

కొంతకాలము గడచిన పిమ్మట, జ్యేష్ఠభార్యయైన కేశినియందు, సగరచక్రవర్తికి అసమంజు దను పేరుగల పుత్రుడు కలిగెను. సుమతి సొరకాయ వంటి గర్భపిండమును కనెను. ఆ గర్భపిండము పగులగా అరువదివేలమంది పుత్రులు బైటకు వచ్చిరి.(16, 17)

పెంపుడు తల్లులు వారిని నేతితో నింపిన పాత్రలలో ఉంచి పెంచిరి. చాలకాలమునకు వారు యౌవనవంతులైరి. సగరుని అరువదివేలమంది కుమారులును దీర్ఘకాలమునకు రూపయౌవనములతో ప్రకాశించుచు పెరిగిరి. (18, 19)

సగరుని జ్యేష్ఠకుమారుడు ప్రతిదినము చిన్నపిల్లలను పట్టుకొని, సరయూనదీ జలములోనికి విసిరివేసి, వాళ్లు మునకలు కొట్టుచుండగా చూచి ఆనందించు చుండెడివాడు. ఈవిధముగ పాపకార్యములు చేయుచు, సజ్జనులను బాధించుచు, పౌరులకు అహితము చేయుటలో ఆసక్తుడైన ఆ పుత్రుని, సగరుడు పట్టణమునుండి వెడలగొట్టెను.(20, 21)

ఆ అసమంజుని కుమారుడు అంశుమంతుడు. అతడు పరాక్రమశాలి. సకలలోకమునకును ఇష్టుడు. అందరితోను ప్రియముగా మాటలాడువాడు.(22)

పిమ్మట చాల కాలమునకు సగరునకు యజ్ఞము చేయవలెనని ఆలోచన కలిగెను. అపుడు వేదజ్ఞుడైన అతడు ఉపాధ్యాయులతో కూడ యజ్ఞానుష్ఠానము విషయమున నిశ్చయించుకొని యాగము చేయ ప్రారంభించెను."(23, 24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పది ఎనిమిదవసర్గము సమాప్తము.

ముప్పది తొమ్మిదవ సర్గము

యజ్ఞాశ్వమును దేవేంద్రుడు అపహరించుట, సగరుని కుమారులు యజ్ఞాశ్వమును వెదకుచు భూమిని భేదించుట.

రాముడు విశ్వామిత్రుని వచనమును విని, చాల సంతసించి, కథాంతమున ప్రజ్వలించుచున్న అగ్నివలె ఉన్న అతనితో, "ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! మా పూర్వపురుషుడైన సగరచక్రవర్తి యజ్ఞము ఎట్లు చేసెనో సవిస్తరముగా వినగోరుచున్నాను." అని పలికెను. (1,2)

విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వి రామునితో ఇట్లు పలికెను. "రామా! మహాత్ముడైన సగరుని కథావిస్తరమును చెప్పెదను. వినుము. (3)

మహేశ్వరుని మామగారైన హిమవత్పర్వత మను పర్వతశ్రేష్ఠము వింధ్యపర్వతమును చూచుచున్నది. అట్లే వింధ్యము హిమవత్పర్వతమును చూచుచున్నది. ఆ రెండు పర్వతములును, పరస్పరము చూచుకొనుచుండును. ఆ రెండు పర్వతముల మధ్యనున్న ప్రదేశము యజ్ఞము చేయుటకు చాలా ప్రశస్తమైనది. అందువలన సగరుని యజ్ఞము ఆ ప్రదేశమందునే జరిగినది. (4, 5)

సగరుని ఆజ్ఞ ప్రకారము మహారథుడైన అంశుమంతుడు యజ్ఞాశ్వమును రక్షించుచు దాని ననుసరించెను. (6)

దేవేంద్రుడు రాక్షసరూపమును ధరించి, ఉక్తదివస మను పర్వమునందు సగరుని యజ్ఞాశ్వమును అపహరించెను. (7)

మహాత్ముడైన సగరుని యజ్ఞీయాశ్వము అపహరింపబడుచుండగా ఋత్విక్కులందరును యజమానునితో, "రాజా! ఈ పర్వసమయమునందు నీ యజ్ఞాశ్వమును ఎవ్వరో వేగముగ అపహరించి తీసికొనిపోవుచున్నారు. వానిని సంహరించి యజ్ఞాశ్వమును తీసికొనిరమ్ము. ఈ యజ్ఞాపరాధము మన అందరికిని అమంగళకరము, అందువలన యజ్ఞములో అపచారము కలుగకుండునట్లు చేయుము" అని పలికిరి. (8–10)

సగరుడు ఋత్విక్కుల వాక్యములు విని ఆ యజ్ఞసదస్సులో ఉన్న అరువదివేలమంది కుమారులతో, "పురుషశ్రేష్ఠులైన పుత్రులారా! ఇచటకు రాక్షసులు రాజాల రని నా విశ్వాసము. ఏలననగా ఈ క్రతువును జరిపించువారు మంత్రములచే



పవిత్రులైన మహానుభావులు. మీరందరును వెంటనే బయలుదేరుడు. సముద్రములచే చుట్టబడియున్న భూమినంతను వెదకుడు.(11-13)

మీరు ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనము చొప్పున భూమియొక్క విస్తారమును పంచుకొని, అశ్వమును హరించినవానిని వెదకుచు, అశ్వము కనబడునంతవరకును భూమిని త్రవ్వుడు. ఇది నా యాజ్ఞ. మీకు యాగాశ్వము కనబడువరకును, దీక్ష వహించిన నేను, ఋత్విక్కులును, పౌత్రుడును ఇచటనే ఉండగలము." అని పలికెను.(14, 15)

సగరుడు ఇట్లు పలుకగనే మహాబలశాలు లగు ఆ రాజపుత్రులు ఉత్సాహవంతులై, తండ్రి ఆజ్ఞప్రకారము భూమినంతను వెదకుటకు వెళ్లిరి. ఒక్కొక్కడు ఒక నలుచదురపు యోజనము చొప్పున భూప్రదేశమును వజ్రమువంటి సారము గల నఖములతో బ్రద్దలుగొట్టిరి. వారీవిధముగ వజ్రములవంటి శూలములచేతను, భయంకరమైన నాగళ్లచేతను భూమిని భేదించుచుండగా గొప్ప ధ్వని బయలుదేరెను. ఎన్నియో సర్పములు, అసురులు, రాక్షసులు, ఇతర జంతువులు నలిగిపోవుటచే సహింపరాని ఆర్తధ్వని బయలుదేరినది.(16-19)

ఆ వీరులు అరవైవేల యోజనముల భూమి పాతాళమైపోవునట్లుగా త్రవ్విరి. పర్వతములతో ఇరుకుగా ఉన్న జంబూద్వీపమును ఈవిధముగ త్రవ్వుచు అంతటను సంచరించిరి.(20, 21)

పిమ్మట దేవతలు, గంధర్వులు, అసురులు, పన్నగులు అందరును కలతచెంది బ్రహ్మదేవుని వద్దకు వెళ్లిరి. మిక్కిలి భయముతో దిగులుచెందిన ముఖములుగల వారందరును మహాత్ముడైన బ్రహ్మదేవుని అనుగ్రహింపచేసికొని,(22, 23)

"భగవంతుడా! సగరకుమారులు భూమినంతను త్రవ్వివేయుచున్నారు. పాతాళములో నివసించు ఎందరో మహాత్ములను చంపివేయుచున్నారు. 'వీడే మన అశ్వమును అపహరించుచున్నాడు. మన యజ్ఞమును చెరచినవాడు వీడే." అని అనుచు వారు కనబడిన ప్రతి ఒక్కప్రాణిని చంపుతున్నారు" అని మొరపెట్టుకొనిరి".(24, 25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ముప్పదితొమ్మిదవసర్గ సమాప్తము.

నలుబదియవ సర్గము

సగరకుమారులు కపిలుని క్రోధాగ్నికి భస్మమగుట.

(విశ్వామిత్రుడు తరువాత జరిగిన కథను చెప్పెను.)

"దైవబలముచేత వివశులై మిక్కిలి భయపడిన దేవతలతో బ్రహ్మదేవుడు ఇట్లనెను.

'ఈ సమస్తభూమియు ఏ వాసుదేవునకు చెందినదో అట్టి వాసుదేవుడు, కపిలావతారము నెత్తి సర్వదా ఈ భూమిని ధరించుచున్నాడు. ఈ సగరకుమారులు ఆ కపిలుని కోపాగ్నిచే భస్మము కాగలరు. ఈ విధముగా భూమి త్రవ్వబడు ననియు, అల్పాయుష్కులగు సగరకుమారులు నశించెదరనియు ఏనాడో నిర్ణయింపబడినది." అని చెప్పెను.(1-3)

ముప్పదిముగ్గురు దేవతలును, ఇతరులును, బ్రహ్మదేవుని మాటలు విని,చాల సంతోషించి తమతమ స్థానములకు వెళ్లిపోయిరి.(4)

ఈ విధముగా భూమిని బ్రద్దలుకొట్టుచున్నప్పుడు సగరకుమారులకు పిడుగువంటి ధ్వని వినబడెను. అది వారి వినాశమును సూచించెను.(5)

ఆ సగరకుమారు లందరును భూమిని త్రవ్వుకొనుచు పోయి ఒక చుట్టు తిరిగి వచ్చిరి. అశ్వము కనబడలేదు. అంత వారందరును కలిసి తండ్రివద్దకు

పోయి, "తండ్రీ! భూమండల మంతయు తిరిగితిమి. బలవంతులైన ఎందరో దేవదానవరాక్షస పిశాచోరగకిన్నరులను పరిమార్చితిమి. ఆ గుఱ్ఱము గాని, దాని నపహరించినవాడు గాని కనబడలేదు. ఇపుడేమి చేయవలెనో ఆలోచించి చెప్పుము" అని పలికిరి.(6-8)

పుత్రుల మాటలు విని సగరుడు కోపముతో, "మరల త్రవ్వి భూతలమును భేదింపుడు. అశ్వమును హరించినవానిని పట్టుకొని, కార్యము పూర్తియైన పిమ్మటనే తిరిగి రండు." అని ఆజ్ఞాపించెను.(9, 10)

తండ్రియైన సగరుని ఆజ్ఞ ననుసరించి ఆ అరువదివేల మంది కుమారులను పాతాళలోకమునకు శీఘ్రముగ పోయిరి. ఆ ప్రదేశమును త్రవ్వుచున్నపుడు వారికి అచట పర్వతమంత పరిమాణముగల విరూపాక్ష మను దిగ్గజము కనబడెను. ఆ దిగ్గజము పర్వతవనాదిసహితముగా ఈ భూమినంతను తన శిరస్సుపై మోయుచుండును. ఆ మహాగజము అలసట కలిగినపుడు అప్పుడప్పుడు, విశ్రాంతికొరకై శిరస్సును కదల్చుచుండును. అపుడు భూకంపము కలుగుచుండును. (11-14)

వారు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణము చేసి, పూజించి, భూమిని భేదించుకొనుచు పాతాళమునకు పోయిరి. పిమ్మట తూర్పుదిక్కును తరువాత దక్షిణదిక్కును భేదించిరి. దక్షిణదిక్కునందు కూడ వారు గొప్ప పర్వతముతో సమానమైన మహాపద్మ మనెడు మహాగజమును చూచిరి. అది కూడ శిరస్సుపై భూమిని మోయుచుండెను. దానిని జూచి వారు చాల ఆశ్చర్యము చెందిరి.(15-17)

పిమ్మట మహాత్ముడైన సగరుని అరువదివేలమంది కుమారులు, ఆ దిగ్గజమునకు ప్రదక్షిణము చేసి, పశ్చిమదిక్కునందు త్రవ్విరి. మహాబలవంతులైన ఆ సగరపుత్రులు పశ్చిమదిక్కునందు కూడ పర్వతసమానమైన సౌమనస మనెడు దిగ్గజమును చూచిరి. వారు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణనమస్కారములు చేసి, కుశలప్రశ్న వేసి, అచటినుండి, భూమిని త్రవ్వుకొనుచు ఉత్తరమువైపు వెళ్లిరి.(18-20)

ఉత్తరదిక్కునందు, వారు మంగళకరమైనది, మంచువలె తెల్లగా ఉన్నది, భూమిని మోయుచున్నది అగు భద్ర మనెడు దిగ్గజమును చూచిరి. సగరుని అరువదివేలమంది కుమారులును ఆ దిగ్గజమును స్పృశించి, ప్రదక్షిణ నమస్కారములు చేసి మరల భూమిని త్రవ్విరి. పిమ్మట ఆ సగరకుమారు లందరును ప్రసిద్ధమైన ఈశాన్యదిక్కునకు వెళ్లి, రోషముతో భూమిని త్రవ్విరి.(21-23)



భయంకరమైన వేగము, గొప్ప బలముగల ఆ మహాత్ములు అందరును అచట కపిలరూపములో నున్న సనాతనపురుషుడైన శ్రీమహావిష్ణువును, అతని సమీపమున గడ్డి మేయుచు తిరుగుచున్న అశ్వమును చూచి చాల సంతసించిరి.(24, 25)

వారు ఆ అశ్వమును గుర్తించిరి. వారి కళ్లు కోపముచే ఎఱ్ఱబారినవి. గునపములను, నాగళ్లను, వృక్షములను, శిలలను ధరించి, 'ఆగుమాగుము.' అని పలుకుచు ఆ కపిలునిమీదికి పరుగెత్తి వెళ్లి, "ఓరి దుర్బుద్ధీ! నీవు మా యజ్ఞాశ్వమును హరించినావు. మేము ఎవరమనుకొంటివి? సగరచక్రవర్తి కుమారులము." అని నిందించిరి.(26-28)

కపిలుడు వారి మాటలు విని కోపావిష్టుడై హుంకారము చేసెను.(29)

మహాత్ముడైన ఆ కపిలుడు హుంకరించగనే ఆ సగరపుత్రు లందరును భస్మమైపోయిరి." (30)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబదియవసర్గము సమాప్తము.

నలుబది ఒకటవ సర్గము

అంశుమంతుడు యజ్ఞాశ్వమును తీసుకొనివచ్చుట.

(విశ్వామిత్రుడు తదుపరి గాథను ఇట్లు చెప్పెను.)

"రఘునందనా! తన కుమారులు వెళ్లి చాలకాలమైనదని గుర్తించిన సగరచక్రవర్తి మనుమడు అంశుమంతునితో,(1)

'నీవు శూరుడవు. విద్యలన్నియు నేర్చినవాడవు. తేజస్సుచే పూర్వపురుషులతో సమానుడవు. నీవు వెళ్ళి నీ పినతండ్రుల జాడను, అశ్వమును అపహరించినవాని జాడను తెలుసుకొని రమ్ము. భూమిలోపల నుండు ప్రాణులు పరాక్రమము, మహాప్రమాణము కలవై ఉండును. వాటిని చంపుటకై ధనుస్సును, అస్త్రములను తీసికొని వెళ్లుము.(2, 3)

నమస్కరింపదగినవారికి నమస్కారము చేయుచు, విఘ్నములు కలుగ చేసినవారిని వధించుచు కార్యమును సాధించి తిరిగివచ్చి నా యజ్ఞమును పూర్తిచేయుము.' అని బోధించి వానిని పంపెను.(4)

మహాత్ముడైన సగరచక్రవర్తి ఈవిధముగ చక్కగా బోధింపగా, అంశుమంతుడు ధనుస్సును, ఖడ్గమును గ్రహించి, భూమిలోపల తన పినతండ్రులు త్రవ్విన మార్గమును అనుసరించి శీఘ్రముగా వెళ్లెను.(5, 6)

అంశుమంతుడు దారిలో దిగ్గజమును చూచెను. దైత్యులు, దానవులు, రాక్షసులు, పిశాచములు, పక్షులు, ఉరగులు దానిని పూజించుచుండిరి.(7)

అతడు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణనమస్కారములు చేసి, కుశలప్రశ్న కూడ వేసి, తన పినతండ్రులను గూర్చియు, అశ్వమును అపహరించినవానిని గూర్చియు అడిగెను. అంశుమంతుని వచనము విని దిగ్గజము, "అంశుమంతా! నీవు కృతార్థుడవై, అశ్వముతో శీఘ్రముగ తిరిగి రాగలవు." అని చెప్పెను.(8, 9)

అంశుమంతుడు ఆ దిగ్గజము మాట విని, మిగిలిన దిగ్గజములను కూడ ఒకదాని తరువాత ఒకదానిని, న్యాయానుసారముగ ప్రశ్నించుట ప్రారంభించెను. ఆ దిగ్గజము లన్నియు మాటలలో సారమును గ్రహింపగల్గినవి. ఎట్లు మాటలాడ వలెనో బాగుగ తెలిసినవి. అట్టి ఆ దిగ్గజములు అతనిని ఆదరించి, "అశ్వముతో తిరిగి వెళ్లెదవు." అని పలికి ప్రోత్సహించినవి.(10, 11)

ఆ దిగ్గజముల మాటలు వినిన తరువాత శీఘ్రముగ వెళ్లుచు తన పినతండ్రులైన

సగరకుమారులు భస్మరాశిగా పడివున్న చోటికి చేరెను. ఆ భస్మరాశిని చూచి వారు మరణించినందులకు చాల బాధపడుచు ఏడ్చెను. దుఃఖముతో ఏడ్చుచున్న ఆ అంశుమంతుడు అచట దగ్గరనే మేయుచు తిరుగుచున్న యజ్ఞాశ్వమును చూచెను.(12-14)

సగరపుత్రులకు జలతర్పణము లివ్వవలెనని తలచి ఉదకమునకై అన్వేషింపగా అచట జలాశయ మేదియు కనబడలేదు.(15)

పిమ్మట అతడు నలువైపులా చూడగా అచట పక్షిరాజు, వాయుసమానుడు, పినతండ్రుల మేనమామయు అయిన గరుత్మంతుడు కనబడెను. మహాబలశాలియగు వైనతేయుడు అంశుమంతుని చూచి ఇట్లు పలికెను. "ఓ అంశుమంతుడా! దుఃఖింపకుము. మీ పినతండ్రుల మరణమునకు లోకు లందరును హర్షించుచున్నారు. మహాబలవంతులైన నీ పినతండ్రులను అప్రమేయమైన ప్రభావముగల కపిలుడు దగ్ధముచేసినాడుకదా! వీరికి లౌకికమైన ఉదకమును ఇచ్చుట యుక్తము కాదు. హిమవంతుని జ్యేష్ఠపుత్రికయగు గంగానది జలములలో నీ పినతండ్రులకు జలతర్పణము లిమ్ము.(16-19)

ఆ లోకపావని భస్మరాశులుగా చేయబడిన వీరి నందరిని పవిత్రింపచేయును. లోకమునకు ఇష్టురాలైన ఆ గంగచే తడపబడిన ఈ భస్మము సగరుని అరువది వేలమంది కుమారులను స్వర్గలోకము చేర్చును. అంతకు ముందు ఈ అశ్వమును తీసుకొనివెళ్లి నీ పితామహుడు ప్రారంభించిన యజ్ఞము జరిపింపుము." (20, 21)

అంశుమంతుడు గరుత్మంతుడు చెప్పిన విధముగ గుఱ్ఱమును తీసికొని తన పురము చేరి, యజ్ఞదీక్షితుడైన సగరచక్రవర్తి వద్దకు వెళ్లి జరిగిన విషయమును, గరుత్మంతుని మాటలను అతనికి తెలిపెను.(22,23)

సగరచక్రవర్తి అంశుమంతునినుండి ఘోరమైన ఆ వార్త విని చాల విచారించెను. (దుఃఖమును నియంత్రించుకొని) యజ్ఞమును శాస్త్రోక్తప్రకారము పూర్తిచేసెను.(24)

సగరచక్రవర్తి యజ్ఞము పూర్తిచేసికొని నగరములో ప్రవేశించెను. గంగను తీసికొనివచ్చుటకు ఉపాయ మేదియు అతడు కానజాలకపోయెను. చాలకాలమునకు గూడ గంగను తీసికొనివచ్చు ఉపాయము కానజాలక, అతడు ముప్పదివేల సంవత్సరములు రాజ్యము చేసి స్వర్గమునకు వెళ్లెను."(25, 26)

శ్రీమద్రామాయణమందలి బాలకాండలోని నలుబది ఒకటవసర్గము సమాప్తము.

నలుబది రెండవ సర్గము

గంగను భూలోకమునకు తెచ్చుటకై భగీరథుడు తపస్సు చేయుట.

(విశ్వామిత్రుడు ఇంకను ఇట్లు చెప్పెను.)

"రామా! సగరచక్రవర్తి మరణించినపిమ్మట మంత్రులును, ప్రజలును ధార్మికుడైన అంశుమంతుని రాజుగా చేసిరి. (1)

ఆ అంశుమంతుడు గొప్ప రాజుగా ఉండి రాజ్యము చేసెను. అతనికి దిలీపుడను కుమారుడు కలిగెను. అంశుమంతుడు రాజ్యభారమును దిలీపునకు అప్పచెప్పి, పుణ్యమైన హిమవత్పర్వతశిఖరముపై తీవ్రమైన తపస్సు చేసెను. ముప్పదిరెండువేల సంవత్సరములు తపోవనములో నివసించి, తపోధనము నార్జించి స్వర్గమును పొందెను. (2-4)

మహాతేజఃశాలియగు దిలీపుడు తన పితామహుల వధవృత్తాంతమును విని, చాల విచారించి, గంగను తీసికొనివచ్చుటకు ఉపాయమును తెలిసికొనలేకపోయెను. 'గంగను ఎట్లు తేవలెను? వీరికి జలతర్పణము లెట్లు ఈయవలెను? వీరిని ఎట్లు తరింపచేయవలెను?' అను ఆలోచనలతో బాధపడెను. (5, 6)

ధర్మమార్గమున గంగానయనమును గూర్చి నిత్యము ఆలోచించుచున్న ఆ దిలీపునకు, పరమధార్మికుడైన భగీరథుడనెడు కుమారుడు జనించెను. మహాతేజశ్శాలియగు ఆ దిలీపుడు అనేక యజ్ఞములు చేసి ముప్పదివేల సంవత్సరములు రాజ్యము పాలించెను. అతడు కూడా సగరపుత్రులను ఉద్ధరించు మార్గము తెలియక ఆ మనోవ్యథతోనే బాధపడుచు, పుత్రుడైన భగీరథుని రాజ్యమునందు అభిషిక్తుని చేసి, స్వయముగ సంపాదించిన పుణ్యకర్మలచే స్వర్గము చేరెను. (7-10)

ధార్మికుడును, మహాతేజఃశాలియును, రాజర్షియు అగు భగీరథునకు సంతానము కావలెనని కోరిక యుండెడిదిగాని సంతానము మాత్రము కలుగలేదు. (11)

భగీరథుడు గంగను స్వర్గమునుండి భూలోకమునకు తేవలెనను నిర్ణయముతో రాజ్యభారమును మంత్రులకు అప్పగించి గోకర్ణక్షేత్రమునకు పోయెను. అచట చేతులను పైకెత్తి, జితేంద్రియుడై, మాసమున కొకసారి మాత్రమే ఆహారము భుజించుచు, గ్రీష్మమునందు పంచాగ్నిమధ్యమున చాలకాలము తపస్సు చేసెను. (12)

అతడిట్లు ఘోరమైన తపస్సు చేయుచుండగా, వేలకొలది సంవత్సరములు గడచిపోయినవి. ప్రజలకు పతియు, సమర్థుడు అయిన భగవంతుడైన బ్రహ్మదేవుడు మహాత్ముడైన ఆ రాజు విషయమున సంతోషించి దేవతాగణములతో కలసివచ్చి తపస్సు చేయుచున్న మహాత్ముడైన ఆ భగీరథునితో, "భగీరథ మహారాజా! నీవు చేసిన గొప్ప తపస్సుకు సంతసించినాను. వరమును కోరుకొనుము" అనెను.(13-16)

భగీరథుడు, బ్రహ్మదేవుని సమీపించి, చేతులు జోడించి, "భగవంతుడా! నీకు నాపై అనుగ్రహము కలిగినచో, నా తపస్సుకు ఫలమున్నచో, సగరుని కుమారు లందరికిని నేను జలతర్పణములు చేయగల్గుదునుగాక! మహాత్ములైన మా ప్రపితామహు లందరును వారి భస్మము గంగాజలముచే తడుపబడినంతనే శాశ్వతముగ స్వర్గమును చేరుదురుగాక! దేవా! నా రెండవ వర మేమనగా - ఇక్ష్వాకు వంశీయులమైన మా కులమునందు సంతానము కలుగవలెను. మా వంశ మెన్నటికిని నశించకూడదు." అని ప్రార్థించెను. (17-20)

భగీరథుడు ఇట్లు పలుకగా విని, బ్రహ్మదేవుడు, మంగళకరము, మధురాక్షర భరితము, మధురము అయిన వచనము పలుకుచూ, "మహారథుడవైన భగీరథుడా! ఈ కోరిక చాల గొప్పది. దుర్లభమైనది. అయిననూ అట్లే అగుగాక. నీకు క్షేమమగుగాక! (21, 22)

హిమవంతుని పెద్దకూతురైన గంగ (ఆకాశమునుండి క్రిందికి పడునప్పుడు) ఆమెను వహింప గల సమర్థుడు శివు డొక్కడే. అందుచే అతనిని ఆ కార్యమునందు నియోగించవలెను. గంగ క్రిందికి పడుచున్నపుడు ఆ తాకిడిని భూమి సహింపజాలదు. ఆ గంగను ధరించుటకు ఈశ్వరుడు తప్ప మరెవ్వరును నాకు కనబడుటలేదు." అని చెప్పెను.(23, 24)

బ్రహ్మదేవుడు భగీరథునితో ఇట్లు చెప్పి, గంగతో కూడ మాటలాడి, దేవతలతోడను, మరుద్గణములతోడను స్వర్గమునకు వెళ్లెను."(25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది రెండవసర్గము సమాప్తము.

నలుబది మూడవ సర్గము

గంగ భగీరథునివెంట పాతాళమునకు వెళ్ళి సగరపుత్రులను ఉద్ధరించుట.

"రామా! బ్రహ్మదేవుడు వెళ్లిన పిదప, భగీరథుడు సంవత్సరకాలము భూమిపై కాలి బొటనవ్రేలుపై నిలిచి తపస్సు చేసెను.(1)

సంవత్సరకాలము పూర్తియైన పిమ్మట, సర్వలోకములకును పూజనీయుడగు ఉమాపతియైన మహేశ్వరుడు రాజుతో, "ఓ నరశ్రేష్ఠా! నీ తపస్సునకు సంతసించినాను. గంగను శిరస్సున వహించి నీకు ప్రియము చేకూర్చెదను." అని చెప్పెను.(2, 3)

పిమ్మట హిమవత్పుత్రి, సర్వలోకములచే నమస్కరింపబడినది అయిన గంగ గొప్ప ఆకారమును, సహింప శక్యముగాని వేగమును వహించి ఆకాశమునుండి పవిత్రమైన శివుని శిరస్సుపై పడెను.(4)

ధరించుటకు చాల కష్టమైన ఆ గంగాదేవి, "నా ప్రవాహమునందు శివుని గ్రహించి ఆతనితో సహా పాతాళమును ప్రవేశించెదను." అని తలచెను.(5)

అప్పుడు త్రినేత్రుడైన ఈశ్వరుడు ఆమె గర్వమును తెలిసికొని, ఆమె కనబడకుండ చేయవలెనని నిశ్చయించుకొనెను.(6)

పవిత్రమైన ఆ గంగ హిమవత్పర్వతముతో సమానమైనది, జటామండలమనెడు గుహలు కలది అయిన శివుని పవిత్రమగు శిరస్సుపై పడినది. ఆపైన ఎంత ప్రయత్నించినను ఆమె భూమిపై పడలేకపోయెను. ఆ జటామండలములో చిక్కుకొని బైటకు రాజాలక పోయెను. ఆ గంగ ఎన్నో సంవత్సరములు ఆ జటాజూటము లోపలనే తిరిగెను. ఆమె కనబడకపోవుటచే భగీరథుడు మరల తీవ్రమైన తపస్సు చేసెను. శివుడు ఆ తపస్సుచేత చాల సంతసించినవాడై, బిందుసరోవర ప్రాంతమునందు గంగను విడిచెను.(7-10)

శివుడు గంగను విడచినప్పుడు ఏడు ప్రవాహములు పుట్టినవి. వాటిలో హ్లాదిని, పావని, నళిని అను పవిత్రజలములుగల శుభములైన మూడు గంగలు తూర్పువైపు ప్రవహించినవి. సుచక్షువు, సీత, సింధునది అనెడు శుభోదకములు గల మూడు నదులును పశ్చిమదిక్కునకు ప్రవహించినవి.(11-13)

ఏడవ ప్రవాహము భగీరథుని అనుసరించెను. మహాతేజఃశాలి, రాజర్షియైన



భగీరథుడు దివ్యమైన రథము నెక్కి ముందు వెళ్లగా గంగ అతని వెనుక వెళ్లెను.(14)

గంగ ఆకాశమునుండి శివుని శిరస్సును, అచటనుండి భూమిని చేరినది. అచట జలము తీవ్రమైన శబ్దముతో ప్రవహించెను. అపుడు భూమిపై కొన్ని మత్స్యములు, తాబేళ్లు, మొసళ్లు మొదలైనవి పడినవి, కొన్ని పడుచున్నవి. వాటితో భూమి ప్రకాశించెను. (15, 16)

గంగ (అవిధముగా) ఆకాశమునుండి భూమిపై పడుచుండగా, దేవ-ఋషి-గంధర్వులు, యక్ష-సిద్ధాదులు ఆశ్చర్యముతో చూచిరి. నగరములవంటి విమానముల పైనను, వేగముగా కదిలెడి గుఱ్ఱముల మీదను, ఏనుగులమీదను ఎక్కి వచ్చిన దేవతలు అచట నిలచి ఉండిరి. లోకములో అత్యాశ్చర్యకరమైన ఉత్తమమైన ఆ గంగావతరణమును చూచుటకై గొప్ప తేజస్సుగల దేవత లందరును వచ్చిరి. మేఘములు లేని ఆకాశముమీద సురగణములు వచ్చి చేరగా వారి అలంకారముల కాంతిచేత నూర్గురు సూర్యు లున్నంత కాంతి కలిగెను.(17-20)

అపుడు మొసళ్లు, సర్పములు, మీనములు కదలుచు పడుచుండగా ఆకాశము మెఱపులచే వ్యాప్తమైన ట్లుండెను. వేయి విధములుగా చిమ్మబడుచున్న నీటి నురుగులతోను, హంసల సముదాయములతోను నిండిన ఆకాశము శరత్కాల మేఘములచేతను వ్యాప్తమైనది వలె ఉండెను.(21, 22)

ఆ గంగ కొన్నిచోట్ల శీఘ్రముగను, కొన్నిచోట్ల మెల్లగను, కొన్నిచోట్ల వంకరగను, కొన్నిచోట్ల పొడవుగను, కొన్నిచోట్ల క్రిందికిని, కొన్నిచోట్ల పైకిని ప్రవహించుచుండెను. కొన్నిచోట్ల నీటితో నీరు ఢీకొని, పైకెగసి మరల భూమిపై పడుచుండెను.(23,24)

ఆకాశమునుండి శంకరుని శిరస్సుపై బడి, పిమ్మట భూమిపై బడిన కల్మషము లేని ఆ ఉదకము నిర్మలముగా ప్రకాశించెను.(25)

శివుని శరీరమునుండి పడిన దగుటచే ఆ జలము పవిత్రమైనదను అభిప్రాయముతో అచట దేవఋషిగంధర్వులును, భూమిపై నివసించువారును దానిని స్పృశించిరి. శాపవశముచేత స్వర్గమునుండి భూలోకములో పడినవారు



గంగలో స్నానము చేసి, పాపవిముక్తు లైరి. ప్రకాశించుచున్న ఆ జలము పాపము లన్నింటిని కడిగివేయగా వారు ఆకాశములోనికి ఎగిరి తమ లోకములు చేరిరి.(26-28)

ప్రకాశించుచున్న ఆ జలమును చూచి జనులందరును చాల సంతసించి, ఆ గంగలో స్నానముచేసి శ్రమమును పోగొట్టుకొనిరి.(29)

ఏడవ ప్రవాహము భగీరథుని అనుసరించెను. మహాతేజఃశాలి, రాజర్షియైన భగీరథుడు దివ్యమైన రథము నెక్కి ముందు వెళ్లగా గంగ అతని వెనుక వెళ్లెను.(30)

భగీరథుని అనుసరించి గంగ వెళ్లుచుండగా, జలచరములే కాక, ఋషి-దైత్య-దానవ-రాక్షస-గంధర్వ - యక్ష - కిన్నర - మహోరగ - అప్సరసలు కూడ ఆ గంగ వెంట వెళ్లిరి.(31, 32)

భగీరథుడు ఎటువైపు వెళ్లెనో అటువైపునకే యశస్వినియు, నదీశ్రేష్ఠయు, సర్వపాపవినాశినియు అగు గంగ కూడ ప్రవహించుచు వెళ్లెను. ఆ మార్గములో అద్భుతమైన కార్యములు చేయగల జహ్నుమహర్షి ఆశ్రమముండెను. ఆ సమయమున ఆ మహర్షి ఒక యజ్ఞము చేయుచుండెను. గంగ ఆ యజ్ఞవాటికను ముంచివేసెను. (33, 34)

గంగ గర్వమును చూచి, కోపించి జహ్నుమహర్షి ఆ గంగాజలము నంతను త్రాగివేసెను. అది చాల ఆశ్చర్యకరముగ నుండెను.(35)

పిమ్మట, దేవతలును, గంధర్వులును, ఋషులును చాల ఆశ్చర్యము చెందినవారై, పురుషశ్రేష్ఠుడు, మహాత్ముడు అయిన జహ్నుమహర్షిని పూజించిరి. గంగను ఆ మహాత్ముని కుమార్తెనుగా చేయ నిర్ణయించిరి. మహాతేజస్సుగల ఆ జహ్నుమహర్షి సంతసించినవాడై, చెవులనుండి గంగను విడచెను. అందుచే గంగకు 'జహ్నుసుత' అనియు, 'జాహ్నవి' అనియు పేర్లు వచ్చినవి.(36-38)

నదులలో శ్రేష్ఠయైన ఆ గంగ మరల భగీరథుని అనుసరించి, వెళ్లి సముద్రములో ప్రవేశించి, సగరపుత్రులను తరింపచేయుట అను పని పూర్తిచేయుటకు

పాతాళమునకు వెళ్లెను.(39)

రాజర్షియైన భగీరథుడు ఇంత ప్రయత్నము చేసి గంగను (పాతాళమునకు) తీసుకొనివెళ్లెను. అచట భస్మమై పడియున్న పితామహులను చూచి, దుఃఖితు డయ్యెను.(40)

రామా! ఉత్తమమైన ఆ గంగోదకము ఆ భస్మరాశిని తడుపగా సగరకుమారు లందరును పాపములు నశించి స్వర్గము చేరిరి."(41)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది మూడవసర్గము సమాప్తము.

నలుబది నాల్గవ సర్గము

భగీరథుడు గంగాజలముచే పితృతర్పణము చేయుట.

"గంగానది తన వెనుకనే వచ్చుచుండగా, భగీరథుడు సముద్రమునకు వెళ్లి, అచటనుండి, సగరకుమారులు భస్మమై పడి ఉన్న పాతాళలోకములో ప్రవేశించెను.(1)

గంగాజలము భస్మమును ముంచెత్తిన పిమ్మట, సకలలోకప్రభువైన బ్రహ్మదేవుడు భగీరథునితో, 'రాజా! మహాత్ముడైన సగరుని అరువదివేలమంది కుమారులును తరింపచేయబడినవారై, దేవతలవలె స్వర్గమునకు వెళ్లినారు. లోకములో సాగరజల మున్నంతవరకును, సగరకుమారులు దేవతలవలె స్వర్గములో ఉండగలరు. ఈ గంగ నీకు పెద్దకుమార్తె కాగలదు. నీ పేరుతో సంబంధించిన 'భాగీరథి' అను పేరుతో లోకమునందు ప్రసిద్ధి పొందగలదు.(2-5)

గంగ త్రిపథగ అనియు, భాగీరథి యనియు ప్రసిద్ధి పొందును. మూడు మార్గములను, అనగా స్వర్గలోక - భూలోక - పాతాళలోక మార్గములను తన ప్రవాహముచే పవిత్రింప చేయుచున్నది గాన ఈమె త్రిపథగ అని చెప్పబడును.(6)

భగీరథా! ఈ గంగాజలముతో నీ పితామహు లందరికిని తర్పణములు చేసి నీ ప్రతిజ్ఞను నిలుపుకొనుము.(7)



గొప్ప కీర్తి కలవాడు, ధార్మికులలో శ్రేష్ఠుడు అయిన నీ పూర్వపురుషుడు సగరచక్రవర్తికూడ ఆనాడు, ఈ కోరికను తీర్చుకొనజాలకపోయెను. లోకములో సాటిలేని తేజస్సుగల అంశుమంతుడుగూడ గంగను తీసుకొనిరావలె ననెడు ప్రతిజ్ఞను పూర్తిచేసికొనలేకపోయెను. రాజర్షియు, గుణవంతుడు, మహర్షులతో సమానమైన తేజస్సు కలవాడు, నావంటి తపస్సు కలవాడు, క్షత్రియధర్మమును అవలంబించినవాడు, మంచి తేజస్సు కలవాడు, అయిన నీ తండ్రి దిలీపుడు గంగను తీసుకొనిరావలెనని కోరెనుగాని తీసికొనిరాలేక పోయెను.(8–11)

పురుషశ్రేష్ఠుడా! ఆ ప్రతిజ్ఞను నీవు దాటగలిగినావు. లోకములో చాల మెచ్చుకొనదగిన గొప్ప కీర్తిని సంపాదించుకొనినావు. నీవు గంగను క్రిందికి దింపుట వలన గొప్ప ధర్మప్రతిష్ఠను చేసినవాడవైనావు. స్నానోచితమైన గంగాజలమునందు నిత్యము స్నానము చేసి పవిత్రుడవై, పుణ్యాత్ముడవు అగుము. (12–14)

రాజా! నీ పితామహులందరికిని జలతర్పణము చేయుము. నీకు క్షేమమగుగాక! నేను వెళ్లెదను. నీవు కూడ నీ లోకమునకు వెళ్లుము." అని పలికెను.(15)

సమస్తలోకములకును పితామహుడైన ఆ బ్రహ్మదేవుడు ఈ విధముగ పలికి స్వర్గలోకమునకు మరలి వెళ్లెను.(16)

గొప్ప కీర్తిగల భగీరథుడు సగరకుమారు లందరికిని క్రమానుసారముగా శాస్త్రము ననుసరించి జలతర్పణములు చేసి, పవిత్రుడై తన పురమును ప్రవేశించెను. ఈవిధముగ చరితార్థుడై తన రాజ్యమును పరిపాలించెను.(17, 18)

భగీరథుడు రాజుగా ఉండుటచే లోకమంతయు సంతోషించెను. భగీరథుడు కూడ కోరిక తీరుటచే శోకము, మనస్తాపము తొలగి సుఖముగా నుండెను.(19)

రామా! గంగను గూర్చి విస్తృతమైన కథను చెప్పినాను. దీనిని వినుటచే మంగళమును పొందుము. నీకు క్షేమమగుగాక! సంధ్యాకాలము దాటిపోవుచున్నది. ఇక సంధ్యావందనాదికము చేసికొందము.(20)

ఈ గంగావతరణవృత్తాంతము ఐశ్వర్యమును, యశస్సును, ఆయుర్దాయమును, పుత్రులను, స్వర్గమును ఇచ్చును. దీనిని బ్రాహ్మణులకును, క్షత్రియులకును, ఇతరులకును వినిపించువాని విషయమున అతని పితృదేవతలును, దేవతలును సంతోషించెదరు.(21)

పవిత్రమైన ఈ గంగావతరణ కథను వినువాడు సమస్త కామములను పొందగలడు. అతని పాపము లన్నియు నశించును. ఆయుర్దాయము, కీర్తి వృద్ధిపొందును."(22, 23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబదినాల్గవసర్గము సమాప్తము.

నలుబది ఐదవ సర్గము

క్షీరసాగరమథనము, అమృతము ఆవిర్భవించుట.

రాముడు విశ్వామిత్రుని మాటలను విని, చాల ఆశ్చర్యము చెంది అతనితో,(1)

"ఓ బ్రహ్మర్షీ! నీవు చెప్పిన ఈ గొప్పదైన గంగావతరణము, సాగరమును నింపుటయు చాల ఆశ్చర్యకరములు." అనెను.(2)

విశ్వామిత్రుడు చెప్పిన కథను గూర్చి రామలక్ష్మణు లిరువురును ముచ్చటించుకొనుచుండగనే రాత్రి గడచిపోయినది.(3)

రాముడు ప్రశాంతమైన ప్రాతఃకాలమునందు, ఆహ్నికకృత్యము లన్నియు పూర్తిచేసికొని కూర్చున్న విశ్వామిత్రునితో, "ఓ మహాతపస్వీ! వినదగిన గొప్ప ఉపాఖ్యానమును వింటిమి. పూజ్యురాలైన రాత్రి గడచినది. నీవు చెప్పిన ఈ కథ

నంతను ఆలోచించుచుండగా, మా ఇద్దరికిని రాత్రి ఒక్కక్షణము వలె గడచిపోయినది. (4, 5)

నదులలో శ్రేష్ఠమైనది, పుణ్యమైనది అగు ఈ గంగానదిని దాటుదము. నీవు ఇచటికి వచ్చినట్లు తెలియగనే, ఇచటి పుణ్యాత్ములైన ఋషీశ్వరులు నదిని దాటుటకు చక్కటి నావను మెత్తని చాపలు మొదలైనవాటిచే కప్పి తీసికొని వచ్చినారు." అని పలికెను. (6, 7)

విశ్వామిత్రుడు మహాత్ముడైన రాముని మాటలు విని ఋషులు, రామలక్ష్మణులు, తానును నదిని దాటుటకు ఏర్పాటు చేయించెను. (8)

ఉత్తరతీరమును చేరి, నావచే తమను నదిని దాటించిన ఋషులను పూజించి, గంగాతీరమున విడిసియుండెను. అక్కటినుండి వారికి విశాలానగరము కనబడెను. (9)

విశ్వామిత్రుడు, రామలక్ష్మణసమేతుడై, రమ్యము, దివ్యము, స్వర్గతుల్యము అయిన విశాలానగరమునకు శీఘ్రముగ వెళ్లెను. (10)


బుద్ధిశాలియైన రాముడు విశాలానగరమును గూర్చి విశ్వామిత్రుని సవినయముగ ప్రశ్నించెను. "మహామునీ! ఇపుడు ఈ విశాలానగరమును ఏ రాజవంశమునకు చెందినవారు పాలించుచున్నారో వినవలెనని నాకు చాల కోరికగా ఉన్నది. (11, 12)

విశ్వామిత్రుడు రాముని వచనము విని ప్రాచీనమైన విశాలాపురవృత్తాంతమును చెప్పుటకు ప్రారంభించెను. (13)

"రామా! (ఈ ప్రదేశము కథ దేవేంద్రుని కథతో ముడిపడి యున్నది.) శుభమైన దేవేంద్రుని కథ చెప్పెదను. ఈ ప్రదేశములో ఏమి జరిగినదో కూడ చెప్పెదను. వినుము. (14)

పూర్వము కృతయుగమునందు దితిపుత్రులును, అదితిపుత్రులును మహాబలవంతులై, వీర్యవంతులై, పరమధార్మికులై ఉండెడివారు. వారందరూ, 'మనకు ముసలితనము, మరణము, రోగములు లేకుండ ఉండవలెను. ఇందుకు ఉపాయమేమి?' అని ఆలోచింపసాగిరి. (15, 16)

ఈవిధముగ ఆలోచించగా ఆలోచించగా వారికి, 'మనము క్షీరసముద్రమును మథించి, అచట అమృతమును పొందెదము. (దానివలన వార్ధక్యము, మరణము



ఉండవు.)" అను అభిప్రాయము కలిగినది.(17)

అమితమైన తేజస్సుగల దేవతలు, రాక్షసులు అందరును క్షీరసాగరమును మథనము చేయవలెనని నిశ్చయించి, వాసుకిని త్రాడుగా చేసి, మందరపర్వతమును కవ్వముగా చేసి (సముద్రములో దింపి) మథింపసాగిరి.(18)

ఆ విధముగా సముద్రమథనము చేయుచుండగా వేయి సంవత్సరములు గడచినవి. అపుడు త్రాడుగా ఉన్న వాసుకి శిరస్సులు విషమును కక్కుచు దంతములచే శిలలను కరవ ప్రారంభించినవి. అగ్నితో సమానమైన హాలాహలమహావిషము బయలుదేరి దేవాసురమనుష్యసహితముగా జగత్తు నంతను కాల్చివేయుట మొదలుపెట్టినది.(19, 20)

దేవత లందరును మహాదేవుడును, సర్వజీవులకు పతియును అగు శంకరుని దగ్గరకు వెళ్ళి శరణువేడుచు, 'రక్షింపుము రక్షింపుము.' అని ప్రార్థించుచు స్తుతించిరి.(21)

దేవత లందరును సర్వరక్షణసమర్థు డగు ఆ దేవదేవేశ్వరుని ఈ విధముగ ప్రార్థించుచుండగా శంఖచక్రధారియైన విష్ణువు అచట ప్రత్యక్ష మాయెను. ఆ హరి చిరునవ్వు నవ్వుచు శూలపాణియైన శివునితో, "ఓ సురశ్రేష్ఠుడా! నీవు దేవత లందరికన్నను ముందు పుట్టినవాడవు. అందుచేత దేవతలు మథించుచున్నపుడు ముందుగ పుట్టినది నీకే చెందవలెను. కావున దీనిని అగ్రపూజగా భావించి ఈ విషమును గ్రహింపుము." అని పలికెను.(22-24)

విష్ణువు ఈవిధముగా పలికి అచటనే అంతర్ధానము చెందెను. శివుడు దేవతలకు కలిగిన భయమును చూచి, విష్ణువు చెప్పిన ప్రకారము, ఘోరమైన ఆ హాలాహలమును

అమృతమునువలె గ్రహించెను.(25)

దేవాధిపతియు, భగవంతుడును అయిన శివుడు, దేవతలను వీడ్కొని వెళ్లిపోగా దేవాసురు లందరును మరల మథింప మొదలిడిరి. కవ్వముగా ఉన్న ఆ పర్వతము (సముద్రములో దిగిపోయి) పాతాళమును ప్రవేశించెను. దేవతలును, గంధర్వులును విష్ణువును, "ఓ మహాబాహూ! నీవే సర్వభూతములకును గతియైనవాడవు. ప్రధానముగ దేవతలకు నీవే గతి. ఈ పర్వతమును పైకెత్తి మమ్ము రక్షింపుము," అని ప్రార్థించిరి.(26-28)

ఇంద్రియములకు శక్తిని కూర్చువాడగు హరి ఈ వాక్యమును విని, కూర్మరూపమును ధరించి, ఆ పర్వతమును వీపుపై మోయుచు సముద్రములో శయనించెను. సకలలోకాత్ముడు, పురుషోత్తముడు అయిన ఆ కేశవుడు, తాను దేవతలమధ్య కూడ నిలచి, పర్వతాగ్రమును ఆన్చి పట్టుకొని మథించెను.(29, 30)

ఈవిధముగా వేయి సంవత్సరములు గడచినవి. అంతట ముందుగా, దండకమండలములతో కూడిన ధన్వంతరియు, మంచి కాంతిగల అప్సరఃస్త్రీలును బయటకు వచ్చిరి. జలమును మథింపగా ఆ రసమునుండి ఆవిర్భవించుటచే ఆ స్త్రీలకు అప్సరసలు అను పేరు వచ్చినది. మంచి కాంతిగల అరువదికోట్లమంది అప్సర స్త్రీలు పుట్టిరి. వారికి లెక్కింపశక్యముకాని పరిచారిక లుండిరి. దేవదానవులలో ఎవ్వరును ఆ అప్సరసలను వివాహమాడలేదు. అందుచే ఆ అప్సరసలు అందరికి సాధారణలు (వేశ్యలు) అని చెప్పబడుచున్నారు.(31-34)

పిమ్మట వరుణుని కూతురు, మహాభాగ్యవతియు అయిన వారుణి (మద్యదేవత) తనను ఎవరు స్వీకరించెదరా అని వెదకుకొనుచు బయటకు వచ్చెను. ఆ వారుణిని దైత్యులు స్వీకరించలేదు. కాని అనిందిత యగు ఆమెను అదితిపుత్రులు స్వీకరించిరి.(35, 36)

సురను గ్రహింపకపోవుటచే దైత్యులు అసురులైరి. ఆమెను గ్రహించుటచే దేవతలు సురులైనారు. వారుణిని గ్రహించి సురులు సంతసించి చాల ఆనందించిరి.(37)

ఉచ్చైఃశ్రవ మనెడు శ్రేష్ఠమైన అశ్వము, కౌస్తుభ మనెడు శ్రేష్ఠమైన మాణిక్యము, ఉత్తమమైన అమృతము కూడ బయటకు వచ్చినవి. ఆ అమృతముకొరకై గొప్ప యుద్ధము జరిగినది. దేవతలు దైత్యులను చంపివేసిరి.(38, 39)

దైత్యు లందరును, రాక్షసులును ఒక పక్షముగా చేరిరి. మూడులోకములకు విభ్రాంతి కలిగించు అతిఘోరమైన యుద్ధము జరిగెను. అంతయు క్షయమైన తరువాత మహాబలుడైన విష్ణువు మాయామోహినీరూపము ధరించి, శీఘ్రముగా అమృతమును హరించెను.(40, 41)

కొందరు దైత్యులు నాశరహితుడు, పురుషోత్తముడు అయిన విష్ణువును యుద్ధములో ఎదిరించగా వారి నందరిని సమర్థుడైన విష్ణువు సంహరించెను. దైత్యులకును దేవతలకు జరిగిన ఆ ఘోరసంగ్రామమునందు వీరులైన దేవతలు దైత్యులను చంపిరి.(42, 43)

దేవేంద్రుడు దైత్యులను సంహరించి, రాజ్యమును పొంది, సంతోషించినవాడై, ఋషులు, చారణులు మొదలైనవారితో కూడిన లోకాలను పరిపాలించెను."(44)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది ఐదవసర్గము సమాప్తము.

నలుబది ఆరవ సర్గము

ఇంద్రుని చంపగల పుత్రునికై దితి తపస్సు చేయుట.

"రామా! ఈవిధముగ తన కుమారులందరును చంపబడుట చూచి దితి చాల దుఃఖించుచు, మరీచి కుమారుడైన, తన భర్త కాశ్యపుని, "దేవా! నీ కుమారులైన దేవతలు మహాబలశాలులు. వారు నా పుత్రులను చంపివేసినారు. నాకు గొప్ప బలము గలవాడు, దేవేంద్రుని చంపగలవాడు అయిన కుమారుడు కావలెను. అందుకై సుదీర్ఘమైన తపస్సు చేయవలెననుకొనుచున్నాను. నాకు అట్టి కుమారుని ఇమ్ము. నేను తపస్సు చేయుటకు అనుజ్ఞ ఇమ్ము." అని ప్రార్థించెను.(1-3)

మహాతేజశ్శాలియు, మరీచికుమారుడును అయిన కాశ్యపుడు ఆమె వచనములను విని అతిదుఃఖితురాలగు ఆమెతో,

"తపోధనులారా! అట్లే అగుగాక. నీకు క్షేమమగుగాక! యుద్ధములో దేవేంద్రుని చంపగల కుమారుడు నీకు కలుగును. నీవు పవిత్రముగా ఉన్నచో వేయి సంవత్సరములు నిండగనే మూడు లోకములకును ప్రభువైన కుమారుని నావలన

కనగలవు." అని పలికి దితిని హస్తముతో స్పృశించి, శరీరమంతయు తడవి, "క్షేమమగుగాక!" అని తపస్సు చేసుకొనుటకై వెడలిపోయెను. దితి చాల సంతసించి, కుశప్లవన మనెడు క్షేత్రము చేరి అతి తీవ్రమైన తపస్సు చేసెను.(4-8)

అమె తపస్సు చేయుచున్నప్పుడు దేవేంద్రుడు ఉత్తమమైన గుణసంపదతో ఆమెకు సేవ చేసెను. అతడు అగ్ని, కుశములు, సమిధలు, ఉదకము, ఫలములు, మూలములు, మొదలైన కావలసిన పదార్థముల నన్నింటిని ఆమెకు సమకూర్చుచు సేవ చేయుచుండెను. ఒడలు పట్టుట, శ్రమ దీర్చుట మొదలగు పనులు చేయుచు అన్ని కాలములందును ఆమెకు ఉపచారములు చేసెను.(9-11)

ఈవిధముగ తొమ్మిదివందల తొంబై సంవత్సరములు గడచినవి. అపుడు దితి చాల సంతసించి దేవేంద్రునితో ఇట్లు పలికెను.(12)

"దేవతలలో శ్రేష్ఠుడవైన ఓ ఇంద్రుడా! నేను కోరగా, నీ తండ్రి వేయి సంవత్సరముల తరువాత కుమారుడు కలుగగల దని నాకొక వరము నిచ్చెను. నేను తపస్సు చేయ ప్రారంభించిన తరువాత వేయి సంవత్సరములు పూర్తి అగుటకు ఇంకను పది సంవత్సరములు ఉన్నవి. పది సంవత్సరముల తరువాత సోదరుని చూడగలవు. నీకు శుభమగుగాక!(13, 14)

కుమారా! నీకొరకై అతనియందు జయాభిలాషను కలిగించెదను. నీవు అతనితో కలిసి, ఎట్టి బాధలును లేక మూడు లోకములను జయించి ఆ విజయానందమును అనుభవింపగలవు."(15)

దేవేంద్రునితో ఇట్లు పలికి దితి మధ్యాహ్నసమయమునందు తలవైపు పాదము లుంచుకొని నిద్రాపరవశ ఆయెను.(16)

శిరఃస్థానమునందు పాదము లుంచి, పాదములపై కేశములు పడునట్లు వంగి నిద్రించుచుండుటచే అపరిశుద్ధురా లగు ఆమెను చూచి దేవేంద్రుడు ఆనందముతో నవ్వుకొనెను.(17)

రామా! మిక్కిలి ధైర్యముగల ఆ ఇంద్రుడు ఆమె శరీరములో ప్రవేశించి ఆమె గర్భమును ఏడు ముక్కలుగ ఖండించెను. నూరంచులగల వజ్రముచే ఖండింపబడిన ఆ గర్భము బిగ్గరగా ఏడ్చెను. (అశబ్దము వినిన) దితి మేల్కొనెను. మహాతేజస్సుగల ఆ దేవేంద్రుడు ఏడ్చుచున్న ఆ గర్భమును, 'మా రుద ('ఏడవకుము), మా రుద (ఏడవకుము)." అని అనుచునే ఖండించెను.(18-20)



(గర్భస్థ శిశువును) చంపవద్దని దితి పలుకగా, తల్లి మాటపై గౌరవముచే దేవేంద్రుడు బయటకు వచ్చెను.(21)

వజ్రమును ధరించిన ఇంద్రుడు, "ఓ దేవీ! నీవు కేశములు పాదములకు తగులునట్లుగా పరుండి నిద్రించితివి. ఆ అవకాశమును చూచుకొని నేను, యుద్ధములో నన్ను సంహరించుటకు నీ గర్భములో పెరుగుచున్న పిల్లవానిని ఏడు ముక్కలుగా ఖండించితిని. ఇందులకు నన్ను క్షమింపుము." అని పలుకుచు ఆమెకు నమస్కరించెను."(22, 23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది ఆరవసర్గము సమాప్తము.

నలుబది ఏడవ సర్గము

సప్తమరుత్తుల వృత్తాంతము.

ఈ విధముగ గర్భము ఏడు ముక్కలుగ ఖండింపబడినందులకు దుఃఖించుచు దితి, ఎదిరింప శక్యము కానివాడైన దేవేంద్రునితో అనునయపూర్వకముగా ఇట్లు పలికెను.(1)

"దేవేంద్రా! నువ్వు బలాసురిని సంహరించినవాడివి. నా అపరాధముచేతనే నా గర్భము ఏడుముక్కలు చేయబడి వ్యర్థమైనది. ఇందులో నీ అపరాధము లేదు.(2)

గర్భము విషయమున అనుకున్నదానికి వ్యతిరేకముగ జరిగినది. అందుచే నీవు నాకొక ప్రియమును చేయవలె నని కోరుచున్నాను. ఈ గర్భఖండములు ఏడును ఏడు మారుతస్థానములకు పాలకు లగుగాక!(3)

నా ఏడుగురు కుమారులును దివ్యరూపములు ధరించి, వాతస్కంధములకు అధిష్ఠానదేవతలై, మారుతు లను పేరుతో అంతరిక్షమునందు సంచరించెదరుగాక! (4)

వీరిలో ఒకడు బ్రహ్మలోకమునందును, ఒకడు ఇంద్రలోకమునందును, మహాకీర్తిశాలియగు మూడవవాడు వాయువను పేరుతో అంతరిక్షము నందును సంచరించుగాక! మిగిలిన నా నలుగురు కుమారులు నీ ఆజ్ఞప్రకారము దేవతలై, నాలుగు దిక్కులందును సంచరింతురుగాక!"(5, 6)

దేవేంద్రుడు ఆ దితి వాక్యములు విని, దోసిలి ఒగ్గి నమస్కరించుచు,(7)

"తల్లీ! అంతయు నీవు చెప్పిన విధముననే జరుగగలదు. సంశయము లేదు. నీ కుమారులు దేవతలై సంచరించగలరు. నీకు క్షేమమగుగాక!" అనెను.(8)

రామా! ఆ తల్లియు, కుమారుడును, తపోవనమునందు ఈవిధముగ నిశ్చయము చేసి, కృతార్థులై, స్వర్గమునకు వెళ్లిరని వినియున్నాము.(9)

పూర్వము మహేంద్రుడు నివసించిన కుశప్లవమను ఆ దేశమిదియే. ఇచటనే దితి తపస్సు చేయుచుండగా అతడు ఆమెకు ఉపచారములు చేసెను.(10)

ఇక్ష్వాకునకు అలంబుసయందు జన్మించిన విశాలు డనే పరమధార్మికుడైన కుమారుడు, ఈ ప్రదేశమునందు విశాల అను నగరమును నిర్మించెను. మహాబలశాలియగు హేమచంద్రుడు విశాలుని కుమారుడు. హేమచంద్రుని కుమారుడు సుచంద్రుడు.(11-13)

సుచంద్రుని కుమారుడు ధూమ్రాశ్వుడు. అతని కుమారుడు సృంజయుడు. శ్రీమంతుడు, ప్రతాపవంతుడు అయిన సహదేవుడు సృంజయుని కుమారుడు. పరమధార్మికుడైన కుశాశ్వుడు సహదేవుని కుమారుడు. కుశాశ్వునకు మహాతేజః శాలియు, ప్రతాపవంతుడును అగు సోమదత్తుడును, సోమదత్తునకు కాకుత్స్థుడును పుత్రులుగా జనించిరి.(14-16)

గొప్ప తేజస్సు కలవాడు, దేవతాసమానుడు, జయింపశక్యము కానివాడు

అయిన ఇక్ష్వాకుకుమారుడు సుమతి, ఇపుడు ఈ నగరమును పాలించుచున్నాడు.(17)

విశాలానగరరాజు లందరును, ఇక్ష్వాకుప్రభావముచేత, దీర్ఘాయుర్దాయ వంతులై, మహాత్ములై, వీర్యవంతులై, ధార్మికులై ఒప్పుచుందురు.(18)

రామా! ఈ రాత్రి మనము ఇచటనే సుఖముగ నివసించెదము. రేపు ఉదయమున జనకమహారాజును చూచెదము."(19)

మహాతేజుడు, మహాయశుడు, నరవరశ్రేష్ఠుడు అయిన సుమతి విశ్వామిత్రుడు తన రాజ్యమునకు వచ్చినాడను వార్త వినెను. ఆ తపోధనునికి స్వాగతము చెప్పుటకై (సపరివారముగ) బయలుదేరెను.(20)

బంధుపురోహితాదిసమేతుడైన ఆ సుమతి విశ్వామిత్రుని అధికముగ పూజించి, అంజలి ఘటించి, కుశలప్రశ్నలు వేసి ఇట్లనెను.(21)

"మహర్షీ! నీవు మా దేశమునకు వచ్చి మాకు దర్శనమిచ్చినందులకు నేను చాల ధన్యుడనైతిని. అనుగ్రహింపబడినవాడనైతిని. నన్ను మించిన ధన్యాత్ముడెవ్వడును లేడు." (22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబదిఏడవసర్గము సమాప్తము.

నలుబది ఎనిమిదవ సర్గము

అహల్యాశాపవృత్తాంతము.

అచట వారు పరస్పరము కలిసినపుడు సుమతి క్షేమసమాచారములను అడిగి, కొంత సంభాషణము జరిగిన పిమ్మట మహామునితో ఇట్లు పలికెను.(1)

"ఓ మునీ! నిన్ననుసరించి వచ్చిన ఈ కుమారులిరువురును, దేవతలతో సమానమైన పరాక్రమము కలవారుగా కనబడుచున్నారు. (వీరు ఠీవిగా, నిర్భయముగా) ఏనుగవలె, సింహమువలె నడచుచున్నారు. వీరు శార్దూలమువలెను, వృషభమువలెను ఉన్నారు. (ఇవి శ్రేష్ఠతను సూచించు పదములు.) వీరి నేత్రములు పద్మపత్రములవలె విశాలముగ నున్నవి. ఖడ్గములను, అంబులపొదులను, ధనుస్సులను ధరించి ఉన్నారు. యౌవన ప్రారంభములో ఉన్నారు. సౌందర్యమున

అశ్వినీదేవతలను పోలి యున్నారు. స్వేచ్ఛగా దేవలోకమునుండి భూలోకమునకు దిగి వచ్చిన అశ్వినీదేవతలవలె ఉన్నారు. వీరు ఎవరి కుమారులు? కాలి నడకతో ఇచటకు ఎట్లు వచ్చినారు? ఎందుకు వచ్చినారు?(2-4)

మునిశ్రేష్ఠా! వీరి రూపప్రమాణములు, భావములు, చేష్టలు ఒకేవిధముగ నున్నవి. చంద్రసూర్యులు ఆకాశమును అలంకరించినట్లు వీరు ఈ ప్రదేశమును అలంకరించుచున్నారు. శ్రేష్ఠములైన ఆయుధములు ధరించిన ఈ వీరులు, దుర్గమమైన మార్గమునందు ప్రయాణము చేసి ఎందుకు వచ్చినారు? పూర్తిగ వినగోరుచున్నాను."(5, 6)

విశ్వామిత్రుడు అతని మాటలు విని, సిద్ధాశ్రమనివాసము, రాక్షసవధము మొదలైన వృత్తాంతములను జరిగినది జరిగినట్లుగా తెలిపెను.(7)

సుమతి విశ్వామిత్రుని మాటలు విని చాల సంతోషించి, గొప్ప బలముకల వారును, సత్కారము చేయదగినవారును, ఉత్తమాతిథులుగా వచ్చినవారును అగు ఆ దశరథకుమారులను యథావిధిగా పూజించెను.(8)

రామలక్ష్మణులు ఆ సుమతి చేసిన సత్కారములు స్వీకరించి, ఒక రాత్రి అచట నివసించి, పిమ్మట మిథిలకు వెళ్లిరి.(9)

విశ్వామిత్రాది మునులందరును శుభమైన ఆ జనకరాజపురమును చూచి 'బాగున్నది, బాగున్నది' అని మెచ్చుకొనుచు ఆ మిథిలను పూజించిరి.(10)

రాముడు, మిథిలాసమీపమునందున్న వనమునందు, ప్రాచీనము, నిర్జనము, సుందరము, శూన్యము అయిన ఆశ్రమమును చూచి మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని, "ఓ పూజ్యుడా! ఇది ఆశ్రమమువలె కనబడుచున్నది. ఇందు మునులెవ్వరును లేరు. ఇది ఏమి? ప్రాచీనమైన ఈ ఆశ్రమము ఎవరిది? వినగోరుచున్నాను." అని ప్రశ్నించెను.(11, 12)

మాటలలో నేర్పుగల మహాతేజఃశాలియగు విశ్వామిత్ర మహాముని రాముని మాటలు విని ఇట్లు పలికెను.(13)

"రామా! చాల సంతోషము! ఈ ఆశ్రమము ఎవ్వరిదో, ఏ మహాత్ముడు కోపముచే దీనిని శపించెనో యథార్థముగా చెప్పెదను వినుము.(14)

రామా! దేవతలు కూడా పూజించు దివ్యమైన ఈ ఆశ్రమము పూర్వము

మహాత్ముడైన గౌతమునిది. పూర్వమాతడు అహల్యాసమేతుడై ఇచట అనేక సంవత్సరములపాటు తపస్సు చేసెను.(15, 16)

శచీపతియైన దేవేంద్రుడు ఆ ముని లేని సమయము చూచి అతని వేషము ధరించి (ఈ ఆశ్రమమునకు వచ్చి) అహల్యతో, "సుందరీ! కాముకులు ఋతుకాలమునకై వేచి యుండరు. మంచి నడుము కలదానా! నీ సంగమమును కోరుచున్నాను." అని పలికెను. మునివేషములో వచ్చిన ఆతడు దేవేంద్రు డని తెలిసికూడ, దుర్బుద్ధియైన ఆమె, వచ్చినవాడు దేవరాజు కదా అను మక్కువచే సమ్మతించెను.(17-19)

పిమ్మట అహల్య, కృతార్థమైన అంతఃకరణముతో, "దేవతలలో శ్రేష్ఠుడా! కృతార్థురాల నైతిని. ఓ ప్రభూ! ఇచటినుండి శీఘ్రముగా వెళ్లిపొమ్ము. నిన్ను, నన్ను కూడ గౌతమునినుండి అన్ని విధముల రక్షించుము." అని పలికెను.(20, 21)

ఇంద్రుడు నవ్వుచు అహల్యతో, "ఓ సుందరీ! సంతోషించితిని, వచ్చినట్లే వెళ్లెదను." అని పలుకుచు, గౌతముడెక్కడ వచ్చునో యని శంకించుచు, భయమువలన తొందరపడుచు, పర్ణశాల నుండి బయటకు వచ్చెను.(22, 23)

అంతట దేవదానవులచే ఎదిరింప శక్యముకానివాడు, తపోబలవంతుడు, తీర్థోదకముచే తడిసి ఉన్నవాడు, అగ్నివలె ప్రకాశించుచున్నవాడు, మునులలో శ్రేష్ఠుడు అయిన గౌతమమహాముని సమిధలను, కుశలను గ్రహించి ఆశ్రమమునందు ప్రవేశించుచుండగా ఇంద్రుడు చూచెను.(24, 25)

ఆ మునిని చూడగనే దేవేంద్రుని ముఖము వెలవెలబారెను. ఉత్తమ చరిత్రశాలియగు ఆ ముని, తనవేషములో ఉన్న దుష్టచరిత్రుడగు ఆ ఇంద్రుని చూచి కోపముతో, "ఓ దుర్మతీ! నా రూపమును ధరించి ఈవిధమైన దుష్టకార్యము నాచరించినందులకు నీ అండములు పడిపోవుగాక!" అని శపించెను. గౌతముడు కోపముతో ఇట్లు పలుకగనే ఇంద్రుని అండములు వెంటనే నేలపై పడినవి.(26-28)

గౌతముడు ఇంద్రుని ఆవిధముగ శపించి అహల్యను కూడ, "అనేక వేల సంవత్సరములపాటు నీవు ఇచటనే నివసించెదవు. ఎవ్వరికిని కనబడకుండగ భస్మములో పడియుండి, ఆహార మేమియు లేక, వాయువును మాత్రమే భక్షించుచు, తపస్సు చేయుచు ఈ ఆశ్రమమునందే నివసించెదవు. (కొంతకాలము తరువాత) దశరథకుమారు డైన రాముడు భయంకర మైన ఈ వనములో ప్రవేశించ గలడు.

అతడు ఈ ఆశ్రమములో ప్రవేశించగానే నీవు శుద్ధురాలవు కాగలవు.(29-31)

ఓ దుశ్చరితురాలా! నీవు ఆ రామునకు అతిథిసత్కారములు చేసిన తరువాత లోభమోహములు తొలగి, సంతోషవంతురాలవై, నీ నిజస్వరూపము ధరించి నాతో కలిసి జీవించగలవు." అని శపించెను.(32)

మహాతేజఃశాలి, మహాతపఃసంపన్నుడు అయిన ఆ గౌతముడు చెడ్డగా ప్రవర్తించిన ఆ అహల్యను అట్లు శపించి ఈ అరణ్యమును విడచి, సిద్ధులును చారణులును నివసించు హిమవత్పర్వత శిఖరమునకు పోయి, అచట తపస్సు చేసెను."(33, 34)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది ఎనిమిదవసర్గ సమాప్తము.

నలుబది తొమ్మిదవ సర్గము

అహల్యాశాపవిమోచనము.

"అండములు పడిపోవుటచే దిగులు చెందిన దేవేంద్రుడు, అగ్ని మొదలగు దేవతలతోను, ఋషిసంఘములతోను, చారణులతోను, 'మహాత్ముడైన గౌతమునకు కోపము కలిగించి అతని తపస్సునకు విఘ్నము చేయుటద్వారా నేను దేవతా కార్యమును సాధించితిని. కోపముతో నన్నాతడు అండములు లేనివానినిగా చేసి, అహల్యను కూడ పరిత్యజించినాడు. ఈవిధముగ అతడు గొప్ప శాపము నిచ్చునట్లు చేసి నేనాతని తపస్సును హరించితిని.(1-3)

అందువలన ఓ దేవతాశ్రేష్ఠులారా! ఋషులారా! చారణులారా! మీరందరును, దేవకార్యము చేసిన నాకు మరల అండములు వచ్చునట్లు చేయుడు."అని పలికెను.(4)

అగ్ని మొదలైన దేవతలు ఇంద్రుని మాటలు విని, మరుద్గణములతో కలిసి పితృదేవతల వద్దకు వెళ్ళి, "యజ్ఞములో మీ భాగముగా మేషము లభించును. ఆ మేషమున కున్న అండములను తీసి వాటిని అండములు లేని దేవేంద్రునకు ఇవ్వండి. అండములు తీసివేసినను మేషము మీకు చాల సంతోషమును ఇవ్వగలదు. మీకు అట్టి మేషమును సమర్పించు మానవులకు కూడ సంతోషప్రదము కాగలదు. (అనగా అట్టి మేషమును మీకు సమర్పించి మానవులు ఇష్టఫలమును పొందగలరు.)" అని పలికిరి.(5-7)

అగ్ని మాటలు విన్న పితృదేవత లందరును కలిసి, మేషాండములు తీసి సహస్రాక్షునకు అతికించిరి. పితృదేవత లందరును మేషముల అండములను ఇంద్రునకు అతికించినారుగాన, అది మొదలు అండములు లేని మేషములనే భుజించుచున్నారు. మహాత్ముడైన గౌతముని తపఃప్రభావముచే, అది మొదలు ఇంద్రుడు మేషవృషణుడైనాడు. పుణ్యాత్ముడైన గౌతముని ఆశ్రమము ప్రవేశించి మహాభాగ్యవంతురాలు, దేవతల వంటి రూపము కలది అయిన ఈ అహల్యను తరింపచేయుము." లక్ష్మణసమేతుడైన రాముడు, విశ్వామిత్రుని మాటలు విని అతని వెనుక నడచుచు గౌతముని ఆశ్రమములో ప్రవేశించెను.(8-12)

తపస్సుచేత వృద్ధిపొందిన తేజస్సుగలది, మహాభాగ్యవతియగు, ఆ అహల్యను రాముడు చూచెను. ఆమె మానవులు కాని, దేవతలుగాని, అసురులుగాని సమీపించి చూడజాలని విధముగ నుండెను. బ్రహ్మ ఆమెను ప్రయత్నపూర్వకముగ సృజించెనా అన్నట్లు దివ్యరూపవంతురాలై ఉండెను. మాయాస్వరూపిణివలె ఉండెను. మంచు, మేఘములు కప్పిన పూర్ణచంద్రకాంతివలె, జలమధ్యమునందు ప్రతిబింబించిన సూర్యకాంతివలె పైకి స్పష్టముగ కనబడకున్నను ఎదిరింపరాని తేజస్సుతో ప్రకాశించుచుండెను.(13, 14)

గౌతమవాక్యముచే ఆమె, రామదర్శనమగు నంతవరకును, మూడు లోకములలో నివసించువారి కెవ్వరికిని కనబడకుండెను. ఆ శాపము అంతమగుటచే ఆమె వారికి కనబడెను. రామలక్ష్మణులు ఆమె పాదములు స్పృశించి నమస్కరించిరి.(15, 16)

అహల్య గౌతముని మాటలు స్మరించి, వారిని సగౌరవముగా ఆదరించుచు, సావధానమైన మనస్సుతో శాస్త్రోక్తప్రకారమున అర్ఘ్యపాద్యాదులు సమర్పించి అతిథిపూజ చేసెను. రాముడు ఆ సత్కారము లన్నింటిని స్వీకరించెను.(17, 18)

దేవతలు దుందుభులు మ్రోగించి పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వులు పాటలు పాడగా అప్సరసలు నాట్యము చేసిరి. గౌతముని ఆదేశము ప్రకారము ఘోరతపస్సు చేయుటచే పవిత్రురాలైన ఆ అహల్యను దేవత లందరును బాగు బాగు అని మెచ్చుకొనిరి. గొప్ప తపస్తేజస్సులు గల గౌతముడు కూడ అహల్యను స్వీకరించి, సంతోషించినవాడై, రాముని యథావిధిగా పూజించి పిమ్మట తిరిగి తపోనిష్ఠుడు అయ్యెను.(19-21)

రాముడు ఆ గౌతమమహాముని యథావిధిగా చేసిన పూజను అందుకొని

మిథిలకు వెళ్లెను.(22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని నలుబది తొమ్మిదవసర్గము సమాప్తము.

ఏబదియవ సర్గము

రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిల చేరుట.

లక్ష్మణసమేతుడైన రాముడు విశ్వామిత్రుని వెంట నడచుచు ఈశాన్యదిక్కువైపు ప్రయాణము చేసి (జనకుని) యజ్ఞవాటమును చేరి విశ్వామిత్రునితో, "మహామునీ! మహాత్ముడైన జనకుని యజ్ఞసంభారాదులు చాల ఉత్తమముగా ఉన్నవి. ఇచట, నానాదేశములనుండి వచ్చిన, అధ్యయన సంపన్నులైన బ్రాహ్మణులు వేలకొలది ఉన్నారు. వందలకొలది శకటములతో ఇరుకుగా ఉన్న ఋషివాటికలు కనబడుచున్నవి. ఇచట మనము నివసించుటకు అనువగు ప్రదేశమును నిర్ణయింపుము." అని పలికెను. విశ్వామిత్రుడు రాముని మాటలు విని, జలసమృద్ధమై, జనసంమర్దము లేని ప్రదేశమునందు విడిది చేసెను.(1-5)

జనకమహారాజు విశ్వామిత్రుడు వచ్చినట్లు విని, పుణ్యాత్ముడు, పురోహితుడు అయిన శతానందుని ముందిడుకొని, సవినయముగా ఎదురేగెను. మహాత్ములైన ఋత్విక్కులు శీఘ్రముగా పూజాద్రవ్యములు తీసికొని వచ్చి మంత్రపూర్వకముగా, ధర్మానుసారముగా విశ్వామిత్రునకు సమర్పించిరి.(6, 7)

విశ్వామిత్రుడు, జనకుడు చేసిన పూజలను అందుకొని, "మహారాజా! నీవు కుశలముగా నున్నావా? యజ్ఞము ఎట్టి లోపములును లేకుండ జరుగుచున్నదా?" అని ప్రశ్నించెను. విశ్వామిత్రుడు ఉపాధ్యాయులను, పురోహితుని, మునులను న్యాయానుసారముగ కుశలప్రశ్నము చేసి వారందరితో కలిసి,ఆనందముతో నుండెను.(8, 9)

పిమ్మట జనకుడు అంజలి ఘటించి విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. "ఓ పూజ్యుడా! మునులతో గూడి నీవు ఆసనముపై కూర్చుండుము."(10)

జనకుని వాక్యము విని విశ్వామిత్రుడు కూర్చుండెను. పిమ్మట, పురోహితుడైన

శతానందుడును, ఋత్విక్కులును, రాజును, మంత్రులును కూర్చుండిరి. వారందరును న్యాయానుసారముగ ఉచితాసనములపై కూర్చున్న పిమ్మట జనకుడు విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. (11, 12)

"మహర్షీ! ఈనాడు దేవతలు సర్వాంగసంపన్నమైన నా యజ్ఞమును సఫలము చేసినారు. పూజ్యుడవైన నీ దర్శనము లభించినది గాన ఈనాడు నా యజ్ఞము సఫలమైనది. మునులతో కలిసి నీవు నా యజ్ఞవాటమునకు వచ్చుటచే నేను ధన్యుడ నైతిని. నీ అనుగ్రహమునకు పాత్రుడనైతిని. (13, 14)

ఈ యజ్ఞము పూర్తి యగుటకు ఇంక పండ్రెండు దినములే ఉన్నవని పండితులు చెప్పుచున్నారు. పిమ్మట యజ్ఞభాగములకొరకు వచ్చు దేవతలను చూడగలవు."(15)

జనకమహారాజు విశ్వామిత్రునితో ఈవిధముగా పలికి, సంతోషముతో వికసించిన ముఖము కలవాడై, దోసిలి యొగ్గి నమస్కరించుచు, మరల విశ్వామిత్రుని ఈవిధముగ ప్రశ్నించెను. (16)

"విశ్వామిత్రా! దేవతలతో సమానమైన పరాక్రమము కలవారు, గజసింహముల నడకవంటి నడక కలవారు, వీరులు, శార్దూలవృషభములతో తుల్యులు, పద్మపత్రములవలె విశాలమైన నేత్రములు కలవారు, ఖడ్గములను అంబులపొదులను ధనుస్సులను ధరించినవారు, అశ్వినీదేవతల వంటి సౌందర్యము కలవారు, యౌవన ప్రారంభములోనున్నవారు, దేవలోకమునుండి భూలోకమునకు దిగివచ్చిన దేవతలవలె ఉన్నవారు, అయిన ఈ బాలురు ఎవరివారు? ఇచటికి కాలినడకనే వచ్చినారేమి? ఎందుకు వచ్చినారు?(17-19)

మహామునీ! శ్రేష్ఠమైన ఆయుధములను ధరించిన ఈవీరులు ఎవని కుమారులు? జనపములను ధరించిన ఈ వీరులు ప్రమాణమునందును, ఇంగితములయందును, చేష్టలయందును ఒకరి నొకరు పోలియున్నారు. చంద్రసూర్యులు ఆకాశమును ప్రకాశింపచేసినట్లు ఈ ప్రదేశమును ప్రకాశింప చేయుచున్నారు. ఈ వీరులను గూర్చి తెలిసికొనదలచుచున్నాను."(20, 21)

విశ్వామిత్రుడు మహాత్ముడైన జనకుని మాటలు విని, ఆ మహాత్ము లిరువురును దశరథకుమారులని తెలిపెను. (22)

మహాతేజఃశాలియగు విశ్వామిత్రమహాముని, రామలక్ష్మణులు నిర్భయముగ సిద్ధాశ్రమమునకు వచ్చి అచట నివసించిన రాక్షసులను సంహరించుట,

విశాలానగరమును చూచుట, అహల్యాసందర్శనము, గౌతమునితో సమాగమము, శివధనుస్సును పరీక్షించుటకై మిథిలకు వచ్చుట మొదలగు విషయము లన్నియు జనకమహారాజునకు తెలిపెను. (23-25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబదియవసర్గము సమాప్తము.

ఏబది ఒకటవ సర్గము

శతానందుడు విశ్వామిత్రుని పూర్వవృత్తాంతమును వర్ణించుట.

మహాతేజఃశ్శాలి, మహాతపస్వి అయిన శతానందుడు గౌతముని జ్యేష్ఠపుత్రుడు. విశ్వామిత్రుని మాటలు వినగానే ఆ తపస్వి శరీరము గగుర్పాటు చెందినది. రాముని చూడగనే అతడు అత్యాశ్చర్యవంతుడయ్యెను. (1, 2)

శతానందుడు తనకు సమీపమునందే సుఖముగా కూర్చున్న ఆ రాజకుమారులను చూచి విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. (3)

"ఓ మునిశ్రేష్ఠా! తీవ్రమైనతపస్సు చేయుచున్న యశస్విని యగు మా తల్లిని రామునకు చూపితివా? గొప్ప తేజస్సు, యశస్సుగల మా తల్లి సర్వప్రాణులచేతను పూజింపదగిన రాముని ఫలమూలాదు లర్పించి పూజించినదా? విధిబలముచే మా తల్లి విషయమున జరిగిన వృత్తాంతము నంతను రామునకు యథాతథముగ చెప్పినావా? (4-6)

రాముని చూచి అతిథ్యాదు లిచ్చుటచే పవిత్రురాలైన మా తల్లి మా తండ్రిగారిని చేరినదా? నా తండ్రి రాముని పూజించినాడా? అచటికి వచ్చిన నా తండ్రిని ఈ మహాత్ముడు గౌరవించినాడా? ఆ ఆశ్రమమును చేరిన పరిశుద్ధుడగు రాముడు శాంతమైన మనస్సుతో నా తండ్రిని పూజించినాడా?" (7-9)

మాటలాడుటలో నేర్పుగల విశ్వామిత్రమహాముని ఆ మాటలు విని, ఆ శతానందునితో, "శతానందా! నేను చేయదగిన దంతయు చేసినాను. ఏమియు విడువలేదు. రేణుకాదేవి జమదగ్నిని చేరినట్లు అహల్య గౌతముని చేరినది." అనెను. (10, 11)

విశ్వామిత్రుని మాటలను విని మహాతేజశ్శాలియగు శతానందుడు రామునితో ఇట్లనెను. "రామా! నీవు నరశ్రేష్ఠుడవు. ఈవిశ్వామిత్రుని మహిమకు అడ్డు లేదు. ఈతనిని అనుసరించి దైవవశముచే (మా అదృష్టముచే) ఇచటికి వచ్చితివి. నీకు స్వాగతము.(12, 13)

గొప్ప తేజస్సుగల ఈ విశ్వామిత్రుని కార్యములు మనసా కూడ ఊహింపశక్యము కానివి. ఈతడు తపస్సుచేత బ్రహ్మర్షియైనాడు. ఈతని ప్రభావము సాటిలేనిది. ఈతనినే ఉత్తమగతిగా గ్రహించినావు. గొప్ప తపస్సు చేసిన విశ్వామిత్రుడు నీకు రక్షకుడుగా ఉన్నాడు. అందుచే నీకంటె ధన్యుడు మరెవ్వడును ఈ లోకములో లేడు. (14, 15)

విశ్వామిత్రుని బల మెంతటిదో, అతని చరిత్ర ఎట్టిదో చెప్పెదను, వినుము.(16)

ఈ విశ్వామిత్రుడు చాలాకాలము రాజ్యము చేసెను. రాజుగా ఉండినప్పుడు ఈతడు ధర్మాత్ముడు, శత్రువినాశకుడు, ధర్మవేత్త, సకలవిద్యలను అభ్యసించినవాడు, ప్రజల మేలు కోరువాడు అని కీర్తి పొందినాడు.(17)

బ్రహ్మపుత్రుడైన కుశు డనెడు రాజు ఉండెను. ఆ కుశునకు బలవంతుడు, ధార్మికుడు అయిన కుశనాభుడను కుమారుడుండెను. ప్రసిద్ధుడగు గాధి కుశనాభుని కుమారుడు. మహాతేజశ్శాలియైన ఈ విశ్వామిత్రముని ఆ గాధియొక్క కుమారుడు. (18, 19)

మహాతేజఃశాలియైన విశ్వామిత్రుడు చాల వేల సంవత్సరములు రాజ్యము చేసెను. ఒకప్పుడు సైన్యమును సమకూర్చుకొని, అక్షౌహిణీ ప్రమాణములో నున్న సైన్యము వెంటరాగా భూమి యంతయును తిరిగెను.(20, 21)

రామా! విశ్వామిత్రుడు నగరములందును, రాష్ట్రములందును నదీగిరి ప్రాంతములందును, ఆశ్రమములందును క్రమముగా సంచరించుచు వసిష్ఠుని ఆశ్రమమునకు చేరెను. ఆ ఆశ్రమము నానావిధములగు వృక్షములతోడను, పక్షిగణములతోడను వ్యాప్తమై యుండెను. అచట సిద్ధ-చారణ-దేవ-దానవ - గంధర్వ -కిన్నరాదులు నివసించుచుండిరి. ఆ ఆశ్రమము ప్రశాంతములైన లేళ్లతోను, పక్షిసముదాయములతోను ఒప్పుచుండెను. బ్రహ్మర్షిగణములు, దేవర్షిగణములు ఆ ఆశ్రమమును ఆశ్రయించి ఉండిరి. తపస్సు నాచరించి సిద్ధి పొందినవారును, అగ్నితో సమానులును, మహాత్ములును, మనస్సును నిగ్రహించినవారును, రోషమును

జయించినవారును, జితేంద్రియులును అగు ఋషులు అచట నివసించుచుండిరి. వారిలో కొందరు నీరు మాత్రమే భక్షించుచుండగా, కొందరు వాయువునే భక్షించుచుండిరి. కొందరు రాలిన ఆకులను మాత్రమే ఆహారముగా తీసికొనెడివారు. జపహోమములందు ఆసక్తి గల వాలఖిల్యులును, ఇతరులైన వైఖానసులును ఆ ఆశ్రమమునకు శోభ కలిగించుచుండిరి.(22-27)

విజయవంతులలో శ్రేష్ఠుడు, మహాబలశాలియు అయిన విశ్వామిత్రుడు రెండవ బ్రహ్మలోకమువలె నున్న వసిష్ఠాశ్రమమును చూచెను."(28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది ఒకటవ సర్గము సమాప్తము.

ఏబది రెండవ సర్గము

వసిష్ఠుడు విశ్వామిత్రుని సత్కరించుటకై కామధేనువును ఆదేశించుట.

"గొప్ప బలము కలవాడును, వీరుడును అగు ఆ విశ్వామిత్రుడు మునులలో శ్రేష్ఠుడైన వసిష్ఠుని చూచి చాల సంతసించి, సవినయముగా నమస్కరించెను.(1)

పూజ్యుడైన వసిష్ఠుడు అతనికి స్వాగతము పలికి ఆసన మిచ్చెను. పిమ్మట మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు విశ్వామిత్రునకు న్యాయానుసారముగా ఫలమూలములను సమర్పించెను.(2, 3)

మహాతేజఃశాలియగు ఆ విశ్వామిత్రమహారాజు వసిష్ఠుడు చేసిన పూజను స్వీకరించి, "మీ తపస్సునకును, అగ్నిహోత్రమునకును, శిష్యులకును వృక్ష సముదాయమునకును క్షేమమా?" అని ప్రశ్నించెను. "అన్నియు క్షేమముగా నున్నవి" అని వసిష్ఠుడు అతనికి చెప్పెను.(4, 5)

బ్రహ్మపుత్రుడగు వసిష్ఠుడు సుఖాసీనుడై ఉన్న విశ్వామిత్రమహారాజును ఇట్లు ప్రశ్నించెను. "రాజా! నీకు క్షేమమే కదా? నీవు ధార్మికుడవైన వీరుడవు. ధర్మముచే ప్రజలను రంజింపచేయుచు, వారిని రాజవృత్తానుసారముగా పాలించుచున్నావా? నీ భృత్యులను చక్కగా పోషించుచున్నావా? వారు నీ ఆజ్ఞను అతిక్రమించక ఉన్నారా? నీ శత్రువుల నందరిని జయించితివా? నీ సేనలు, కోశములు, మిత్రులు,



పుత్రపౌత్రాదులును కుశలమా?"(6-9)

మహాతేజశ్శాలియైన విశ్వామిత్రమహారాజు, "అంతటను కుశలమే." అని వసిష్ఠునకు సవినయముగ నివేదించెను. ధర్మనిష్ఠులైన వారిరువురును మిక్కిలి ఆనందముతో చాలసేపు ఆయా విషయములను గూర్చి సంభాషణలు చేసికొని ఒకరినొకరు సంతోషపెట్టుకొనిరి.(10, 11)

సంభాషణాంతమునందు, పూజ్యుడైన వసిష్ఠుడు నవ్వుచు విశ్వామిత్రునితో, "విశ్వామిత్రా! మహాబలశాలివైన నీకును, నీ సైన్యమునకును యథోచితముగ అతిథిసత్కారము చేయగోరుచున్నాను. దీనిని స్వీకరింపుము. రాజువైన నీవు ఉత్తముడైన అతిథివి. అందుచే నిన్ను ప్రయత్నపూర్వకముగా పూజింపవలసి యున్నది." అని పలికెను.(12-14)

వసిష్ఠుని మాటలు విన్న బుద్ధిశాలియగు విశ్వామిత్రుడు, "పూజ్యుడా! నీవు ప్రియమైన మాటలు పలికితివి. ఇదియే నాకు అతిథ్యము. నీ ఆశ్రమములో లభించు ఫలమూలాదికమును, పాద్యమును, ఆచమనమును ఇచ్చి, పూజార్హుడవైన నీవు నన్ను సర్వవిధముల సత్కరించితివి. ఇదియే చాలును, నేను వెళ్లెదను. నన్ను స్నేహపూర్ణమైన దృష్టితో చూచుచుండుము." అని పలికెను.(15-17)

విశ్వామిత్రుడు ఇట్లు పలికినను, ధర్మాత్ముడును, ఉదారబుద్ధియు అగు వసిష్ఠుడు ఆతిథ్యము స్వీకరింపుమని అతనిని మాటిమాటికిని నిర్బంధించెను. చివరికి విశ్వామిత్రుడు వసిష్ఠునితో, "మునిశ్రేష్ఠా! నీకు ఎట్లు ప్రియమో అట్లే తప్పక అగునుగాక." అని పలికెను.(18, 19)

మహాతేజశ్శాలి, మునులలో గొప్పవాడు, పాపములను నశింపచేయువాడు అయిన వసిష్ఠుడు విశ్వామిత్రుని మాటలు విని సంతోషించి (తనవద్దనున్న శబల అను) చిత్రవర్ణము గల కామధేనువును పిలిచి,

"ఓ శబలా! రమ్ము. రమ్ము. నా మాట వినుము. నేను సేనాసమేతుడైన ఈ రాజర్షికి శ్రేష్ఠమైన భోజన మొసగి సత్కరింప నిశ్చయించినాను. తగిన ఏర్పాట్లు చేయుము. ఎవరికి ఏది ఇష్టమో దానిని అతని కోరిక ప్రకారము, నాకుగాను శీఘ్రముగా ఇమ్ము. రసాయనముతోను; తినదగినవి, త్రాగదగినవి, నాకదగినవి, పీల్చదగినవి మొదలయిన పదార్థములతోను కూడిన ఆహారసముదాయమును శీఘ్రముగా సమకూర్చుము." అని ఆజ్ఞాపించెను.(20-23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది రెండవ సర్గము సమాప్తము.

ఏబది మూడవ సర్గము

విశ్వామిత్రుడు కామధేనువును కోరగా, వసిష్ఠుడు నిరాకరించుట.

"రామా! ఆ కామధేనువు వసిష్ఠుడు చెప్పిన విధముగ ఎవరెవరికి ఏది ఇష్టమో దాని నంతయు సమకూర్చెను.(1)

ఆ కామధేనువు, చెఱకుగడలు, తేనెలు, పేలాలు, మంచి పాత్రలలో పోసిన మద్యములు, శ్రేష్ఠములైన పానీయములు, అనేకవిధములైన భక్ష్యములు సృజించెను. అచట వేడిగా ఉన్న పర్వతములవంటి అన్నరాశులు, మధురాన్నములు, సూపములు, పెరుగు కాలువలు, వివిధ రసములను చేర్చి వండిన పదార్థములతో నింపబడిన పాత్రలు, బెల్లముతో చేసిన పదార్థములు వేలకొలది ఏర్పడినవి.(2-4)

ఈవిధముగా వసిష్ఠుని ఆతిథ్యముచే విశ్వామిత్రుని సైన్యములోనివా రందరును భుజించి, సంతృప్తి చెంది, ఆనందించిరి.(5)

రాజర్షియైన విశ్వామిత్రుడును, ఆతని అంతఃపురకాంతలును, అతనితో వచ్చిన బ్రాహ్మణపురోహితాదులును, తృప్తి చెంది ఆనందించిరి.(6)

అమాత్య - మంత్రి - భృత్యసమేతముగ వసిష్ఠుని పూజలందుకొన్న

విశ్వామిత్రుడు సంతోషించి వసిష్ఠునితో, "ఓ బ్రాహ్మణోత్తమా! పూజార్హుడవైన నీవు నన్ను పూజించి సత్కరించినావు. నేనొక మాట చెప్పెదను. వినుము. లక్షగోవుల నిచ్చెదను. ఈ శబలను నాకిమ్ము. ఓ పూజ్యుడా! ఈ ధేనువు రత్నము వంటిది. రత్నములు రాజు సొమ్ము. అందుచే ఇది నాకు చెందవలసి యున్నది. కావున ఈ ధేనువును నాకిమ్ము." అని పలికెను.(7-9)

ధర్మాత్ముడైన వసిష్ఠమహాముని, విశ్వామిత్రుని మాటలు విని, "రాజా! నీవు లక్షలకొలది ఆవు లిచ్చినను, కొన్ని వందల కోట్లు ఆవు లిచ్చినను, వెండిరాశు లిచ్చినను నేనీ శబలను ఇవ్వను. ఈ ధేనువు నానుండి దూరమగుటకు వీలులేదు. ఈ ధేనువునకును నాకును ఉన్న సంబంధము బుద్ధిమంతునకును, కీర్తికిని గల సంబంధమువలె శాశ్వత మైనది.(10-12)

హవ్యము, కవ్యము, నా ప్రాణయాత్ర, అగ్నిహోత్రము, భూతబలి, హోమము - ఇవి అన్నియు ఈ ధేనువుపై ఆధారపడియున్నవి. స్వాహాకారవషట్కారములు, (అనగా దేవతాదులకు హవిరాదులు అర్పించుట అని అర్థము) నానావిధములైన విద్యలు, ఇవన్నియు ఈ కామధేనువు మీదనే ఆధారపడి యున్నవి. నిజముగ ఈ ధేనువు నా సర్వస్వము. నాకు ఆనందము కలిగించునది. ఇంకను అనేక కారణములను బట్టి కూడ ఈ ధేనువును నీకు ఇవ్వను." అని బదులు చెప్పెను.(13-15)

మాటలలో నేర్పరియైన విశ్వామిత్రుడు వసిష్ఠుని మాటలు విని, మిక్కిలి తొందరబాటుతో ఇట్లు పలికెను. "బంగారు నడుముత్రాళ్లను మెడత్రాళ్లను గలవి, బంగారు అంకుశములు కలవి అయిన పదునాలుగువేల ఏనుగులను ఇచ్చెదను. తెల్లని గుఱ్ఱములు కలవి, నాలుగేసి గుఱ్ఱములు కట్టదగినవి, చిరుగంటలచే అలంకరించబడినవి అయిన ఎనిమిది వందల బంగారురథములను నీ కిచ్చెదను. మంచి దేశమునందు, మంచి జాతియందు పుట్టిన గొప్ప బలముగల పదకొండువేల అశ్వములను నీకిచ్చెదను. వివిధ వర్ణములుగల, మంచి వయస్సులో ఉన్న ఒక కోటి గోవులను ఇచ్చెదను. నాకీ శబలను ఇమ్ము. బ్రాహ్మణోత్తమా! రత్నములు కాని, బంగారము కాని ఎంత కావలెనని కోరెదవో అంత ఇచ్చెదను. ఈ శబలను నాకిమ్ము".(16-21)

విశ్వామిత్రుడు పలికిన మాటలు విని వసిష్ఠుడు, "రాజా! ఏమైనను శబలను ఇవ్వను" అని పలికెను. "నా కిదియే రత్నము. ఇదియే ధనము. ఇదియే నా సర్వస్వము. ఇదియే నా జీవితము. నాకు దర్శపూర్ణమాసయాగములు, మంచి

దక్షిణలుగల యజ్ఞములు, వివిధములైన ఇతర క్రియలును ఈ ధేనువే. నా క్రియ లన్నింటికిని ఇదియే ఆధారము. ఇంక ఉపయోగము లేని మాట లేల? ఈ కామధేనువు నివ్వను."(22-25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది మూడవసర్గము సమాప్తము.

ఏబదినాల్గవ సర్గము

విశ్వామిత్రుడు శబలను అపహరించబోవుట.


"రామా! ఈవిధముగా వసిష్ఠుడు కామధేనువు నిచ్చుటకు నిరాకరించగా విశ్వామిత్రుడు ఆ ధేనువును బలాత్కారముగా లాగికొనిపోయెను. బలశాలియగు ఆ రాజు తన నీవిధముగ లాగికొనిపోవుచుండగా ఆ శబల దుఃఖార్తురాలై, ఏడ్చుచు ఇట్లు ఆలోచించెను.(1, 2)

"మిక్కిలి దుఃఖముతో దీనురాలనైన నన్ను ఈ రాజభటులు ఈవిధముగా తీసికొనిపోవుచున్నారు. నన్నీ మహాత్ముడైన వసిష్ఠుడు విడిచివేసినాడా యేమి? పవిత్రహృదయుడైన ఈ మహర్షికి నేనేమి అపకారము చేసినాను? భక్తురాలను, ఇష్టురాలను, ఏ అపరాధము ఎరుగనిదానను అయిన నన్నీ విధముగ విడచివేయు చున్నాడు!"(3, 4)

రామా! ఆ ధేనువు ఈవిధముగ ఆలోచించి, మాటిమాటికి నిట్టూర్చుచు, తనను లాగుచున్న వందలకొలది ఉన్న విశ్వామిత్రుని భృత్యులను విదుల్చుకొని వాయువేగముతో వసిష్ఠుని దగ్గరకు పోయెను.(5)

ఆ శబల, ఏడ్చుచు, అరచుచు వసిష్ఠుని ఎదుట నిలచి మేఘదుందుభుల వంటి ధ్వనితో, "బ్రహ్మపుత్రుడవైన ఓ పూజ్యుడా! ఈ రాజభృత్యులు నన్ను నీ వద్దనుండి తీసికొనిపోవుచున్నారు. (నీవు వీరిని నిరోధించుటలేదు.) నీవు నన్ను విడిచివేసితివా?"అని అడిగెను.(6, 7)

ఈ మాటలు విని ఆ బ్రహ్మర్షి, శోకముచే తపించుచున్న మనస్సుగల ఆ ధేనువుతో, దుఃఖించుచున్న సోదరితో పలికినట్లు ఇట్లు పలికెను. "ఓ శబలా! నేను



నిన్ను విడచుటలేదు. నీవు నాకేమియు అపకారము చేయలేదు. మహాబలవంతుడైన ఈ రాజు నిన్ను నా వద్దనుంచి బలాత్కారముగ తీసికొనిపోవుచున్నాడు. నా బలము ఈతని బలముతో తుల్యముకాదు. విశేషించి ఇతడు రాజుగా ఉన్నాడు. రాజైన ఇతడు బలవంతుడైన క్షత్రియుడు. పృథివికంతకును ప్రభువు కూడ. ఇతనికి అశ్వములతోను, రథములతోను, గజములతోను, ధ్వజములతోను, వ్యాప్తమైన పూర్తి అక్షౌహిణీ సేన ఉన్నది. అందుచేత ఇతడు నాకంటే ఎక్కువ బలము కలవాడు."(8-11)

వసిష్ఠుని వాక్యమును విని వాక్యములందు నేర్పుగల ఆ ధేనువు అమితమైన కాంతిగల ఆ బ్రహ్మర్షిని గూర్చి, సవినయముగా, "బ్రాహ్మణోత్తమా! క్షత్రియబలము బలము కాదు. క్షత్రియబలము కంటె బ్రహ్మబలము దివ్యమైనది. అధికమైనది. నీ బలము అంతము లేనిది. ఎంతటి మహావీర్యవంతు డైనను విశ్వామిత్రుడు నీకంటె అధికబలము కలవాడు కాదు. నీ తేజస్సు సమీపింప శక్యముకానిది. మహాత్మా! నీ బ్రహ్మబలముతో నిండిన నన్ను ఆజ్ఞాపించుము. ఆ దురాత్ముని దర్పమును, బలమును నశింపచేసెదను." అని పలికెను.(12-15)

ఆ ధేనువు మాటలు విని, మహాయశశ్శాలియగు వసిష్ఠుడు, "శత్రుసైన్యమును నశింపచేయగలిగిన సైన్యమును సృజింపుము." అని పలికెను. వసిష్ఠుని మాటలు విని ఆ కామధేనువు సైనికులను సృజించెను. ఆ కామధేనువు యొక్క హుంభాధ్వనినుండి పుట్టిన వందలాది పప్లవులు, విశ్వామిత్రుడు చూచుచుండగనే అతని సైన్యమునంతను నశింపచేసిరి.(16, 17)

అంతట విశ్వామిత్రమహారాజు తన సైన్యము ఈ విధముగ నశించుచుండగా చూచి, చాల కోపించి, కోపముచేత కళ్లు పెద్దవి చేసి, రథము నధిరోహించి, అనేకవిధములైన ఆయుధములతో పప్లవులను నశింపచేసెను.(18, 19)

ఆ పప్లవుల నందరిని విశ్వామిత్రుడు చంపివేయుట చూచి, ఆ కామధేనువు కోపముతో, మరల యవనులను, శకులను సృజించెను. కాంతి కలవారును, మహావీర్యవంతులును, బంగారు కింజల్కములవలె నున్నవారును అగు ఆ యవనులును, శకులును, భూమిని కప్పివేసిరి. పొడవైన ఖడ్గములను పట్టసములను చేతబట్టుకొని, బంగారు వస్త్రములను ధరించి మండుచున్న అగ్నులవలె ఉన్న ఆ శక-యవనులు విశ్వామిత్రుని సైన్యము నంతను నశింపచేసిరి.(20-22)

పిమ్మట విశ్వామిత్రుడు మహాస్త్రములను ప్రయోగింపగా యవనులును, కాంభోజులును, పప్లవులును చెల్లాచెదరైపోయిరి.(23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబదినాల్గవ సర్గము సమాప్తము.

ఏబది ఐదవ సర్గము

విశ్వామిత్రుడు దివ్యాస్త్రములు ప్రయోగించుట, వసిష్ఠుడు బ్రహ్మదండమును ధరించి విశ్వామిత్రుని ఎదుర్కొనుట.

"వారందరును విశ్వామిత్రుని అస్త్రములచే మోహితులై చెల్లాచెదరైపోవుట చూచి వసిష్ఠుడు, 'ఓ కామధేనువా! యోగశక్తిచేత ఇంకను సృజింపుము.' అని ఆ ధేనువును ప్రేరేపించెను.(1)

ఆ కామధేనువు హుంభాధ్వని చేయగా దానినుండి సూర్యునివంటి కాంతిగల కాంభోజులు పుట్టిరి. పొదుగునుండి ఆయుధములను హస్తములందు ధరించిన పప్లవులును, యోనినుండి యవనులును, గోమయప్రదేశమునుండి శకులును, రోమకూపములనుండి మ్లేచ్ఛులు, హారీతులు, కిరాతులును పుట్టిరి.(2, 3)

ఈవిధముగ జనించిన కాంభోజాదులందరును పదాతి-గజ-అశ్వ-రథములతో కూడిన విశ్వామిత్రసైన్యము నంతను క్షణములో నశింపచేసిరి.(4)

వసిష్ఠుడు తమ సైన్యమును నశింపచేయుటను చూచి, విశ్వామిత్రుని నూర్గురు కుమారులు మిక్కిలి కోపించినవారై, అనేకవిధములైన ఆయుధములను ధరించి, మహాముని పైకి దుమికిరి. అతడు హుంకారముచే వారందరినీ భస్మము చేసెను. ఆ విశ్వామిత్రకుమారుల నందరిని అశ్వరథపదాతులతో సహా క్షణములో భస్మము చేసెను.(5-7)

ఆ విధముగ తన సైన్యమంతయు, కుమారులును నశించిపోవుట చూచి విశ్వామిత్రుడు సిగ్గుతో చింతాక్రాంతు డయ్యెను. వేగము లేని సముద్రమువలె, కోరలు తీసిన పామువలె, రాహువు మ్రింగిన సూర్యునివలె కాంతివిహీను డయ్యెను. పుత్రులును సైన్యమును నశించుటచే అతడు రెక్కలు తెగగొట్టిన పక్షివలె, దీనుడై దర్పోత్సాహములు అడగి దుఃఖమును పొందెను.(8-10)

పిమ్మట విశ్వామిత్రుడు, "ఈ భూమిని క్షత్రియధర్మానుసారముగా పాలింపుము." అని ఒక కుమారుని నియమించి, తరువాత హిమవత్పర్వతసమీపము చేరి మహాదేవుని అనుగ్రహము కోరుచు తపస్సు చేసెను.(11, 12)

కొంతకాలమునకు దేవాధీశుడైన పరమేశ్వరుడు మహాబలశాలియగు విశ్వామిత్రునకు వరముల నిచ్చుటకై ప్రత్యక్షమై, "రాజా! ఎందుకు తపస్సు చేయుచున్నావు? నీవు చెప్పదలచిన దేదియో చెప్పుము. నీకు వరముల నిచ్చెదను. నీవు కోరెదు కోరిక ఏదియో చెప్పుము." అని అడిగెను.(13, 14)

మహాదేవు డిట్లు పలుకగా విని మహాతపశ్శాలియగు విశ్వామిత్రుడు అతనికి నమస్కరించి, "మహాదేవా! నీవు అనుగ్రహించినట్లైతే, నాకు ధనుర్వేదమునంతను సాంగోపాంగముగా సరహస్యముగా ఇమ్ము. దేవతలకును, దానవులకును, మహర్షులకును, గంధర్వయక్షరక్షస్సులకును తెలిసిన అస్త్రము లన్నియు నాకు స్ఫురించుగాక. నీ అనుగ్రహమువలన నా కోరిక తీరుగాక." అని ప్రార్థించెను. ఆ వాక్యమును విని మహాదేవుడు, "అటులనే అగును." అని పలికి వెడలిపోయెను. (15-18)

మహాబలశాలి యగు విశ్వామిత్రుడు స్వతః దర్పము కలవాడు. ఆ అస్త్రములు లభించగనే అతని దర్పము ఇనుమడించెను. పూర్ణిమాపర్వమునందు సముద్రము పొంగి నట్లు వీర్యముచేత వృద్ధిపొందుచున్న వాడై, అతడు, "ఇపుడిక ఈ వసిష్ఠుడు తప్పక నశింపగలడు." అని భావించుచు, వసిష్ఠాశ్రమమునకు పోయి అస్త్రములను విడువగా ఆ అస్త్రముల తేజస్సుచే ఆ తపోవన మంతయు దగ్ధమయ్యెను.(19-21)

ఆ విశ్వామిత్రాస్త్రములు విజృంభించుట చూచి అచట నున్న ముని లందరును దిక్కులను పట్టి పారిపోయిరి. వసిష్ఠుని శిష్యులును, వేలకొలది మృగములును, పక్షులును భీతిచెంది నలు దిక్కులకును పారిపోయిరి. మహాత్ముడైన వసిష్ఠుని ఆశ్రమము, క్షణకాలములో మరుస్థలమువలె ప్రాణిశూన్యము, నిశ్శబ్దము అయ్యెను.(22–24)

"సూర్యుడు మంచును నశింపచేసినట్లు ఈ విశ్వామిత్రుని నశింపచేసెదను. భయపడకుడు." అని వసిష్ఠుడు అనుచున్ననూ అచటి మునులును, తదితరప్రాణులును పారిపోయిరి.(25)

మునులలో శ్రేష్ఠుడును, మహాతేజశ్శాలియు అగు వసిష్ఠుడు ఈ విధముగా పలికి, క్రోధావిష్టుడై విశ్వామిత్రునితో, "ఓరీ మూఢాత్మా! చిరకాలమునుంచి పెంచిన ఆశ్రమమును నశింపచేసితివి. ఇంతటి దుష్కార్యము చేసిన నీవు ఇక జీవించవు." అని పలికెను.(26, 27)

మిక్కిలి కోపించిన వసిష్ఠుడు ధూమములేని కాలాగ్నివలె,రెండవ యమదండమువలె ఉన్న బ్రహ్మదండమును శీఘ్రముగ చేత ధరించి నిలచెను."(28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది యైదవసర్గ సమాప్తము.

ఏబది ఆరవ సర్గము

విశ్వామిత్రుని అస్త్రములను వసిష్ఠుడు బ్రహ్మదండముతో శమింపచేయుట.

"వసిష్ఠుని వాక్యములు విన్న మహాబలశాలి యగు విశ్వామిత్రుడు, ఆగ్నేయాస్త్రమును ప్రయోగించుచు, 'నిలువుము, నిలువుము.' అని పలికెను.(1)

పూజ్యుడైన వసిష్ఠుడు రెండవ కాలదండమువలె నున్న బ్రహ్మదండము నెత్తి కోపముతో, "ఓ దుష్టక్షత్రియా! నీకున్న బల మేదియో చూపుము. ఇపుడు నీ దర్పమును, నీ శస్త్రముల దర్పమును నశింపచేసెదను. నీ క్షత్రియబల మెక్కడ, గొప్పదైన బ్రహ్మబల మెక్కడ! దివ్యమైన నా బ్రహ్మబలమును చూడుము." అని



పలికెను.(2-4)

విశ్వామిత్రుడు ప్రయోగించిన భయంకరమైన ఆ ఆగ్నేయాస్త్రము అగ్నివేగము ఉదకముచే శాంతించి నట్లు బ్రహ్మదండముచే శాంతించెను. విశ్వామిత్రుడు కోపించి వారుణ-రౌద్ర-ఐంద్ర-పాశుపత-ఐషీకాస్త్రములను ప్రయోగించెను.(5, 6)

విశ్వామిత్రుడు భయంకరమైన మానవ-మోహన-గాంధర్వ-స్వాపన - జృంభణ - మాదన - సంతాపన - విలాపన - శోషణ - దారణ - వజ్రాస్త్రములను, బ్రహ్మపాశ - వరుణపాశములను, పైనాక - దయితాస్త్రములను, శుష్కము, ఆర్ద్రము అను రెండు వజ్రములను, దండ - పైశాచ - క్రౌంచాస్త్రములను, కంకాళ-ముసలము లను రెండు శక్తులను, వైద్యాధర - కాల - త్రిశూల- కాపాల- కంకణాస్త్రములను ప్రయోగించెను.(7-12)

వసిష్ఠుని బ్రహ్మదండము ఆ అస్త్రములన్నిటినీ మ్రింగివేసెను. ఆ అస్త్రము లన్నియు శాంతింపగా, విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రము ప్రయోగించెను.(13)

ఆ అస్త్రము ప్రయోగించుటను చూచి అగ్న్యాదిదేవతలు, దేవర్షులు, గంధర్వులు, మహోరగులు, కలత చెందిరి. బ్రహ్మాస్త్రము ప్రయోగింపగనే ముల్లోకములును బాధ చెందెను.(14, 15)

వసిష్ఠుడు, బ్రహ్మతేజఃప్రభావముచే బ్రహ్మదండముచేత, ఆ అతిభయంకరమైన బ్రహ్మాస్త్రమును కూడ పూర్తిగా మ్రింగివేసెను.(16)

బ్రహ్మాస్త్రమును మ్రింగుచున్న సమయమున ఆ మహాత్ముడైన వసిష్ఠుని రూపము

రౌద్రమై, అతిదారుణమై, ముల్లోకములను మూర్ఛనొందించునదిగా ఉండెను. మహాత్ముడైన వసిష్ఠుని రోమకూపములనుండి ధూమముతో నిండిన జ్వాలలు గల అగ్నికిరణములు బయల్వెడలినట్లు కనబడెను. వసిష్ఠుని హస్తములో నున్న బ్రహ్మదండము ధూమములేని ప్రళయకాలాగ్నివలె, రెండవ యమదండమువలె ప్రజ్వరిల్లెను.(17-19)

అపుడు మునిగణములు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠునితో, "మహామునీ! నీ బలము అడ్డులేనిది. నీ తేజస్సును నీ తేజస్సునందే నిగ్రహించుము. నీవు మహాతపః శాలియైన విశ్వామిత్రుని నిగ్రహించితివి. (లోకములను) అనుగ్రహింపుము. లోకముల బాధ తొలగుగాక!" అని పలికిరి.(20, 21)

మహాతేజశ్శాలి, మహాతపశ్శాలి అయిన వసిష్ఠుడు వారి మాటలు విని శాంతించెను. ఈ విధముగ భంగపాటు చెందిన విశ్వామిత్రుడు నిట్టూర్చుచు, "ఛీ! క్షత్రియబలమేమి బలము! బ్రహ్మతేజోబలమే నిజమైన బలము. ఒక్క బ్రహ్మదండము నా అస్త్రముల నన్నింటిని మ్రింగివేసినది కదా!" అని అనుకొని ఆలోచించెను. "ఇపుడు నేనీ విషయమును గ్రహించితిని. అందుచేత మనస్సును ఇంద్రియములను నిర్మలముగ ఉంచుకొని, నాకు బ్రాహ్మణత్వము నొసగు తీవ్ర తపస్సు చేసెదను." అని నిశ్చయించుకొనెను."(22-24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబదియారవసర్గము సమాప్తము.

ఏబది ఏడవ సర్గము

విశ్వామిత్రుడు తపస్సు చేయుట. త్రిశంకువృత్తాంతము.

"ఈ విధముగ మహాత్ముడైన వసిష్ఠునితో వైరము పెట్టుకొనిన ఆ విశ్వామిత్రుడు తనకు కలిగిన పరాభవమును స్మరించుచు, బాధపడుచున్న మనస్సుతో మాటిమాటికి నిట్టూర్చుచు, జ్యేష్ఠభార్యతో కూడ దక్షిణదిక్కునకు వెళ్లి, ఫలములు మూలములు మాత్రమే ఆహారముగా గొనుచు, ఇంద్రియములను నిగ్రహించుకొని అతి తీవ్రమైన తపస్సు చేసెను. ఆ కాలములో విశ్వామిత్రునకు హవిష్యందుడు, మధుష్యందుడు, దృఢనేత్రుడు, మహారథుడు అను సత్యధర్మపరాయణులైన నలుగురు

కుమారులు పుట్టిరి.(1-3)

వేయి సంవత్సరములు పూర్తియైనవి. అపుడు సర్వలోకములకును పితామహుడైన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై తపోధనుడైన విశ్వామిత్రునితో, "కుశికనందనా! నీవు తపస్సుచేత రాజర్షులు చేరగల్గిన లోకములను జయించినావు. ఈ తపస్సుచే నీవు రాజర్షివైనావు." అని మధురమైన వాక్యము పలికెను. ఈవిధముగ పలికి బ్రహ్మ దేవతలతో కూడ తన నివాసస్థానమైన స్వర్గమునకు వెళ్లెను.(4-6)

విశ్వామిత్రుడు ఈ మాటలు విని, సిగ్గుతో తలవంచుకొని, గొప్ప దుఃఖముతో కూడినవాడై, కోపముతో,"ఇంత తపస్సు చేసినాను. అయినను, దేవతలును, ఋషిగణములును రాజర్షి యని మాత్రమే నన్ను గుర్తించుచున్నారు. ఇంత తపస్సు చేసి ఫలిత మేమియు లేదని తలచుచున్నాను." అని అనుకొనెను.(7, 8)

ఈవిధముగా ఆలోచించి విశ్వామిత్రుడు మరల తీవ్రమైన తపస్సు చేయుట మొదలుపెట్టెను.(9)

ఆ కాలమునందే సత్యవాదియు, జితేంద్రియుడు, ఇక్ష్వాకువంశీయుడు అయిన త్రిశంకువను రాజు ఉండెను. "యజ్ఞముచేసి ఈ శరీరముతోడనే స్వర్గమునకు వెళ్లవలెను." అని అతనికి బుద్ధి పుట్టినది.(10, 11)

అతడు వసిష్ఠుని పిలిపించి తన అభిప్రాయము తెలుపగా ఆ మహాత్ముడు ఇది సాధ్యముకాదు అని చెప్పెను. వసిష్ఠుడు నిరాకరింపగా ఆ రాజు (ఆలోచించి) అచ్చటకు దక్షిణదిశలో తపస్సు చేసుకొనుచున్న వసిష్ఠ పుత్రులను తనచే యజ్ఞము చేయింపుడని ప్రార్థించుటకై వారి వద్దకు వెళ్లెను. గొప్ప తేజస్సుగల త్రిశంకువు వసిష్ఠకుమారుల ఆశ్రమమునకు వెళ్లి అచట తపస్సు చేయుచున్నవారు, యశస్సు కలవారు, తేజస్సు కలవారు అగు నూర్గురు వసిష్ఠపుత్రులను చూచెను.(12-14)

అతడు ఆ గురుపుత్రులను సమీపించి ఆ మహాత్ములందరికి వారి వయః క్రమము ననుసరించి నమస్కరించి సిగ్గుతో కొంచెము తలవంచి, దోసిలియొగ్గి, ఇట్లనెను,(15, 16)

"నేను శరణాగతరక్షకులైన మీవద్దకు శరణము కోరి వచ్చినాను. మీకు క్షేమమగుగాక! మహాత్ముడైన వసిష్ఠుడు నా కోరిక నిరాకరించినాడు. మహాయజ్ఞ మొకటి చేయవలెనని నాకు కోరిక ఉన్నది. అందుకు అనుజ్ఞ ఇవ్వండి. గురుపుత్రులైన మిమ్ముల నందరిని నమస్కరించి వేడుచున్నాను. మీరు తపస్సు చేయుచున్న

బ్రాహ్మణోత్తములు. మిమ్ములను తలవంచి నమస్కరించి ప్రార్థించుచున్నాను. నేను శరీరముతో స్వర్గమునకు వెళ్లునట్లు చేయుటకై, మీరు సావధానచిత్తులై యజ్ఞము చేయించుడు. ఓ తపోధనులారా! వసిష్ఠుడు నిరాకరించిన పిమ్మట గురుపుత్రులైన మీరు తప్ప నాకు మరొక గతి యేదియును లేదు. ఇక్ష్వాకువంశీయు లందరికిని పురోహితుడే పరమగతి. విద్వాంసులైన పురోహితులు ఎల్లప్పుడును, రాజులను తరింపచేయుచుందురు. వసిష్ఠుని తరవాత మీరే నాకు దేవతలు." అని వేడుకొనెను."(17-22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది ఏడవసర్గము సమాప్తము.

ఏబది ఎనిమిదవ సర్గము

వసిష్ఠపుత్రులు శపించగా త్రిశంకువు విశ్వామిత్రు నాశ్రయించుట.

"రామా! త్రిశంకుని వచనములు విన్న నూరుగురు ఋషికుమారులును, కోపావిష్టులై రాజుతో, "ఓ దుర్బుద్ధీ! సత్యవాదియైన గురువు నిరాకరించిన పిమ్మట, అతనిని కాదని మరొకరిని ఎట్లు ఆశ్రయించుచున్నావు?

ఇక్ష్వాకువంశీయు లందరికిని పురోహితుడే పరమపూజ్యుడు. సత్యవాదియైన గురువుయొక్క వాక్యము అతిక్రమింపరానిది. పూజ్యుడైన వసిష్ఠమహర్షి అశక్యమని చెప్పిన యజ్ఞమును మేము చేయించగలమా?

రాజా! నీవు మూఢుడవు. నీ నగరమునకు తిరిగి వెళ్లుము. పూజ్యుడైన వసిష్ఠుడు ముల్లోకములలో ఉన్న ఎవ్వరిచేతనైనను యాగము చేయించగల సమర్థుడు. ఆయన కాదనిన తరువాత యాగము చేయించి ఆయనను మేము అవమానించగలమా?" అనుచు ఆక్షేపించిరి.(1-5)

క్రోధముచే అక్షరములు తడబడుచు వారు పలికిన మాటలు విని ఆ రాజు, "ఓ తపోధనులారా! నా గురువు, గురుపుత్రులు కూడ నా కోరికను నిరాకరించినారు. నేను మరొకగతి చూచుకొనెదను. మీకు క్షేమమగుగాక!" అనెను.(6, 7)

చెడ్డ అభిప్రాయముతో కూడిన అతని మాట విని, వసిష్ఠపుత్రులు చాల కోపించి, "నీవు చండాలుడ వగుదువు గాక!" అని శపించిరి. ఈవిధముగ పలికి

ఆ మహాత్ములు తమ ఆశ్రమములోనికి వెళ్లిపోయిరి. పిమ్మట రాత్రి గడవగానే రాజు చండాలుడై పోయెను. అతడు నల్లనివాడై, నల్లని వస్త్రములు ధరించి, సౌకుమార్యము తొలగి, కురుచలైన కేశములతో, శ్మశానమునందలి మాలలను ధరించి, బూడిదను పూసికొని, ఇనుప ఆభరణములను ధరించి ఉండెను. తెల్లవారుసరికి ఆతని రాజవస్త్రభూషణాదు లన్నియు ఈవిధముగా మారిపోయెను. (8–10)

రామా! చండాలరూపము గల అతనిని చూచి, మంత్రులును, పౌరులును, అతని అనుచరులును, అందరును కలిసి దూరముగ పారిపోయిరి. (11)

మిక్కిలి ధైర్యముగల ఆ త్రిశంకుడు ఏకాకియై, దుఃఖముతో కుములుచు, విశ్వామిత్రమహామునివద్దకు వెళ్లెను. వసిష్ఠాదులచే విఫలీకృతుడై చండాలత్వము చెందిన ఆ రాజును జూచి విశ్వామిత్రుడు జాలి చెందెను.

మహాతేజశ్శాలియు పరమధార్మికుడును అగు విశ్వామిత్రుడు, ఘోరరూపము గల ఆ త్రిశంకుని చూచి, జాలిగొని, "నీకు భద్ర మగుగాక," అని అనుచు, "మహాబలుడవైన ఓ రాజపుత్రా! నీవు ఎందుకు వచ్చినావు? అయోధ్యాధిపతివైన ఓ వీరుడా! పాపము! శాపమువలన చండాలుడ వైతివి కదా!" అని పలకరించెను.

చండాలత్వమును పొందిన ఆ త్రిశంకుడు ఆ మాటలు విని, చేతులు జోడించి, మాటలాడుటలో నేర్పరి అయిన ఆ విశ్వామిత్రునితో ఇట్లనెను. (12–16)

"మహామునీ! గురువు, గురుపుత్రులు కూడ నా కోరికను మన్నింపలేదు. ఆ కోరిక తీరకుండగనే ఈ విపరీతఫలమును పొందితిని. ఈ శరీరముతో స్వర్గమునకు వెళ్లవలెనని నా అభిప్రాయము.

నూరు యజ్ఞములు చేసితిని కాని ఆ ఫలము లభింపలేదు. నేనెన్నడును అసత్యము పలికి ఎరుగను. ఇటుపైన కూడ ఎన్ని కష్టములు వచ్చినను అబద్ధమాడను. నా క్షత్రియధర్మముపై ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. అనేకవిధములైన యజ్ఞములు చేసితిని. ప్రజలను ధర్మముగా పాలించితిని. మహాత్ములగు పెద్దలను మంచి శీలముచేతను నడవడికచేతను సంతోషపెట్టితిని. (17–20)

నేను ధర్మాచరణమునకై ప్రయత్నించుచు యాగము చేయవలెనని అభిలషింపగా గురువులు అభినందింపకున్నారు. దైవమే బలవత్తర మైనది. పురుషప్రయత్నము వ్యర్థము. అంతయు దైవవశమే. దైవమే ఉత్తమగతి. దైవముచేత విఫలప్రయత్నుడ నైన నేను మిక్కిలి ఆర్తుడనై నీ అనుగ్రహమునకై వేడుచున్నాను. అనుగ్రహింపుము.

నీకు మంగళ మగును. నేను మరి యెవ్వరి వద్దకును వెళ్లను. మరొక రక్షకు డెవ్వడును లేడు. పురుషకారముచే నీవు దైవమును నివర్తింపజేయుము."(21-24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది ఎనిమిదవసర్గము సమాప్తము.

ఏబది తొమ్మిదవ సర్గము

విశ్వామిత్రుడు మహోదయుని, వసిష్ఠపుత్రులను శపించుట.

"పూర్తిగా చండాలరూపుడైన ఆ రాజు మాటలు విని విశ్వామిత్రుడు జాలిచెంది, అతనితో మధురమైన వాక్యము పలికెను.(1)

'ఇక్ష్వాకువంశసంజాతుడవైన ఓ వత్సా! నీకు స్వాగతము. నీవు ధార్మికుడ వని నాకు తెలియును. నేను నీకు రక్షణ నొసగెదను; భయపడకుము. రాజా! పుణ్యాత్ములైన మహర్షులను యజ్ఞములో సాహాయ్యము చేయుటకై నేను ఆహ్వానించెదను. నీవు నిశ్చింతగ యజ్ఞము చేయగలవు. గురుశాపముచే ఏర్పడిన ఈ రూపముతోనే సశరీరుడవై స్వర్గమునకు వెళ్లగలవు. శరణాగతరక్షకుడైన విశ్వామిత్రుని శరణు జొచ్చితివి. ఇక స్వర్గము నీ చేతిలో నున్నది.'(2-5)

ఆ విశ్వామిత్రుడు ఈ విధముగ పలికి యజ్ఞసంభారములను సమకూర్చుడని, పరమధార్మికులును, గొప్ప బుద్ధిమంతులును అగు కుమారులను ఆజ్ఞాపించెను.(6)

శిష్యు లందరిని పిలచి, "ఓ వత్సలారా! నా ఆజ్ఞానుసారముగా వెళ్లి శిష్యులతోడను, స్నేహితులతోడను, ఋత్విక్కులతోడను, విద్యావంతులతోడను కూడిన ఋషుల నందరిని తీసికొనిరండు. నా సందేశమును విని ఎవ రెవరు అనాదరపూర్వకముగా ఏ మాటలు పలుకుదురో ఆ మాటలన్నియు నాకు చెప్పవలెను." అని ఆదేశించెను.(7, 8)

విశ్వామిత్రుని ఆజ్ఞప్రకారము శిష్యులు నలుదిక్కులకును వెళ్లి ఆహ్వానింపగా వేదాధ్యయనసంపన్నులైన బ్రాహ్మణులు అన్ని దేశములనుండియు వచ్చిరి. తిరిగి వచ్చిన ఆ శిష్యు లందరును, తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ విశ్వామిత్రునితో, వేదాధ్యయన సంపన్ను లగు బ్రాహ్మణులందరును పలికిన మాటలను చెప్పిరి.(9, 10)

"మీ సందేశము విని బ్రాహ్మణు లందరును వచ్చుచున్నారు. మహోదయుడు తక్క, సకలదేశములలోని బ్రాహ్మణులును వచ్చినారు. మునిశ్రేష్ఠా! నీ వాక్యము విని వసిష్ఠకుమారులు నూరుగురును ఏమనినారో వినుము.(11, 12)

'క్షత్రియుని యాజకునిగా స్వీకరించినవాడు, విశేషించి చండాలుడు, సమర్పించు హవిస్సును యాగములో దేవతలును, ఋషులును ఎట్లు గ్రహింతురు? విశ్వామిత్రుని మాటలు విని చండాలుని అన్నము భుజించినవారు మహాత్ములైన బ్రాహ్మణు లైనను స్వర్గమున కెట్లు వెళ్లెదరు?'(13, 14)

మహోదయుడును, వసిష్ఠకుమారు లందరును, క్రోధముచే ఎఱ్ఱనైన నేత్రములతో ఈవిధముగ పరుషముగా మాట్లాడిరి."(15)

మునిశ్రేష్ఠుడైన ఆ విశ్వామిత్రుడు వారి మాటలు విని, క్రోధముతో నేత్రములు ఎఱ్ఱబారగా ఇట్లు పలికెను.(16)

"ఎట్టి దోషములును లేక ఉగ్రమైన తపస్సు ఆచరించుచున్న నన్ను దూషించు ఆ దురాత్ములు భస్మమైపోయెదరు. సంశయము లేదు. వాళ్లందరును ఈనాడే యమపాశబద్ధులై యమలోకమునకు పోయి ఏడువందల జన్మములవరకు శవభక్షకులుగా ఉందురుగాక!(17, 18)

వసిష్ఠపుత్రు లందరును జాలిలేని ముష్టికజాతిలో పుట్టి, నిత్యము కుక్కమాంసమును భక్షించుచు, వికృతరూపములతో ఈ లోకమునందు సంచరించెదరుగాక! దూషింపరాని నన్ను దూషించిన మహోదయుడు సకలజనులును దూషించు నిషాదజాతిలో పుట్టగలడు. నా కోపమునకు ఫలితముగ ఆ మహోదయుడు, దయావిహీనుడై, ప్రాణములు తీయుటయందు ఆసక్తి కలవాడై, చాలకాలము దుష్టమైన జీవికను పొందగలడు." మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రమహాముని, ఋషుల మధ్య ఇట్లు పలికి ఊరకుండెను.(19-22)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని ఏబది తొమ్మిదవసర్గము సమాప్తము.

అరువదియవ సర్గము

విశ్వామిత్రుడు మరొక స్వర్గలోకమును సృజించుటకు ఉద్యమించి దేవతలు ప్రార్థింపగా విరమించుట

"మహాతేజస్సు గల విశ్వామిత్రుడు మహోదయుని, వసిష్ఠకుమారులను ఈ విధముగ శపించి ఋషులతో, "ఇతడు ఇక్ష్వాకువంశమునకు చెందిన త్రిశంకువు. ధర్మిష్ఠుడు. దాతృత్వము కలవాడు. ఈ శరీరముతోనే స్వర్గమునకు వెళ్లవలెనను కోరికతో నా సహాయ్య మర్థించినాడు. ఈతడు శరీరముతో స్వర్గమును చేరుటకై నేను చేయు యజ్ఞమునందు మీరు సహాయపడవలెను." అని పలికెను.(1-3)

ధర్మజ్ఞులైన ఆ మహర్షు లందరును విశ్వామిత్రుని మాటలు విని (తమలో తాము ఆలోచించుకుని) ఒక్కుమ్మడిగా ధర్మసంమతమైన మాట పలికిరి.(4)

"ఈ కౌశికుడు చాల కోపస్వభావము కలవాడు. ఈతడు చెప్పిన విధముగ చేయవలెను. ఇతడు అగ్నివలె తీవ్రస్వభావుడు. కోపము కలిగించినచో శపించును. ఈ త్రిశంకువు విశ్వామిత్రుని తపఃప్రభావముచే సశరీరముగ స్వర్గమునకు వెళ్లుటకై యజ్ఞము చేయుడు. అందరును ప్రారంభింపుడు".(5-7)

మహర్షు లీవిధముగ పలికి యజ్ఞమునకు కావలసిన ఆయా పనులను చేసిరి. మహాతేజశ్శాలి యగు విశ్వామిత్రుడు ఆ క్రతువులో యాజకుడుగా ఉండెను. మంత్రము లెరిగిన ఋత్విక్కులు కల్పోక్తప్రకారమున, యథావిధిగా సర్వకర్మలును క్రమము తప్పక మంత్రపూర్వకముగా నిర్వహించిరి. ఈ విధముగా చాల దినములు గడచిన పిమ్మట మహాతపఃశాలియగు విశ్వామిత్రుడు సమస్తదేవతలను వారి వారి యజ్ఞభాగములను స్వీకరించుటకై ఆహ్వానించెను.(8-10)

ఈవిధముగ ఆహ్వానించినను తమ భాగములు గ్రహించుటకై దేవతలు రాలేదు. అంత, విశ్వామిత్రమహాముని, కోపోద్దీపితుడై, స్రువ మనెడు హోమసాధమును ఎత్తి, త్రిశంకునితో, "రాజా! నా తపఃప్రభావమును చూడుము. నా తపఃశక్తిచే నిన్ను సశరీరముగా స్వర్గమునకు పంపెదను. సశరీరుడవై ఇతరు లెవ్వరును వెళ్లజాలని స్వర్గమునకు వెళ్లుము. నేను స్వయముగా సంపాదించిన తపః ఫలము కొంత ఉన్నది. దాని తేజస్సుచే, సశరీరుడవై స్వర్గమునకు వెళ్లుము." అని పలికెను.(11-14)

విశ్వామిత్రుడు ఈ విధముగా పలికిన వెంటనే ఆ రాజు ఆ మునులందరును



చూచుచుండగా సశరీరుడై స్వర్గమునకు వెళ్లెను. దేవతాగణములతో కూడిన దేవేంద్రుడు త్రిశంకువు స్వర్గములో ప్రవేశించుట చూచి, "ఓ త్రిశంకూ! నీవు స్వర్గనివాసమునకు అర్హుడవు కావు. తిరిగి పొమ్ము. గురుశాపహతుడవైన ఓ మూఢాత్మా! తలక్రిందులుగా భూమిపై పడుము." అని పలికెను.(15-17)

మహేంద్రుడు ఇట్లు పలుకగా త్రిశంకువు రక్షింపుమని విశ్వామిత్రునితో మొరపెట్టుచు మరల క్రిందికి పడెను. విశ్వామిత్రుడు, ఆవిధముగా అరచుచున్న అతని మాటలు విని, తీవ్రమైన కోపముతో ఆగుము, ఆగుము అని పలికెను.(18, 19)

ఋషుల మధ్య నున్న ఆ విశ్వామిత్రుడు కోపోద్దీపితుడై, రెండవ బ్రహ్మ వలె, దక్షిణదిక్కునందు, ఇతరులైన సప్తర్షులను, మరియొక నక్షత్రమాలను సృజించెను. క్రోధముతో నక్షత్రవంశమును కూడ సృజించి, "మరొక ఇంద్రునైనను సృజించెదను; లేదా లోకములో ఇంద్రుడైన లేకుండవలెను." అని పలుకుచు, దేవతాసృష్టి కూడ చేయ ప్రారంభించెను.(20-23)

పిమ్మట మిక్కిలి భయపడిన దేవాసురులును, ఋషులును మహాత్ముడైన విశ్వామిత్రుని అనునయించుచు, "మహాప్రభావశాలివైన ఓ తపోధనా! ఈ రాజు గురుశాపోపహతుడు. సశరీరముగా స్వర్గమునకు వెళ్లుటకు అనర్హుడు." అని పలికిరి.(24,25)

మునిశ్రేష్ఠుడైన ఆ విశ్వామిత్రుడు దేవతల మాటలు విని వారితో ప్రశంసనీయ మగు ఒక వచనము పలికెను.(26)

"దేవతలారా! మీకు క్షేమమగుగాక! ఈ త్రిశంకువును సశరీరముగా స్వర్గమునకు పంపెదనని ప్రతిజ్ఞచేసి ఆ ప్రతిజ్ఞను అసత్యము చేయుటను నేను

అంగీకరింపను. ఈ త్రిశంకువు సశరీరుడై, శాశ్వతముగా స్వర్గమునందు నివసించవలెను. నేను సృజించిన నక్షత్రము లన్నియు ఈ లోకము లున్నంతవరకును స్థిరముగ ఉండవలెను. ఓ దేవతలారా! మీరు నాకు దీనిని అనుమతింపుడు." (27-29)

ఆ దేవతలు మునిపుంగవునితో, "ఓ మునిశ్రేష్ఠా! నీవు చెప్పినట్లే అగును. నీకు భద్రమగుగాక! నీవు సృష్టించిన నక్షత్రము లన్నియు జ్యోతిశ్చక్రమునకు వెలుపల నుండుగాక! త్రిశంకువు ఆ నక్షత్రముల నడుమ ప్రకాశించుచు, దేవతాతుల్యుడై, తలక్రిందులుగ నివసించుగాక. చరితార్థుడై కీర్తిమంతుడైన ఈ రాజశ్రేష్ఠుని, ఈ నక్షత్రము లన్నియు స్వర్గములో ఉన్నవానిని అనుసరించినట్లు అనుసరింపగలవు." అని చెప్పిరి.(30-32)

ఈవిధముగా సకలదేవతలును, ఋషులును స్తుతింపగా, ధర్మాత్ముడును, తేజోవంతుడును అగు విశ్వామిత్రుడు 'సరే' అని అంగీకరించెను.(33)

రామా! యజ్ఞము పూర్తియైన పిమ్మట మహాత్ములైన దేవతలును, తపోధనులైన మునులును తమతమ స్థానములకు వెళ్లిపోయిరి."(34)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువదియవ సర్గము సమాప్తము.

అరువది ఒకటవ సర్గము

శునశ్శేపుని వృత్తాంతము.

"రామా! మహాత్ముడైన విశ్వామిత్రుడు, ప్రయాణమైన ఆ ఋషులందరిని చూచి, "మహాత్ములారా! ఈ దక్షిణపు దిక్కున గొప్ప విఘ్నము సంభవించినది. మరొక దిక్కునకు వెళ్లి అచట తపస్సు చేసెదము. విశాలమైన పశ్చిమదిక్కునకు పోయి, అచట పుష్కరక్షేత్రమునందు తపస్సు చేయుదము. అది ఉత్తమమైన తపోవనము." అని పలికి, పుష్కరక్షేత్రము చేరి, అచట, ఫలమూలములను మాత్రమే భుజించుచు ఉగ్రమైన తపస్సు చేసెను.(1-4)

ఆ కాలమునందే అయోధ్యాధిపతియైన అంబరీషు డను రాజు ఒక యాగము చేయ ప్రారంభించెను. అతడు యాగము చేయుచుండగా ఇంద్రుడు యజ్ఞపశువును

హరించెను. యజ్ఞపశువు కనబడకపోయినతోడనే పురోహితుడు రాజుతో, "రాజా! పశువు నెవరో హరించినారు. నీ అధర్మముచే ఇది పోయినది. యాగపశువును రక్షింపజాలని రాజును దోషములు చంపివేయును. దీనికి చాల పెద్ద ప్రాయశ్చిత్తము చేయవలసియున్నది. పశువు లభించనిచో మనుష్యునైనను పశువుగా తీసికొనిరమ్ము. అపుడు యజ్ఞము జరుగగలదు." అని పలికెను.(5-8)

ఆ రాజు ఉపాధ్యాయుని మాటలు విని, వేలకొలది ఆవుల నిచ్చి నరపశువును సంపాదించుటకు ప్రయత్నించెను. ఆయా దేశములందును, నగరము లందును, పవిత్రమైన ఆశ్రమములందును వెదకుచు భృగుతుంగపర్వతముపై భార్యాపుత్రసమేతుడై సుఖముగా కూర్చుని ఉన్న ఋచీకమహర్షిని చూచెను.(9-11)

తపస్సుతో ప్రకాశించుచున్న ఆ ఋచీకునికి నమస్కరించి, అనుగ్రహింప చేసికొని, అన్నింటను కుశలవార్త లడిగి, "మహామునీ! నీవు లక్ష ఆవులను తీసికొని నీ కుమారుని యజ్ఞపశువుగా అమ్మినచో నేను చరితార్థుడ నగుదును. అన్నిదేశములు తిరిగితిని కాని యజ్ఞపశువు లభించలేదు. నీవు మూల్యము తీసుకుని నీ కుమారులలో ఒకనిని నాకిమ్ము." అని వేడెను.(12-14)

రాజు మాటలు విని ఋచీకుడు, "నే నేవిధమున నైనను జ్యేష్ఠపుత్రుని అమ్మజాలను." అనెను.(15)

తల్లియైన తపోధనురాలు ఋచీకుని మాటలు విని అంబరీషునితో, "ఋచీకమహాముని పెద్దకుమారుని అమ్మనని చెప్పుచున్నాడు. రాజా! చిన్నకుమారుడైన శునకుడు నాకు ఇష్టుడు. అందుచేత ఆతనిని నీకు ఇవ్వను. సాధారణముగా జ్యేష్ఠుడు తండ్రికి ఇష్టుడు కాగా చిన్నవాడు తల్లికి ఇష్టు డగును. అందువలన నేను చిన్నవానిని రక్షించుకొందును." అనెను.(16-19)

మునియు, మునిపత్నియు పలికిన మాటలు విని మధ్యముడైన శునశ్శేపుడు స్వయముగ, "రాజా! జ్యేష్ఠకుమారుని అమ్మజాల నని తండ్రి చెప్పుచున్నాడు. చిన్నవానిని అమ్మజాల నని తల్లి చెప్పుచున్నది. దీనినిబట్టి మధ్యముడైన నన్ను అమ్ముచున్నారని అనుకొనుచున్నాను. అందుచే నన్ను తీసికొనిపొమ్ము." అని పలికెను.(20, 21)

రామా! ఆ రాజు లక్షగోవులతో ఆ శునఃశేపుని కొని ఆనందముతో వెళ్ళెను. ఆతనిని రథముపై కూర్చుండబెట్టుకొని శీఘ్రముగా వెళ్లెను."(22, 23)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది యొకటవ సర్గము సమాప్తము.

అరువది రెండవ సర్గము

విశ్వామిత్రుడు శునఃశేపుని రక్షించుట.

"రామా! ఆ రాజు శునఃశేపుని తీసికొని వెళ్లుచు, మధ్యాహ్నసమయమునందు పుష్కరక్షేత్రమున విశ్రాంతి తీసుకొనెను. (1)

ఆ రాజు విశ్రాంతి తీసుకొనుచున్నసమయమున మహాయశస్వి యగు ఆ శునఃశేపుడు మనస్సులో చాల బాధపడుచు, ఆ పుష్కరక్షేత్రమునందు ఇతర ఋషులతోకలిసి తపస్సు చేసుకొనుచున్న మేనమామ యగు విశ్వామిత్రుని దర్శనము చేసెను. (2)

దప్పికచేతను, అలసటచేతను ఎండిపోయిన ముఖముతో శీఘ్రముగా విశ్వామిత్రుని ఒడిలో పడి,

"ఓ మహామునీ! నాకు తల్లి లేదు. తండ్రి లేదు. ఇంక జ్ఞాతులైన ఇతర బంధువు లెక్కడ? అందుచే నన్ను ధర్మానుసారముగా రక్షింపుము. నీవు అందరిని రక్షించువాడవు. అందరికిని హితము చేకూర్చువాడవు. రాజు కార్యము సఫల మగునట్లును, నేను దీర్ఘాయుర్దాయవంతుడనై, తపస్సు చేసి స్వర్గము చేరకల్గునట్లును చేయుము. (3-6)

ఓ ధర్మాత్మా! మంగళకరమైన చిత్తముతో, నాథుడు లేని నాకు నాథుడవగుము. తండ్రి కుమారుని రక్షించినట్లు నన్నీ ఆపదనుండి రక్షింపుము." అని వేడుకొనెను. (7)

అతని మాటలు విన్న విశ్వామిత్ర మహాముని అతనిని బహువిధముల ఓదార్చి తన పుత్రులతో ఇట్లనెను. (8)

"మంగళమును కోరు తల్లిదండ్రులు ఏ పరలోకహితమును కోరి పుత్రులను కనుచుందురో దానిని సాధించు సమయము ఇప్పుడు వచ్చినది. మునిసుతుడైన ఈ బాలుడు రక్షింపుమని నన్ను వేడుచున్నాడు.

పుత్రులారా! ఈతనికి జీవితదానము చేసి ప్రియము చేకూర్చుడు. ధర్మపరాయణులైన మీరందరును పుణ్యకర్మలు చేసి ఉన్నారు. మీరు రాజునకు యజ్ఞపశువులుగా అయి అగ్ని తృప్తి కలిగింపుడు. మీరట్లు చేసినచో శునఃశేపునకు రక్షణ ఇచ్చినట్లగును. యజ్ఞము నిర్విఘ్నముగ కొనసాగును. దేవతలకు తృప్తి లభించును. నేనిచ్చిన మాట నిలబెట్టుకొని నట్లగును." అని పలికెను. (9-12)

విశ్వామిత్రుని మాటలు విని అతని కుమారులైన మధుష్యందాదులు

అహంకారముతో పరిహాసపూర్వకముగా, "తండ్రీ! తన కుమారులను త్యజించి ఇతరుల కుమారుని రక్షించుట భోజనమునందు శ్వమాంసము(కుక్క మాంసము) భుజించుటవంటిదని మా అభిప్రాయము." అని ఆక్షేపించిరి.(13, 14)

విశ్వామిత్రుడు పుత్రుల మాటలు విని, క్రోధముచే ఎఱ్ఱబారిన కండ్లతో, "మీరు నా మాటను అతిక్రమించుటయే కాక, ఎట్టి సంకోచము లేక ధర్మవిరుద్ధమును, భయంకరమును అగు ఈ వాక్యమును పలికినారు. మీరందరును వసిష్ఠకుమారులవలె ముష్టికజాతులందు పుట్టి, కుక్కమాంసమును తినుచు పూర్తిగా వేయి సంవత్సరములపాటు భూమిపై సంచరించగలరు." అని వారిని శపించెను.(15-17)

విశ్వామిత్రుడు పుత్రులను ఈవిధముగ శపించి, దుఃఖితుడైన శునఃశేపునకు ఎట్టి బాధయు లేకుండునట్లు మంత్రాదులచే రక్ష చేసి అతనితో ఇట్లనెను. "మునికుమారా! నీకు ఎఱ్ఱని పుష్పమాలలు వేసి, ఎఱ్ఱని మైపూత పూసి, పవిత్రములైన పాశములతో వైష్ణవయూపస్తంభమునకు కట్టుదురు. అప్పుడు (నేను ఉపదేశించిన) ఈ మంత్రములతో అగ్నిని స్తుతింపుము. అంబరీషుని యజ్ఞములో శ్రేష్ఠములైన ఈ రెండు మంత్రములను పఠించినచో నీకు కార్యసిద్ధి లభించును."(18-20)

శునఃశేపుడు శ్రద్ధాపూర్వకముగ ఆ రెండు మంత్రములను గ్రహించి రాజశ్రేష్ఠుడైన ఆ అంబరీషుని తొందరపెట్టుచు, "రాజశ్రేష్ఠా! యజ్ఞశాలకు శీఘ్రముగా వెళ్లుదము. దీక్షలో కూర్చుండి యజ్ఞము జరిపింపుము." అని పలికెను.(21, 22)

ఋషిపుత్రుని మాటలు విన్న ఆ రాజు సంతోషోత్సాహభరితుడై, శీఘ్రముగా యజ్ఞవాటికకు వెళ్లెను. సదస్యుల అనుమతి పొంది, ఆ శునఃశేపునకు దర్భపవిత్రముచే గుర్తులుంచి, ఎఱ్ఱని వస్త్రము కట్టి, యజ్ఞపశువునుగా ఆతనిని యూపస్తంభమున బంధింపచేసెను. యూపమున బంధింపబడిన ఆ ముని కుమారుడు ఇంద్రుని, ఉపేంద్రుని శ్రేష్ఠములైన వాక్కులతో యథాశాస్త్రముగా స్తుతించెను.(23-25)

అతడు రహస్యముగా చేసిన స్తుతికి సంతసించి దేవేంద్రుడు శునఃశేపునకు దీర్ఘాయువును ప్రసాదించెను. అంబరీషమహారాజునకు దేవేంద్రుని అనుగ్రహముచే ఎన్నో రెట్లు యజ్ఞఫలము లభించెను.(26, 27)

మహాతపఃశాలియు, ధర్మాత్ముడును అగు విశ్వామిత్రుడు పుష్కరక్షేత్రమునందు మరల వేయి సంవత్సరములపాటు తపస్సు చేసెను."(28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది రెండవ సర్గము సమాప్తము.

అరువది మూడవ సర్గము

విశ్వామిత్రుడు మహర్షిత్వమును పొందుట. మేనక అతని తపస్సుకు విఘ్నము కలిగించుట.

"వేయి సంవత్సరములు గడచిన పిమ్మట ఆ మహాముని వ్రతము పూర్తిచేసికొని యుండగా దేవత లందరును అతని తపస్సునకు ఫలము ఇవ్వగోరి వచ్చిరి. మహాతేజస్సుగల బ్రహ్మ, "నీవు ఆచరించిన శుభకర్మలచేత, ఋషివయినావు. నీకు క్షేమమగుగాక." అని విశ్వామిత్రునితో మధురమైన వాక్యమును పలికెను. విశ్వామిత్రునితో ఇట్లు పలికి బ్రహ్మదేవుడు స్వర్గమునకు వెళ్లిపోయెను. విశ్వామిత్రుడు మరల గొప్ప తపస్సు చేసెను. (1-3)

పిమ్మట చాలకాలమునకు మేనక యనెడు గొప్ప అప్సరస పుష్కరతీర్థమునందు స్నానమాడ మొదలిడెను. విశ్వామిత్రుడు ఆ పుష్కరతీర్థములో మేఘములో మెరుపువలె నున్న సాటిలేని రూపముగల ఆ మేనకను చూచెను. (4, 5)

ఆమెను చూడగనే కామపరవశుడైన విశ్వామిత్రుడు ఆమెతో, "ఓ అప్సరసా! నీకు స్వాగతము. నా యీ ఆశ్రమములో నివసింపుము. మన్మథునిచే మిక్కిలి మోహితుడనైన నన్ను అనుగ్రహింపుము. నీకు క్షేమమగుగాక!" అని పలికెను. (6)

విశ్వామిత్రుడిట్లు పలుకగా ఆ అప్సరస అచట నివసించెను. ఆమె విశ్వామిత్రాశ్రమములో నివసించుచుండగా పది సంవత్సరములు సుఖముగ గడచిపోయినవి. పది సంవత్సరములు గడచిన తరువాత విశ్వామిత్రమహాముని చింతాదుఃఖములతో నిండినవాడై సిగ్గుపడెను. (7-9)

అపుడు విశ్వామిత్రునకు కోపముతో కూడిన ఆలోచన ఒకటి కలిగినది. "ఇది అంతయు, నా తపస్సు హరించుటకై దేవతలు చేసిన పని. పగలు, రాత్రి అని అనుకొనుచుండగనే కామమోహములో చిక్కుకొనియున్న నాకు పది సంవత్సరములు గడచిపోయినవి. ఈవిధముగ నా తపస్సునకు పెద్ద విఘ్నము వచ్చిపడినది". (10, 11)

ఇట్లు విశ్వామిత్రమహాముని పశ్చాత్తాపముచే పీడితుడై, నిట్టూర్చుచున్నవాడై, తన ఎదుట అంజలి ఘటించి వణకుచు నిలచిన మేనక భయపడినదని గ్రహించి, ఆమెను తీయని మాటలతో పంపివేసి, హిమవత్పర్వతమునకు వెళ్లెను. (12, 13)

విశ్వామిత్రుడు నిష్ఠ నవలంబింపవలె నని దృఢనిశ్చయము చేసుకుని, ఇంద్రియములను (లేదా వసిష్ఠుని) జయింపగోరుచున్నవాడై, కౌశికీనదీతీరము చేరి, అతి తీవ్రమైన తపస్సు చేసెను. అతడు హిమవత్పర్వతముపై వేయి సంవత్సరములపాటు ఘోరమైన తపస్సు చేయుచుండగా దేవతలకు భయము కలిగెను.(14, 15)

ఋషులును, దేవతలందరును కలిసి ఈ విశ్వామిత్రుని 'మహర్షి' అనవచ్చును అని నిశ్చయించిరి. దేవతల అభిప్రాయము ననుసరించి బ్రహ్మదేవుడు, విశ్వామిత్రునితో మధురమైన వాక్యము పలికెను. "మహర్షీ! నీవు చేసిన ఉగ్రతపస్సుకు సంతోషించినాను. నీకు మహత్త్వమును, ఋషిత్వమును (అనగా మహర్షిత్వమును) ఇచ్చుచున్నాను".(16-18)

సర్వలోకాధీశ్వరుడైన బ్రహ్మ మాటలను విన్న ఆ విశ్వామిత్ర మహామునికి విషాదము కలుగలేదు. సంతోషమూ కలుగలేదు. అతడు అంజలి ఘటించి, నమ్రుడై బ్రహ్మదేవునితో, "నేను చేసిన శుభకర్మలచే నాకు మహర్షిత్వము లభించినదని పూజ్యుడవైన నీవు చెప్పుచున్నావు కదా! అందుచే నేను జితేంద్రియుడ నైతిని." అనెను. "నీవు జితేంద్రియుడవు మాత్రము కావు. ఇంకను ప్రయత్నింపుము." అని బ్రహ్మ విశ్వామిత్రునితో పలికి స్వర్గమునకు వెళ్లెను.(19-22)

దేవత లందరును వెడలిపోయిన పిమ్మట, విశ్వామిత్రమహాముని, చేతులు పైకెత్తి ఆలంబన మేదియు లేకుండ నిలచి, వాయువును మాత్రమే ఆహారముగ గొని తపస్సు చేయ మొదలిడెను. విశ్వామిత్రమహర్షి గ్రీష్మమునందు పంచాగ్నిమధ్య తపస్సు చేయుచు, వర్షాకాలమునందు ఆరుబైటనే వసించుచు, శీతాకాలమున రేయింబవళ్లు జలమునందు నిలచుచు, వేయి సంవత్సరములపాటు ఘోరతపస్సు చేసెను.(23, 24)

అతడు ఈవిధముగ తపస్సు చేయుటచూచి దేవేంద్రుడును, దేవతలును చాల భయపడిరి. సకలదేవతాసమేతుడైన దేవేంద్రుడు రంభయను అప్సరసతో, తనకు హితకరమును, విశ్వామిత్రునకు అహితకరమును అగు వాక్యము పలికెను."(25, 26)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది మూడవ సర్గము సమాప్తము.

అరువది నాల్గవ సర్గము

విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వముకై ఘోరతపస్సు చేసెదనని శపథము చేయుట.

"ఇంద్రుడిట్లనెను. 'రంభా! విశ్వామిత్రుని కామమోహితుని చేసి ఆశ కల్పించవలెను. ఈ గొప్ప దేవతాకార్యమును నీవు చేయవలెను.'(1)

దేవేంద్రుని మాటలు విని రంభ సిగ్గుపడుచు, చేతులు జోడించి ఆతనిని, 'ఓ సురాధీశా! విశ్వామిత్రమహాముని చాల కోపస్వభావుడు. నాపై తప్పక తన క్రోధమును చూపి నన్ను శపించగలడు. అందుచే నాకు భయము కలుగుచున్నది. నన్ను అనుగ్రహింపుము." అని ప్రార్థించెను.(2, 3)

రంభ భయముతో వణకుచు, చేతులు జోడించి పలికిన మాటలు విని దేవేంద్రుడు, "రంభా! భయపడకుము. నీకు క్షేమ మగును. నా ఆజ్ఞను పాటించుము. అందమైన వృక్షములుగల వసంతర్తువునందు కోకిల రూపము ధరించి, నేను మన్మథునితో కూడ నీ ప్రక్కనే ఉందును. నీవు అనేక శృంగారచేష్టాదిగుణములు గల, చాల ప్రకాశించురూపము వహించి విశ్వామిత్రమహర్షి తపస్సుకు భంగము చేయుము." అని ఆదేశించెను.(4-7)

దేవేంద్రుని మాటలు విని రంభ అత్యుత్తమమైన రూపమును ధరించి, సౌందర్యవతియై తెల్లని చిరునవ్వు నవ్వుచు విశ్వామిత్రుని లోభింపచేసెను. విశ్వామిత్రుడు కోకిలయొక్క మధురధ్వనిని విని, సంతసించిన మనస్సుతో రంభను చూచెను. కోకిలధ్వనియు, మధురమైన సంగీతధ్వనియు వినబడిన పిమ్మట రంభ కనబడగనే విశ్వామిత్రునకు సందేహము కలిగెను.(8-10)

ఇదంతయు ఇంద్రుడు చేసిన పని యని తెలిసికొని విశ్వామిత్రమహాముని రంభను, "దౌర్భాగ్యవంతురాలా! కామక్రోధములను జయించవలె నని కోరుచున్న నన్ను లోభపెట్టుటకు ప్రయత్నించితివి గాన పదివేల సంవత్సరములు ఱాతిబండవై పడియుందువుగాక! నా కోపమునకు గురియైన నిన్ను, గొప్ప తేజస్సు కలవాడు, తపోబలసంపన్నుడు అయిన ఒక బ్రాహ్మణుడు ఉద్ధరించగలడు." అని శపించెను.(11-13)

విశ్వామిత్రమహాముని కోపము పట్టలేక రంభను ఈవిధముగ శపించి,

పశ్చాత్తాపము పొందెను. ఆతని శాపముచేత రంభ వెంటనే శిలగా మారెను. మహర్షి మాటలు విని మన్మథుడును, ఇంద్రుడును పారిపోయిరి.(14, 15)

ఇట్లు కోపము కలుగుటచే తపస్సు క్షీణింపగా మహాతేజశ్శాలియగు విశ్వామిత్రుడు, ఇంద్రియములను జయించలేకపోవుటచే మనఃశాంతి పొందజాలక పోయెను. ఈవిధముగా తపస్సు క్షీణించగా విశ్వామిత్రుడు, "నేను కోపము చెందను. ఏది ఏమైనను మాటకూడ పలుకను. వందలకొలది సంవత్సరములు ఊపిరి విడువక ఉండి, జితేంద్రియుడనై శరీరమును శుష్కింపచేసెదను. తపస్సుచేత నాకు బ్రాహ్మణత్వము లభించువరకును అనేక సంవత్సరములు ఊపిరి విడవక, ఆహారమును పరిత్యజించి ఉండెదను. తపస్సు చేయునంత కాలము నా అవయవములు క్షీణింపవు." అని నిశ్చయించుకొనెను.(16-19)

రామా! ఆ విశ్వామిత్ర మహాముని ఇట్లు లోకములో ఎన్నడును కని విని ఎరుగని విధముగ వేయి సంవత్సరముల దీక్షను గూర్చి ప్రతిజ్ఞ చేసెను."(20)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువదినాల్గవ సర్గము సమాప్తము.

అరువది ఐదవ సర్గము

విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అగుట.

"రామా! అటుపిమ్మట విశ్వామిత్రమహాముని ఉత్తరదిక్కు విడచి తూర్పుదిక్కునకు వెళ్లి అచట అతి తీవ్రమైన తపస్సు చేసెను. వేయి సంవత్సరములపాటు చాల గొప్పదైన మౌనవ్రతము నవలంబించి, చేయ శక్యము కానిది, సాటిలేనిది అయిన తపస్సు చేసెను. వేయి సంవత్సరములు నిండుసరికి విశ్వామిత్రుడు కట్టెవలె ఆయెను. ఎన్ని విఘ్నములు వచ్చినను ఆతని మనస్సులో క్రోధము కలుగలేదు. అతడు దృఢనిశ్చయముతో నాశములేని తపస్సు చేసెను.(1-3)

వేయి సంవత్సరముల వ్రతము పూర్తియైన పిమ్మట మహావ్రతుడైన విశ్వామిత్రుడు అన్నము తినవలె నని అనుకొనుచుండగా (అన్నము వండుకొని తినబోవుచుండగా) ఇంద్రుడు బ్రాహ్మణవేషమున వచ్చి, ఆ సిద్ధాన్నమును యాచించెను. మౌనవ్రత మవలంబించిన మహాతపఃశాలియైన ఆ విశ్వామిత్రుడు

సిద్ధాన్నము నంతను ఆ బ్రాహ్మణున కిచ్చివేసెను. అతడు పూర్తిగా భుజించెను. విశ్వామిత్రుడు భోజనము లేకయే ఉండిపోయెను. ఆ బ్రాహ్మణుని మాత్రము ఏమియు అనలేదు.

పిదప వేయి సంవత్సరములపాటు ఉచ్ఛ్వాసనిఃశ్వాసములను బంధించి తపస్సు చేసెను. విశ్వామిత్రు డావిధముగ ఉచ్ఛ్వాసనిశ్వాసములను బంధించి యుండగా అతని శిరస్సునుండి ధూమము బయలుదేరెను. దానిచే ముల్లోకములును దహింపబడి నట్లు అయి భయపడిపోయినవి.(4-8)

అపుడు దేవగంధర్వపన్నగాసురరాక్షసులు ఆ విశ్వామిత్రుని తేజస్సుచే తెలివి తప్పినవారై, ఆతని తపస్సుచే కాంతి తొలగినవారై, పీడితులై బ్రహ్మవద్దకు వెళ్లి, "ప్రభూ! ఈ విశ్వామిత్ర మహామునిని అనేకవిధముల లోభపెట్టినను, కోపము కలిగించినను, ఈతని తపస్సు వృద్ధిపొందుచునే ఉన్నది. ఈతనిలో కొంచెమైనను పాపము కనబడుటలేదు. ఈతడు కోరిన వరము నీయకున్నచో తపస్సుచేత చరాచరాత్మకమగు లోకత్రయమును దహించివేయగలడు. దిక్కులన్నియు వ్యాకులమైనవి. ఏమియు ప్రకాశించుటలేదు. సాగరములు క్షోభిల్లుచున్నవి. పర్వతములు బ్రద్దలగుచున్నవి.(9-13)

బ్రహ్మదేవా! భూమి కంపించుచున్నది. వాయువు చాల వ్యాకులముగ వీచుచున్నది. జనులందరును నాస్తికు లగుచున్నారు. మా కేమియు తోచకున్నది. క్షోభించిన మనస్సుతో మూడు లోకములును మార్పు చెందినట్లున్నవి. ఆ మహర్షి తేజస్సుచేత సూర్యుడు కాంతివిహీను డైనాడు. అగ్నితుల్యుడును, మహాకాంతిమంతుడును అగు ఈ పూజ్యుడైన మహాముని లోకత్రయనాశము చేయ నిర్ణయించుటకు ముందుగా ఇతనికి కోరిన వరములిచ్చి ప్రసన్నుని చేయుము. ముల్లోకములును, పూర్వము ప్రలయాగ్నిచే దహింపబడినట్లు దహింపబడుచున్నవి. ఇతడు దేవలోకరాజ్యము చేయవలె నని కోరినను ఈతని కేది కావలెనో అది ఇమ్ము." అని ప్రార్థించిరి.(14-17)

అంతట బ్రహ్మదేవుడు మొదలగు దేవతలందరును మహాత్ముడైన విశ్వామిత్రునితో మధురమైన వాక్యము పలుకుచు, "ఓ బ్రహ్మర్షీ! నీకు స్వాగత మగుగాక! నీ తపస్సుచేత చాల సంతోషించినాము. ఓ విశ్వామిత్రా! నీవు ఉగ్రమైన తపస్సుచేత బ్రాహ్మణత్వమును పొందితివి. ఓ బ్రాహ్మణా! దేవతాగణముతో కూడిన నేను నీకు దీర్ఘాయుర్దాయము కూడ ఇచ్చుచున్నాను. క్షేమమును పొందుము. నీకు



భద్ర మగును. నీకు అన్నియు సమకూరును." అనిరి.(18-20)

విశ్వామిత్రుడు బ్రహ్మాది దేవతల మాటలు విని సంతసించి, సమస్కరించి ఇట్లు పలికెను. "నాకు బ్రాహ్మణత్వము, దీర్ఘాయుర్దాయము లభించినచో, ఓంకార వషట్కారములు నన్ను వరించుగాక! నాకు వేదములను ఇతరులకు బోధించు అధికారము, యజ్ఞయాగాదులు చేయించు అధికారము లభించుగాక! క్షత్రియుల విద్యలను, బ్రాహ్మణుల విద్యలను ఎరిగినవారిలో శ్రేష్ఠుడును, బ్రహ్మమానసపుత్రుడును అగు వసిష్ఠుడు నేను బ్రహ్మర్షిని అని అంగీకరించుగాక! నాకీ శ్రేష్ఠమైన వరమును ఇచ్చినచో మీరందరూ వెళ్ళవచ్చును."(21-23)

దేవతలు బ్రతిమాలుకొనగా వసిష్ఠమహాముని వచ్చి విశ్వామిత్రునితో మైత్రి చేసుకుని 'నీవు బ్రహ్మర్షివి' అని చెప్పెను. దేవతలందరూ, 'నీవు బ్రహ్మర్షివే. సందేహము లేదు. నీకు అన్నియు సమకూరును.' అని పలికి వచ్చినదారినే వెళ్ళిపోయిరి.(24, 25)

ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు ఉత్తమమైన బ్రాహ్మణత్వమును సంపాదించి, బ్రహ్మర్షియైన వసిష్ఠుని పూజించెను. విశ్వామిత్రుడు ఈ విధముగా తన కోరికను తీర్చుకుని తపస్సు ఆచరించుచు భూమండలమం దంతటనూ సంచరించెను. ఈ మహాత్ముడు ఈ విధముగా బ్రాహ్మణత్వమును సంపాదించుకొనెను.(26, 27)

ఈతడు మునులలో శ్రేష్ఠుడు. మూర్తీభవించిన తపస్సు. ఎల్లప్పుడును ధర్మపరుడు. వీర్యమునకు నివాసస్థానము." ఇట్లు (విశ్వామిత్రచరిత్ర) చెప్పి

శతానందుడు ఊరకుండెను. శతానందుడు రామలక్ష్మణులతో చెప్పిన మాటలు విని జనకమహారాజు చేతులు జోడించి విశ్వామిత్రునితో,(28-30)

"మునిపుంగవా! నీవు ధార్మికుడవు. రామలక్ష్మణసమేతుడవై నా యజ్ఞమునకు వచ్చితివి. నేను ధన్యుడనైతిని. నీ అనుగ్రహమునకు పాత్రుడనైతిని. నీదర్శనమువలన అనేక విధములగు లాభములు పొందితిని. నీ తపస్సుగురించి సవిస్తరముగా వర్ణించి శతానందుడు చెప్పగా నేనును, మహాత్ముడైన రాముడును వింటిమి. యజ్ఞసభలో ఉన్న సదస్యులందరును నీ గుణములు వినిరి. విశ్వామిత్రా! నీ తపస్సు, నీ బలము, నీ గుణములు ఇంత అని చెప్పుటకు శక్యముకానంత గొప్పవి.(31-34)

ఆశ్చర్యకరమైన నీ కథలను వినుచుండగా తృప్తి కలుగుటలేదు. సూర్యుడు అస్తాద్రికి పోవుచున్నాడు. యజ్ఞకర్మలు చేయవలసిన సమయము సమీపించుచున్నది. రేపు ప్రాతఃకాలమున తిరిగి నిన్ను చూచెదను. నీకు స్వాగతము. నాకు అనుజ్ఞ ఇమ్ము." అని పలికెను.(35, 36)

జనకుడిట్లు పలుకగా సంతసించిన ఆ మహాముని సంతోషయుక్తుడై పురుషశ్రేష్ఠుడగు జనకుని ప్రశంసించి, అతనికి వెళ్ళుటకు వెంటనే అనుజ్ఞ ఇచ్చెను. జనకమహారాజు ఇట్లు పలికి విశ్వామిత్రునికి ప్రదక్షిణ నమస్కారములు చేసెను. ఆతని ఉపాధ్యాయులు, బంధువులు కూడా విశ్వామిత్రునికి ప్రదక్షిణ నమస్కారములు చేసిరి.(37, 38)

మహర్షులు పూజించుచుండగా ధర్మాత్ముడగు విశ్వామిత్రుడు రామలక్ష్మణ సమేతుడై తన నివాసస్థానమునకు వెళ్ళెను.(39)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువదియైదవ సర్గము సమాప్తము.

అరువది ఆరవ సర్గము

జనకుడు శివధనుర్వృత్తాంతము చెప్పుట, రాముడు ధనుస్సునకు నారి కట్టినచో అతనికి సీత నిచ్చెదనని ప్రకటించుట.

తెల్లవారిన పిమ్మట జనకమహారాజు ప్రభాతసమయమున చేయవలసిన కార్యములన్నియు నిర్వర్తించి రామలక్ష్మణసమేతుడైన విశ్వామిత్రుని పిలిపించెను.(1)


జనకుడు విశ్వామిత్రుని, రామలక్ష్మణులను యథావిధిగా గౌరవించి విశ్వామిత్రునితో, "పూజ్యుడా! నీకు స్వాగతమగుగాక! నేను నీకేమి చేయుదును? ఆజ్ఞాపింపుము. నేను నీచే ఆజ్ఞాపింపదగినవాడను." అని పలికెను.(2, 3)

జనకుని మాటలు విని, విశ్వామిత్రుడు, "దశరథుని పుత్రులు, క్షత్రియులు, లోకప్రసిద్ధులు అయిన ఈ రామలక్ష్మణులు నీవద్ద నున్న శ్రేష్ఠమైన ధనుస్సును చూడదలచుచున్నారు. ఆ ధనుస్సును చూపుము. నీకు భద్రమగుగాక! ఈ రాజకుమారులు దానిని చూచి, కోరిక తీరగా వారి ఇష్టము ప్రకారము తిరిగి వెళ్లెదరు." అని చెప్పెను.(4-6)

విశ్వామిత్రుని మాటలు విని జనకుడు ఈవిధముగ ప్రతివచనము పలికెను, "మహామునీ! ఈ ధనుస్సు ఇచట ఎందువలన ఉన్నదో ఆ వృత్తాంతమును చెప్పెదను, వినుము. ఈ ధనుస్సును మహాత్ముడైన శివుడు నిమిచక్రవర్తికి ఆరవవాడైన దేవరాతు డనెడు రాజువద్ద న్యాసముగా ఉంచెను.(7, 8)

పూర్వము దక్షయజ్ఞధ్వంసము చేయుచు వీర్యవంతుడైన రుద్రుడు ధనుస్సును వంచి, కుపితుడై దేవతలతో, 'దేవతలారా! యజ్ఞభాగముల నపేక్షించుచున్న నాకు మీరు యజ్ఞభాగములను కల్పింపలేదుగాన ఈ ధనుస్సుతో మీ శిరస్సులను ఖండించెదను.' అని పలుకగా ఆ దేవతలందరును భయపడి మహేశ్వరుని అనుగ్రహింపచేసుకొనిరి. మహేశ్వరుడు దేవతలను అనుగ్రహించి ఆ ధనుస్సును వారికి ఇచ్చివేయగా దానిని దేవతలు మా పూర్వపురుషుని వద్ద న్యాసముగా ఉంచిరి.(9-12)

నేనొకప్పుడు యజ్ఞభూమిని దున్ని పరిశుద్ధము చేయుచుండగా సీత అను కన్య నాగలినుండి బయటకు వచ్చి నాకు లభించినది. భూమినుండి బయటకు వచ్చిన ఆమె నా కుమార్తెగా పెరిగినది. అయోనిజ యైన ఈమెను వివాహ



మాడవలెనన్నచో పరాక్రమమే శుల్కమని నేను నిశ్చయించితిని. (13, 14)

మహామునీ! భూతలమునుండి ఆవిర్భవించి, నా కుమార్తెగా పెరుగుచున్న ఈమెను వివాహము చేసుకొనుటకు ఎందరో రాజులు వచ్చిరి. ఆ రాజులందరును వచ్చి కన్యనిమ్మని కోరగా, ఈమె వీర్యశుల్కయని చెప్పి నేను వారి కీయలేదు. పిమ్మట ఆ రాజులందరును కలిసి తమ బలమెంత యున్నదో పరీక్షించుకొనగోరి మిథిలకు వచ్చిరి. తమ బలమును పరీక్షించదలచిన వారికి ధనుస్సును చూపగా దానిని పట్టుకొనుటకు గాని, కదల్చుటకుగాని వారికి సాధ్యముకాలేదు. (16-18)

ఆ రాజుల బలము అల్పమైన దని తెలిసికొని నేను వారికి సీత నీయ నిరాకరించితిని. ఈ విషయము తెలిసికొనుము. ఈవిధముగ తమ బలము విషయమున సందేహము కలుగగా రాజులందరును మిక్కిలి కోపించి మిథిలానగరమును ముట్టడించిరి. ఇది తమకు జరిగిన అవమానమని భావించి కోపముతో మిథిలాపురిని బాధించిరి. ఈవిధముగా (వారి ముట్టడిలో) సంవత్సరము గడవగా నగరములో నున్న జీవనోపకరణము లన్నియు తరిగిపోయినవి. దానితో నాకు చాల దుఃఖము కలిగెను. (19-22)

అప్పుడు నేను తపస్సుచే దేవతల నందరిని అనుగ్రహింపచేసికొనగా వారు నాకు చతురంగబలమును ఇచ్చిరి. తమ బలమును గూర్చి సందేహము గల ఆ వీర్యశూన్యులగు పాపాత్ములైన రాజులు యుద్ధమునందు పరాజితులై, సపరివారముగా దిక్కులు పట్టి పారిపోయిరి. (23, 24)

ఓ మునిశ్రేష్ఠా! మిక్కిలి ప్రకాశించు ఆ శివధనుస్సును రామలక్ష్మణులకు



కూడ చూపెదను. రాముడు ఆ ధనుస్సును ఎక్కుపెట్టగలిగినచో, అయోనిజయగు సీతను ఈతనికి ఇచ్చెదను."(25, 26)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది ఆరవ సర్గ సమాప్తము.


అరువది ఏడవ సర్గము

శివధనుర్భంగము. జనకుడు దశరథుని తీసికొనివచ్చుటకై మంత్రులను పంపుట.

విశ్వామిత్రమహాముని జనకుని మాటలు విని, "రామునకు ఆ ధనుస్సును చూపుము" అనెను.(1)

విశ్వామిత్రుని వాక్యము విని జనకమహారాజు, "గంధమాల్యాదులచే అలంకరించిన ఆ దివ్యధనుస్సును తీసికొని రండు."అని సామంతులను ఆజ్ఞాపించెను.(2)

జనకుని ఆజ్ఞప్రకారము మంత్రులు నగరములో ప్రవేశించి ఆ ధనుస్సును ముందిడుకొని బయలుదేరి వచ్చిరి. మంచి బలము కలవారును, దీర్ఘకాయులును అగు ఏబదివందల మంది పురుషులు ఆ ధనుస్సు ఉంచిన ఎనిమిది చక్రాలు ఉన్న



పెట్టెను అతికష్టముగ లాగికొనివచ్చిరి.(3, 4)

జనకుని మంత్రులు ధనుస్సు ఉన్న ఆ ఇనుపపెట్టెను తీసికొనివచ్చి, దేవతాసమానుడైన అతనితో ఇట్లనిరి. "మిథిలాధిపతీ! నీవు రామునకు చూపదలచు చున్న సర్వరాజపూజితమును, శ్రేష్ఠమును అగు ధనుస్సు ఇదిగో."(5, 6)


రాజు వారి వాక్యము విని చేతులు జోడించి, మహాత్ముడైన విశ్వామిత్రునితోను రామలక్ష్మణులతోను ఇట్లు పలికెను,(7)

"విశ్వామిత్రమహామునీ! మా జనకవంశీయులును, పూర్వము దీనిని ఎక్కుపెట్టపోయి విఫలులైన మహావీర్యవంతులగు రాజులును పూజించిన శ్రేష్ఠమైన ధనుస్సు ఇదియే. సురగణములు కాని, అసురులుకాని, రాక్షసులుకాని, గంధర్వ-యక్ష-కిన్నర-మహోరగులు గాని దీనిని ఎక్కుపెట్టజాలకపోయిరి. ఈ ధనుస్సును వంచుటకుగాని, నారి కట్టుటకుగాని, బాణము సంధించుటకుగాని, నారిని లాగుటకుగాని, కదల్చుటకుగాని మనుష్యులకు శక్తి ఎక్కడిది? ఓ మునిశ్రేష్ఠా! అట్టి ఈ ధనుస్సును తీసికొని వచ్చినారు. దీనిని ఈ రాజపుత్రులకు చూపుము." (8-11)

విశ్వామిత్రుడు జనకుని మాటలు విని, "వత్సా! రామా! ఆ ధనుస్సును చూడుము." అని రామునితో అనెను.(12)

ఆ బ్రహ్మర్షి ఆదేశానుసారము రాముడు ధనుస్సు ఉన్న ఆ పెట్టెను తెరిచి, ధనుస్సును చూచి విశ్వామిత్రునితో, "బ్రహ్మర్షీ! ఇపుడీ శ్రేష్ఠమైన ధనుస్సును హస్తముతో స్పృశించెదను. దీనిని కదల్చుటకును, సాధ్యమైనచో ఎక్కుపెట్టుటకును ప్రయత్నించెదను." అనెను.(13, 14)

జనకమహారాజును, విశ్వామిత్రుడును "అటులే చేయుము." అని పలికిరి. విశ్వామిత్రుని ఆజ్ఞప్రకారము రాముడు అనాయాసముగా ఆ ధనుస్సును మధ్యయందు పట్టుకొనెను . ధర్మాత్ముడైన ఆ రఘునందనుడు వేలకొలది జనులు చూచుచుండగా ఆ ధనుస్సును అనాయాసముగ ఎక్కుపెట్టెను. రాముడు ఆ ధనుస్సును ఎక్కుపెట్టి,



నారిని అకర్ణాంతము లాగగా అది విరిగిపోయెను.(15-17)

ఆ ధనుస్సు విరిగినపుడు పిడుగులు పడుచున్నప్పుడు కలిగే ధ్వనితో సమానమైన గొప్ప ధ్వని వచ్చెను. పర్వతము బ్రద్దలగుచున్నపుడు అదరినట్లు భూమి అదరెను. విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప మిగిలిన జను లందరును ఆ ధ్వనికి మూర్ఛితులై క్రింద పడిరి.(18, 19)

అచట వారందరు యథాపూర్వస్థితికి వచ్చిన పిమ్మట మాటలలో నేర్పరియైన జనకుడు, కంగారు లేనివాడై విశ్వామిత్రునితో ఇట్లు పలికెను.(20)

"మహామునీ! దశరథాత్మజుడైన రాముని వీర్యమును ప్రత్యక్షముగ చూచితిని. అత్యద్భుతము, ఊహింప శక్యము కానిది అగు ఈ కార్యము ఇట్లు జరుగునని నేను అనుకొనలేదు. నా కుమార్తె సీత దశరథుని పుత్రుడైన రాముని భర్తగా పొంది మా వంశమునకు కీర్తిని తీసికొని రాగలదు. నా కుమార్తె సీతను వివాహ మాడుటకు వీర్యమే శుల్కమని నేను చేసిన ప్రతిజ్ఞ సత్యమైనది. నా ప్రాణములతో సమానురాలగు ఈమెను రాముని కిచ్చి వివాహము చేసెదను.(21-23)

నీవు ఆజ్ఞాపించినచో నా మంత్రులు రథముల నధిరోహించి శీఘ్రముగా అయోధ్యకు వెళ్లెదరు. వీర్యశుల్కయగు సీతను రామునకీయ నిర్ణయించుట మొదలగు వృత్తాంతము నంతను వారు సవినయముగ దశరథునకు తెలిపి ఆతనిని నా నగరమునకు తీసికొనివచ్చెదరుగాక! నా మంత్రులు శీఘ్రముగ వెళ్లి, రామలక్ష్మణులు విశ్వామిత్రుని సంరక్షణలో నున్నారని దశరథునకు తెలిపి, సంతోషించిన అతనిని తీసికొనివత్తురు!"(24-26)

అటులే చేయుమని విశ్వామిత్రుడు పలుకగా జనకమహారాజు మంత్రులతో సంప్రదించి, దశరథునకు జరిగిన దంతయు చెప్పి ఆతనిని తీసికొనివచ్చుటకై తన ఆజ్ఞానిర్వాహకులగు భృత్యులను అయోధ్యకు పంపెను.(27, 28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది ఏడవ సర్గము సమాప్తము.

అరువది ఎనిమిదవ సర్గము

దశరథుడు మంత్రిసమేతుడై మిథిలకు బయలుదేరుట

జనకు డాజ్ఞాపించిన దూతలు మూడు దినములు ప్రయాణము చేసి, అలసిపోయిన గుఱ్ఱములతో అయోధ్యానగరము చేరిరి. అచట రాజభవనమునకు వెళ్లి, ద్వారపాలకులతో, "జనకమహారాజు దూతలు వచ్చినారని దశరథమహారాజుతో చెప్పుడు." అని పల్కిరి.(1, 2)

ద్వారపాలకులు వారి మాటలు దశరథునకు నివేదించిరి. పిమ్మట రాజాజ్ఞ ప్రకారము రాజభవనములో ప్రవేశించిన ఆ దూతలు దేవతాసదృశుడును, వృద్ధుడును అగు దశరథుని చూచిరి.(3)

ఆ దూతలందరును చేతులు జోడించి, కంగారు పడనివారై, నియమబద్ధులై దశరథునితో మధురాక్షములుగల వాక్యమును పలికిరి.(4)

"మహారాజా! మిథిలాధిపతియైన జనకమహారాజు స్నేహపూర్ణమగు మధురమైన వాక్కుతో అగ్నిహోత్రాదినిరతుడ వగు నీయొక్కయు, నీ ఉపాధ్యాయులయొక్కయు, పురోహితులయొక్కయు, పరివారజనముయొక్కయు యోగక్షేమములను విచారించు చున్నాడు. మిథిలాధీశుడగు జనకమహారాజు శ్రద్ధాపూర్వకముగ నిన్ను కుశలప్రశ్న చేసి, విశ్వామిత్రుని అనుమతి పొంది, నీతో ఈ మాట చెప్పుచున్నాడు.(5-7)

'నా పుత్రిక వీర్యశుల్కయని నేను పూర్వము చేసిన ప్రతిజ్ఞ ప్రసిద్ధమే కదా.(తమ బలపరాక్రమములు చూపించలేక నాపై) కోపించి వచ్చిన రాజులు నిర్వీర్యులై పరాజితులైపోయిరి.(8)

దశరథమహారాజా! అట్టి నా ఈ పుత్రికను విశ్వామిత్రుని వెంట దైవవశముచే మిథిలకు వచ్చిన వీరుడైన నీ కుమారుడు సంపాదించుకొన్నాడు. మహాత్ముడైన రాముడు, గొప్ప సభలో, దివ్యమైన ఆ (శివ)ధనుస్సును మధ్యకు విరచెను. వీర్యశుల్కయైన సీతను ఈ మహాత్మున కిచ్చి నా ప్రతిజ్ఞను నెరవేర్చుకొనవలెను గావున అందులకు అనుజ్ఞ ఇమ్ము.(9-11)

దశరథమహారాజా! నీవు ఉపాధ్యాయపురోహితసహితుడవై శీఘ్రముగ వచ్చి రామలక్ష్మణులను చూడుము. ఇచటికి వచ్చి నాకానందమును కలిగింపుము. నీకు కూడ పుత్రవివాహోత్సవాది దర్శనానందము కలుగగలదు.(12, 13)

జనకమహారాజు విశ్వామిత్రుని అనుజ్ఞ పొంది, శతానందుని అనుమతికూడ

గ్రహించి ఈవిధముగ మధురవాక్యమును చెప్పినాడు".

దూతలు ఈ విధముగా జనకుని సందేశమును వినిపించి రాజుపై గల గౌరవముచే అధికముగ మాటలాడ జంకి ఊరకుండిరి.(14, 15)

దూతవాక్యములు విన్న దశరథుడు మిక్కిలి సంతసించి వసిష్ఠ వామదేవులతోడను, ఇతర మంత్రులతోడను ఇట్లు పలికెను.(16)

"కౌసల్యానందవర్ధనుడైన మన రాముడు విశ్వామిత్రపరిరక్షితుడై, సోదరుడైన లక్ష్మణునితోగూడ ఇపుడు విదేహదేశమునం దున్నాడు. మహాత్ముడైన జనకుడు రాముని పరాక్రమమును చూచి తన కుమార్తెను ఆతని కీయగోరుచున్నాడు. జనకుని ఆచారసంపత్తి మీకు నచ్చినట్లయితే విలంబ మేమియు చేయక శీఘ్రముగ మిథిలాపురికి వెళ్లుదము."(17-19)

మంత్రులును, మహర్షులును అందరును, "తప్పక అట్లే చేయుదము." అని పలుకగా దశరథుడు మిక్కిలి సంతోషించి, "రేపే ప్రయాణము." అని మంత్రులతో అనెను.(20)

సకలసద్గుణసంపన్ను లగు జనకుని మంత్రులు మంచి సత్కారముల నంది ఆ రాత్రి అయోధ్యానగరముననే ఉండిపోయిరి.(21)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.

అరువది తొమ్మిదవ సర్గము

దశరథుడు మిథిల చేరగా జనకుడు అతనిని సత్కరించుట.

రాత్రి గడచిన పిమ్మట, బంధువులతోను, ఉపాధ్యాయులతోను కూడిన దశరథమహారాజు సంతసించి సుమంత్రునితో ఇట్లు పలికెను.(1)

"ధనాధ్యక్షు లందరును పుష్కలముగా ధనమును, వివిధరత్నములను గూడ గ్రహించి, బాగుగా సంసిద్ధులై ముందుగా వెళ్లెదరుగాక. నేను ఆజ్ఞాపించిన క్షణమునందే చతురంగ బలసైన్యము, శ్రేష్ఠమైన పల్లకీలు, రథములు మొదలగునవియు బయలుదేరుగాక!(2, 3)

వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, దీర్ఘాయుర్దాయవంతుడైన మార్కండేయుడు, కాత్యాయనఋషి – ఈ బ్రాహ్మణు లందరును ముందు వెళ్ళెదరుగాక! నా రథమును కూర్చి శీఘ్రముగ తీసికొని రమ్ము. విలంబము చేయవలదు. జనకుని దూతలు నన్ను తొందర పెట్టుచున్నారు."(4, 5)

దశరథమహారాజు ఋషులతో కలిసి వెళ్ళుచుండగా, అతని ఆజ్ఞానుసారము చతురంగబలము అతని వెనుకనే వెళ్ళెను.(6)

నాల్గు దినములు ప్రయాణము చేసి దశరథుడు విదేహదేశము చేరగా జనకమహారాజు ఆ విషయము విని, దశరథునకు ఆయా ప్రాంతములలో తగు విధముగ సత్కారముల నేర్పరచెను. పిమ్మట జనకమహారాజు వృద్ధుడైన దశరథమహారాజును కలుసుకొని చాల సంతోషించెను. అతనితో,(7, 8)

"దశరథమహారాజా! నీకు స్వాగతము. నా భాగ్యవశముచే నీవు మిథిలకు వచ్చినావు. నీ ఇరువురి కుమారుల పరాక్రమముచే ప్రాప్తించిన ఆనందమును పొందగలవు. మహాతేజఃశాలియు, భగవంతుడును అగు వసిష్ఠమహర్షి బ్రాహ్మణోత్తములతో కలిసి, దేవతలతో కలిసి దేవేంద్రుడు వలె, నా భాగ్యవశమున ఇచటికి వచ్చినాడు. నా భాగ్యమువలన పరాక్రమముచే శ్రేష్ఠులును, మహాత్ములును అగు రఘువంశరాజులతో వియ్యమందితిని. నా విఘ్నము లన్నియు తొలగినవి. నా కులము పూజనీయమైనది. రాజాధిరాజా! రేపు ప్రాతఃకాలము యజ్ఞము పూర్తియైన పిమ్మట ఋషిసంమతమైన వివాహమును నెరవేర్చుము." అని సాదరముగా పలికెను.(9–12)

మాట నేర్పరులలో శ్రేష్ఠుడగు దశరథమహారాజు జనకుని వచనము విని, అచటి ఋషులందరును వినుచుండగా ఆతనితో, "జనకమహారాజా! నీవు ధర్మము తెలిసినవాడవు. ప్రతిగ్రహము అనునది దాత చేతిలో నున్నది. దాత ఇచ్చినప్పుడే కదా ప్రతిగ్రహీత స్వీకరించునది! నీ కన్యాదాననిర్ణయాదికమును విని యున్నాము. నీ వెట్లు చెప్పెదవో అట్లే చేసెదము." అనెను.(13, 14)

సత్యవాదియైన దశరథుడు పలికిన ధర్మసంమతము, యశస్కరము అయిన వచనము విని జనకమహారాజు చాల ఆశ్చర్యపడెను.(15)

అచ్చటి మునీశ్వరు లందరును, పరస్పరము కలిసినందులకు చాల సంతసించినవారై, ఆ రాత్రి సుఖముగ గడిపిరి. దశరథమహారాజు పుత్రులైన రామలక్ష్మణులను జూచి ఆనందభరితుడై, జనకుని సత్కారములకు సంతుష్టుడై

నివసించెను.(16, 17)

జనకమహారాజు, యజ్ఞమునకు సంబంధించిన కర్మలను, కుమార్తెల వివాహమునకు సంబంధించిన అంకురారోపణాదిక్రియలను పూర్తిచేసికొని ఆ రాత్రి గడపెను.(18)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని అరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.

డెబ్బదియవ సర్గము

వసిష్ఠుడు రామలక్ష్మణులకొరకై సీతా ఊర్మిళలను వరించుట.

ప్రాతఃకాలమున మహర్షులు కర్తవ్యకర్మ లన్నియు చేయించిన పిమ్మట వాక్యకుశలుడైన జనకుడు పురోహితుడైన శతానందునితో, "మహాతేజశ్శాలి, అతిధార్మికుడు అయిన నా తమ్ముడు కుశధ్వజుడు, ఇక్షుమతీనదీతీరమున నీటిలో పాతిన ఇనుప శూలములు సరిహద్దుగా గలది, పరిశుద్ధమైనది, పుష్పక విమానమువంటిది అయిన శుభమైన సాంకాశ్యనగరములో నివసించుచున్నాడు. (1-3)

అతడు సంభారములను సమకూర్చుట మొదలగు పనుల ద్వారా నాకు యజ్ఞసంరక్షణ చేసినవాడు. అతనిని చూడవలెనని అనుకొనుచున్నాను. ఆ మహాతేజస్వికూడ నాతో ఈ ఆనందమును అనుభవించవలెను." అని పలికెను.(4)

జనకుడు శతానందునితో ఇట్లు చెప్పగా అచటికి శతానందుడు పిలువనంపగా వచ్చిన కొందరు ఉత్సాహవంతు లగు దూతలను జనకు డాజ్ఞాపించెను. ఆ దూతలు జనకుని ఆజ్ఞ ప్రకారము కుశధ్వజుని తీసికొనివచ్చుటకై వేగముగా పరుగెత్తు అశ్వములను అధిరోహించి వెళ్లిరి.(5, 6)

వారు సాంకాశ్యమునకు వెళ్లి కుశధ్వజుని చూచి, జరిగిన విషయము నంతను తెలిపి జనకుని అభిప్రాయమును నివేదించిరి. కుశధ్వజుడు, ఆ దూతలు చెప్పిన వృత్తాంతమును విని జనకుని ఆజ్ఞ ననుసరించి మిథిలానగరమునకు వచ్చెను.(7, 8)

ఆ కుశధ్వజుడు, ధర్మనిరతుడును, మహాత్ముడును అగు జనకుని చూచెను. శతానందునకును, ధార్మికుడైన జనకునకును అభివాదనము చేసి, రాజోచితమగు శ్రేష్ఠమైన ఆసనమును అధిష్ఠించెను.(9)

మహాతేజఃశాలులును, వీరులును అగు ఆ సోదరు లిరువురును కూర్చుండి మంత్రులలో శ్రేష్ఠుడైన సుదామనుని, "మహామంత్రీ! అమితమైన తేజస్సు కల దశరథుని వద్దకు వెళ్లి, పుత్రమంత్రిసమేతముగ అతనిని తీసికొనిరమ్ము." అని చెప్పి దశరథుని వద్దకు పంపిరి.(10, 11)

ఆతడు విడిదికి వెళ్ళి, అచట రఘువంశవర్ధనుడైన దశరథుని చూచి, తలవంచి నమస్కరించి, "దశరథమహారాజా! మిథిలాధిపతియైన జనకమహారాజు, ఉపాధ్యాయ పురోహితసమేతుడవైన నిన్ను చూడవలెనని అనుకొనుచున్నాడు." అని చెప్పెను.(12, 13)

దశరథమహారాజు ఆ మంత్రి మాటలు విని, ఋషులతోను, బంధువులతోను కలిసి జనకుడున్న చోటికి వెళ్లెను. బంధువులతోడను, ఉపాధ్యాయులతోడను కూడినవాడు, మాటలలో నేర్పరి అయిన దశరథుడు జనకునితో,(14, 15)

"మహారాజా! పూజ్యుడైన వసిష్ఠమహర్షి మా వంశమువారి కందరికిని దేవత అనియు, అన్ని పనులందును మా పక్షమున మాటలాడువా డనియు నీకు తెలియునుగదా? విశ్వామిత్రుని అనుజ్ఞను, సకలమహర్షుల అనుజ్ఞను పొంది ధర్మాత్ముడైన వసిష్ఠుడు నా వంశములోని పూర్వపురుషులను గూర్చి యథాక్రమముగా చెప్పగలడు." అని పలికెను.(16, 17)

అపుడు మాటలలో నేర్పరియగు పూజ్యుడైన వసిష్ఠమహర్షి, పురోహితులతో గూడిన జనకమహారాజుతో ఇట్లనెను.(18, 19)

"అవ్యక్తమునుండి పుట్టినవాడును, ఎల్లప్పుడు ఉండువాడును, నిత్యుడును, వినాశరహితుడును అగు బ్రహ్మదేవునినుండి మరీచియు, మరీచినుండి కాశ్యపు డనెడు కుమారుడును పుట్టెను. కాశ్యపునకు సూర్యుడు జనించెను. సూర్యుని కుమారుడు మనువు. పూర్వము ప్రజాపతిగ ఉన్న మనువునకు ఇక్ష్వాకువు జనించెను.(20, 21)

ఆ ఇక్ష్వాకువు అయోధ్యలో మొదటి రాజుగా ఉండెను. శ్రీమంతుడగు కుక్షి ఇక్ష్వాకుని పుత్రుడు. పిమ్మట కుక్షికి వికుక్షి అను నతడు కుమారుడుగా పుట్టెను.

వికుక్షి కుమారుడు, మహాతేజఃశాలియు, ప్రతాపవంతుడును అగు బాణుడు. మహాతేజస్వి, ప్రతాపవంతుడు అయిన అనరణ్యుడు బాణుని కుమారుడు. అనరణ్యునకు పృథువు, పృథువునకు త్రిశంకువు కుమారులుగా జన్మించిరి.(22-24)

త్రిశంకువునకు దుందుమారుడను గొప్ప కీర్తిగల కుమారుడు పుట్టెను. ఆతనికి యువనాశ్వు డని కూడ పేరు. మాంధాత చక్రవర్తి యువనాశ్వుని కుమారుడు. మాంధాతకు సుసంధియను శ్రీమంతుడగు కుమారుడు జనించెను. ఆతనికి ధ్రువసంధి, ప్రసేనజిత్ అను ఇరువురు కుమారులు జనించిరి. ధ్రువసంధికి కీర్తిమంతుడగు భరతు డను కుమారుడు పుట్టెను. భరతునకు గొప్ప తేజస్సుగల అసితు డను కుమారుడు పుట్టెను.(25-27)

హైహయ - తాలజంఘ - శశిబిందు వంశములకు చెందిన రాజులు ఈ అసితునకు శత్రువులైరి. ఆ అసితమహారాజు శత్రువులతో యుద్ధము చేసి, పరాజితుడై రాజ్యభ్రష్టు డయ్యెను. అల్పమైన సైన్యముతోడను, మంత్రులతోడను కలిసి హిమవత్పర్వతమునకు వెళ్లి అచట భృగుప్రస్రవణ మను ప్రదేశమున నివసించెను.(28, 29)

ఆ సమయమున అతని భార్యలలో ఇద్దరు గర్భవతులై యుండిరి. వారిలో ఒకతె సవతి గర్భము నష్టమగుటకై ఆమెకు విషముతో కూడిన ఆహార మిచ్చినదట. ఆ దివసములలో రమ్యమైన పర్వతశ్రేష్ఠమునందు అభిరుచి గల భృగువంశ సంజాతుడగు చ్యవనుడు హిమవత్పర్వతమునకు వచ్చెను.(30, 31)

రాజభార్యలలో గొప్ప భాగ్యము కలదియు, పద్మపత్రాక్షియు అగు ఒకతె తనకు కుమారుడు కావలెనని కోరుచు, దేవతలవంటి కాంతిగల ఆ చ్యవనునికి నమస్కరించెను. ఆ సవతికి విషము పెట్టిన కాళింది కూడ ఆ మునివద్దకు వెళ్లి నమస్కరించెను. చ్యవనుడు పుత్రాభిలాషిణి యగు రాజభార్యతో,(32, 33)

"మహాభాగ్యవంతురాలా! మహాబలుడు, మహావీర్యుడు, మహాతేజస్వియు అగు సుపుత్రుడు నీ గర్భములో ఉన్నాడు. ఐశ్వర్యవంతుడైన ఆ కుమారుడు కొలది కాలములో విషముతో కూడ పుట్టగలడు; దుఃఖింపకుము." అని పలికెను.(34, 35)

రాజపుత్రియు, పతివ్రతయు, భర్తృమరణముచే దుఃఖితురాలును అగు ఆ రాజమహిషి ఈవిధముగ చ్యవనుని అనుగ్రహముచే పుత్రుని కనెను. గర్భమును నశింపచేయవలెనను అభిప్రాయముతో సవతి ఆమెకు ఇచ్చిన గరముతో పాటు

పుట్టుటచే ఆ పుత్రుడు 'సగరుడు' అయ్యెను.(36, 37)

సగరుని కుమారుడు అసమంజుడు. ఆతని కుమారుడు అంశుమంతుడు. అంశుమంతుని పుత్రుడు దిలీపుడు. అతని కుమారుడు భగీరథుడు. భగీరథునకు కకుత్స్థుడును, ఆతనికి రఘువును పుట్టిరి. తేజఃశాలియగు ప్రవృద్ధుడు రఘువుయొక్క కుమారుడు. అతడు వసిష్ఠుని శాపముచే పురుషాదకుడు (మనుష్యమాంసము తినువాడు) అయ్యెను. అతడు వసిష్ఠునకు ప్రతిశాప మిచ్చుటకై జలము గ్రహించెను. అపుడు ఆతని భార్య నివారించుటచే ఆ శాపోదకమును తన పాదములపైననే విడచుటచే కల్మాషపాదుడు (కల్మషముతో కూడిన పాదములు కలవాడు) అయ్యెను. అతనికి శంఖణుడు పుట్టెను. శంఖణుని కుమారుడు సుదర్శనుడు. సుదర్శనుని కుమారుడు అగ్నివర్ణుడు. ఆతని కుమారుడు శీఘ్రగుడు. ఆతని కుమారుడు మరువు. ఆతని కుమారుడు ప్రశుశ్రుకుడు. ప్రశుశ్రుకుని కుమారుడు అంబరీషుడు. అంబరీషుని పుత్రుడు నహుషమహారాజు. నహుషునకు యయాతి యను పుత్రుడు జనించెను. ఆతని కుమారుడు నాభాగుడు.(38-42)

నాభాగునకు అజుడను కుమారుడు కలిగెను. అజుని కుమారుడు దశరథుడు. ఈ దశరథుని కుమారులే ఈ రామలక్ష్మణులు.(43)

నరశ్రేష్ఠుడవైన జనకమహారాజా! అదినుండియు పరిశుద్ధమైన వంశము కలవారు, పరమధార్మికులు, వీరులు, సత్యవాదులు అయిన ఇక్ష్వాకుల వంశములో జన్మించిన ఈ రామలక్ష్మణులకొరకై నీ కుమార్తెలను వరించుచున్నాను. ఈ రామలక్ష్మణులు నీ కుమార్తెలకు తగిన వరులు. వీరికి తగిన వధువులైన నీ కుమార్తెలను ఇచ్చి వివాహము చేయుము."(44, 45)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బదియవసర్గము సమాప్తము.

డెబ్బది ఒకటవ సర్గము

రామలక్ష్మణులకు సీతాఊర్మిళలను ఇచ్చెదనని జనకుడు అంగీకరించుట.

ఈ విధముగ దశరథుని వంశమును వర్ణించి చెప్పిన వసిష్ఠునితో జనకుడు, చేతులు జోడించి ఇట్లు పలికెను.

"మహామునీ! నీకు మంగళమగుగాక! నా వంశమును గూర్చి చెప్పుచున్నాను. వినుము. సత్కులములో పుట్టినవారు కన్యాదానసమయమున తమ వంశమును గూర్చి పూర్తిగా చెప్పవలెను. అందుచే నేను నా వంశమును గూర్చి చెప్పుచున్నాను. వినుము.(1, 2)

మూడు లోకములందును ప్రసిద్ధుడును, పరమధర్మాత్ముడును, బలము కలవా రందరిలోను శ్రేష్ఠుడును అగు నిమి అను చక్రవర్తి ఉండెను. మిథిలను నిర్మించిన మిథి ఆ నిమిచక్రవర్తి కుమారుడు. ఇతడే మొట్టమొదటి జనకుడు. ఆతని కుమారుడు ఉదావసువు. ఉదావసువుకు నందివర్ధనుడను కుమారుడు కలిగెను. ఆతని కుమారుడు సుకేతువు.(3, 5)

సుకేతువునకు ధర్మాత్ముడును, మహాబలుడును అగు దేవరాతుడు పుట్టెను. రాజర్షియైన దేవరాతునకు బృహద్రథు డను పుత్రుడు జనించెను. బృహద్రథునకు శూరుడును ప్రతాపవంతుడును అగు మహావీరుడు పుట్టెను. మహావీరునకు ధైర్యవంతుడు, సత్యమైన పరాక్రమము కలవాడు అయిన సుధృతి జన్మించెను.(6, 7)

ధర్మబుద్ధి కలవాడును, ధర్మాచరణశీలుడును అగు దృష్టకేతువు సుధృతికి కుమారుడుగ జన్మించెను. రాజర్షియైన దృష్టకేతువునకు హర్యశ్వుడని ప్రసిద్ధుడైన పుత్రుడు జనించెను. హర్యశ్వునకు మరుడు అను పుత్రుడు జనించెను. మరుని పుత్రుడు ప్రతింధకుడు. ధర్మాత్ముడైన కీర్తిరథమహారాజు ప్రతింధకుని కుమారుడు. కీర్తిరథునికి దేవమీఢుడు, దేవమీఢునకు విబుధుడు, ఆతనికి మహీధ్రకుడును పుట్టెను. మహీధ్రకునకు మహాబలుడైన కీర్తిరాతు డను కుమారుడు జనించెను. రాజర్షియైన కీర్తిరాతునకు మహారోముడు పుట్టెను. మహారోమునకు ధర్మాత్ముడైన స్వర్ణరోముడు పుట్టెను. రాజర్షియైన స్వర్ణరోమునకు హ్రస్వరోముడు పుట్టెను. ధర్మము నెరిగిన ఆ మహాత్మునకు ఇద్దరు పుత్రులు జనించిరి. నేను పెద్దవాడను. వీరుడైన కుశధ్వజుడు నా తమ్ముడు.(8-13)

మా తండ్రియైన హ్రస్వరోమమహారాజు జ్యేష్ఠుడ నైన నన్ను రాజ్యాభిషిక్తుని చేసి, కుశధ్వజుని పోషణభారమును నాపై ఉంచి వనమునకు పోయెను. వృద్ధుడైన తండ్రి స్వర్గస్థుడైన పిమ్మట, దేవసదృశుడైన నా తమ్ముడు కుశధ్వజుని స్నేహముతో చూచుకొనుచు, ధర్మానుసారముగా రాజ్యభారము వహించితిని.(14, 15)

కొంతకాలమునకు, పరాక్రమవంతుడగు సుధన్వుడను రాజు సాంకాశ్యపురమునుండి మిథిలపైకి దండెత్తివచ్చెను. 'శ్రేష్ఠమగు శివధనుస్సును, పద్మపత్రాక్షియగు సీతను నా కిమ్ము.' అని ఆతడు నాకు వార్త పంపెను.(16, 17)

సీతను, శివధనుస్సును ఇవ్వకపోవుటచే ఆతనికిని నాకును యుద్ధము జరుగగా, రణరంగమున నేనాతనిని వధించితిని. ఆ సుధన్వుని సంహరించి, నా సోదరుడైన ఈ కుశధ్వజుని సాంకాశ్యపురమున రాజ్యాభిషిక్తుని చేసితిని.(18, 19)

సోదరులలో నేను పెద్దవాడను. ఇతడు చిన్నవాడు. నా కన్యలిద్దరిని దశరథనందనులకు ఆనందపూర్వకముగ ఇచ్చెదను. సీతను రామునకును, ఊర్మిళను లక్ష్మణునకును ఇచ్చెదను. వీర్యశుల్కయు, దేవకన్యతో సమానురాలును అగు నా పుత్రికయైన సీతను, రెండవ కుమార్తెయైన ఊర్మిళను ఇచ్చెదనని మూడు పర్యాయములు నొక్కి వక్కాణించుచున్నాను. ఈ విషయమున సందేహము లేదు. (20, 21)

దశరథమహారాజా! ఈ కన్యలను ఆనందపూర్వకముగా ఇచ్చుచున్నాను. రామలక్ష్మణులకు గోదానమును (సమావర్తనవ్రతమును) చేయించుము. నాందీశ్రాద్ధము చేసిన పిమ్మట వివాహము జరిపించుము.(22, 23)

ఈ దివసమున మఘానక్షత్రము కదా. నేటికి మూడవరోజున, ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు వివాహము చేయుము. ముందుగా రామలక్ష్మణుల భావిసుఖహేతువు అగు గోహిరణ్యభూమ్యాదిదానము కూడ చేయింపవలెను.(24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది ఒకటవ సర్గము సమాప్తము.

డెబ్బది రెండవ సర్గము

భరతశత్రుఘ్నులకొరకై కుశధ్వజుని కన్యలను వరించుట.

విదేహాధిపతియగు జనకమహారాజు పలికిన మాటలు విని వసిష్ఠవిశ్వామిత్రులు ఆతనితో ఇట్లు పలికిరి.(1)

"జనకమహారాజా! ఇక్ష్వాకువిదేహవంశములు ఊహింపరాని, ఇంత అని చెప్పుటకు శక్యముకాని ప్రభావము కలవి. అట్టి వంశీయులతో సమాను లెవ్వరును లేరు. సీతాఊర్మిళలను రామలక్ష్మణులకిచ్చి వివాహము చేయుట అనునది పరస్పర వంశగౌరవాదులకును, (వధూవరుల) రూపసంపదకును తగిన సంబంధము. (2, 3)

మేము చెప్పదలచిన మాటలను వినుము. నీ తమ్ముడైన ఈ కుశధ్వజుడు ధర్మము నెరిగినవాడు. భూలోకమునందు సాటిలేని రూపము గలవాడగు ఈ ధర్మాత్ముని ఇరువురు పుత్రికలను భరతశత్రుఘ్నులకు భార్యలనుగా వరించుచున్నాము. భరతకుమారుని కొరకును, ధీమంతుడైన శత్రుఘ్నుని కొరకును నీ తమ్ముని కుమార్తెలను కోరుచున్నాము.(4-6)

ఈ దశరథకుమారు లందరును రూపయౌవనములతో ప్రకాశించుచున్నవారు. లోకపాలులతో సమానులు. దేవతలవంటి పరాక్రమము గలవారు. పుణ్యకర్ములుగల నీ వంశమునకును, ఇక్ష్వాకువంశమునకును ఈ వివాహసంబంధముచే దృఢమైన బంధము ఏర్పడుగాక!"(7, 8)

వసిష్ఠుని అనుమతి ననుసరించి విశ్వామిత్రుడు పలికిన ఈ మాటలు విని, జనకమహారాజు అంజలి ఘటించి, ఆ వసిష్ఠవిశ్వామిత్రులతో ఇట్లనెను.(9)

"మునిశ్రేష్ఠులైన మీరు మాకు తగిన కులసంబంధమును గూర్చి స్వయముగ ఆజ్ఞాపించుచున్నారు. అందుచే మా వంశము ధన్యమైనది. మీరు చెప్పినట్లే అగుగాక! ఈ కుశధ్వజుని కుమార్తెలగు మాండవీశ్రుతకీర్తులు, కలిసి సంచరించెడు ఈ భరతశత్రుఘ్నులకు(వరుసగ) భార్యలై వారిని సేవింతురుగాక!(10, 11)

మహామునీ! మహాబలశాలులగు నలుగురు రాజపుత్రులును ఒకే దివసమున నలుగురు రాజపుత్రికలను వివాహమాడుదురుగాక! సంతానదాతయగు భగుడు

దేవతగా గల ఉత్తరనక్షత్రముతో కూడిన దివసమున వివాహకృత్యము శ్రేష్ఠమని బుద్ధిమంతులు చెప్పుదురుకదా?"(12, 13)

జనకమహారాజు ఈవిధముగ సౌమ్యమగు వాక్యము పలికి, లేచి, దోసిలి కట్టి, ఆ మహామును లిరువురితో మరల ఇట్లనెను.(14)

"మీరు నాకు గొప్ప ధర్మకార్యమును నెరవేర్చినారు. నేను ఎల్లప్పుడును మీ శిష్యుడనే. మునిపుంగవులైన మీ రిరువురును ఈ మూడు సింహాసనములను (జనక-దశరథ-కుశధ్వజుల సింహాసనములను) అధిష్ఠింతురుగాక! దశరథునకు మిథిలపై అధికారమున్నట్లే నాకును అయోధ్యపై అధికారమున్నది. అందుచేతనే దశరథుని రాజ్యముపై కూడ మీకు అధికారము నిచ్చుచున్నాను. ప్రభుత్వ విషయమున సందేహములేదు. తగు విధముగ కార్యము నిర్వహింపుడు."(15, 16)

దశరథమహారాజు జనకుని మాటలకు సంతసించి ఆతనితో, "మిథిలాధిపతులైన మీ సోదరు లిరువురును ఇన్ని అని చెప్పలేని సద్గుణములు గలవారు. మీ రెందరో ఋషులను, రాజులను పూజించి వారినుండి సద్గుణములను అలవరచుకొనినారు. మీకు మేలగుగాక! నేను నా నివాసమునకు వెళ్ళి నాందీముఖశ్రాద్ధాదికర్మలు చేసెదను." అని పలికెను.(17-19)

మహాయశఃశాలియగు దశరథమహారాజు అపుడు, జనకునివద్ద సెలవుగైకొని వసిష్ఠవిశ్వామిత్రులతో నిజనివాసమునకు వెళ్లెను. అతడు తన నివాసగృహము చేరి యథాశాస్త్రముగ శ్రాద్ధము చేసి, మరునాడు ప్రాతఃకాలముననే లేచి అపుడు చేయవలసిన స్నాతకవ్రతమును జరిపించెను. ఒక్కొక్క కుమారు నుద్దేశించి ఒక్కొక్క లక్షచొప్పున గోవులను బ్రాహ్మణులకు దానము చేసెను.(20-22)

పురుషశ్రేష్ఠుడును, పుత్రులయందు అత్యధికప్రేమ కలవాడును అగు దశరథమహారాజు లేగదూడలతో కూడినవి, క్షీరసమృద్ధములు అయిన నాలుగు లక్షల గోవులను కొమ్ములకు బంగారు తొడుగులు వేయించి, (పాలు పితుకుటకు) కంచుపాత్రలతో కూడ దానము చేసెను. ఇంకను అత్యధికమైన ఇతర ద్రవ్యమును, పుత్రుల గోదానవ్రతసమయమున బ్రాహ్మణులకు దానము చేసెను.(23, 24)

గోదానవ్రతము పూర్తిచేసికొనిన కుమారులు చుట్టును నిలచియుండగా ఆ దశరథమహారాజు లోకపాలుల మధ్య నున్న బ్రహ్మవలె ప్రకాశించెను.(25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది రెండవ సర్గము సమాప్తము.

డెబ్బది మూడవ సర్గము

రామలక్ష్మణభరతశత్రుఘ్నుల వివాహము.

దశరథమహారాజు కుమారులకు గోదానవ్రతము జరిపించిన దివసముననే భరతుని మేనమామ యగు యుధాజిత్తు మిథిలకు వచ్చెను. కేకయరాజకుమారుడును, భరతుని మేనమామయు అగు ఆ యుధాజిత్తు రాజును చూచి, కుశలప్రశ్న మడిగి ఇట్లు చెప్పెను. (1, 2)

“మహారాజా! కేకయదేశప్రభు వైన మా తండ్రి స్నేహపూర్వకముగ నిన్ను కుశలప్రశ్న చేసినాడు. నీవు ఎవరి కుశలమును కోరుచుందువో వారందరును ఇపుడు ఆరోగ్యముగ నున్నారు. (3)

మా తండ్రి మా మేనల్లుని చూడవలెనని కోరుటచే అందుకొరకై నేను అయోధ్యానగరమునకు వెళ్లి యుంటిని. నీ కుమారులు వివాహముకొరకై నీతో కలిసి మిథిలకు వెళ్లినారని అయోధ్యలో తెలిసినది. వెంటనే నేను నా సోదరిపుత్రుని చూచుటకై శీఘ్రముగా ఇచటికి వచ్చినాను.”(4, 5)

దశరథుడు పూజార్హుడైన ఆ ప్రియాతిథిని చూచి ఆతనిని అధికసత్కారములతో పూజించెను. (6)

కర్మవేత్త యైన దశరథుడు మహాత్ములైన పుత్రులతో ఆ రాత్రి గడపి, ప్రాతః కాలమున లేచి, కర్మ లాచరించి, ఋషులను ముందిడుకొని యజ్ఞవాటమును చేరెను. (7, 8)

సర్వాలంకారములచే అలంకృతులైన సోదరులతో కూడిన రాముడు విజయ మనెడు యుక్తమైన ముహూర్తమునందు తోరము, బాసికము కట్టుట మొదలగు వివాహమంగళములు జరుపుకొని, వసిష్ఠాదిమహర్షులను ముందిడుకొని, సోదరసహితుడై తండ్రివద్దకు చేరెను. (9, 10)

వసిష్ఠమహాముని జనకుని వద్దకు వెళ్లి, “జనకమహారాజా! దశరథమహారాజు కుమారుల కౌతుకమంగళము పూర్తిచేసి కన్యాదాతవైన నీకొరకు ఎదురు చూచుచున్నాడు. ఇట్టి పనులు దాత, ప్రతిగ్రహీత ఇరువురు కలిసినప్పుడే జరుగును. ఉత్తమమైన వివాహమును చేసి స్వధర్మము నాచరించుము.” అని చెప్పెను. (11, 12)

పరమౌదార్యవంతుడు, మహాతేజఃశాలి, పరమధర్మవేత్త అయిన జనకుడు వసిష్ఠుని మాటలు విని, "వసిష్ఠమునీంద్రా! దశరథుడు లోనికి ఎందుకు రాలేదు? ద్వారమువద్ద ఎవరైనా అడ్డగించినారా? దశరథ మహారాజును అడ్డగించగల ద్వారపాలకుడు ఎవడైనా ఉన్నాడా? లోనికి ఏల రాలేదు? ఎవరి ఆజ్ఞకై ఎదురుజూచుచున్నారు? స్వగృహములో సంకోచమెందుకు? ఈ రాజ్యము కూడ నీ రాజ్యమువంటిదే కదా!(13, 14)

నా కన్యలు కౌతుకమంగళములు పూర్తిచేసికొని, ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలల వలె వేదికసమీపమున చేరియున్నారు. నేను సిద్ధుడనై వేదిదగ్గర ఉండి మీకొరకు ఎదురుచూచుచున్నాను. దశరథమహారాజు విఘ్నము లేవియు లేకుండ శుభకార్యము జరుపుగాక! ఆలస్యమెందులకు?" అనెను.(15, 16)

దశరథు డప్పుడు జనకుని వాక్యము విని, కుమారులను, సకలఋషులను కూడ లోనికి తీసికొనివెళ్లెను.(17)

పిమ్మట జనకుడు వసిష్ఠుని, "ధార్మికుడవైన వసిష్ఠమహామునీ! ఇతర ఋషుల సహాయముతో, లోకాభిరాముడైన రాముని వివాహక్రియను జరిపింపుము." అని ప్రార్థించెను.(18, 19)

వసిష్ఠమహర్షి "అటులనే చేసెదను." అని జనకునకు చెప్పి, విశ్వామిత్ర శతానందులను ముందిడుకొని, మండపము మధ్య యథాశాస్త్రముగ అగ్నివేదికను నిర్మించెను. దాని చుట్టును గంధపుష్పములు, బంగారు పాలికలు, అంకురములు గల రంధ్రములతో కూడిన కుంభములు, అంకురములతో నిండిన మూకుళ్లు, ధూపముతో కూడిన ధూపపాత్రలు, శంఖాకారములైన పాత్రలు, స్రుక్కులు, స్రువములు, అర్ఘ్యోదకము నింపిన పాత్రలు, పేలాలు నింపిన పాత్రలు, సంస్కరించిన అక్షతలు ఉంచి అలంకరించెను.(20-23)

మహాతేజశ్శాలి, పూజ్యుడు అయిన వసిష్ఠుడు వేదిచుట్టు, యథాశాస్త్రముగ, మంత్రపూర్వకముగ, సమములైన దర్భలను పరిచెను. పిమ్మట యథాశాస్త్రముగా, మంత్రపూర్వకముగా వేదియందు అగ్నిని ఉంచి, అగ్నిలో హోమము చేసెను.(24)

సీతారామకల్యాణమహోత్సవఘట్టము

పిమ్మట జనకమహారాజు, సర్వాభరణభూషితురా లగు సీతను తీసికొనివచ్చి, అగ్ని సమక్షమున, రామునకు ఎదురుగా నిలబెట్టి, కౌసల్యానందవర్ధనుడగు ఆ



రామునితో, "రామా! ఇదిగో ఈమె నా కుమార్తె సీత. ఈమె నీకు సహధర్మచారిణి కాగలదు. ఈమెను స్వీకరింపుము. నీ హస్తముతో ఈమె హస్తమును పట్టుకొనుము (పాణిగ్రహణము చేయుము). మహాభాగ్యవంతురాలగు ఈమె పతివ్రతయై నీడవలె సర్వదా నిన్ను అనుసరించి యుండగలదు." అని పలికి, మంత్రపూతమైన జలము వదలెను.(25-28)

ఆ సమయమున దేవతలును, ఋషులును "బాగు బాగు." అని పలికిరి. దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసినది.(29)

జనకమహారాజు మంత్రోదకపూర్వకముగా సీతను ఇచ్చిన పిమ్మట ఆనందముతో నిండినవాడై,(30)

"లక్ష్మణా! రమ్ము. నీకు క్షేమమగుగాక! (నా కుమార్తె) ఊర్మిళను స్వీకరింపుము. ఈమె హస్తమును నీహస్తముతో గ్రహింపుము. ఆలస్యము చేయకుము". లక్ష్మణునితో ఇట్లు పలికి పిదప భరతునితో, "భరతా! మాండవి హస్తమును నీహస్తముతో గ్రహించుము." అనెను. అతడు శత్రుఘ్నునితో కూడ, "ఓ మహాబాహూ! శ్రుతకీర్తి హస్తమును నీహస్తముతో పట్టుకొనుము" అని పలికి, "ఓ రామలక్ష్మణభరతశత్రుఘ్నులారా! మీరందరును సౌమ్యులు. అందరును మంచినడవడిక, నియమములు కలవారు. మీ భార్యలను స్వీకరింపుడు. ఆలస్యము చేయవద్దు" అనెను.(31-34)

జనకుని వాక్యము విని ఆ నలుగురు రాజకుమారులును, వసిష్ఠుని అనుమతి

పొంది, తమ హస్తములతో ఆ నలుగురు కన్యల హస్తములను గ్రహించిరి. మహాత్ములైన ఆ రఘువంశకుమారులు, భార్యాసమేతులై, అగ్నికిని, వేదికిని, జనకమహారాజునకును, ఋషులకును, ప్రదక్షిణము చేసి, వసిష్ఠాదులు చెప్పిన విధమున, యథావిధిగ వివాహము చేసికొనిరి.(35, 36)

రామలక్ష్మణభరతశత్రుఘ్నులు, సీతా-ఊర్మిళా-మాండవీ - శ్రుతకీర్తుల సుకుమారములైన హస్తములు గ్రహించగనే ఆకాశమునుండి మిక్కిలి ప్రకాశించుచున్న గొప్ప పుష్పవృష్టి కురిసినది.(37)

రాఘవుల వివాహసమయమున స్వర్గమునందు దుందుభులు మ్రోగినవి. గీతమంగళవాద్యధ్వనులతో అప్సరసలు నాట్యము చేసిరి. గంధర్వులు మధురముగా గానము చేసిరి. ఇది అంతయు ఆశ్చర్యకరముగా కనబడెను. ఈవిధముగ తూర్యాదిధ్వని ప్రవర్తిల్లుచుండగా రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు మూడు పర్యాయములు అగ్నిప్రదక్షిణము చేసి, భార్యలను వివాహమాడిరి.(38-40)

పిమ్మట రామలక్ష్మణభరతశత్రుఘ్నులు భార్యలతో గూడి తమ విడిదికి వెళ్లిరి. ఋషులతోను, బంధువులతోను, కూడిన దశరథుడుకూడ భార్యాసమేతులైన పుత్రులను చూచుకొనుచు వెనుకనే వెళ్లెను.(41)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది మూడవ సర్గము సమాప్తము.

డెబ్బది నాల్గవ సర్గము

దశరథుడు తన నగరమున కేగుచుండగా దారిలో పరశురాముడు వచ్చుట.

రాత్రి గడచిన పిదప విశ్వామిత్ర మహాముని ఆ రాజకుమారులకు అనేకాశీర్వాదముల నిచ్చి, జనకదశరథమహారాజులవద్ద సెలవు గైకొని హిమవత్పర్వతమునకు వెళ్లిపోయెను.(1)

విశ్వామిత్రుడు వెళ్లిన పిమ్మట దశరథమహారాజు జనకమహారాజు వద్ద సెలవు గైకొని శీఘ్రముగ అయోధ్యకు బయలుదేరెను. జనకమహారాజు, ప్రయాణమై వెళ్లుచున్న దశరథమహారాజును అనుసరించి వెళ్లి సాగనంపెను. ఆతడు తన

కుమార్తెలకు అరణముగా అత్యధికమగు ధనము నిచ్చెను.(2, 3)

ఆ మిథిలేశ్వరుడు లక్షలకొలది అవులను, శ్రేష్ఠమైన కంబళీలను, కోట్లకొలది పట్టువస్త్రములను, ఏనుగులు, అశ్వములు, రథములు, కాలిబంటులును గల చతురంగసైన్యమును, మంచి సౌందర్యము కలవారు, బాగుగా అలంకరించుకున్నవారు, శ్రేష్ఠులును అయిన దాసీదాసులను కుమార్తెలకు అరణముగా పంపెను. ఆతడు సంతోషముతో వెండి, బంగారము, ముత్యములు, పగడములు, వీటి రూపములో నున్న అత్యధికమగు కన్యాధనమును ఇచ్చెను. కుమార్తెలకు అత్యధికమైన ధనమునిచ్చి, దశరథమహారాజు వద్ద అనుజ్ఞ గైకొని తన నివాసస్థాన మగు మిథిలాపురిని ప్రవేశించెను.(4-7)

దశరథమహారాజు మహాత్ములైన కుమారులతో కూడి, ఋషు లందరిని ముందు ఉంచుకొని, సైన్యము, అనుచరులు వెంట రాగా, వెళ్లెను.(8)

అతడు ప్రయాణము చేయుచుండగా అక్కడక్కడ భయంకరములైన పక్షులు ధ్వనులు చేయ నారంభించినవి. భూమిపై నున్న మృగములు ప్రదక్షిణముగా వెళ్లినవి. దీని నంతయు చూచి దశరథమహారాజు వసిష్ఠుని ఇట్లు ప్రశ్నించెను. "ఘోరములైన పక్షులు ప్రతికూలముగా నున్నవి. మృగములు ప్రదక్షిణముగా సంచరించుచు అనుకూలముగా ఉన్నవి. నా మనస్సు విషాదము చెందుచున్నది. హృదయమును కంపింపచేయు ఇది యంతయు ఏమిటి?"(9-11)

దశరథమహారాజు మాటలు విని వసిష్ఠమహర్షి మధురమైన వాక్యము పలికెను. "దీని ఫలమేదియో చెప్పెదను వినుము. ఆకస్మికముగ దైవకృతమైన ఘోరమైన భయము వచ్చిపడనున్నట్లు పక్షులు సూచించుచున్నవి. మృగములు ఆ భయము శాంతింప నున్నట్లు సూచించుచున్నవి. అందుచేత మనస్తాపము పొందకుము." (12, 13)

వారిట్లు మాటలాడుకొనుచుండగా అచట, భూమిని కంపింపచేయుచు, మంగళకరములైన వృక్షములను పడగొట్టుచు వాయువు బయలుదేరెను. సూర్యుని చీకటి ఆవరించెను. దిక్కులన్నియు ప్రకాశవిహీనము లయ్యెను. ఆ సైన్యమంతయు బూడిద కప్పగా మూర్ఛ పొందినట్లుండెను.(14, 15)

ఆ సమయమున, వసిష్ఠాదిఋషులు, దశరథుడు, ఆతని కుమారులు వీరు మాత్రమే చైతన్యమున్నట్లు కనబడిరి. మిగిలిన వారందరును విచేతనుల వలె అయిరి.(16)

ఆ ఘోరమైన అంధకారములో, బూడిద కప్పినట్లున్న ఆ సైన్యము, జటామండలమును ధరించినవాడు, భయంకరుడు, రాజులను సంహరించినవాడు అయిన పరశురాముని చూచెను. ఆతడు కైలాసమువలె ఎదిరింప శక్యముకానివాడై, ప్రళయకాలాగ్నివలె సహింప శక్యముకానివాడై యుండెను. తేజస్సులచే మండుచున్నట్లున్న ఆతనిని సామాన్యజనులు చూడజాలకుండిరి. అతడు గండ్రగొడ్డలి బుజముపై వ్రేలాడదీసికొని, మెరపుల గుంపు వంటి ధనుస్సును, శ్రేష్ఠమైన శరమును చేతులలో ధరించి త్రిపురసంహారము చేయు శివునివలె నుండెను.(17-20)

ప్రజ్వరిల్లుచున్న అగ్నివలె భయంకరముగా ఉన్న ఆతనిని చూచి, జపహోమాది పరాయణులును, శాంతస్వభావులును అగు వసిష్ఠాదిమునులు అందరును కలిసి, పరస్పరము ఇట్లనుకొనిరి.(21)

"(కార్తవీర్యార్జునుడు) తండ్రిని చంపుటచే కోపించిన ఇతడు క్షత్రియజాతిని నశింపచేయడు కద! పూర్వము క్షత్రియవధ చేసి కోపతాపములు తగ్గి శాంతించిన ఇతడు మరల క్షత్రియవంశవినాశమునకు పూనుకొనునా?"(22, 23)

ఋషులు తమలో తామీ విధముగ మాటలాడుకొని, భయంకరుడుగా కనబడుచున్న ఆ పరశురామునకై అర్ఘ్యము గ్రహించి, "రామా! రామా!" అని మధురముగా పిలిచి పూజించిరి. ప్రతాపవంతుడైన ఆ పరశురాముడు ఋషులు సమర్పించిన ఆ పూజను స్వీకరించి, దశరథుని కుమారు డగు రామునితో ఇట్లనెను.(24, 25)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది నాల్గవ సర్గ సమాప్తము.

డెబ్బది ఐదవ సర్గము

పరశురాముడు రాముని వైష్ణవధనుస్సుపై బాణసంధానము చేయుమనుట.

"రామా! నీ పరాక్రమము అత్యద్భుతమైన దని వినుచున్నాము. శివధనుర్భంగమును గూర్చి కూడ పూర్తిగ విని యున్నాము. నీవు శివుని విల్లు విరచుట చాల ఆశ్చర్యకరమైనది, ఊహింపరానిది. ఆ వార్త విని నేను మరొక శుభమైన విల్లు తీసికొని వచ్చినాను. ఘోరమైనది, జమదగ్నిద్వారా లభించినది

అయిన ఈ మహాధనుస్సును ఎక్కుపెట్టి, బాణముచే పూరించి, నీ బలమును చూపుము.(1,3)

ఈ ధనుస్సును పూరించినచో అపుడు నీ బలమును చూచి, వీర్యముచే శ్లాఘింపదగిన నీతో ద్వంద్వయుద్ధము చేయగలను."(4)

దశరథమహారాజు అతని మాటలు విని, వాడిపోయిన ముఖముతో దీనుడై, చేతులు జోడించి, "మహామునీ! నీవు గొప్ప యశస్సు కలవాడవు. బ్రాహ్మణుడవైన నీవు క్షత్రియులపై ఉన్న కోపము తొలగి శాంతుడవుగా ఉన్నావుకదా? ఇపుడు బాలులైన నా కుమారులకు అభయమిమ్ము. నీవు స్వాధ్యాయమునందును, ఇతర వ్రతములందును ఆసక్తిగల భృగువంశమునందు పుట్టినావు. దేవేంద్రుని ముందు ప్రతిజ్ఞచేసి, శస్త్రమును విడచిపెట్టినావు. ధర్మపరుడవై, భూమి నంతను కాశ్యపునకు దానముచేసి, వనము చేరి, మహేంద్రపర్వతముపై నివాస మేర్పరచుకున్నావు.(5-8)

ఈనాడు నీవు మా అందరి వినాశార్థమై వచ్చితివి. ఒక్క రాముడు మరణించినను మేమందరము మరణింతుముకదా? (మమ్ము అనుగ్రహింపుము.)" అని ప్రార్థించెను.(9)

దశరథుడీ విధముగ మాటలాడుచుండగా ప్రతాపవంతుడైన పరశురాముడు, అతని మాటలు లెక్కచేయకుండగనే, రామునితో మాత్రమే ఇట్లు పలికెను.(10)

"రామా! ఈ రెండు ధనుస్సులును (నువ్వు విరిచిన శివధనుస్సు, నేను తెచ్చిన ఈ ధనుస్సు) శ్రేష్ఠమైనవి. దేవలోకమునకు సంబంధించినవి. లోకములలో ప్రసిద్ధి పొందినవి. దృఢమైనవి. బలము గలవి. ప్రధానమైనవి. విశ్వకర్మ వీటిని బాగుగ నిర్మించెను. వీటిలో ఒక ధనుస్సును దేవతలు యుద్ధము చేయగోరుచున్న ఈశ్వరునకు ఇచ్చిరి. త్రిపురవినాశకమగు దానినే నీవు విరచితివి.(11, 12)

ఎదిరింపరాని ఈ రెండవ ధనుస్సును దేవతలు విష్ణువున కిచ్చినారు. మిక్కిలి ప్రకాశించుచున్న ఈ ధనుస్సు విష్ణువునకు సంబంధించినది. ఇది శివధనుస్సుతో సమానమైన సారము గలది. అపుడు దేవతలందరును శివవిష్ణువుల బలాబలములను తెలిసికొనగోరి బ్రహ్మను అడిగిరి.(13, 14)

సత్యవంతులలో గొప్పవాడగు బ్రహ్మదేవుడు దేవతల అభిప్రాయము తెలిసికొని శివునకు విష్ణువునకు విరోధము కల్పించెను. అట్లు విరోధము కలుగగా, పరస్పరము జయించవలె నని కోరుచున్న శివునకును, విష్ణువునకును గొప్ప భయంకరమగు

యుద్ధము జరిగెను. విష్ణువు హుంకారము చేయగా భయంకరమైన పరాక్రమము గల ఆ శివధనుస్సు జడమైపోయినది. త్రిలోచనుడు కూడ కదలలేకపోయెను. అపుడు దేవతలు, ఋషులు, చారణులు వచ్చి ప్రార్థింపగా ఆ దేవతాశ్రేష్ఠు లిరువురును శాంతించిరి. విష్ణుపరాక్రమముచే ఆ శివధనుస్సు జడమైపోవుట జూచి దేవతలును, ఋషిగణములును, విష్ణువే అధికుడని తెలుసుకొనిరి.(15-19)

మహాయశస్సుగల రుద్రుడు కోపించి, బాణసహితమైన ఆ ధనుస్సును, విదేహదేశములో దేవరాతుడను రాజర్షికి ఇచ్చివేసెను.(20)

రామా! శత్రుపురవినాశక మగు తన ధనస్సును, విష్ణువు, భృగువంశమునకు చెందిన ఋచీకునివద్ద ఉత్తమమైన, న్యాసమునుగా ఇచ్చెను. మహాతేజఃశాలియగు ఋచీకుడు, దానిని సాటిలేని కర్మకలవాడును, మహాత్ముడును, తన కుమారుడును, నా తండ్రియు అగు జమదగ్ని కిచ్చెను. తపోబలసమన్వితు డగు నా తండ్రి అస్త్రసంన్యాసము చేసి ఉన్నపుడు కార్తవీర్యార్జునుడు పామరబుద్ధికలవాడై అతనిని చంపెను.(21-23)

చాల దారుణము, క్రౌర్యమున సాటిలేనిది అయిన నా తండ్రి వధను గూర్చి విన్న నేను రోషముతో అనేకపర్యాయములు క్షత్రియజాతికి చెందిన ప్రతి ఒక్కనిని, పుట్టినవానిని పుట్టినట్లుగనే సంహరించితిని. ఈ భూమినంతను జయించి, యజ్ఞాంతమునందు మహాత్ముడు, పుణ్యకర్మ కలవాడు అయిన కాశ్యపునకు దానము చేసితిని. పిదప తపోబలసమన్వితుడనై, మహేంద్రపర్వతముపై నివసించుచున్నాను. (24, 25)

ఉత్తమమైన పరాక్రమముగల నీవు ఇపుడు శివధనుస్సు విరచితివని విని శీఘ్రముగా వచ్చినాను. క్షత్రియధర్మమును మన్నించి, మా పితృపితామహక్రమమున లభించినది, శ్రేష్ఠము అయిన ఈ విష్ణుధనుస్సును గ్రహింపుము.(26, 27)

శ్రేష్ఠమైన ఈ ధనుస్సుమీద శత్రువుల పురములను జయించు ఈ శరమును సంధించుము. నీవట్లు చేయగలిగినచో నీతో ద్వంద్వయుద్ధము చేయగలను."(28)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది ఐదవ సర్గము సమాప్తము.

డెబ్బది అరవ సర్గము

రాముడు పరశురాముడు సంపాదించుకొనిన పుణ్యలోకములను అమోఘమైన బాణముతో కొట్టివేయుట.


అపుడు రాముడు పరశురాముని మాటలు విని, తండ్రి దగ్గర నుండుటచే ఆయనపై నున్న గౌరవభావముచే, అధికముగ మాటలాడక,(1)

"పరశురామా! నీవు చేసిన పనులను వింటిమి. తండ్రి విషయమున స్వధర్మమును నిర్వహించి ఆనృణ్యమును (ఋణమును తీర్చివేయుటను) పొందిన నిన్ను అభినందించుచున్నాము. నన్ను, పరాక్రమములేనివానిని, క్షత్రియ ధర్మానుసారము ప్రవర్తింప సామర్థ్యము లేనివానిని అవమానించినట్లు అవమానించు చున్నావు. ఇపుడు నా తేజస్సును, పరాక్రమమును చూడుము." అని పలికి (తృటిలో) పరశురాముని చేతిలోనుండి ధనుస్సును, బాణమును తీసికొనెను.(2-4)

రాముడు ధనుస్సును ఎక్కుపెట్టి నారిపై బాణము సంధించి, క్రుద్ధుడై పరశురామునితో, "పరశురామా! నీవు బ్రాహ్మణుడవు అగుటచేతను, విశ్వామిత్రునికి బంధువువు అగుటచేతను నాకు పూజ్యుడవు. అందుచే ప్రాణములను హరించు ఈ బాణమును నీపై ప్రయోగింపజాలను. నీ పాదములకున్న గమనశక్తిని గాని, తపోబలముచే నీవు సంపాదించిన సాటిలేని ఉత్తమలోకములనుగాని ఈ బాణము ప్రయోగించి కొట్టివేసెదను. ఏది కొట్టమనెదవో చెప్పుము. స్వర్గములో పుట్టినది, శత్రుపురములను జయించునది, వీర్యముచే (శత్రువుల) బలమును దర్పమును నశింపచేయునది అయిన ఈ విష్ణుబాణము వ్యర్థ మగుటకు వీలులేదు." అని పలికెను.(5-8)

శ్రేష్ఠమైన విష్ణుధనుస్సును ధరించిన రాముని చూచుటకై బ్రహ్మాదిదేవతలును, ఋషులును, గుంపులు గుంపులుగా అచటికి వచ్చిరి. గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, చారణులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు, నాగులు కూడ ఆ అద్భుతమును చూచుటకు వచ్చిరి.(9, 10)

రాముడు ఆ శ్రేష్ఠమైన ధనుస్సును ఎక్కుపెట్టగానే పరశురాముడు నిర్వీర్యుడయ్యెను. లోకమంతయు స్తంభించిపోయెను. అపుడా పరశురాముడు ఆశ్చర్యచకితుడై రాముని చూచెను. రాముని తేజస్సుచే పరాక్రమము అణగిపోయి జడుడైన పరశురాముడు పద్మపత్రాక్షుడైన రామునితో మెల్లమెల్లగా ఇట్లు పలికెను.(11, 12)



"నేను పూర్వ మీ భూమినంతను కాశ్యపున కిచ్చినపుడు అతడు, 'నీవు నా దేశములో నివసింపగూడదు." అని నన్ను ఆదేశించెను. నేను ఈ భూమిని కాశ్యపునకు దానము చేసి, ఆయన కోరిన విధమున ఇచట నివసించ నని ప్రతిజ్ఞ చేసితిని. గురువైన ఆ కాశ్యపుని మాట ననుసరించి నేను రాత్రి ఈ భూమిపై నివసించను.(13, 14)

కావున, రామా! నీవు నా గమనశక్తిని కొట్టవద్దు. నేను వెంటనే మనోవేగముతో మహేంద్రపర్వతమునకు వెళ్లిపోయెదను. నేను తపస్సుచేత జయించిన ఉత్తమలోకములను ఈ బాణముచే కొట్టుము. కాలవిలంబము చేయవద్దు. ఈ ధనుస్సును ఎక్కుపెట్టుటవలన, నీవు సురేశ్వరుడును, నాశరహితుడును, మధుసంహారియు అగు మహావిష్ణువే అని గ్రహించినాను.(15, 16)

ఓ శత్రువినాశకా! నీకు క్షేమమగుగాక! నీవు చేయు పనులు సాటిలేనివి. యుద్ధములో నిన్ను ఎదిరించువాడు ఎవ్వడును లేడు. అట్టి నిన్ను దేవతలందరును వచ్చి చూచుచున్నారు.(17, 18)

నేను, ముల్లోకములకును ప్రభువైన నీ చేతిలో పరాజితుడ నైనాను. అందుచే నాకు సిగ్గుపడవలసిన పని లేదు. నీవు బాణమును ప్రయోగింపుము. బాణమును ప్రయోగించిన పిమ్మట నేను మహేంద్రగిరికి వెళ్లెదను."(19, 20)

పరశురాముని మాటలు విని ప్రతాపవంతుడైన దశరథరాముడు బాణమును ప్రయోగించెను.(21)

తాను తపస్సుచే సంపాదించిన పుణ్యలోకములను రాముడు కొట్టగా జూచి, పరశురాముడు శీఘ్రముగ మహేంద్రపర్వతమునకు పోయెను.(22)

అపుడు దిక్కులును, విదిక్కులును చీకటి తొలగి ప్రకాశించినవి. ఆయుధము ధరించిన ఆ రాముని దేవతలును, ఋషులును స్తుతించిరి.(23)

సమర్థుడగు ఆ పరశురాముడు దశరథరాముని స్తుతించి ప్రదక్షిణము చేసి తన దారిన తాను పోయెను.(24)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది ఆఱవ సర్గము సమాప్తము.

డెబ్బది ఏడవ సర్గము

సీతారాముల ప్రేమాతిశయ వర్ణనము.

పరశురాముడు వెళ్లిన పిమ్మట రాముడు ఆ ధనుస్సును, బాణమును, అప్రమేయప్రభావశాలి యగు వరుణునకు ఇచ్చివేసెను.(1)

పిమ్మట రాముడు, వసిష్ఠుడు మొదలైన ఋషులకు నమస్కరించి, వ్యాకులుడై యున్న తండ్రిని జూచి, "మహారాజా! పరశురాముడు వెళ్లిపోయినాడు. నీ సంరక్షణలో నున్న చతురంగబలము అయోధ్యాభిముఖముగ పయనించుగాక! నీ ఆజ్ఞననుసరించు సైన్యమును ఆజ్ఞాపింపుము. చాతకముల పంక్తి జలమును కోరినట్లు సేన నీ శాసనమును కోరుచున్నది." అని పలికెను.(2-4)

దశరథమహారాజు రాముని వచనము విని ఆతనిని కౌగలించుకొని, శిరస్సుపై మూర్కొనెను. పరశురాముడు వెళ్లిపోయెనని విన్న రాజు ఆనందభరితుడై తనూ, తన కుమారులూ కూడ మరొకసారి జన్మించినట్లు భావించెను.(5, 6)

పిదప దశరథుడు సైన్యమును ముందుకు నడచుటకై ఆజ్ఞాపించెను. ప్రయాణము చేసి శీఘ్రముగా అయోధ్యాపురి చేరెను. ఆ పట్టణము చిన్న జెండాలతోడను, పెద్ద జెండాలతోడను రమ్యమై తూర్యనాదములతో ప్రతిధ్వనించు చుండెను. రాజమార్గములను జలముతో తడిపి పుష్పములు చల్లి పౌరులందరును రాజప్రవేశము తిలకించుటకై ఆనందముతో ఎదురుచూచుచుండిరి. మంగళ

వాద్యములను మ్రోగించుచుండిరి.(7, 8)

శ్రీమంతులగు దశరథపుత్రులు, శ్రీమంతుడును మహాయశస్వియు అయిన తమ తండ్రిని అనుసరించి వెళ్లిరి. పౌరులును, పురమునందలి బ్రాహ్మణులును దూరమునుండి ఎదురు వచ్చి స్వాగతము చెప్పిరి. ఈ విధముగ అయోధ్యానగరమును ప్రవేశించి దశరథమహారాజు హిమవత్పర్వతముతో సమానమైన తన గృహమును ప్రవేశించెను.(9)

బాంధవజనులతో కూడిన దశరథమహారాజు సకలభోగ్యవస్తువులచేతను పూజితుడై ఆనందించెను. కౌసల్యా-సుమిత్రా-కైకేయిలును, తదితర రాజస్త్రీలును కొత్త కోడండ్రను ప్రతిగ్రహించుటలో వ్యగ్రలై ఆనందించిరి. అంత రాజభార్యలు మహాభాగ్యవతి యగు సీతను, కీర్తిమంతురా లగు ఊర్మిళను, మాండవీశ్రుతకీర్తులను గ్రహించిరి.(10-12)

ఆ నూతనవధువు లందరును మంగళకరము లగు వస్తువులను అలదికొని, పట్టుబట్టలు ధరించి గృహదేవతలను పూజించిరి. అపుడు, ఆ రాజపుత్రికలు నమస్కరింపదగిన పెద్ద లందరికిని నమస్కరించి, కుబేరుని భవనముతో సమానమైన తమ తమ గృహములను చేరి, గోవులను, ధనధాన్యములను దానము చేసి బ్రాహ్మణోత్తములను సంతృప్తిపరచిరి. పిమ్మట రహస్యమున భర్తలను కలిసి ఆనందముతో క్రీడించిరి.(13-15)

మహాత్ములును, పరాక్రమముచే భూలోకమున సాటిలేనివారును, అస్త్రములందు సమర్థులును, ధనము, మిత్రులు మొదలగు వాటితో కూడినవారును, నరశ్రేష్ఠులును అగు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వివాహము చేసికొని తండ్రికి శుశ్రూష చేయుచు అతని ఆజ్ఞను పాటించుచు ఉండిరి.(16)

తరువాత కొంతకాలమునకు దశరథమహారాజు కైకేయీపుత్రుడైన భరతునితో ఇట్లనెను. "కుమారా! కేకయరాజు పుత్రుడును, నీ మేనమామయు అగు ఈ యుధాజిత్తు నిన్ను తీసికొని వెళ్ళుటకై వచ్చియున్నాడు. మిథిలలో, ఋషుల సమక్షమున అతడు నన్నావిధముగ ప్రార్థించినాడు. అతనికి ఆనందమును కలిగించుము."(17-19)

భరతుడు దశరథుని మాటలు విని, తండ్రికిని, రామునకును అభివాదనము చేసి, లక్ష్మణుని కౌగలించుకొని, శత్రుఘ్నసమేతుడై ప్రయాణ మాయెను. శూరుడును,

నరశ్రేష్ఠుడును అగు భరతుడు తండ్రివద్దను, రామునివద్దను, తల్లులవద్దను సెలవు గైకొని, శత్రుఘ్నసహితుడై వెళ్లెను. (20-22)

భరతుడు వెళ్లిన పిమ్మట, రాముడును మహాబలశాలి యగు లక్ష్మణుడును, దేవసమానుడైన తండ్రికి సేవ యొనర్చుచుండిరి. (23)

ధర్మాత్ముడైన రాముడు తండ్రి యాజ్ఞ ననుసరించి, పౌరులకు ప్రియములు, లాభకరములు అయిన కార్యముల నన్నింటిని చేసెను. నియమములను పూర్తిగ పాటించుచు, తల్లులకు చేయవలసిన కార్యములను చేయుచు, ఆయా కాలములందు పూజ్యులకు చేయవలసిన కార్యములను పర్యవేక్షించుచుండెను. (24, 25)

రాముని ఈ శీలమును, నడవడికను చూచి దశరథుడు చాల సంతోషించెను. బ్రాహ్మణులును, నాగరికులును, రాజ్యములో అందరును సంతసించిరి. రాముడు లోకమునందు గొప్ప కీర్తి గలవాడు. సత్యమైన పరాక్రమము కలవాడు. ఎక్కువ సద్గుణములు కలవాడు. ప్రాణులకు బ్రహ్మదేవు డెట్లో రాజ్యములోని ప్రజలందరికిని రాముడు అట్లుండెను. (26, 27)

ఉత్తమమైన మనస్సు గల రాముడు సీతయందే మనస్సు నిలిపెను. ఆమె తన హృదయమునందు రామునే సర్వదా నిలుపుకొనెను. ఈవిధముగ అన్యోన్యాసక్తులై సీతారాములు అనేక ఋతువులపాటు (చాలకాలము) విహరించిరి. (28)

తండ్రి అంగీకరించిన సంబంధ మగుటచే రామునకు సీతపై ప్రేమ గలిగెను. ఆమెయొక్క సద్గుణములచేతను, లోకోత్తరసౌందర్యముచేతను అతని ప్రేమ ఇంకను వృద్ధిచెందెను. (29)

సీత హృదయములో భర్తయైన రాముడు రెండింతలుగా మసలుచుండెను. లోలోపల నున్న భావమును గూడ ఒకరి హృదయము, మరొకరి హృదయముతో చెప్పుచుండెడిది. (30)

సౌందర్యమున దేవతాస్త్రీవలె నున్నది, లక్ష్మివలె అపూర్వసౌందర్యము గలది (ఆ రూపము దాల్చిన లక్ష్మివలె నున్నది), మిథిలానగరసంజాత, జనకుని కుమార్తె అయిన సీత రాముని హృదయములో ఇంకను ఎక్కువగ మసలుచుండెను. (31)

(తండ్రి అంగీకరించిన వధువు అగుటచేతను, ఆమెకు గల రూపసద్గుణాదుల చేతను రామునకు సీతపై గాఢానురాగము కలిగెను. సీతకు మాత్రము రాముడు తనకు భర్త అను ఒక్క కారణముచేతనే రామునిపై రెట్టింపు ప్రేమ ఉండెడిది.)

రాముడు, మనోహరురాలైన సీతతో కలిసినవాడై, ఆనందించుచు, లక్ష్మితోగూడిన అమరాధీశ్వరుడైన మహావిష్ణువువలె ప్రకాశించెను. (32)

శ్రీమద్రామాయణమునందలి బాలకాండలోని డెబ్బది ఏడవ సర్గము సమాప్తము.

బాలకాండము సమాప్తము.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్,
యః పఠేద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే.

(బాలకాండ: సర్గ. 1.38)

రామచరిత్ర పరిశుద్ధిని కలిగించును. పాపములను నశింపచేయును. పుణ్యములను ఇచ్చును. ఇది వేదములతో సమానము. దీనిని చదువువాని సర్వపాపములును తొలగిపోవును.

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే,
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి.

(బాలకాండ: సర్గ. 2. 36)

భూతలమునందు పర్వతములును, నదులును ఉన్నంతవరకును రామాయణకథ లోకములో వ్యాపించి ఉండును.



TLP PUBLISHERS

9788192771519